
'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 18

గురువారం 10-4-2025



టైటాన్స్ జైత్రయాత్ర
రాజస్తాన్ రాయల్స్‌పై 58 పరుగులతో గుజరాత్ ఘనవిజయం
-14లో



ఇక రుణాలు మరింత చౌక!
ఈఎంఐలు దిగొస్తాయ్.. వరుసగా రెండోసారి రెపో రేటు కోత
-15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌రీల్

ఉమెనోపాజ్ అర్థం చేసుకుందాం



వయసు 40 నుంచి 50కి చేరుకుంటున్న సమయంలో స్త్రీలు ఇంటా బయటా కీలకమైన దశలో ఉంటారు. అదే సమయంలో భౌతికంగా తప్పని మెనోపాజ్ సమస్యలు తలెత్తుతాయి. మెనోపాజ్ స్త్రీలను వారికి తెలియకుండానే మార్చేస్తుంది. ఈ మార్పులను సాటి స్త్రీలే అర్థం చేసుకోలేరు. ఇక కుటుంబం అర్థం చేసుకుంటుందా? మెనోపాజ్ మార్పును అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం.

'సాక్షి ఫ్యామిలీ'లో వరుస కథనాలు నేటి నుంచి...

యంగ్ ఇండియా పోలీసు స్కూల్ సిద్ధం



హైదరాబాద్ శివార్లలోని మంచిరేవులలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా పోలీసు స్కూల్ (వైఐపీఎస్) సిద్ధమైంది. దీన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించనున్నారు.

- వివరాలు 2లో▶

నేడు హెచ్‌సీయూకు ఎంపవర్డ్ కమిటీ !



హెచ్‌సీయూ పరిధిలో ఉన్న 400 ఎకరాలకు సంబంధించి ఏం జరిగిందనే దానిపై క్షేత్రస్థాయి పరిశీలనతోపాటు, జరిగిన నష్టంపై సొంతంగా అంచనా వేసేందుకు గురువారం సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ హైదరాబాద్‌కు రానుంది.

- వివరాలు 3లో▶

ఇదండీ సంగతి



విదేశీ విద్యార్థులను బయటకు పంపేయాలనే కక్షతో మనమే చాలా ఉల్లంఘనలు చేస్తున్నాం సార్

టారిఫ్‌లకు బ్రేక్..

చైనా మినహా మిగిలిన దేశాలకు 90 రోజుల విరామం

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆకస్మిక నిర్ణయం
- డ్రాగన్‌కు మాత్రం సుంకాలు 125 శాతానికి పెంపు, తక్షణం అమల్లోకి..
- యూఎస్‌పై 84 శాతం సుంకాలు: చైనా
- నేటినుంచే అమల్లోకి వస్తాయని ప్రకటన

6లో



ప్రపంచవ్యాప్త ఆర్థిక ప్రకంపనల నేపథ్యంలో ట్రంప్ వెనక్కు తగ్గారు. భారత్‌తో పాటు 75 పై చిలుకు దేశాలపై విధించిన ప్రతీకార సుంకాలను తాత్కాలికంగా పక్కన పెట్టారు. వాటి అమలును 90 రోజుల పాటు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. దాంతో అదనపు సుంకాలు అమల్లోకి వచ్చిన ఒక్క రోజులోనే అటకెక్కాయి. కానీ చైనాతో మాత్రం అమెరికా టారిఫ్‌ల పోరు బుధవారం మరింత తీవ్ర రూపు దాల్చింది. ఈ దిశగా రోజంతా శరవేగంగా నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 50 శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించిన గంటల వ్యవధిలోనే అమెరికాపైనా చైనా అంతే మొత్తం బాదింది. అమెరికా ఉత్పత్తులపై 84 శాతం సుంకాలు గురువారం నుంచే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. దీనిపై ట్రంప్ తీవ్రంగా కన్నెర్రజేశారు. చైనా ఉత్పత్తులపై ఇప్పటికే 104 శాతానికి చేరిన సుంకాలను ఏకంగా 125 శాతానికి పెంచేశారు. అవి తక్షణం అమల్లోకి వస్తాయని కుండబద్దలు కొట్టారు. మరోవైపు యూరోపియన్ యూనియన్ కూడా అమెరికాపై మళ్లీ సుంకాల కత్తి ఝుళిపించింది. 23 బిలియన్ల విలువైన యూఎస్ ఉత్పత్తులపై దశలవారీగా అదనపు టారిఫ్‌లు విధిస్తున్నట్టు ప్రకటించింది. కెనడా కూడా అమెరికా ఆటో ఉత్పత్తులపై 25 శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్టు పేర్కొంది.

వెంటనే వెళ్లిపొండి

- లేదంటే రోజుకు రూ.86 వేలు కట్టండి
- దేశ బహిష్కరణ ఆదేశాలు అందుకున్న వ్యక్తులకు ట్రంప్ సర్కార్ అల్టిమేటమ్... కఠిన చర్యలూ తప్పవని హెచ్చరించిన హోమ్‌ల్యాండ్ శాఖ

6లో

తగ్గేదే లేదు: చైనా



ఏఐసీసీ సదస్సులో ముచ్చటించుకుంటున్న సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ

పనిచేయండి లేదా వైదొలగండి

- బాధ్యతల్ని విస్మరించిన వాళ్లు రిటైరైతే మంచిది... పార్టీ పదవుల్లో ఉన్న నేతలకు కాంగ్రెస్ చీఫ్ ఖర్గే హెచ్చరిక
- ఏఐసీసీ సమావేశ వేదికగా పార్టీలో సంస్కరణలను ప్రస్తావించిన అధ్యక్షుడు
- క్రైస్తవులు, సిక్కుల హక్కులనూ హరిస్తారు: రాహుల్

6లో

"పార్టీకి సాయపడని నేతలు తప్పుకోవాలి. అలాంటి నేతలు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. అప్పగించిన బాధ్యతలను నెరవేర్చకుండా పదవుల్లో అలంకారప్రాయంగా తిష్టవేసిన నేతలు రాజకీయ సన్యాసం చేయాలి. డీసీసీలు ఇకపై అత్యంత క్రియాశీలక పాత్ర పోషించనున్నాయి." - ఖర్గే

బ్రిటిషర్ల కంటే బీజేపీ డేంజర్

- బ్రిటిష్ వాళ్లను తరిమికొట్టినట్టే బీజేపీని తరిమికొట్టాలి
- తెలంగాణలో బీజేపీని అడుగుపెట్టనిచ్చే ప్రసక్తే లేదు
- ప్రధాని మోదీ గాడ్సే విధానాలను ప్రచారం చేస్తున్నారు
- కాంగ్రెస్ 'న్యాయ్‌పథ్'లో సీఎం రేవంత్‌రెడ్డి

2లో

'కాళేశ్వరం బాధ్యుల'పై చర్యలకు

విజిలెన్స్ ఓకే

విజిలెన్స్ విభాగం నివేదికను ఆమోదించిన కమిషన్

- బరాజ్‌ల వైఫల్యానికి 40 మంది ఇంజనీర్లు, అధికారులు బాధ్యులని తేల్చిన విజిలెన్స్
- వారిపై క్రిమినల్, శాఖాపరమైన చర్యలకు సిఫారసు
- జాబితాలో కొందరు ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లతో పాటు మాజీ ఈఎన్‌సీలు!

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సమర్పించిన నివేదికను రాష్ట్ర విజిలెన్స్ కమిషన్ ఆమోదించింది. మేడిగడ్డ బరాజ్ కుంగిపోగా, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో బుంగలు ఏర్పడి భారీగా నీళ్లు లీకైన విషయం తెలిసిందే. దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించగా.. బరాజ్‌ల వైఫల్యానికి 40 మందికి పైగా ఇంజనీర్లు, ఇతర అధికారులు బాధ్యులని తేల్చుతూ, వారిపై క్రిమినల్ చర్యలతో పాటు శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ విభాగం సిఫారసు చేసింది. ఈ నివేదికను తాజాగా విజిలెన్స్ కమిషన్ ఆమోదించడంతో.. బాధ్యులైన ఇంజనీర్లు, ఇతర అధికారులపై చర్యలకు మార్గం సుగమమైంది. బాధ్యులైన అధికారుల జాబితాలో కొందరు



మిగతా 3వ పేజీలో ▶

జైలులో ఖైదీలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం



శిక్ష కాదు శిక్షణ!

ఖైదీలకు విద్యాబుద్ధులు నేర్పుతున్న జైళ్ల శాఖ

- 118 మంది బీఏ, 35 మంది ఎమ్మెస్సీ సైకాలజీ పూర్తి
- అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీతో జైళ్లశాఖ ఎంఓయూ
- ఎన్‌ఐఓఎస్‌తో పాఠశాల విద్యపై ఒప్పందం
- అక్షరాస్యత కోసం 'తంబ్ ఇన్.. సైన్ ఔట్' కార్యక్రమం
- 2024లో 15,896 మందికి కనీస విద్య నేర్పిన అధికారులు

16లో

సీతమ్మసాగర్ బరాజ్ డిజైన్లు ఓకే!

నిర్ధారించిన సీడబ్ల్యూసీలోని ప్రాజెక్టుల మదింపు విభాగం

- బరాజ్ డిజైన్ల పట్ల సీడబ్ల్యూసీ సంతృప్తి వ్యక్తీకరణ
- పంప్‌హౌస్‌లు, జల విద్యుదుత్పత్తి కేంద్రం డిజైన్లతో మళ్లీ డీపీఆర్ సమర్పించాలని సూచన
- రాష్ట్రానికి లేఖ రాసిన సీడబ్ల్యూసీలోని ప్రాజెక్టుల మదింపు విభాగం

5లో

హైసెక్యూరిటీ ప్లేట్ తప్పనిసరి

- 2019 ఏప్రిల్ ఒకటికి ముందు తయారైన అన్ని వాహనాలకు వర్తింపు
- ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు గడువు
- ఆదేశాలు జారీ చేసిన రవాణా శాఖ



- వివరాలు 12లో

ప్లాట్‌ఫామ్స్ మూత.. రైళ్లు మళ్లింపు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆరు ప్లాట్‌ఫామ్స్ మూసివేత

- 15వ తేదీ నుంచి పునర్నిర్మాణంలో కీలక పనులు ప్రారంభం
- 115 రోజుల పాటు 120 జతల రైళ్లు వేరే స్టేషన్ల మీదుగా మళ్లింపు



సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణంలో భాగంగా భారీ స్కై కాంకోర్స్, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఫుట్‌ఓవర్ వంతెన పనులు ప్రారంభిస్తుండటంతో 115 రోజుల పాటు సగం ప్లాట్‌ఫామ్స్‌ను మూసివేయనున్నారు. ఈ నెల 15 నుంచి దశలవారీగా 120 జతల రైళ్లను దారిమళ్లించి వేరే స్టేషన్ల నుంచి తిప్పనున్నారు. వీటిల్లో సింహభాగం రైళ్లు చర్లపల్లి టెర్మినల్ నుంచి రాకపోకలు సాగించనుండగా, కొన్ని నాంపల్లి, కొన్ని కాచిగూడ స్టేషన్ల నుంచి నడుస్తాయి.

స్కై కాంకోర్స్ కోసమే 100 రోజులు

సికింద్రాబాద్ స్టేషన్‌ను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పునర్నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రెండంతస్తుల్లో భారీ స్కై కాంకోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. రైల్వేస్టేషన్‌లో ఇదే కీలక భాగం. ఇది ఏకంగా 110 మీటర్ల వెడల్పు, 120 మీటర్ల పొడవు ఉంటుంది. ప్రయాణికులకు అన్ని వసతులు ఇక్కడే ఉంటాయి. వేచి ఉండే ప్రాంతంతోపాటు రిటైల్ ఔట్‌లెట్స్,

మిగతా 2వ పేజీలో ▶

గ్రూప్-1 ప్రాథమిక ఎంపిక

జాబితా విడుదల

- ఈ నెల 16 నుంచి అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన
- నిర్దేశించిన తేదీల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలి
- లేకుంటే తదుపరి అవకాశం ఉండదని టీజీపీఎస్సీ స్పష్టీకరణ
- అభ్యర్థులు గైర్హాజరైతే తదుపరి మెరిట్ అభ్యర్థులకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ప్రాథమిక జాబితాను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) బుధవారం విడుదల చేసింది. మొత్తం 563 ఉద్యోగాలకు అభ్య ర్థులను ఎంపిక చేస్తూ... జాబితాను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఒక్కో ఉద్యోగానికి ఒక అభ్యర్థినే ఎంపిక చేసింది. 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపిక చేపట్టడంతో ప్రస్తుతం



మిగతా 5వ పేజీలో ▶



యంగ్ ఇండియా పోలీసు స్కూల్ సిద్ధం

YIPS
YOUNG INDIA POLICE SCHOOL

నేడు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రస్తుతం ఏడు ఎకరాల క్యాంపస్‌లో కార్యకలాపాలు | భవిష్యత్‌లో 50 ఎకరాలకు విస్తరించేలా ప్రణాళికలు | మొత్తం సీట్లు 200, ఇప్పటివరకు 87 మందికి అడ్మిషన్లు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ శివార్లలోని మంచిరేవులలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా పోలీసు స్కూల్ (వైఐపీఎస్) సిద్ధమైంది. దీన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించనున్నారు. మొత్తం 50 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయగా, ప్రస్తుతం ఏడు ఎకరాల్లో కార్యకలాపాలు ప్రారంభించనున్నారు. ఈ స్కూల్‌లో మొత్తం 200 సీట్లు ఉంటాయి. వీటిలో 100 పోలీసు అధికారులు, ఉద్యోగుల పిల్లలకు, మరో 100 సాధారణ పౌరుల పిల్లలకు కేటాయించారు. ప్రస్తుతానికి ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రవేశాలు జరుగుతున్నాయి. మార్చి మొదటి వారంలో అందుబాటులోకి వచ్చిన వైఐపీఎస్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించి అర్హులను ఎంపిక చేశారు. ఒక్కో తరగతిలో 40 మంది చొప్పున ఐదు క్లాసుల్లో కలిపి మొత్తం 200 మంది విద్యార్థులు ఉంటారు. ఇప్పటి వరకు 83 మంది పోలీసు, నలుగురు సాధారణ పౌరుల పిల్లలకు అడ్మిషన్లు ఇచ్చారు. భవిష్యత్తులో 5 వేల మందికి అడ్మిషన్లు ఇస్తారు. విద్యార్థుల కోసం 6 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 1,750 పడకలతో హాస్టల్‌ను నిర్మిస్తారు.



ప్రతిభగల ప్రైవేట్ టీచర్ల ఎంపిక

ఈ స్కూల్‌లో పని చేయడానికి ప్రతిభ గల ప్రైవేట్ టీచర్లను ఎంపిక చేసుకున్నారు. విద్యాభ్యాసంతోపాటు విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి వైఐపీఎస్ కృషి చేస్తుంది. త్వరలో ఉత్తమ క్రీడా శిక్షకులను ఎంపిక చేయనున్నారు. ఏడుగురు సభ్యులతో కూడిన గవర్నింగ్ సొసైటీ ఆధ్వర్యంలో వైఐపీఎస్ నడుస్తుంది. దీనికి రాష్ట్ర డీజీపీ జితేందర్ ప్రెసిడెంట్‌గా, హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ వైస్ ప్రెసిడెంట్‌గా, గ్రేహౌండ్స్ విభాగం అదనపు డీజీ ఎం.స్టీఫెన్ రవీంద్ర సెక్రటరీగా ఉంటారు. మరో నలుగురు సభ్యులు ఉన్నారు. విద్యార్థుల కోసం మూడు డిజైన్లతో కూడిన యూనిఫామ్స్ ఖరారు చేశారు.





వైఐపీఎస్‌లో తల్లిదండ్రుల హోదా ఆధారంగా విద్యార్థుల కేటగిరీ

కేటగిరీ	తల్లిదండ్రుల హోదా
1	అమరవీరులు
2	హోంగార్డు నుంచి ఏఎస్సై వరకు
3	ఎస్సై నుంచి ఏఎస్పీ వరకు
4	ఎస్పీ ఆపై స్థాయి అధికారులు
5	సాధారణ పౌరులు



“ పరిపూర్ణ వ్యక్తిత్వంతో బయటకు వెళతారు

కేటగిరీల వారీగా సీట్ల కేటాయింపు, ఫీజులు ఇలా..

కేటగిరీ	సీట్లు (శాతం)	వార్షిక ఫీజు (రూ.ల్లో)
1	5	40,000
2	40	50,000
3	40	95,000
4	15	1,40,000
5	సాధారణ పౌరులు (100 సీట్లు)	1,60,000

వైఐపీఎస్ నుంచి ప్రతి విద్యార్థి పరిపూర్ణ వ్యక్తిత్వంతో బయటకు వెళ్తాడు. అందుకే విద్య, క్రీడలతోపాటు అన్ని అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. పోలీసు విభాగంలో కిందిస్థాయి ఉద్యోగులు పని ఒత్తిడి కారణంగా తమ పిల్లల బాగోగుల కోసం సమయం ఇవ్వలేరు. పెద్దపెద్ద స్కూళ్లలో చేర్చాలంటే భారీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుని సీట్ల రిజర్వేషన్, ఫీజులు నిర్ధారించాం.

- సీవీ ఆనంద్, పోలీసు కమిషనర్, హైదరాబాద్

క్లుప్తంగా...

సీఎం గారూ.. పగటి కలలు మానండి

కేంద్ర మంత్రి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: 'సీఎం గారూ.. పగటి కలలు మానండి.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం పక్కా' అని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. 'ఇందుకు ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే నిదర్శనం.. కాంగ్రెస్‌కు అభ్యర్థులే కరువయ్యారు. అంతరించి పోతున్న పార్టీ కాంగ్రెస్'.. అని బుధవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. బీజేపీని తెలంగాణలోకి అడుగుపెట్టనీయమని.. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సంజయ్ స్పందించారు. 'తెలంగాణలో బీజేపీని అధికారంలోకి రానివ్వకుండా అడ్డుకుంటామంటూ రేవంత్‌రెడ్డి పగటి కలలు కంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అంతరించిపోతున్న జాతివంటిది' అని పేర్కొన్నారు.

రేవంత్ బీజేపీని అడుగుపెట్టనిచ్చేదేంటి?

బీజేపీ ఎంపీ రఘునందన్ రావు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీజేపీని సీఎం రేవంత్ రెడ్డి అడుగుపెట్టనిచ్చేదేంటి?.. ఇప్పటికే తమ పార్టీ రాష్ట్రంలో అడుగుపెట్టి వేళ్లూనుకుందని మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బీజేపీని అడుగుపెట్టనివ్వొద్దని రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బుధవారం మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో రేవంత్ సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో బీజేపీ గెలిచిందని గుర్తు చేశారు. రేవంత్ సిట్టింగ్ సీటు మల్కాజిగిరి కూడా బీజేపీ చేజిక్కించుకుందన్నారు. రేవంత్ ఇన్‌చార్జిగా ఉన్న చేవెళ్లలో ఎంపీగా గెలిచామన్నారు. కామారెడ్డిలో తాజా, మాజీ ముఖ్యమంత్రులను ఓడించింది కూడా తమ పార్టీ అన్నారు.

గ్యాస్ ధర పెంపుతో మహిళలపై మోదీ గుదిబండ మోపారు

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్: గ్యాస్ ధరను పెంచి మహిళలపై మోదీ ప్రభుత్వం గుదిబండను మోపిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. మహిళా సంఘాలకు రూ.15 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను కేంద్ర ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మహిళా సాధికారత సమాఖ్య సంఘం సభ్యులు కవితను తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయంగా ధరలు తగ్గుతుంటే ఇక్కడ పెంచడమేంటని నిల దీశారు. ఎందుకు పెంచుతున్నారని ప్రశ్నిస్తే మోదీ ఇంత గొప్పోడు అంత గొప్పోడు అని బీజేపీ నాయకులు అంటున్నారని, ఇలా ఇష్టమున్నట్లు ధరలు పెంచితే మోదీ ఎంత గొప్ప వ్యక్తి అయితే తమకేంటి అన్నారు. కార్యక్రమంలో రూప్ సింగ్, మర్రిపల్లి మాధవి పాల్గొన్నారు.

అటవీభూముల అవినీతిపై విచారణ చేపట్టాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య



స్టేషన్‌ఘన్‌పూర్: హనుమకొండ జిల్లా దేవునూరు, ముప్పారం అటవీ భూముల్లో.. ఎమ్మెల్యే కడియం శ్రీహరి బినామీ పేర్లతో చేసిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. ఆయన బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. కడియం శ్రీహరి చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నానని చెప్పారు. తేదీ, సమయం, ప్రదేశం నిర్ణయించాలని కోరారు. తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని, ధైర్యముంటే అధికారు లను తీసుకుని రావాలని శ్రీహరికి సవాల్ చేశారు.

బ్రిటిషర్ల కంటే బీజేపీ డేంజర్

బ్రిటిష్ వాళ్లను తరిమికొట్టినట్టే బీజేపీని తరిమికొట్టాలి

- తెలంగాణలో బీజేపీని అడుగుపెట్టనిచ్చే ప్రసక్తే లేదు
- కాంగ్రెస్ 'న్యాయ్‌పథ్'లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- గాంధీజీ ఆలోచనలను రాహుల్ ముందుకు తీసుకెళ్తున్నారు
- ప్రధాని మోదీ గాడ్సే విధానాలను ప్రచారం చేస్తున్నారన్న సీఎం



అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐసీసీ సదస్సులో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బ్రిటిషర్ల కంటే బీజేపీ నాయకులు చాలా ప్రమాదకరమైన వారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. స్వాతంత్య్రం కోసం బ్రిటిష్ వాళ్లను తరిమికొట్టినట్లే రాహుల్‌గాంధీ నాయకత్వంలో మనమంతా దేశంలో బీజేపీని ఓడించి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ ఆలోచన విధానాన్ని కాంగ్రెస్ పార్టీ రాహుల్‌గాంధీ నేతృత్వంలో ముందుకు తీసుకుని వెళ్తుంటే.. ప్రధానమంత్రి మోదీ మాత్రం దేశ వ్యాప్తంగా గాడ్సే విధానాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అహ్మదాబాద్‌లో జరుగుతున్న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సదస్సు 'న్యాయ్‌పథ్'లో బుధవారం సీఎం ప్రసంగించారు.

వల్లభాయ్ పటేల్‌తో హృదయపూర్వక బంధం

'గుజరాత్ ప్రజలతో, వల్లభాయ్ పటేల్ వారసులతో మా తెలంగాణ ప్రజలకు సంబంధం ఉంది. దేశ ప్రజలకు స్వాతంత్య్రం వచ్చినప్పుడు తెలంగాణకు రాలేదు. అప్పుడు మాకు స్వాతంత్య్రం ప్రసాదించిన వల్లభాయ్ పటేల్‌తో మాకు హృదయపూర్వక బంధం ఉంది. వల్లభాయ్ పటేల్ మాకు స్వాతంత్య్రం ఇస్తే.. సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని అందించారు. వల్లభాయ్ పటేల్ భూమి నుంచి నేను ఒకటే చెబుతున్నా. మేము బీజేపీని తెలంగాణలో అడుగుపెట్టనివ్వం..అడ్డుకుంటాం. వారిని ఎవరూ క్షమించరు' అని రేవంత్ అన్నారు.

మోదీ గ్యారంటీ దేశాన్ని విభజించడమే..

'రాహుల్‌గాంధీ తెలంగాణలోని రైతులకు ఇచ్చిన హామీ మేరకు మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి 10 నెలల్లోనే 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ అమలు చేసి చూపించింది. మరో హామీ అయిన కులగణనను కూడా పూర్తి చేశాం. కేంద్రం జనగణనతో పాటు కుల గణన చేయాలనే డిమాండ్‌పై లోక్‌సభలో మాట్లాడేందుకు మైక్ ఇవ్వకుండా రాహుల్‌గాంధీని మోదీ ప్రభుత్వం అడ్డుకుంది. మరోవైపు ప్రధానమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు. ఏడాదికి రెండు కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని గాలికి వదిలేశారు. రెండు కోట్ల మందికి రాకపోయినా మోదీ, అమిత్‌షాలకు మాత్రం పదవులు వచ్చాయి. రైతులు కనీస మద్దతు ధర, నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 15 నెలలపాటు ఆందోళన చేసినా మోదీ ప్రభుత్వం కనీసం వారితో చర్చలు కూడా జరపలేదు. మోదీ మణిపూర్‌లో మంటలు రాజేశారు. దేశ మూల వాసుల జీవన హక్కును కాలరాసే ప్రయత్నం చేశారు. మోదీ గ్యారంటీ దేశాన్ని విభజించడమే. కానీ రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు భారత్ జోడో పేరిట 150 రోజులు 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారు.

బీజేపీ ఓటమికి కంకణబద్ధులై వెళ్లాలి

దేశ స్వాతంత్య్రం కోసం మహాత్మాగాంధీ ఎన్నో ఆందోళనలు చేసినా.. ఆయనపై ఏనాడూ లాఠీ ఎత్తలేదు. కానీ స్వాతంత్య్రం వచ్చిన ఆరునెలల్లోనే గాడ్సేలు తూటాలు పేల్చి ఆయన్ను పొట్టన పెట్టుకున్నారు. గాడ్సే వారసుల ఆలోచన ధోరణిని అడ్డుకునేందుకు, మోదీ ఆలోచన విధానాన్ని అడ్డుకునేందుకే మనమంతా ఇక్కడ ఏకమయ్యాం. ఇక్కడకు వచ్చిన ప్రతి నాయకుడు, కార్యకర్త రానున్న ఎన్నికల్లో బీజేపీని ప్రతిచోటా ఓడించేలా కంకణబద్ధులై వెళ్లాలి. గాడ్సే భావజాలాన్ని ప్రచారం చేస్తున్న ప్రధాని మోదీని, బీజేపీని అడ్డుకుని దేశాన్ని రక్షించాల్సిన అవసరం అందరిపైనా ఉంది..' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

పెట్రో, గ్యాస్ ధరలు వెనక్కి తీసుకోవాలి

ఇదేనా మోదీ చెప్పిన అచ్చేదిన్?

- కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పురికి కేటీ రామారావు లేఖ



సాక్షి, హైదరాబాద్: సెస్సుల పేరిట పెట్రో ధరలను పెంచుతున్న మోదీ ప్రభుత్వం ఆర్థిక దోపిడీకి పాల్పడుతూ రాష్ట్రాల హక్కులను కబళిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వసూలు చేసిన సెస్సులతో మౌలిక సదుపాయాలు కల్పించకుండా బీజేపీ సొంత రాజకీయ ఎజెండా ప్రచారాల కోసం వినియోగిస్తున్నారని మండిపడ్డారు. పన్నుల్లో రాష్ట్రాలకు దక్కాల్సిన న్యాయమైన వాటాను ఇవ్వకుండా దేశ సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలకు మోదీ ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి గణనీయంగా సహకరిస్తున్న తెలంగాణ వంటి రాష్ట్రాలు నిధుల కొరతతో అల్లాడుతున్నా, సెస్సుల రూపంలో సమకూరుతున్న ఆదాయంతో రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చేస్తోందని విమర్శించారు. పెరిగిన పెట్రో, గ్యాస్ ధరలను వెనక్కి తీసుకోవాలని కోరుతూ కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురికి కేటీఆర్ బుధవారం బహిరంగ లేఖ రాశారు. అధిక ఇంధన ధరలు ఉన్న దేశాల్లో భారత్ కూడా ఒకటన్నారు. భూటాన్, పాకిస్తాన్‌తో పాటు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన శ్రీలంకలో కూడా పెట్రోలు, డీజిల్, ఎల్పీజీ ధరలు భారత్ కంటే చౌకగా ఉన్నాయన్నారు. 'ఎల్పీజీ సిలిండర్ ధర రూ.1,100 దాటడం పేద, మధ్యతరగతి మహిళలకు భారంగా మారింది. ఉజ్వల యోజన పథకం కింద సిలిండర్లు తీసుకున్న మహిళలు, పెరిగిన గ్యాస్ ధరలతో మళ్లీ కట్టెలపైనే వంట చేస్తున్నారు 'అని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు.

ఢిల్లీ పార్టీలను నమ్మొద్దు..: తలసరి వృద్ధి రేటు, జీఎస్‌డీపీలో తెలంగాణ అట్టడుగు స్థానంలో నిలవడంపై కేటీ రామారావు 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో వేసిన ఆర్థిక పునాదులను రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందన్నారు. 'సన్నాసి ఢిల్లీ పార్టీలను నమ్మితే తెలంగాణ బతుకు సున్నా అని మరోసారి రుజువుచేసిన సందర్భమిది. తెలివిలేని దద్దమ్మను గద్దెనెక్కిస్తారు, కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని ఆగం చేస్తారు, ఆర్థిక వృద్ధిలో అగ్రభాగాన ఉన్న రాష్ట్రాన్ని పాతాళానికి పడేసిన ఈ పాపం క్షమించరానిది. నాటి పదేళ్ల దార్శనిక పాలనకు నేటి దగుల్బాజీ విధానాలకు మధ్య తేడాను నాలుగు కోట్ల సమాజం నిశితంగా గమనిస్తోంది. ఇక జీవితంలో ఈ ఢిల్లీ పార్టీలను తెలంగాణ నమ్మదు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

హెచ్‌సీయూ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి

కేసీఆర్‌ది సాగు భాష అయితే.. రేవంత్‌ది చావు భాష.. సీఎంపై నిప్పులు చెరిగిన హరీశ్‌రావు



పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తున్న హరీశ్‌రావు

పటాన్‌చెరు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్‌సీయూ విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందేనని మాజీమంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకుంటామని చెప్పారు. అంటే రేవంత్‌రెడ్డి తప్పుడు కేసులు పెట్టినట్టే కదా అని నిలదీశారు. బుధవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన సభలో హరీశ్‌రావు ప్రసంగించారు. హెచ్‌సీయూ భూముల్లో 400 ఎకరాల అడవుల్లో చెట్లు నరికి సీఎం మూగజీవుల పాపం కట్టుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్‌ది సాగు భాష అయితే.. రేవంత్ రెడ్డిది చావు భాష అని విమర్శించారు. ఢిల్లీలో కూడా రేవంత్‌రెడ్డి పని అయిపోయిందన్నారు.

పాలేవో, నీళ్లేవో అర్థమైపోయింది..: రేవంత్‌రెడ్డివి మాటలు తప్ప చేతలు లేవన్నది ప్రజలకు అర్థమైపోయిందని హరీశ్ పేర్కొన్నారు. పాలేవో.. నీళ్లేవో ప్రజలకు ఇప్పుడిప్పుడే తెలుస్తుందన్నారు. నో ఎల్ఆర్ఎస్ అన్నారు.. ఇప్పుడు ఎల్ఆర్ఎస్ అని ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఫార్మాసిటీ భూములన్నీ రైతులకు వాపసిస్తామని చెప్పారు. ఇప్పుడేమో 16 వేల ఎకరాలు ఫార్మా సిటీ కోసం సేకరిస్తామని ప్రకటించారు. రైతు బంధు, రుణమాఫీ, రూ.4,000 పెన్షన్, మహాలక్ష్మి, తులం బంగారం తదితర పథకాలేవీ అమలు కాలేదని విమర్శించారు. రాహుల్ ఢిల్లీలో ఉండి కూడా ధర్నాకు ఎందుకు రాలేదని హరీశ్ ప్రశ్నించారు.

రియల్ ఎస్టేట్ పతనం..: హైడ్రా అని ఆర్నెల్లు ఉరికిండు.. ఎల్లంకెల పడ్డాడు. దీంతో రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఈగలు కొట్టుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. రియల్ ఎస్టేట్ పూర్తిగా పతనమైందని, మళ్లీ కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. సభలో శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈలకు తేలిగ్గా రుణాలు

గోద్రెజ్ క్యాపిటల్‌తో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం



గోద్రెజ్ క్యాపిటల్ ప్రతినిధులతో కలిసి అవగాహన ఒప్పంద పత్రం చూపిస్తున్న జయేశ్‌రంజన్

సాక్షి, హైదరాబాద్: గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్‌నకు చెందిన ఆర్థిక సేవల కంపెనీ గోద్రెజ్ క్యాపిటల్ తమ ఫైనాన్స్, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల ద్వారా తెలంగాణ ప్రభుత్వంతో బుధవారం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. రాష్ట్రవ్యాప్తంగా రుణ, వ్యాపార అవకాశాల లభ్యతను పెంచి ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి ఊతమిచ్చేందుకు ఈ భాగస్వామ్యం దోహదం చేయనుంది. తొలిసారి రుణం తీసుకుంటున్నవారు, ముఖ్యంగా రుణ సదుపాయం అంతగా లేనివారికి రుణాల లభ్యతను మెరుగుపర్చడం ద్వారా సూక్ష్మ చిన్న మధ్యతరహా (ఎంఎస్‌ఎంఈ) పరిశ్రమలను ఈ ఒప్పందం పటిష్టం చేస్తుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఒప్పందంలో భాగంగా మహిళల కోసం ఉద్దేశించిన 'ఆరోహి పథకం' ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు తోడ్పాటు అందించడంపై ప్రత్యేకంగా దృష్టి పెడతారు. ఎంఎస్‌ఎంఈ వ్యవస్థను పటిష్టం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని గోద్రెజ్ క్యాపిటల్ ఎండీ, సీఈవో మనీష్ షా తెలిపారు. స్థానిక ఎంఎస్‌ఎంఈలు ముఖ్యంగా మహిళా పారిశ్రామికవేత్తలకు అనుగుణంగా ఉండేలా వినూత్న రుణ పరిష్కారాలను అందుబాటులోకి తేవడంలో గోద్రెజ్ క్యాపిటల్‌తో కుదిరిన ఒప్పందం తోడ్పడుతుందని పరిశ్రమల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ వెల్లడించారు.

ప్లాట్‌ఫామ్స్ మూత.. రైళ్లు మళ్లింపు

▶ మొదటి పేజీ తరువాయి

రెస్టారెంట్లు, కియోస్క్‌లు లాంటివన్నీ ఇందులోనే ఏర్పాటు చేస్తున్నారు. ఇది లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఫుట్‌ఓవర్ వంతెనతో అనుసంధానమై ఉంటుంది. పునాదులు, కాలమ్స్ పనులు మొదలుపెడుతున్నారు. ఇందుకోసం 2–3, 4–5 ప్లాట్స్ ఫామ్స్‌ను 50 రోజులు చొప్పున మొత్తం వంద రోజులపాటు మూసేస్తారు. వీటిల్లో లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటుచేసే పనులు కూడా చేపడుతారు. ప్లాట్‌ఫామ్స్‌తోపాటు రైల్వే ట్రాక్ మొత్తానికి పైకప్పు ఏర్పాటు చేస్తారు. దానికి సంబంధించిన పనులను కూడా ఈ నాలుగు ప్లాట్‌ఫామ్స్‌తో ప్రారంభిస్తున్నారు. తర్వాత ప్లాట్‌ఫామ్ నంబర్ 10 వైపు పనులు చేపడతారు.

పట్టాలపై ఇసుకబస్తాలు నింపి క్రేన్ ఏర్పాటు..: ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్ నుంచి పదో ప్లాట్‌ఫామ్ వరకు భారీ ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. దీని పనుల కోసం మధ్యలో ఉండే ప్లాట్‌పామ్ 5–6 లో 500 టన్నుల సామర్థ్యంగల భారీ క్రేన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండు ట్రాక్‌లపై ఇసుక బస్తాలు నింపి, దాని మీద క్రేన్ ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం 15 రోజుల పాటు ఆ రెండు ప్లాట్‌ఫామ్స్‌ను మూసేస్తున్నారు. నిత్యం సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ఇప్పటికే 6 జతల రైళ్లను చర్లపల్లి టెర్మినల్ స్టేషన్‌కు శాశ్వతంగా మళ్లించారు. మరో 26 జతల రైళ్లను తాత్కాలిక పద్ధతిలో ఇతర స్టేషన్‌ల మీదుగా నడుపుతున్నారు. ఇప్పుడు 115 రోజులపాటు సింహభాగం ప్లాట్‌ఫామ్స్‌ను మూసేస్తుండటంతో 120 జతల రైళ్లను కూడా మళ్లిస్తున్నారు. దీంతో సికింద్రాబాద్‌లో రైలు సేవలు పరిమితంగానే ఉండనున్నాయి. ఆరు నెలల పాటు సికింద్రాబాద్ స్టేషన్‌లో రైళ్ల రాకపోకలకు అంతరాయం కొనసాగనుంది.

దక్షిణాసియా హోటల్ ఇన్వెస్ట్‌మెంట్ వర్క్‌షాప్ నేడు

హాజరు కానున్న మంత్రి 'జూపల్లి'



సాక్షి, హైదరాబాద్: ముంబైలో గురువారం జరగనున్న దక్షిణాసియా హోటల్ ఇన్వెస్ట్‌మెంట్ వర్క్‌షాప్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొంటారు. తెలంగాణ నూతన పర్యాటక విధానంతో పాటు పర్యావరణ, ఆలయ, ఆరోగ్య పర్యాటక రంగాల్లో ఉన్న అవకాశాలను మంత్రి వివరించనున్నారు. ఆతిథ్య రంగంలో పెట్టుబడుల అవకాశాలను వివరించి పెట్టుబడిదారులను ఆహ్వానించనున్నారు. పర్యాటక రంగంలో రూ.15 వేల కోట్ల పెట్టుబడుల సమీకరణ.. తద్వారా 3 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి జూపల్లి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్యాటకరంగంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 10న ముంబైలో మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించనున్నారు.

కాంగ్రెస్ పాలనలో విచ్చలవిడిగా ఏపీ జలదోపిడీ

నాగార్జునసాగర్ పూర్తిగా చంద్రబాబు సర్కారు చేతిలోకి: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పాలనలో ఏపీ ప్రభుత్వం విచ్చలవిడిగా జలదోపిడీకి పాల్పడుతోందని మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను పూర్తిగా వినియోగించుకోగా, కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదన్నారు. ఇన్నాళ్లు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ములుగు సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ పరిరక్షణలో ఉండగా, ప్రస్తుతం విశాఖపట్నం సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ చేతికి అప్పగించారన్నారు. తెలంగాణ నిధులు ఢిల్లీకి, నీళ్లు ఆంధ్రకు అన్నట్టుగా పరిస్థితి తయారైందన్నారు. తెలంగాణభవన్‌లో జగదీశ్‌రెడ్డి బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఆర్‌పీఎఫ్ బలగాలకు నాగార్జునసాగర్‌ను అప్పగించడం అంటే.. ఏపీ చేతిలో పెట్టడమేనని, అయినా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సోయి లేదని మండిపడ్డారు. తెలంగాణలో పరోక్షంగా చంద్రబాబు పాలన కొనసాగుతోందని, తిరిగి సమైక్య పాలన రోజులు కనిపిస్తున్నాయన్నారు. దోచుకొని దాచుకుందాం అనే రీతిలో సీఎం, మంత్రులు తీరిక లేకుండా ఉన్నారని చెప్పారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే హైదరాబాద్‌కు తాగునీరు కూడా ఇవ్వలేని పరిస్థితి తలెత్తుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తమ్ సొంత నియోజకవర్గంలో సాగునీటి కోసం రైతులు కంట తడి పెడుతున్నారన్నారు. ఏఐ వీడియోల పేరిట ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములపై వాస్తవాలను దాచే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. మంత్రివర్గ విస్తరణ జరిగితే ముఖ్యమంత్రి పీఠానికి ముప్పు వస్తుందనే భయంతోనే రేవంత్‌రెడ్డి అడ్డుకట్ట వేస్తున్నాడన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ లింగయ్యయాదవ్, ఒంటెద్దు నరసింహారెడ్డి, కిశోర్‌గౌడ్, తుంగ బాలు పాల్గొన్నారు.

బీజేపీ నేతల పేర్లు కేటీఆర్ బయట పెట్టాలి

లేదా పరువునష్టం దావా ఎదుర్కోవాలి: పాయల్ శంకర్




సాక్షి, హైదరాబాద్: హెచ్‌సీయూ భూముల వ్యవహారంలో బీజేపీ నేతల హస్తం ఉందంటూ ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు దమ్ము, ధైర్యం ఉంటే వారి పేర్లు బయట పెట్టాలని బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్ సవాల్ విసిరారు. బీజేపీ నేతల పేర్లను బయటపెట్టని పక్షంలో తమ పార్టీ వేసే పరువు నష్టం దావాకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'హెచ్‌సీయూ భూములపై నిజాలు తేలుస్తా...బాంబులు పేలుస్తా...బీజేపీ నేతల హస్తం ఉంది' అంటూ ఇటీవల కేటీఆర్ ఆరోపణలు చేశారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల అక్రమ సంబంధం బయటపడుతుందని భయపడి కేటీఆర్ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని పాయల్ శంకర్ విమర్శించారు. 'బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకుని, ఆ పార్టీ నేతలను జైల్లో వేస్తామని గతంలో రేవంత్‌రెడ్డి ఎన్నోసార్లు చెప్పారు. 15 నెలలు దాటినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బీఆర్ఎస్ ఇక్కడి కాంగ్రెస్‌తో డీలింగ్ చేసుకుంది. ఇక్కడ సెట్ అవ్వకపోతే ఢిల్లీ పెద్దలతో డీల్ చేస్తున్నారు' అని పాయల్ శంకర్ ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ భూములు అమ్మింది.. ఇప్పుడు కాంగ్రెస్ అమ్ముతోందని, భూముల కబ్జాలపై పోరాడుతున్నది బీజేపీ మాత్రమేనని ఆయన చెప్పారు.

నిలదీస్తే నిర్బంధాలు.. నిరసిస్తే కేసులు

మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కక్ష సాధింపు చర్యలు రాజ్యమేలుతున్నాయని, ఏ ఒక్క వర్గాన్ని వదలకుండా అక్రమ కేసులతో జైలు పాలు చేస్తున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి విమర్శించారు. అభివృద్ధిపై శ్రద్ధ లేని సీఎం రేవంత్‌రెడ్డి.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను వేధించే పనిలో నిమగ్నమయ్యారని మండిపడ్డారు. తెలంగాణకు కాంగ్రెస్ చివరి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని వ్యాఖ్యానించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో జీవన్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో నిర్బంధకాండను అమలు చేస్తూ రేవంత్ నియంతను తలపిస్తున్నారన్నారు. రేవంత్‌ను బీజేపీ కోవర్టుగా భావిస్తున్న రాహుల్ గాంధీ అప్రమత్తమై మీనాక్షి నటరాజన్‌ను పార్టీ ఇన్‌చార్జిగా పంపారని తెలిపారు. సచివాలయం నుంచి మీనాక్షి నటరాజన్ షాడో సీఎంగా, కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి రేవంత్‌రెడ్డి డమ్మీ సీఎంగా పాలన చేస్తున్నారని జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. బిహార్ ఎన్నికల కోసం మీనాక్షి నటరాజన్ నేరుగా వసూళ్ల కౌంటర్ తెరిచారని ఆరోపించారు.


తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ మధ్య సహజ సరిహద్దుగా ఉన్న కర్రి గుట్టలు

పైన మావోయిస్టులు... కిందన జవాన్లు

మళ్లీ తెరపైకి కర్రి గుట్టలు

- గుట్టలపై షెల్టర్ తీసుకుంటున్న మావోయిస్టులు, సానుభూతిపరులు
- దిగువన మాటేసిన భద్రతా దళాలు
- గుట్టల చుట్టూ బాంబులు అమర్చామంటున్న మావోయిస్టులు
- తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో టెన్షన్ టెన్షన్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వం-మావోయిస్టుల మధ్య శాంతి చర్చలకు ప్రజాసంఘాలు, పౌరహక్కుల నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్న తరుణంలో కర్రిగుట్టల్లో బాంబుల అంశం ఇప్పుడు చర్చనీయాంశమైంది. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ మధ్య సహజ సరిహద్దుగా సుమారు వంద కిలోమీటర్ల పొడవునా కర్రిగుట్టలు విస్తరించి ఉన్నాయి. వీటిని సడేమలమ్మ గుట్టలు, సోములమ్మ గుట్టలని కూడా పిలుస్తారు. ఈ గుట్టలకు అవతలి వైపు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఉండగా, తెలంగాణ వైపు ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కొంత భాగం ఉంది. ఎప్పటినుంచో ఈ ప్రాంతం మావోయిస్టులకు షెల్టర్ జోన్‌గా ఉంది. ఆపరేషన్ కగార్ మొదలైన తర్వాత నిర్బంధం తీవ్రం కావడంతో గత వేసవి నుంచే మావోయిస్టులతోపాటు ప్రభుత్వ బలగాలంటే బెదిరిపోయే జన మిలీషియా సభ్యులు, సానుభూతిపరులు కూడా పెద్ద సంఖ్యలో కర్రిగుట్టలపైకి చేరుకున్నారు. వివిధ కోణాల్లో పోలీసువర్గాలకు అందిన పక్కా సమాచారం సైతం ఇదే విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయి. అయితే కర్రిగుట్టల మీదకు వెళ్లి మావోయిస్టులపై దాడులు చేయడమంటే జవాన్ల ప్రాణాలను రిస్క్‌లో పెట్టడమేననే అభిప్రాయం ప్రభుత్వ భద్రతాదళాల్లో వ్యక్తమవుతోంది. దీంతో సుదీర్ఘ కాలం గుట్టలపై మావోలు ఉండలేరని, కచ్చితంగా కిందకు రాక తప్పదనే అంచనాతో ఈ గుట్టల చుట్టూ మాటు వేసి ఉన్నారు. దీంతో తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో టెన్షన్ నెలకొంది.

ఎన్‌కౌంటర్లు.. లొంగుబాట్లు

నెలల తరబడి పోలీసు నిర్బంధం పెరిగిపోవడంతో సానుభూతిపరులను కర్రిగుట్టలపై ఉంచుకోవడం మావోలకు భారంగా మారినట్టు తెలుస్తోంది. దీంతో నిత్యావసరాలు, మందులు, ఇతర అవసరాల కోసం జట్లు జట్లుగా సానుభూతిపరులను కర్రిగుట్టల నుంచి వారి స్వస్థలాలకు వెళ్లాలని కోరినట్టు తెలుస్తోంది. అనారోగ్య సమస్యలు ఉన్న కామ్రేడ్లను వైద్యసాయం కోసం కర్రిగుట్టల నుంచి కిందకు పంపుతుండగా, ఇలా వస్తున్న సీనియర్ మావోలు ఎన్‌కౌంటర్లలో మృతి చెందుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక పోలీసులకు పట్టుబడిన సానుభూతిపరులు అరెస్టవడమో లేక లొంగిపోవడమో జరుగుతోంది.

శాంతి చర్చలపై ఒత్తిడి పెంచేందుకేనా..?

రెండు వారాలు గడిచినా శాంతి చర్చలపై ప్రభుత్వం నుంచి బహిరంగ స్పందన రాలేదు. దీంతో ఈ ప్రతిపాదన విఫలమైతే బస్తర్ అడవుల్లో తీవ్రహింస తప్పదనే సంకేతాలు పంపేందుకే కర్రిగుట్టల్లో బాంబులు పెట్టిన అంశాన్ని మావోలు బహిర్గతం చేశారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీని ద్వారా మరోసారి శాంతిచర్చల అంశాన్ని ప్రజల మధ్యకు తీసుకురావడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం మావోల వ్యూహమనే వాదనలు వినిపిస్తున్నాయి.

శాంతి చర్చలకు మేం సిద్ధమే!

మావోయిస్టు పార్టీ నార్త్ వెస్ట్ సబ్ జోనల్ బ్యూరో రూపేశ్

చర్ల: శాంతి చర్చలకు తామెప్పుడూ సిద్ధమేనని.. ఇందుకోసం ప్రభుత్వం అనుకూల వాతావరణం కల్పించాలని మావోయిస్టు పార్టీ నార్త్ వెస్ట్ సబ్ జోనల్ బ్యూరో రూపేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రూపేశ్ పేరిట విడుదలైన లేఖలోని వివరాలిలా ఉన్నాయి. శాంతి చర్చలకు సంబంధించి తమ కేంద్ర కమిటీ ప్రకటన విడుదల చేస్తూ చర్చలకు అనుకూల వాతావరణం కల్పించాలని కోరగా, ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్‌శర్మ తిరస్కరించారని తెలిపారు. అనుకూల వాతావరణం లేకుండా చర్చలు సాధ్యం కాదనే విషయం ప్రభుత్వానికి తెలుసని, బస్తర్‌లో జరుగుతున్న మారణకాండను ఆపడం వల్ల శాంతిచర్చలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని మరోసారి ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ మారణకాండతో ప్రజలు భయానక వాతావరణంలో జీవిస్తున్నారని, అది వారి జీవనోపాధిపై ప్రభావం చూపిస్తూ యువత వలసబాట పడుతున్నారని పేర్కొన్నారు. శాంతి చర్చలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలనే తమ డిమాండ్‌కు ప్రజాస్వామ్య ప్రేమికులు, మేధావులు, మానవ హక్కుల సంఘాలు, సామాజిక సంస్థల కార్యకర్తలు, పాత్రికేయులు మద్దతు తెలపాలని రూపేశ్ కోరారు. ప్రభుత్వం - మావోయిస్టుల మధ్య శాంతిచర్చల కోసం ఏర్పాటైన కమిటీ సభ్యులు కూడా చొరవ తీసుకోవాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా...

స్వచ్ఛంద సంస్థలు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

4 సంస్థలకు ఆర్థిక సాయం అందించిన గవర్నర్


రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో డీడీలు అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

[illegible] స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి రాష్ట్ర పురోగాభివృద్ధిలో [illegible] పిలుపునిచ్చారు. [illegible] వీక్షణ నిధులు [illegible] సేవలు [illegible] అక్షయ. రవాణా నిర్వహణ [illegible] కిచెన్ [illegible] 15 [illegible] టీవీ, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ కొనుగోలు కోసం [illegible] అందజేశారు. కార్యక్రమంలో గవర్నర్ కార్యదర్శి ఎం.దాన [illegible] పాల్గొన్నారు.

వర్ష బాధిత రైతులకు సహాకరించాలి

వ్యవసాయ అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



[illegible] బాద్: [illegible] ఇటీవల కురిసిన అకాల వర్షాలు, గాలి బీభత్సానికి [illegible] కోరిగిన చోట, రైతులకు అందుబాటులో ఉంటూ [illegible] సూచించాలని వ్యవ[illegible] సూచించారు. మార్కెట్‌లోకి వచ్చిన పంట ఉత్పత్తులు, [illegible] కుండా అన్ని [illegible] అధికారులకు [illegible]

మరో ఏడాదిపాటు ఎన్వీఎస్ రెడ్డి సేవలు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైల్, హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సర్వీసును మరో ఏడాది పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం [illegible]. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ పరిపాలన, [illegible] కార్యదర్శి దాన కిశోర్ ఉత్తర్వులు జారీచేశారు. పదవీకాలం ముగిసినా [illegible] సర్వీసులను [illegible] మని భావించిన ప్రభుత్వం

'కాళేశ్వరం బాధ్యుల'పై చర్యలకు విజిలెన్స్ ఓకే

▶ మొదటి పేజీ తరువాయి

ఐఏఎస్, మాజీ ఐఏఎస్‌లతో పాటు పలువురు మాజీ ఈఎన్‌సీల పేర్లు సైతం ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో వీరిని రక్షించడానికి కొందరు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్టు చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆయా అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా? లేదా? అనే అనుమానాలు ఉన్నతాధికార వర్గాల్లోనే వ్యక్తమవుతున్నాయి.

ఓ అండ్ ఎం వైఫల్యంతోనే..

మేడిగడ్డ బరాజ్ నిర్మాణంలో సాంకేతిక తప్పిదాలు చోటుచేసుకున్నాయని, బరాజ్ పునాదుల కింద రక్షణగా ఉండే సికెంట్ ఫైల్స్ నిర్మాణంలో లోపాలతోనే 7వ బ్లాక్ కుంగిపోయిందని విజిలెన్స్ నిర్ధారించినట్టు తెలిసింది. ఇక బరాజ్‌ల పనులు పూర్తికాక ముందే పూర్తైనట్టు నిర్మాణ సంస్థలకు వర్క్ కంప్లిషన్ సర్టిఫికెట్లు జారీ చేయడం నేరపూరిత చర్య అని పేర్కొంది. బ్యాంక్ గ్యారంటీల విడుదలలో సైతం నిర్మాణ సంస్థలకు అనుచిత లబ్ధి కలిగించేలా వ్యవహరించారని తప్పుబట్టినట్లు సమాచారం. మేడిగడ్డ బరాజ్ 2019లో వినియోగంలోకి రాగా అదే ఏడాది వచ్చిన వరదల్లో బరాజ్ దిగువన రక్షణ కోసం ఏర్పాటు చేసిన సీసీ బ్లాకులు (అప్రాన్) కొట్టుకుపోగా, మూడేళ్ల పాటు మరమ్మతులు నిర్వహించకుండా ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) విభాగం నిర్లక్ష్యం చేయడంతోనే 2022 అక్టోబర్‌లో బరాజ్ కుంగిందని పేర్కొంది. ఏటా వర్షాకాలానికి ముందు, ఆ తర్వాత బరాజ్ స్థితిగతులపై అధ్యయనం చేసి నివేదికను తయారు చేయాల్సి ఉండగా, నాటి రామగుండం ఈఎన్‌సీ నిర్వహించలేదని తప్పుబట్టినట్లు తెలిసింది. నిర్మాణం పూర్తైన తర్వాత లోపలి భాగంలో షీట్ ఫైల్స్‌తో ఏర్పాటు చేసిన కాఫర్ డ్యామ్‌ను తొలగించక పోవడంతో నది సహజ ప్రవాహానికి అడ్డంకిగా మారి బరాజ్‌పై ఒత్తిడి పెంచిందని అభిప్రాయపడింది. ఈ విషయంలో నిర్మాణ సంస్థతో పాటు రామగుండం మాజీ ఈఎన్‌సీ, ఎస్ఈ, ఈఈలే బాధ్యులని తేల్చినట్లు తెలిసింది.



కాళేశ్వరం కమిషన్‌కు విజిలెన్స్ నివేదిక

బరాజ్‌ల వైఫల్యాలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు తాజాగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తమ నివేదికను అందించింది. ఈ నెల 20 తర్వాత జస్టిస్ ఘోష్ హైదరాబాద్‌కు చేరుకుని సాక్షుల తుది దఫా క్రాస్ ఎగ్జామినేషన్ జరపనున్నారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లకు లేఖ రాసి, క్రాస్ ఎగ్జామినేషన్‌లో పాల్గొనడం ద్వారా కమిషన్‌కు సహకరించాలని కోరనున్నట్టు తెలిసింది.

నేడు హెచ్‌సీయూకు ఎంపవర్డ్ కమిటీ !

స్వయంగా పరిశీలించనున్న సభ్యులు

సాక్షి, హైదరాబాద్ : హెచ్‌సీయూ పరిధిలో ఉన్న 400 ఎకరాలకు సంబంధించి ఏం జరిగిందనే దానిపై క్షేత్రస్థాయి పరిశీలనతోపాటు, జరిగిన నష్టంపై సొంతంగా అంచనా వేసేందుకు గురువారం సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ హైదరాబాద్‌కు రానుంది. ఈ బృందంలో ఇద్దరు లేదా ముగ్గురు కేంద్ర ప్రభుత్వ అధికారులు, న్యాయ, పర్యావరణ వేత్తలు, ఆయా రంగాలకు చెందిన వారున్నట్టు సమాచారం. పర్యటనలో భాగంగా ఈ సమస్యతో ముడిపడిన అంశాలపై పరిశీలనతోపాటు ప్రభుత్వ అధికారులు, వివిధ రంగాలకు చెందిన, పర్యావరణ నిపుణులను ఈ బృందం భేటీ కానున్నట్టుగా తెలిసింది. ఇది అటవీ ప్రాంతమా.. ప్రదేశమా అనే దానితో నిమిత్తం లేకుండా...దాదాపు వందకు పైగా ఎకరాల్లో జరిగిన చెట్ల నరికివేత, వన్యప్రాణులు, పర్యావరణానికి ఏ మేరకు నష్టం జరిగిందనే అంశాలకు ఇప్పుడు ప్రాధాన్యం ఏర్పడిందని నిపుణులు చెబుతున్నారు. ఈ నెల 11వ తేదీలోగా ఆయా అంశాలపై సుప్రీంకోర్టుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం నివేదిక సమర్పించాల్సి ఉండగా, హెచ్‌సీయూ పరిశీలనకు స్వయంగా ఎంపవర్డ్ కమిటీ వస్తున్నట్టుగా తెలుస్తోంది.

అటవీశాఖ తీరుపైనా చర్చ

హెచ్‌సీయూ పరిధిలోని 400 ఎకరాల భూమి రక్షిత అటవీ ప్రాంతం కాకపోయినా చెట్ల కూల్చివేత, వన్యప్రాణులు, జీవవైవిధ్యానికి జరిగిన నష్టం చర్చనీయాంశమయ్యాయి. 40 ఏళ్లుగా పెరిగిన చెట్లతోపాటు వన్యప్రాణులు, జంతువుల సంచారం పెరగడం, రకరకాల పక్షులకు ఇది కేంద్రంగా మారిన విషయం తెలిసిందే. అటవీశాఖ పరంగా జరిపిన పరిశీలనలో ఈ ప్రాంతంలో ఎక్కువగా సుబాబుల్ చెట్లున్నాయని, అధిక శాతం డీగ్రేడెడ్ ఫారెస్ట్‌గానే ఉందనే నివేదిక ప్రభుత్వానికి అందజేసినట్టు సమాచారం. ఇటీవల వందకు పైగా ఎకరాల్లో చెట్ల కూల్చివేత జరిగిన ప్రదేశంలో ఎక్కువ సుబాబుల్ చెట్లు ఉన్నాయని ఆ నివేదికలో పేర్కొన్నట్టు తెలిసింది. అయితే ఈ 400 ఎకరాలు రక్షిత అటవీ ప్రాంతం కాదనే వాదననే వినిపిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి అటవీశాఖ పదే పదే నివేదించడం చర్చనీయాంశమవుతోంది. ఈ ప్రాంతం విభిన్న రకాల చెట్లు, జంతువులు, పక్షులు, పర్యావరణ వ్యవస్థ, జీవవైవిధ్యం ఏర్పడిందనే విషయాన్ని...ఇటీవల చెట్ల కూల్చివేతలు, క్లియరెన్స్ అనేది నియమనిబంధనలకు అనుగుణంగానే జరిగిందా లేదా అన్న దానిపై స్పష్టత ఇవ్వకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఎన్యుమరేషన్‌కు సంబంధించి హెచ్‌సీయూ పాలకవర్గానికి గతంలోనే అటవీశాఖ ప్రతిపాదన పంపించగా...ఫండింగ్ అనేది ఆర్థికభారంగా మారినందున అది ముందుకు సాగలేదని అధికారులు చెబుతున్నారు.

కూల్చిన చెట్ల సంఖ్యపైనా అస్పష్టత...

గతంలోనే డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఫర్ నేచర్ హైదరాబాద్...హెచ్‌సీయూ పరిధిలోని భూమిలో పర్యావరణ వ్యవస్థ, జీవావరణం, జీవవైవిధ్యంపై అధ్యయనం నిర్వహించింది. వర్సిటీలో 'బయోడైవర్సిటీ'భేషుగ్గా ఉందని, వివిధ రకాల జంతువులు, చెట్లతో అలరారుతోందని ఈ వర్సిటీకి డబ్ల్యూడబ్ల్యూఎఫ్ నివేదిక సమర్పించింది. ఇటీవల జరిగిన చెట్ల కూల్చివేతకు సంబంధించి కూడా డబ్ల్యూడబ్ల్యూఎఫ్‌కు స్పష్టమైన సమాచారం అందుబాటులోకి రాలేదని తెలుస్తోంది. రాష్ట్రస్థాయిలో 'ట్రీ ప్రొటెక్షన్ కమిటీ'దీనిపై పూర్తి వివరాలేవి అందలేదని తెలుస్తోంది. ఈ కమిటీలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు, ఇతర సభ్యులు కూడా నేలమట్టమైన చెట్ల డేటా ఇవ్వాలని 'ట్రీ ప్రొటెక్షన్ కమిటీ'చైర్‌పర్సన్ డా.జీ.రామలింగంకు లేఖ రాసినట్టు సమాచారం. ఈ అంశాలన్నింటిపైనా ఎంపవర్డ్ కమిటీ దృష్టి పెట్టనున్నట్టు తెలుస్తోంది.

బీజేపీ ఎంపీలతో హెచ్‌సీయూ వీసీ, రిజిస్ట్రార్ భేటీ

- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నివాసంలో సమావేశం
- హాజరైన ఈటల రాజేందర్, రఘునందన్‌రావు
- వాస్తవాలు తెలుసుకునేందుకే సమావేశమయ్యామన్న ఎంపీలు


మీడియాతో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి. చిత్రంలో ఈటల రాజేందర్, ఎం.రఘునందన్‌రావు

సాక్షి, హైదరాబాద్: హెచ్‌సీయూ భూములకు సంబంధించి వివాదం తలెత్తడం, ఇందులో ఓ బీజేపీ ఎంపీ ప్రమేయం ఉందంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో.. బీజేపీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఎం.రఘునందన్‌రావులతో వర్సిటీ వీసీ జగదీశ్వరరావు, రిజిస్ట్రార్ సమావేశమయ్యారు. బుధవారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నివాసంలో ఈ సమావేశం జరిగింది. సమావేశానంతరం ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడారు. ఈ భూములకు సంబంధించి ఎంపీలుగా వాస్తవ విషయాలు తెలుసుకుని, ప్రజల ముందు ఉంచేందుకే ఈ భేటీ నిర్వహించామని కొండా చెప్పారు. 'హెచ్‌సీయూ వీసీ, రిజిస్ట్రార్‌తో సమావేశమయ్యాం. లీగల్ డాక్యుమెంట్స్ పరిశీలించాం. 2,300 ఎకరాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చింది. వర్సిటీకి ప్రస్తుతం ఎన్ని ఎకరాలు ఉన్నాయి. దీనిపై సర్వే చేసే అవకాశం ఉందా? అసలు భూమి ఎవరిదన్న విషయాలపై చర్చించాం' అని ఆయన తెలియజేశారు. ఈ భూముల వ్యవహారంపై ఇటీవల సచివాలయంలో జరిగిన సమావేశానికి కాంగ్రెస్ రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ హాజరుకావడం పట్ల విమర్శలు వ్యక్తమైన విషయం తెలిసిందే.

కేటీఆర్ ఆరోపణలపైనా..

హెచ్‌సీయూ భూముల విషయంలో ఓ బీజేపీ ఎంపీ ప్రమేయం ఉందంటూ మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీ ఎంపీల సమావేశం చర్చనీయాంశమైంది. కేటీఆర్ ఆరోపణలపై వీసీతో మాట్లాడి వాస్తవ విషయాలను తెలుసుకునేందుకు ఎంపీలు సమావేశమయ్యారని పార్టీ నాయకులు చెబుతున్నారు. ఈ వర్సిటీ చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఉండటంతో స్థానిక ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చొరవ తీసుకొని సమావేశం నిర్వహించారని తెలుస్తోంది. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. 2012లో అప్పటి రంగారెడ్డి కలెక్టర్ 2,185 ఎకరాలు హెచ్‌సీయూకు చెందినదని సీసీఎల్ఏకు లేఖ రాశారు. సుప్రీంకోర్టులో రేవంత్ ఈ భూమిపై ఎప్పుడు పోరాడారని ఆయన ప్రశ్నించారు. 'వివాదాస్పదంగా ఉన్న 400 ఎకరాలు పక్కనపెట్టి 1,785 ఎకరాల భూమికి గత పదేళ్లలో ఎందుకు కాంపౌండ్ వాల్ కట్టలేదు. ఈ వర్సిటీకి చెందిన 134 ఎకరాలు మాజీ సీఎం కేసీఆర్ టీఎన్జీవోలకు ఎందుకు ఇచ్చారు? కేటీఆర్ ఆరోపణలు చేయడం కాదు. ఏ ఎంపీ చేశారో చెబితే పార్టీ తరఫున మేం సమాధానం చెబుతాం. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లిన అనంతరం ఇష్యూపై ముందుకు వెళ్తాం' అని రఘునందన్ తెలిపారు.

ఏప్రిల్ వేతనాలేవీ?

- గురుకుల సొసైటీల ఉద్యోగులకు ఇంకా అందని వేతనాలు
- వేతన బిల్లుల ఖరారులో జాప్యంతోనే పరిస్థితి ఇలా...



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బందికి వేతన చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఏప్రిల్ పదోతేదీ వచ్చినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ గురుకుల సొసైటీల్లోని ఉద్యోగులకు ఇంకా వేతనాలు అందలేదు. సాధారణంగా బీసీ, జనరల్ గురుకుల సిబ్బందికి ప్రతినెలా మొదటివారంలోనే వేతనాలు వారి ఖాతాలో జమ అయ్యేవి. కానీ పది రోజులవుతున్నా, ఇంకా వేతనం అందక ఉద్యోగులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేతన చెల్లింపుల్లో జాప్యాన్ని అరికడుతున్నామని, ప్రతినెలా మొదటి పనిదినం రోజున వేతనాలు చెల్లిస్తామని స్పష్టం చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఏడాదికాలంగా వేతన చెల్లింపులు సజావుగానే జరుగుతున్నాయి. కానీ ఏప్రిల్ నెలలో మాత్రం ఏ ఒక్క సొసైటీలోని ఉద్యోగికి పదోతేదీ వచ్చినా వేతనాలు మాత్రం జమ కాలేదు.

☛ ఎస్సీ, మైనారిటీ గురుకుల సొసైటీల్లో ఉద్యోగుల వేతన చెల్లింపుల జాప్యానికి ప్రధాన కారణం ఆయా కార్యాలయాల్లోని సెక్షన్ అధికారుల నిర్లక్ష్యమే. వేతన బిల్లులు సాధారణంగా 20వ తేదీకల్లా తయారు చేసి సమర్పిస్తే ఒకటో తేదీన వేతనాలు విడుదలవుతాయి. కానీ ఈ రెండు సొసైటీల్లో కొద్ది నెలలుగా బిల్లుల తయారీ ప్రక్రియ నెలాఖరు వరకు నిర్వహిస్తుండడంతో వేతన చెల్లింపుల్లో సైతం అదే స్థాయిలో జాప్యం జరుగుతోంది.

☛ మరోవైపు గురుకుల సొసైటీలోని విద్యాసంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు విడుదల కాలేదు. దీంతో ఆయా ఉద్యోగులు సొసైటీ కార్యాలయంలోని అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు.

సొసైటీ కార్యదర్శులకు వినతులు

ఉద్యోగుల వేతన చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్న తీరుపై గురుకుల ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు. బుధవారం వివిధ ఉద్యోగ సంఘాల నేతలు గురుకుల సొసైటీ కార్యదర్శులు, ప్రభుత్వ కార్యదర్శులకు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు.

☛ అన్ని సొసైటీల్లోని ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.బాలరాజు, ప్రధానకార్యదర్శి ఎస్.దయాకర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

☛ గురుకుల ఉద్యోగుల వేతనాల్లో జాప్యంతో వారి ఆర్థిక క్రమశిక్షణ పూర్తిగా దెబ్బతిన్నదని, ఫలితంగా భవిష్యత్‌లో బ్యాంకు రుణాలకు అర్హత లేకుండా పోతోందని ఆల్ తెలంగాణ గవర్నమెంట్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కూకుట్ల యాదయ్య, వై.పాపిరెడ్డి మరో ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే జేఏసీ లక్ష్యం

37 డిమాండ్లతో ప్రభుత్వ సలహాదారు కేశవరావును కలిసిన జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే జేఏసీ లక్ష్యం అని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ల సాధనకు కృషి చేస్తున్నామని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ కార్యాలయంలో బుధవారం లచ్చిరెడ్డి అధ్యక్షతన తెలంగాణ ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం జరిగింది. ఇందులో అన్ని విభాగాల ప్రభుత్వ ఉద్యోగుల ప్రధాన సమస్యలపై పలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఉద్యోగ సంఘాల ప్రతినిధులు లేవనెత్తిన 37 ప్రధాన సమస్యలపై లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో జేఏసీ ప్రతినిధి బృందం కేబినెట్ సబ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు కె.కేశవరావుకు వినతిపత్రం అందించారు. ఈ వినతిపత్రంపై సానుకూలంగా స్పందించిన కేశవరావు.. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే నిర్వహించనున్న కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ఓ నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు లచ్చిరెడ్డి తెలిపారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై జీఏడీ (పొలిటికల్) ముఖ్యకార్యదర్శి రఘునందన్‌రావుకు కూడా వినతిపత్రం అందించారు. ఉద్యోగులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత చికిత్స అందించడం, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులపై సీలింగ్ పెంపు, పెండింగ్ బిల్లులకు ముందుగానే క్లియరెన్స్ చేయడం, ఉద్యోగులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉన్న చికిత్స ధరల ప్రకారం చికిత్స అందించడంతో పాటు బిల్లుల క్లియరెన్స్, ఇ-కుబేర్ ద్వారా గ్రీన్‌చానల్ ద్వారా రూ.10 లక్షలు అందించడం మొదలైన డిమాండ్లను ప్రస్తావించారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.రామకృష్ణ, టీపీయూఎస్ ప్రెసిడెంట్ హన్మంత్ రావు, తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్ ప్రెసిడెంట్ దర్శన్ గౌడ్, టీఈఏ ప్రెసిడెంట్ జి.నిర్మల, టీజీటీఏ జనరల్ సెక్రటరీ రమేశ్ పాక, ఎస్టీటీయూ ప్రెసిడెంట్ మహిపాల్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కత్తి జనార్దన్‌రావు, హెచ్ఎండబ్ల్యూఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుగంధిని, టీజీ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీజీటీఎస్ఎల్‌కు ఐటీ కన్సల్టెన్సీ, సాఫ్ట్‌వేర్ బాధ్యతలు

ఈ గవర్నెన్స్ ప్రాజెక్టుల్లో పారదర్శకత కోసం మార్గదర్శకాలు జారీ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ విభాగాల్లో ఐటీ ఉత్పత్తుల కొనుగోళ్లలో పారదర్శకతకు పెద్దపీట వేసేలా తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (టీజీటీఎస్ఎల్)కు కీలక బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది. ప్రభుత్వ విభాగాల్లో ఐటీ వినియోగం, ఐటీ మౌలిక వసతుల ప్రాజెక్టులు, ఐటీ కన్సల్టెన్సీ సేవలు, సమాచారానికి భద్రత కల్పించే సేవలు, ఐటీ మౌలిక వసతుల కల్పనకు అవసరమైన కొనుగోళ్లలో టీజీటీఎస్ఎల్ నోడల్ ఏజెన్సీగా పనిచేస్తోంది. ప్రభుత్వ విభాగాల్లో కంప్యూటర్ వ్యవస్థల ఏర్పాటు, మార్కెట్ ఇంటెలిజెన్స్, ప్రభుత్వ విభాగాలు ఉపయోగించే ఐటీ ఉత్పత్తులకు సంబంధించిన అనేక కార్యకలాపాలను ఈ సంస్థ పర్యవేక్షిస్తోంది. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఆఫీస్ ఆటోమేషన్ పరికరాల కొనుగోలుకు సంబంధించిన విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సమీక్షించింది. ఈ గవర్నెన్స్ ప్రాజెక్టులకు అవసరమైన సాఫ్ట్‌వేర్, ఐటీ సేవలకు సంబంధించిన సర్వీసు చార్జీలను నిర్ధారిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. సామర్థ్యం పెంచుకోవడం, అందుబాటులో ఉన్న మౌలిక వసతులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, ఐటీ సంబంధిత అవసరాలు, అవసరమైన ఐటీ ఉత్పత్తులను పారదర్శకంగా కొనుగోలు చేయడం తదితరాల కోసం టీజీటీఎస్ఎల్ సేవలు వినియోగించుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

స్వామి రామానందతీర్థ సంస్థలో ఉచిత ఉపాధి శిక్షణ

సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి వెల్లడి



భూదాన్ పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో స్వల్పకాలిక స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 45 రోజుల కాలవ్యవధి గల మొబైల్‌ఫోన్ రిపేరింగ్ కోర్సు, నెల రోజుల కాలవ్యవధి గల సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్ మెయింటెనెన్స్, హౌస్‌వైరింగ్ కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. ఈ కోర్సులకు పదో తరగతి పాసై ఉండాలన్నారు. క్విల్ట్ బ్యాగుల తయారీ కోర్సుకు మాత్రం 8వ తరగతి పాసైన వారు అర్హులని పేర్కొన్నారు. రెండు నెలల కాలవ్యవధి కలిగిన జర్దోజీ (అడ్వాన్స్‌డ్) కోర్సుకు 8వ తరగతి విద్యార్హత ఉండాలన్నారు. అభ్యర్థులు 18-30 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలని చెప్పారు. భోజనంతో కూడిన హాస్టల్‌లో ఉండేవారు నెలకు రూ.3,900 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు ఒరిజినల్స్‌తో ఈనెల 15న సంస్థలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు నేరుగా హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.



తృష్ణనే కోల్పోవడం కంటే,
తృష్ణలో తనను తాను కోల్పోవడం మెరుగు.
– సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి
గురువారం, 10 ఏప్రిల్ 2025

సరైన న్యాయం!

పుష్కరకాలం క్రితం ఒక మునిమాపు వేళ హైదరాబాద్ నగరంలో 18 మంది అమాయకుల ప్రాణాలు తీసిన బాంబు పేలుళ్ల ఉదంతాల్లో దోషులుగా తేలిన ఆరుగురు నిందితులకూ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) ప్రత్యేక న్యాయస్థానం విధించిన మరణశిక్షను ధ్రువీకరిస్తూ తెలంగాణ హైకోర్టు మంగళవారం వెలువరించిన తీర్పు బాధిత కుటుంబాలకు మాత్రమే కాదు, ఉగ్రవాద ఘటనలను వ్యతిరేకించే వారందరికీ ఊరటనిస్తుంది. నగరంలోని దిల్‌సుఖ్‌నగర్‌లో రెండుచోట్ల జరిగిన ఈ పేలుళ్లలో మరో 131 మంది గాయాల పాలయ్యారు. వారిలో చాలామంది ఈనాటికీ ఆ గాయాలు కలిగించిన శారీరక, మానసిక క్లేశాల నుంచి కోలుకోలేకపోతున్నారు. మరణశిక్ష పడిన వారిలో రియాజ్ భత్కల్ అనే ఉగ్రవాది ఇప్పటికీ పాకిస్తాన్‌లో తలదాచుకున్నాడు. ఈ పేలుళ్లకు పథకం పన్నడంతోపాటు అందుకు కావల్సిన నిధుల సమీకరణ, పేలుడు పదార్థాలు, మనుషుల్ని సమకూర్చుకోవటం వగైరాలకు సూత్రధారి రియాజే. ఏవో కొన్ని ఉగ్రవాద ఘటనల ద్వారా దేశంలో అల్లకల్లోలం సృష్టించవచ్చని, దేశాన్ని బలహీనపరచవచ్చని ఈ బాపతు ఉగ్రవాదులు కలలుగంటారు. ఉగ్రవాదం మామూలు ఉన్మాదం కాదు. అది ఎప్పుడు ఎక్కడ తన విషపుకోరలు చాస్తుందో... ఎవరిని కాటేస్తుందో అంచనా వేయటం కూడా అసాధ్యం. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద సంస్థలు అక్కడి సైన్యం, దాని గూఢచార విభాగం ఐఎస్‌ఐ సహకారంతో శిక్షణ శిబిరాలు నిర్వహించటం, యువకులను తప్పుడు మార్గానికి మళ్లించటం, సాధారణ ప్రజానీకానికి హాని కలిగించగల చర్యలకు ప్రేరేపించటం దశాబ్దాలుగా సాగుతోంది. ఆ సంస్థల ప్రేరణతో సొంతంగా ఉగ్రవాద సంస్థలను నెలకొల్పి భయోత్పాతాన్ని సృష్టించటం భత్కల్ లాంటివారికి లాభసాటి వ్యాపారంగా కూడా మారిందని దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల ఉదంతంపై చేసిన దర్యాప్తులో వెల్లడైంది. మంగళూరు సమీప ప్రాంతాల్లో రియాజ్ భత్కల్ భారీయెత్తున రియల్ ఎస్టేట్ వెంచర్లు నిర్వహించాడని, జిహాద్ పేరుతో దేశంలోనూ, వెలుపలా లక్షలాది రూపాయలు వసూలు చేసి సొంత ఖాతాలకు మళ్లించుకున్నాడని కూడా బయటపడింది.

తమను తాము మత సంరక్షకులుగా చిత్రించుకోవటం, జిహాద్ చేస్తున్నామని మభ్యపెట్టడం భత్కల్ లాంటివారికి రివాజు. వీరి వలలోపడి అనేకమంది యువకుల జీవితాలు నాశనమయ్యాయి. జనసమ్మర్దంగల ప్రాంతాల్లో బాంబులుంచి సాధారణ పౌరుల ప్రాణాలకు హాని కలిగించే ఇలాంటి వారికి కఠినమైన శిక్ష విధించటం సమాజ శ్రేయస్సు కోసం తప్పనిసరి. ఈ పన్నెండేళ్ల కాలంలోనూ వీరు తమ చర్యలకు పశ్చాత్తాపం ప్రకటించటంగానీ, ఇకపై సత్ప్రవర్తనతో మెలుగుతామని గానీ ఎక్కడా చెప్పలేదు. వీరిలో పరివర్తనకూ లేదా సంస్కరణకూ అవకాశమే లేదని నిర్ధారణకొచ్చినట్టు ఉన్నత న్యాయస్థానం చెప్పిందంటే ఈ నేరగాళ్లు ఎంత కరుడు గట్టిపోయారో అర్థమవుతుంది.

ఉగ్రవాదులు మతం పేరు చెప్పుకోవచ్చుగానీ ఏ మతమూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించదు. ఉగ్రవాదానికి అసలు మతం ఉండదు. ఇలాంటి నేరగాళ్ల చర్యల వల్ల మాత్రమే మతం సురక్షితంగా మనుగడ సాగించగలదని అందులోని వారెవరూ విశ్వసించరు కూడా! కానీ అమాయకులను నమ్మించటానికి వీరు మతాన్ని సాధనంగా వాడుకుంటారు. వారిని మభ్యపెట్టడం కోసం ఆధ్యాత్మికతను ప్రబోధిస్తారు. క్రమేపీ తమ దురాలోచనను వారి మెదళ్లలోకి ఎక్కిస్తారు. అప్పటికల్లా ఆ యువకులు వీరి చేతుల్లో కీలుబొమ్మలుగా మారుతారు. ఇలాంటివారికి చివరకు మిగిలేదేమిటో, వారి మానసిక, శారీరక స్థితిగతులు ఎలా దిగజారతాయో తెలియటానికి జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు కొందరు వారితో మాట్లాడి రూపొందించిన నివేదికే సాక్ష్యం.

భిన్న వర్గాల ప్రజల మధ్య చిచ్చురేపి దేశాన్ని విచ్ఛిన్నం చేయటానికీ, సమాజాన్ని భయభ్రాంతపరచటానికీ వీరు పాల్పడిన చర్యల వల్ల ఎక్కడెక్కడి నుంచో పొట్టకూటి కోసం ఈ మహానగరానికొచ్చిన సాధారణ ప్రజానీకం బలయ్యారు. అందులో అన్ని మతాలవారూ ఉన్నారు. ఇంకా అమ్మ కడుపులోనే ఉన్న శిశువు మొదలుకొని స్త్రీలు, పిల్లలు కూడా వీరి మతిమాలిన చేష్టలకు బలైపోయారు. అనేకమంది జీవితాలు అనిశ్చితిలో పడ్డాయి. మనుషులైవుండి తోటి మనుషుల పట్ల ఇంత క్రూరంగా, ఇంత దారుణంగా వ్యవహరించటం ఊహకందనిది. ఇలాంటి ఉదంతాల్లో ఆచూకీ దొరక్కుండా సులభంగా తప్పించుకోవచ్చని, నేర నిరూపణ అసాధ్యమని నేరగాళ్లు భావిస్తుంటారు. కానీ సాంకేతికత బాగా పెరిగిన ఈ కాలంలో అదేమంత కష్టం కాదని పకడ్బందీ దర్యాప్తు ద్వారా ఎన్‌ఐఏ నిరూపించింది.

అయితే ఇలాంటి కేసుల్లో ఇమిడివుండే సంక్లిష్టతల వల్ల కావొచ్చు... మన న్యాయస్థానాలకు ఉండే పెండింగ్ కేసుల భారం వల్ల కావొచ్చు విచారణకు సుదీర్ఘ సమయం పడుతోంది. ఈ ఉదంతం చోటుచేసుకున్ననాటినుంచీ చూస్తే ఇప్పటికి పన్నెండేళ్ల సమయం పట్టింది. త్వరితగతిన విచారించి శిక్షించే వ్యవస్థ ఉంటే అలాంటి బాటలో పోయేవారికి అదొక హెచ్చరికగా పనికొస్తుంది. ఈ తరహా భయోత్పాత చర్యలకు ఒక నిరోధంగా ఉపయోగపడుతుంది. అయితే ఈ ఉదంతంలో అయిన వారిని కోల్పోయినవారికీ, ప్రాణాలతో బయటపడి భారంగా బతుకీడుస్తున్నవారికీ ఇప్పటికీ ప్రభుత్వ సాయం అందలేదంటే మనసు చివుక్కుమంటుంది. కాళ్లూ చేతులూ కోల్పోయి, చూపు, వినికిడి దెబ్బతిని, కనీసం మందులు కొనే శక్తిలేక అనేకులు కష్టాలు పడుతుండటం కలచివేస్తుంది. ఈ విషయంలో ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించాలి.

ప్రాసంగికత కోల్పోతున్న యూరప్?

విశ్లేషణ



మోహన్ గురుస్వామి

డోనాల్డ్ ట్రంప్, జె.డి. వాన్స్ కలిసి వైట్ హౌస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని ఎలా వేధించారో ప్రపంచం అంతా చూసింది. అమెరికా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఆయన పట్ల పాశవికంగా ప్రవర్తించి గుడ్ బై సైతం చెప్పకుండా తరిమేశారు. 'రష్యాను ధిక్కరించండి, మీకు మేము అండగా ఉన్నాం...' అంటూ ఉక్రెయిన్ అధినేతకు బాసటగా నిలిచి ఎంతగా ప్రోత్సహించాలో అంతగా ప్రోత్సహించిన యూరప్ ఈ ఘట్టాన్ని చేష్టలుడిగి చూసింది. యూరప్ ప్రభావం పలుచబడిపోతోంది అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి?



◆ 2050 నాటికి ప్రపంచ జనాభాలో యూరప్ వాటా కేవలం 7 శాతానికి పరిమితం అవుతుందని అంచనా. యుద్ధరంగానికి దళాలు సమకూర్చుకోవడం కూడా ఈ దేశాలకు సమస్యగా మారుతోంది.

◆ వర్ధమాన దేశాలు 21వ శతాబ్దపు నూతన వ్యవస్థకు రూపుదిద్ద బోతున్నందున... ప్రపంచ వ్యవహారాల్లో యూరప్ పాత్ర క్రమేపీ క్షీణించి పోతుంది.

◆ రెండో ప్రపంచ యుద్ధం ముగిసి వందేళ్లు గడిచే లోపే అప్పటి విజేతల్లో ఒక్క అమెరికా మినహా మిగిలినవన్నీ టాప్–10 జాబితా నుంచి కనుమరుగవుతాయి.

తగ్గుతున్న జనాభా

యూరోపియన్ యూనియన్ (ఈయూ)కు బలమైన నాయకత్వం లేదు. ఎవరి దౌత్య విధానం వారిదే. 'యూరప్‌తో మాట్లాడాలనుకుంటే, నేను ఎవరికి ఫోన్ చేయాలి?' అంటూ అమెరికా మాజీ విదేశాంగ మంత్రి హెన్రీ కిసింజర్ ఒక సందర్భంలో చేసిన సుప్రసిద్ధ వ్యాఖ్య ఇందుకు అద్దం పడుతుంది. యూరప్ దేశాలకు కాలం కూడా కలిసిరావడం లేదు. ఆ దేశాల్లో జననాల రేట్లు తగ్గుతున్నాయి. వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా, యువకులు తగ్గిపోతున్నారు. 2050 నాటికి యూరప్ సగటు వయసు 48 ఏళ్లకు పెరుగుతుంది. 60 ఏళ్లు దాటినవారు జనాభాలో 40 శాతం ఉంటారు. వందేళ్ల క్రితం ప్రపంచ జనాభాలో 25 శాతం యూరప్ దేశాల ప్రజలే ఉండేవారు. 2050 నాటికి, వీరి వాటా కేవలం 7 శాతానికి పరిమితం అవుతుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

యుద్ధరంగానికి దళాలు సమకూర్చుకోవడం కూడా ఈ దేశాలకు సమస్యగా మారుతోంది. రష్యా ఇప్పటికే ఉత్తర కొరియా దళాలను రెగ్యులర్ ప్రాతిపదికన తన సైన్యంలో నియమించుకోవలసి వచ్చింది. పనిచేసే వారి సంఖ్య తగ్గిపోతున్నా సరే... యూరప్ కాలం చెల్లిన తన పాత ఇమ్మిగ్రేషన్ విధానాలనే పట్టుకు వేలాడుతోంది. ఇది శ్రమశక్తి సమస్యను మరింత జటిలం చేస్తోంది. ఉక్రెయిన్ శ్వేతజాతి శరణార్థుల పుణ్యమా అని పనిచేసే వారి సంఖ్య పెరిగినా ఇది తాత్కాలికమే!

ఎదుగుదల లేని ఆర్థిక వ్యవస్థ

పరిపాలన సరిగా ఉండదు, ఆర్థికంగా పురోగమనం లేదు, వయసు మళ్లుతున్న జనం పెరుగుతున్నారు, వృత్తిపరమైన అవకాశాలూ అంతంత మాత్రమే. ఇలాంటి యూరప్ ఇండియాను ఎలా ఆకట్టుకుంటుంది? అమెరికాలో ఒంటి రంగును బట్టి కాకుండా, సత్తాను బట్టి మనుషుల్ని అంచనా వేస్తారు. ఆ మాదిరిగా మార్పు చెందటంలో యూరప్ సమాజం విఫలమైంది. నత్తనడకగా ఉన్న జీడీపీ వృద్ధి రేటు, పెరుగుతున్న సామాజిక భద్రతా వ్యయాలు, నడ్డి విరుస్తున్న రుణభారం... ఇవన్నీ ఆ ఖండం ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయి. అమెరికా పాత్రికేయుడు ఫరీద్ జకారియా చెప్పినట్లు, యూరప్ దుఃస్థితికి మూల కారణం ఆర్థిక వృద్ధి లోపం. ఉదాహరణకు ఇటలీ ఆర్థిక వ్యవస్థలో ఏకంగా ఒక దశాబ్దంగా ఎలాంటి పెరుగుదల లేదు.

ఆసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికాల్లోని వర్ధమాన ఆర్థిక వ్యవస్థలు బలం పుంజుకుంటూ దూసుకు వస్తున్నాయి. గ్లోబల్ గవర్నెన్స్‌లో తమకు అధిక పాత్ర ఉండాలని ఈ దేశాలు డిమాండ్ చేస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి, జీ–7, నాటో వంటి ప్రపంచ అధికార సంస్థలు ఇప్పటికీ యూరప్ చెప్పుచేతల్లో నడుస్తున్నాయి. కానీ ఆర్థిక వాస్తవాలు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రస్తుతం అయిదు యూరప్ దేశాలు (జర్మనీ, యూకే, రష్యా, ఫ్రాన్స్, ఇటలీ) ప్రపంచ టాప్–10 ఆర్థిక వ్యవస్థల్లో ఉన్నాయి. 2050 నాటికి ఈ అయిదింటిలో కేవలం జర్మనీ, యూకే రెండే టాప్–10 జాబితాలో మిగిలి ఉంటాయి. ఆ పదిలో వాటికి దక్కే ర్యాంకులు చిట్టచివరి తొమ్మిది, పది! ఇందుకు భిన్నంగా, వాటి కంటే ముందుండే ఇండియా, బ్రెజిల్, ఇంకా ఇతర వర్ధమాన దేశాలు అంతర్జాతీయ వ్యవహారాల్లో తమకు గణనీయ పాత్ర ఉండాలని ఒత్తిడి చేస్తాయి. ఇప్పటి ప్రపంచ వ్యవస్థ పునర్ వ్యవస్థీకరణను ఎంతో కాలం అడ్డుకోలేరు.

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి నిర్మాణం ఇప్పటికే కాలం చెల్లిపోయింది. దీన్ని ఎలా పునర్ వ్యవస్థీకరించాలనే అంశంపై పరిశీలన జరుగుతోంది. ఇండియా, బ్రెజిల్, జర్మనీ, జపాన్ వంటి దేశాలు ప్రస్తుత సభ్యత్వాల మీద అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. తమకు శాశ్వత సభ్యత్వం కల్పించాలని ఒత్తిడి తెస్తున్నాయి. ఇండియా జీడీపీలో మూడోవంతు కంటే తక్కువ, జపాన్ జీడీపీలో దాదాపు సగం ఉండే యూకే, ఫ్రాన్స్ వంటి దేశాలు శాశ్వత సభ్యులుగా ఉండటం... ఇండియా, జపాన్ వెలుపల ఉండటం ఎలా సమంజసమనీ, వాటి మీద ఈ రెండు యూరప్ దేశాలు ఎలా పెత్తనం చలాయిస్తాయనీ గట్టి వాదన వినబడుతోంది. భద్రతా మండలి, జీ–7లను సభ్యత్వ పరంగా విస్తరించడం మీద చర్చలు నడుస్తున్నాయి. ప్రపంచ పాలన సంస్థల పునర్ వ్యవస్థీకరణ జరగాలన్నది కాదనలేని అంశం.

తిరుగులేని అమెరికా?

శాస్త్ర సాంకేతిక రంగాల్లో అగ్రగామిగా ఉన్న అమెరికా మున్ముందు కూడా ప్రబలమైన ప్రపంచ శక్తిగా కొనసాగుతుంది. చైనా, ఇండియా వంటి దేశాలు దాన్ని వెన్నంటి ఉంటాయి. ఒకవేళ అధిగమించినా ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదు. ఏమైనా, రెండో ప్రపంచ యుద్ధం ముగిసి వందేళ్లు గడిచే లోపే అప్పటి విజేతల్లో ఒక్క అమెరికా మినహా మిగిలినవన్నీ టాప్–10 జాబితా నుంచి కనుమరుగవుతాయి.

అమెరికా లోలోపల పలు మార్పులు చెందుతోంది. జనాభా వర్గాల్లో పరివర్తన ఫలితంగా రాజకీయంగానూ మార్పులు సంభవిస్తున్నాయి. నల్ల జాతీయుడిని అధ్యక్షుడిగా ఎన్నుకుంది. ఆఫ్రో–ఇండియన్ మహిళ ఉపాధ్యక్ష పదవిని చేపట్టగలిగింది. భారతీయ అమెరికన్లు ప్రభుత్వంలో, విద్యా పారిశ్రామిక రంగాల్లో ఉన్నత స్థానాలకు ఎగబాకారు. గుజ్జూభాయి కశ్యప్ పటేల్ ఎఫ్‌బీఐ పగ్గాలు చేపడతాడని ఎప్పుడైనా అనుకున్నామా? వివిధ దేశాల సంతతులకు చెందిన వ్యక్తులు ప్రభుత్వ, ఇతర రంగాల్లో ప్రముఖ స్థానాలు పొందడం వల్ల ఆ యా దేశాలు అమెరికాతో సాన్నిహిత్యం పెంచుకుంటున్నాయి. విదేశీయులకు ప్రవేశం కల్పించడం వల్ల అమెరికా ప్రతిభ ఇనుమడించింది. యూరప్ ఈ విషయంలో విఫలమైంది.

వర్ధమాన దేశాలు 21వ శతాబ్దపు నూతన వ్యవస్థకు రూపుదిద్దబోతున్నందున... ప్రపంచ వ్యవహారాల్లో యూరప్ పాత్ర క్రమేపీ క్షీణించిపోతుంది. యూరప్ గనుక జనాభా సంబంధిత (డెమోగ్రాఫిక్) నూతన విధానాలు రూపొందించకపోతే, ఆర్థిక పరమైన సంస్కరణలు చేపట్టకపోతే అది ఈ బహుళ ధ్రువ ప్రపంచంలో గుర్తింపు లేని ఖండంగా మిగిలిపోతుంది.

రానున్న రోజుల్లో ఆసియానే ప్రపంచ అధికార కేంద్రంగా ఆవిర్భవిస్తుంది. 2020లో ఈ ఒక్క ఖండమే ప్రపంచ స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ)లో 60 శాతం వాటా కైవసం చేసుకుంది. ఇదే ట్రెండ్ ఇక మీదటా కొనసాగబోతోంది. చైనా, ఇండియా ఆర్థిక, రాజకీయ రంగాల్లో తమ పలుకుబడి పెంచుకుంటూ పోయి, ప్రపంచ పాలన (గ్లోబల్ గవర్నెన్స్)లో మార్పుల కోసం పట్టుబడతాయి. అయితే, అమెరికాతో విరోధం కారణంగా చైనా, యురోపియన్ యూనియన్ (ఈయూ)కు చేరువయ్యే అవకాశం ఉంది. ఇక చైనాతో సంబంధాలు బెడిసినందువల్ల ఇండియా, అమెరికాకు బహుశా మరింత దగ్గర అవుతుంది.

వ్యాసకర్త విధాన నిర్ణయాల విశ్లేషకుడు, రచయిత
mohanguru@gmail.com

సోషల్ మీడియా

జాతీయ సమస్య



ఇండియాకు తొలిసారి రావడం నచ్చింది. కానీ వాయు నాణ్యత పట్ల భారతీయులు ఇంత మూమూలుగా వ్యవహరించడం దిగ్భ్రాంతిని కలిగించింది. ఇక్కడ శ్వాసించడం ఎన్నో సిగరెట్లను తాగినట్టుగా ఉంది. అయినా బయట ఎవరూ మాస్కు ధరించరు, ఇంట ఎయిర్ ఫిల్టర్లు పెట్టుకోరు. వాయు నాణ్యతను నాయకులు ఎందుకు జాతీయ అత్యవసర పరిస్థితిగా చూడటం లేదో అర్థంకావడం లేదు.

– బ్రయాన్ జాన్సన్, వెంచర్ క్యాపిటలిస్ట్

ప్రవేశం లేదా?



ఎలాంటివాడైనా ఒక భారతీయ హిందువు పూరీ జగన్నాథాలయంలోకి ప్రవేశించవచ్చు. కానీ పాశ్చాత్య, శ్వేతవర్ణ సనాతన భక్తుడు లేదా నల్లజాతి ఆఫ్రికా భక్తుడు – వాళ్లు ఎంత నిష్ఠగా ఉన్నప్పటికీ ఆలయంలోకి ప్రవేశించలేరు. ఇది వర్ణవివక్ష కాదా?

– విలియమ్ సీబర్న్, ఇంగ్లిష్ సనాతనీ

సరళతే సంతోషం



డబ్బు మనల్ని కచ్చితంగా సంతోషపెడుతుంది. కానీ మరీ ఎక్కువ డబ్బుతో మన జీవితాల్లోకి సంక్లిష్టత చేరడం సులభం. ఆ సంక్లిష్టత చివరకు అసంతృప్తికి దారితీస్తుంది. సంపద, సంతోషం అనే రెంటినీ కోరుకుంటున్నప్పుడు, జీవితాన్ని సరళంగా ఉంచుకోవడానికి ప్రత్యేకమైన ప్రయత్నం అవసరం.

– మనోజ్ అరోరా, ఫైనాన్షియల్ ప్లానర్

వదిలించుకోగలిగితే...



స్వీయనియంత్రణ గురించి మరీ ఎక్కువ చెబుతారు. మీ పరస్పర విరుద్ధమైన కోరికలను వదిలించుకోండి. అప్పుడు నియంత్రణ అనేదే అవసరం లేదు.

– జేమ్స్ పియర్స్, లైఫ్ కోచ్

ఉండాల్సిన పద్ధతి



బాధితుడి పట్ల సానుభూతి చూపకుండా కూడా (అతడి భావాల పట్ల ఏకీభావం లేనప్పుడు) అతడి పట్ల జరిగే దుశ్చర్యను ఖండించడం సాధ్యమే! అదే పెద్దమనిషి తరహా!!

– అమిత్ శాండిల్య, కాలమిస్ట్

ఇన్ బాక్స్

విద్యార్థుల హక్కులపై ఆంక్షలా?

చరిత్రాత్మక ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ)లో విద్యార్థుల గొంతు నొక్కేసేందుకు యూనివర్సిటీ అధికార్లు పూనుకుంటున్నారు. అందుకు తాజా నిదర్శనం గత మార్చి 13న ఉస్మానియా రిజిస్ట్రార్ విడుదల చేసిన సర్క్యులర్. ఈ సర్క్యులర్‌లో ప్రధాన అంశాలు: విద్యార్థులు కానీ, విద్యార్థి సంఘాలు కానీ ధర్నాలు, ర్యాలీలు, నిరసనలు, నినాదాలు చేయరాదు. బహిరంగ విమర్శలు, ప్రకటనలు చెయ్యకూడదు. అన్‌పార్లమెంటరీ లాంగ్వేజ్ వాడరాదు. ఈ అంశాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు చట్టపరంగా తీసుకుంటారు.

108 సంవత్సరాల చరిత్ర కలిగిన ఓయూ అనేక ప్రజా ఉద్యమాలకు ఊపిరిగా నిలిచింది. ఎన్నో విజయాలు సాధించింది. అటువంటి యూనివర్సిటీ విద్యార్థుల నోళ్లను ఈ సర్క్యులర్ ఏమాత్రం మూయించలేదు. దాని రద్దుకై విద్యార్థులు ఉద్యమిస్తున్నారు. గత నవంబర్, డిసెంబర్ మాసాలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నాటి ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో బీఆర్‌ఎస్ పదేళ్ల పాలన విద్యారంగాన్ని విధ్వంసం చేసిందనీ, తాము అధికారంలోకి వస్తే విద్యారంగానికి పెద్దపీట వేస్తామనీ అన్నది. ప్రధానంగా 7వ గ్యారంటీగా తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని నిలబెడతామని ఎన్నికల ప్రణాళికలో పేర్కొంది. కానీ నాటి తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోనూ... ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనూ అప్రకటిత ఎమర్జెన్సీని కొనసాగిస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూములను ఏకంగా అమ్మడానికి ఆయన ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఈ చర్యను వ్యతిరేకిస్తున్న విద్యార్థులపై పాశవికంగా అణచివేతకు పాల్పడుతోంది. ఇదేనా విద్యా రంగానికి పెద్దపీట వేయడమంటే? ఇదేనా ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడం అంటే?

ఉస్మానియాలో అడుగుపెడితే సమస్యలే స్వాగతం పలుకుతున్నాయి. వర్సిటీ హాస్టళ్లలో కనీస సౌకర్యాలు, వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూనివర్సిటీలో 80% పైగా బోధన, బోధనేతర పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడం లేదు. ఇలాంటి అనేక సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు అడగడం అధికార యంత్రాంగం నేరంగా భావిస్తోంది. అందుకే ఇటువంటి సర్క్యులర్లు! అయితే ఎప్పుడూ విద్యార్థి ఉద్యమాలకు అపజయం లేదన్నది ఈ సందర్భంగా గమనార్హం.

– పొదపంగి నాగరాజు,
పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మన పంటల విధానం మారాలి!

అభిప్రాయం



డా॥ షేక్ ఎన్. మీరా

బియ్యం ఎగుమతులకు తెలంగాణ రాష్ట్రం శ్రీకారం చుట్టింది. ఫిలిప్పీన్స్‌కు తొలివిడత సరఫరా కూడా పూర్తయ్యింది. రాష్ట్ర వ్యవసాయ పురోభివృద్ధిలో ఇదొక మైలురాయి అంటూ ప్రశంసలు కూడా వినవచ్చాయి. నిజంగా ఇదంత సంబరపడాల్సిన పరిణామమేనా? తెలంగాణకు పదికాలాల పాటు లబ్ధి చేకూర్చేదేనా? బియ్యం ఎగుమతుల ద్వారా లభించే తక్షణ లాభాలు ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇవ్వవచ్చు. కాని, తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ స్వస్థత, ఆహార భద్రత, పర్యావరణ సుస్థిరత దీర్ఘకాలంలో ప్రమాదంలో పడతాయి. ఫిలిప్పీన్స్ ఇందుకు సరైన నిదర్శనం. అక్కడి అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని విశ్లేషణ చేసినట్లయితే, ఇదెంత ప్రమాదకర పరిణామమో విశదమవుతుంది.

వైవిధ్యంతో కూడిన వ్యవసాయ–వాతావరణ పరిస్థితులు తెలంగాణ సొంతం. కాబట్టే, ఈ రాష్ట్రం అనాదిగా పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు వంటి ఉద్యాన పంటలకు కేంద్రంగా నిలుస్తూ వచ్చింది. క్రమేణా పరిస్థితి మారింది. విధానాల ఊతంతో వరి సాగు విస్తరించింది. ముఖ్యంగా ధాన్య సేకరణ, సాగునీటి ప్రోత్సాహకాలు రాష్ట్రంలో పంటల సరళిని నాటకీయంగా మార్చేశాయి. తెలంగాణలో వరి సాగు నీటి వనరుల కల్పన మీద విపరీతంగా ఆధారపడి ఉంది. ముఖ్యంగా కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు కమాండ్ ఏరియాల్లో మనం దీన్ని గమనించవచ్చు. ఇప్పటికే భూగర్భ జలాలు క్షీణించిపోతున్న తెలంగాణలో ఇది సుస్థిర సేద్యం కానేకాదు. రాష్ట్రంలో 70 శాతం పైగా జిల్లాల్లో భూగర్భ జలాల వాడకం మితిమీరి ప్రమాదకర స్థాయికి చేరిందని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు తాజా నివేదికలు సూచిస్తున్నాయి.

నానాటికీ వరి సాగు విస్తరిస్తోంది. 2014–15లో 41 లక్షల ఎకరాల్లో వరి పండించగా, 2023–24లో ఈ విస్తీర్ణం దాదాపు 50 శాతం పెరిగి 56 లక్షల ఎకరాలకు చేరింది. భారీ ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారానే ఈ వృద్ధి సాధ్యపడింది. అయినప్పటికీ, భూగర్భ జలాలు తరిగిపోతున్నాయి. తెలంగాణ స్టేట్ గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ ప్రకటించిన 2024 అధ్యయనం ప్రకారం, వరి పండిస్తున్న జిల్లాల్లో భూగర్భ జల మట్టాలు ఏడాదికి 1.2 మీటర్ల వంతున పడిపోతున్నాయి.

ఎగుమతులను ప్రధాన వ్యూహంగా చేసుకుని వాటి మీద ఆధారపడటం శ్రేయస్కరం కాదు. ధరల పతనం, వాణిజ్య ఆంక్షల రిస్కులకు తెలంగాణ రైతాంగాన్నీ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థనూ గురి చేయడం ఎంత వరకు సబబు? ఎగుమతి బియ్యం సేకరణ ధర



(టన్నుకు రూ 36,000) ఇప్పుడు లాభసాటిగానే కనబడుతుంది. అంతర్జాతీయంగా గిరాకీ అటూఇటూ అయితే, అమ్ముడుబోని బియ్యం రాష్ట్రంలో గుట్టలు గుట్టలుగా పేరుకుపోతాయి. దేశీయంగా ఆహార భద్రతను దృష్టిలో పెట్టుకుని ఇండియా 2023లో బాస్మతి యేతర బియ్యం ఎగుమతులపై ఆంక్ష విధించిన విషయం గుర్తు చేసుకోవాలి.

ఫిలిప్పీన్స్ పాఠాలు

ఫిలిప్పీన్స్ అనుభవం మనకు ఒక హెచ్చరిక లాంటిది. ఆ దేశం ఒకప్పుడు బియ్యం ఎగుమతిదారు. తర్వాత్తర్వాత స్వయంసమృద్ధి మీద సకలశక్తులూ ఒడ్డాల్సి వచ్చింది. పలురకాల పంటల సాగుకు స్వస్తి పలికి అన్ని వనరులనూ వరి సేద్యానికి మళ్లించింది. 2018 నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద దిగుమతిదారుగా మారింది. దేశీయ గిరాకీని తట్టుకునేందుకు 31 లక్షల టన్నుల బియ్యం కొనుగోలు చేసింది. ఆహారభద్రతా సంక్షోభంలో కూరుకుపోయి 2023లో దేశంలో రైస్ ఎమర్జెన్సీ విధించింది. వాతావరణ ప్రతికూలతలు, వాణిజ్య ఆంక్షలు, ధరల హెచ్చుతగ్గులు దేశాన్ని అతలాకుతలం చేశాయి. ఇదంతా వరి పంట మీదే అతిగా ఆధారపడటం వల్ల సంభవించిన బాధాకర పర్యవసానం. ఎగుమతి మార్కెట్లు కుప్పకూలినా, స్థానిక సరఫరాలో కొరత ఏర్పడి ఎగుమతులపై ఆంక్షలు విధించినా... తెలంగాణ లోనూ ఇదే పునరావృతం అవుతుంది.

మామిడి, నిమ్మ జాతి పండ్ల తోటలకు, పసుపు పంటకు, ఔషధ మొక్కల సాగుకు అనువైన భూములు, వాతావరణ పరిస్థితులు తెలంగాణలో ఉన్నాయి. వీటితో ఉద్యాన పంటలకు ప్రముఖ కేంద్రంగా అవతరించగల సామర్థ్యం రాష్ట్రానికి ఉంది. నేషనల్ హార్టికల్చర్ బోర్డు గణాంకాల ప్రకారం, ఇండియా సాగుభూమిలో కేవలం 15 శాతమే ఉండే ఉద్యాన పంటలు వ్యవసాయ జీడీపీలో 40 శాతం ఆక్రమిస్తున్నాయి. 2023–24లో తెలంగాణ హార్టికల్చర్ ఉత్పత్తి 120 లక్షల టన్నులు. ఈ పంటల కోసం ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించి విలువైన తయారీ ఉత్పత్తులను ఎగుమతి చేయగలిగితే ఎంతో ఆదాయం లభిస్తుంది. కాబట్టి, అధిక విలువ కలిగిన హార్టికల్చర్ ఎగుమతుల మీద దృష్టి సారించాలి. తద్వారా వ్యవసాయం సుస్థిరమవుతుంది. అన్నింటి కంటే ముఖ్యమైన మరో అంశం, ఉద్యాన పంటలకు మళ్లడం ద్వారా విలువైన నీటి వనరులను నేల సారాన్ని కాపాడుకోగలం.


తెలంగాణ తన వ్యవసాయ విధానంపై పునరాలోచన చేయాలి. భూగోళ వాతావరణ మార్పులు, ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో వాటిని తట్టుకుని దీర్ఘకాలిక సౌభాగ్యానికి బాటలు వేసే సుస్థిరమైన హై వ్యాల్యూ హార్టికల్చర్, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ పరిశ్రమల దిశగా దృష్టి మళ్లించాలి.

వ్యాసకర్త వ్యవసాయ శాస్త్రవేత్త – డైరెక్టర్, ఐసీఏఆర్ – వ్యవసాయ సాంకేతిక అనువర్తన పరిశోధన సంస్థ

నానాటి బతుకు నాటకం

మనిషి ప్రపంచంలోనికి ఒంటరిగానే వచ్చి, ఒంటరిగానే తిరిగిపోతాడు. మాతృ గర్భం నుండి బయటపడి భూగర్భంలోనికి వెళ్లేవరకు సంభవించేదంతా పెద్ద నాటకమే. ఒక వ్యక్తి ఏ విధంగా సంపాదించాడన్న విషయం నేటి లోకులకు అవసరం లేదు. 'ఎంత' సంపాదించాడు అనేదే సమాజానికి కావలసింది. ఈ ప్రపంచాన్ని వదలి వెళ్లేటప్పుడు ఏ ఒక్కడూ... ఎంతగానో కష్టపడి సంపాదించిన ఆస్తులనుగాని లేక తాను ప్రాణప్రదంగా చూసుకొనే వాటిని కానీ తీసికొని వెళ్ళలేడు. ఏది ఏమైనప్పటికీ, మరణానంతరం మనిషితోపాటు కలిసి వెళ్లేవి పాప పుణ్యాలు మాత్రమే. వీటిలో నీవు దేనిని కోరుకుంటున్నావు? నీ వెంట పుణ్యం రావాలంటే మంచి పనులు చెయ్యి. పాపాన్నే తీసుకొని వెళ్ళదలిస్తే ఈ ప్రపంచం నీకు అనేక అవకాశాలను కల్పిస్తుంది. వాటిని గూర్చి నీవు వెతకవలసిన అవసరమే లేదు. నీకు ఏది కావాలో ఇప్పుడే, ఇక్కడే నిర్ణయించుకో.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

నీవు కర్తగా, బయటి ప్రపంచం కర్మగా... ఈ రెండింటి మధ్య క్రియా కలాపంగా ఉన్నదే మానవ జీవితం. ప్రపంచంలో లెక్కలేనన్ని వస్తువులు ఉన్నాయి. ఆకాశంలోని నక్షత్రాలను లేక సముద్రంలోని అలలను ఏ విధంగా లెక్కించలేమో అదే విధంగా నీవు వాటిని లెక్కించలేవు. మనిషి మనస్సు ఎల్లప్పుడూ ఏదో ఒక వస్తువు (విషయము)ను అనుసరిస్తూనే ఉంటుంది. ఈ క్రియ జీవితాంతం కొనసాగుతూనే ఉంటుంది. మానవుడు బాహ్య ప్రపంచాన్నే సంతోషానికి మూలకారణంగా ఎంచుతున్నాడు. ఎంత అవివేకం? ఎంత అజ్ఞానం!

'ద్రష్ట' కంటె వేరుగా దృశ్యము లేదు అని తెలిసినపుడు సంసారంలోని వివిధ వస్తువులు ఎవరినీ ఆకర్షించలేవు. వాటి వల్ల కలిగే సుఖ, దుఃఖాల ప్రభావం ఉండదు. ఇటువంటి వివేకం కలిగినప్పుడు పరిపూర్ణ ప్రశాంతత, ఆనందాలతో నిండిపోతాడు మనిషి. చివరకు అతను సాక్షిగా ఉంటాడు. 'ద్రష్ట' అనగా చూచువాడు, సాక్షిగా ఉన్న జీవచైతన్యం!.

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యేవ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.త్రయోదశి రా.1.01 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** పుబ్బ ప.12.57 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** రా.8.44 నుండి 10.29 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.56 నుండి 10.45 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** ఉ.6.10 నుండి 7.53 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.51, **సూర్యాస్తమయం:** 6.10.

డేటాఎంట్రీ చేయించారు.. బిల్లులు మరిచారు!

- రాష్ట్రవ్యాప్తంగా గతేడాది నవంబర్‌లో సమగ్ర కుటుంబ సర్వే
- ప్రైవేట్ ఆపరేటర్లతో ఆన్‌లైన్‌లో వివరాల నమోదు
- ఒక్కో దరఖాస్తుకు రూ.30 ఒప్పందం.. ఇప్పటికీ అందని బిల్లులు
- సర్వే చేసిన సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్ల పరిస్థితీ అంతే

సాక్షిప్రతినిధి, ఖమ్మం: సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్ చేసిన ప్రైవేట్ కంప్యూటర్ ఆపరేటర్లకు పారితోషికం ఇంకా అందలేదు. వీరితోపాటు సర్వేలో పాల్గొన్న ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు కూడా బిల్లులు చెల్లించలేదు. రాష్ట్రంలో గత ఏడాది నవంబర్ 9 నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరిగిన విషయం తెలిసిందే. మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, సీఓలు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్ అధ్యాపకులు, ఎంఆర్‌సీ సిబ్బంది ఎన్యూమరేటర్లుగా వ్యవహరించారు. వారు సేకరించిన వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు డేటాఎంట్రీ ఆపరేటర్లను నియమించారు.

- ఒక్కో దరఖాస్తుకు రూ.30 చెల్లిస్తామని చెబుతూ రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఆపరేటర్లతో పని చేయించారు. గత ఏడాది డిసెంబర్ 15 నాటికి ఎంట్రీ పూర్తి కాగా, బిల్లులు అడిగితే ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని చెప్పారు. అప్పటి నుంచి వారు కార్యాలయాలకు వచ్చి వెళుతున్నా ఫలితం కానరావడం లేదు.
- సర్వేలో పాల్గొన్న సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకూ బిల్లులు అందించలేదు. సర్వేను పర్యవేక్షించిన సూపర్‌వైజర్‌కు రూ.12 వేలు, ఎన్యూమరేటర్‌కు రూ.10 వేల చొప్పున ఇవ్వాల్సి ఉంది.

ఒక్క మండలంలోనే రూ.6.86 లక్షలు

ఖమ్మం జిల్లా వైరా మండలంలోని 22 జీపీలు, మరో మూడు శివారు గ్రామాల్లో 12,566 కుటుంబాలు, మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో 10,333 కుటుంబాలను ఎన్యూమరేటర్లు సర్వే చేశారు. ఆపై ఇరవై రోజులపాటు 117 మంది ప్రైవేట్ కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయగా, గ్రామాల పరిధిలో దరఖాస్తుకు రూ.30 చొప్పున రూ.3,76,980, మున్సిపాలిటీ పరిధిలో 47 మంది ఆపరేటర్లకు రూ.3,09,990 చెల్లించాల్సి ఉంది. కేవలం వైరా మండలం, మున్సిపాలిటీలోనే 164 మంది ఆపరేటర్లకు రూ.6,86,970 నగదు చెల్లించాల్సి ఉంది. ఈ లెక్క రాష్ట్రవ్యాప్తంగా చూస్తే.. రూ.కోట్లలో ఉంటుంది.



ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీజకు విన్నవిస్తున్న డేటాఎంట్రీ ఆపరేటర్లు (ఫైల్)

రూ.15 వేలు రావాలి



ఎంటెక్ పూర్తి చేసిన నేను 500 సమగ్ర కుటుంబ సర్వే ఫారాలను వైరా మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్ చేశా. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి బిల్లు వచ్చాక.. ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. నాకు రూ.15వేలు రావాలి. ఎప్పుడు మున్సిపాలిటీకి వెళ్లినా ఇంకా నిధులు విడుదల కాలేదన్నారు.

– మల్లు నర్మద, సుందరయ్యనగర్, వైరా

భోజనం, ఇంటర్నెట్ కూడా మావే..



ఆన్‌లైన్ చేస్తున్నప్పుడు 2 నెలల్లో డబ్బులు వస్తాయని చెప్పారు. డేటాఎంట్రీ చేస్తే భోజనం, నెట్ సదుపాయం కల్పిస్తామని చెప్పి, ఆ తర్వాత పట్టించుకోలేదు. పని ముగిశాక డబ్బు అడిగితే పైనుంచి రాలేదని ఓసారి.. కలెక్టరేట్‌కు వెళ్లండని ఇంకోసారి దాటేస్తున్నారు.

– తడికమళ్ల యశస్విని, పల్లిపాడు, కొణిజర్ల మండలం

గోదావరిలో నీటి లభ్యత ఎంత?

- 21న సీడబ్ల్యూసీ సమావేశంలో జరగనున్న చర్చ
- 3,396 టీఎంసీల లభ్యత ఉందని గతంలో సీడబ్ల్యూసీ నివేదిక

సాక్షి, హైదరాబాద్: గోదావరి నదిలో 3,396 టీఎంసీల నీటి లభ్యత ఉందని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చేసిన నిర్ధారణపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేవనెత్తిన అభ్యంతరాలపై చర్చించేందుకు ఈ నెల 21న ఢిల్లీలో సీడబ్ల్యూసీ కీలక సమావేశం నిర్వహించనుంది. సీడబ్ల్యూసీ చైర్మన్ ముకేశ్‌కుమార్ సిన్హా అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నీటిపారుదల శాఖల అధికారులు పాల్గొంటారు. 75 శాతం నీటి లభ్యత ఆధారంగా 1941–42 నుంచి 1979–80 మధ్య కాలంలో తీసిన లెక్కల ప్రకారం 3,396 టీఎంసీల లభ్యత ఉందని గతంలో సీడబ్ల్యూసీ ఓ నివేదిక ఇచ్చింది. గోదావరిలో 1,486 టీఎంసీల నీటి లభ్యత ఉందని, ఇందులో తమకు 968 టీఎంసీలు, ఏపీకి 518 టీఎంసీల కేటాయింపులున్నట్టు తెలంగాణ వాదిస్తోంది. ఈ కేటాయింపుల ఆధారంగా తమ ప్రాజెక్టులకు అనుమతులివ్వాలని సీడబ్ల్యూసీని కోరింది. 2004లో వ్యాప్కోస్ సమర్పించిన నివేదిక ఆధారంగా 1,360 టీఎంసీల లభ్యత మాత్రమే ఉందని ఏపీ ప్రతివాదన చేస్తోంది. వాస్తవ నీటి లభ్యత తేల్చేవరకు తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వరాదని డిమాండ్ చేస్తూ సీడబ్ల్యూసీకి ఇప్పటికే పలుమార్లు లేఖలు రాసింది. గోదావరిలో 3,396 టీఎంసీల లభ్యత ఉందని సీడబ్ల్యూసీ సమర్పించిన నివేదిక పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రాణహిత, ఇంద్రావతి, దిగువ గోదావరిలో నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ లెక్కలు అశాస్త్రీయంగా ఉన్నాయని తప్పుబట్టింది. మళ్లీ అధ్యయనం జరపాలని ఏపీ కోరగా, అప్పట్లో సీడబ్ల్యూసీ అంగీకరించలేదు. తాజాగా సీడబ్ల్యూసీ ఏపీ అభ్యంతరాలపై సమావేశం నిర్వహించనుంది.

విద్యార్థినుల హక్కులపై అవగాహన కల్పించడం అభినందనీయం

- జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ

సాక్షి, హైదరాబాద్: పాఠశాలలు, కళాశాలల్లో రాష్ట్ర మహిళా కమిషన్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి విద్యార్థినుల పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు వారి హక్కులపై అవగాహన కల్పించే కార్యక్రమాలు మంచి ఫలితాలిస్తున్నాయని జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ కిశోర్ రాహత్కర్ అన్నారు. అయోధ్యలో జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సామర్థ్య అభివృద్ధి, శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదతో పాటు కమిషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిషన్ చేపడుతున్న కార్యక్రమాలను, భవిష్యత్ ప్రణాళికలను శారద ప్రజెంట్ చేశారు. రాష్ట్ర మహిళా కమిషన్ చేసిన కృషిపై జాతీయ మహిళా కమిషన్ బృందం అభినందనలు తెలిపింది.

సాగర్ డ్యాంపై బీఆర్‌ఎస్ నేతల నిరసన

- విశాఖపట్నం సీఆర్పీఎఫ్ బెటాలియన్ వెళ్లిపోవాలని డిమాండ్



ప్రాజెక్టు వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

నాగార్జునసాగర్: సాగర్ డ్యాంపై నుంచి సీఆర్పీఎఫ్ విశాఖపట్నం బెటాలియన్ వైదొలగాలని బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం ప్రాజెక్టు ముఖద్వారం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఆర్పీఎఫ్ ములుగు బెటాలియన్ నాగార్జునసాగర్ డ్యాంపై (తెలంగాణవైపు) పహారాను ఉపసంహరించుకొని మంగళవారం విశాఖపట్టణం బెటాలియన్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు వైజాగ్ బెటాలియన్‌ను కూడా తొలగించి గతంలో ఉన్న ఎస్పీఎఫ్ (ప్రత్యేక రక్షణ దళం)కే బాధ్యతలు అప్పగించాలని నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకొని ఈ నిరసనలో బీఆర్‌ఎస్ స్థానిక నాయకులు రమేశ్‌జీ, లక్ష్మణ్‌నాయక్, శేఖరాచారి, రామస్వామి, యేసు, గడ్డమీది రవి, కృష్ణ, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

యాసంగి బోనస్ రూ. 1,500 కోట్లు!

- సన్న ధాన్యానికి చెల్లించేందుకు సర్కారు సన్నాహాలు
- సీజన్‌లో 30 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం వస్తుందని అంచనా
- నిజామాబాద్, కామారెడ్డి, నల్లగొండ, సిద్దిపేటల్లో కొనుగోళ్లు షురూ



సాక్షి, హైదరాబాద్: యాసంగిలో సన్న ధాన్యం పండించిన రైతులకు రూ.1,500 కోట్ల వరకు బోనస్ చెల్లించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రాష్ట్రంలో సన్న ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం గత వానాకాలం సీజన్ నుంచి క్వింటాలుకు రూ.500 బోనస్‌గా ఇస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా మొదటి విడతగా వానాకాలంలో 4.49 లక్షల రైతుల నుంచి సేకరించిన 23.98 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) ధాన్యానికి బోనస్ కింద ప్రభుత్వం రూ.1,199 కోట్లను రైతులకు చెల్లించింది. అయితే ఈసారి యాసంగి సీజన్‌లో ఏకంగా 70 ఎల్‌ఎంటీలకు పైగా ధాన్యాన్ని సేకరించవచ్చని లెక్కలు వేసిన ప్రభుత్వం అందులో సన్న ధాన్యం 30 ఎల్‌ఎంటీల వరకు ఉంటుందని అంచనా వేసింది. ఈ మేరకు సన్న ధాన్యాన్ని రైతుల నుంచి సేకరిస్తే, బోనస్ కింద రూ.1,500 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని పౌరసరఫరాల శాఖ ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు సమాచారం. ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లు మొదలైన నేపథ్యంలో సన్న ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించిన వెంటనే బోనస్‌ను వారి ఖాతాల్లో జమ చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది.

58.29 లక్షల ఎకరాల్లో 60 శాతం సన్నాలే..

రాష్ట్రంలో ఈ యాసంగిలో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఇప్పటివరకు హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో 77.95 లక్షల ఎకరాల్లో వ్యవసాయ పంటలు సాగుకాగా, అందులో వరి ఏకంగా 58.29 లక్షల ఎకరాల్లో సాగైంది. ఇందులో 60 శాతం వరకు విస్తీర్ణంలో సన్నాలే సాగైనట్లు ప్రాథమిక అంచనా. ఎకరాకు సగటున 25 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి అనుకుంటే 145 ఎల్‌ఎంటీల ధాన్యం వస్తుంది. అందులో సగం ధాన్యాన్ని రైతులు సొంత అవసరాలకు వినియోగించుకున్నా, బహిరంగ మార్కెట్‌కు విక్రయించినా, మరో 70 ఎల్‌ఎంటీల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని పౌరసరఫరాల సంస్థ అంచనా వేసింది. కొన్ని జిల్లాల్లో ఇప్పటికే కోతలు మొదలయ్యాయి. మరో వారం రోజుల్లో వేగం పుంజుకోనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 8,200 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని పౌరసరఫరాల సంస్థ నిర్ణయించగా ఇప్పటికే 1,272 కేంద్రాలను సిద్ధం చేశారు. నిజామాబాద్, కామారెడ్డి, నల్లగొండ, సిద్దిపేట జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు మొదలైనట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు.

10 లక్షల ఎకరాలకు వరి విత్తనాలు

- సీడ్ కార్పొరేషన్ ఎండీ అన్వేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వచ్చే వానాకాలం సీజన్‌లో రైతులకు నాణ్యమైన వరి విత్తనాలను సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెర అన్వేశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలో అన్వేశ్‌రెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సంస్థ నిర్వహణ, కార్యకలాపాలు, రబీ సీజన్‌కు సంబంధించిన విత్తనాల నిల్వలు, పంపిణీ తదితర అంశాలను చర్చించారు. గత వానాకాలంలో 1.50 లక్షల ఎకరాలకు మాత్రమే వరి విత్తనాలు అందించామని, ఈ వానాకాలం సీజన్‌లో 10 లక్షల ఎకరాలకు విత్తనాలు అందించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అలాగే కంది, పెసర, మినుము విత్తనాలు కూడా ఎలాంటి లోటు లేకుండా రైతులకు అందించాలని కోరారు. రైతులకు అవగాహన కల్పిస్తూ, నాణ్యమైన విత్తనాలు వినియోగించేలా, అధిక దిగుబడులు సాధించేందుకు సహకారం అందించే విధంగా కృషి చెయ్యాలని కోరారు.

సీఎం మనవల తరహాలో పేదలు చదవొద్దా?

- బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎస్సీ, ఎస్టీలంటే ఎందుకంత వివక్ష అని బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం 'బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల నడపలేం' అన్న శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనాన్ని ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల పేరుతో రూ.26 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం.. విద్యాశాఖకు రూ.23 వేల కోట్లు ప్రకటించిన ప్రభుత్వం.. బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు కనీసం రూ.100 కోట్లు ఇవ్వలేదా? అని సీఎంను అడిగారు. 'రేవంత్ గారూ.. మీ మనవలు, మనవరాళ్లు చదివినట్లు ఈ పేద బిడ్డలు మంచి చదువు చదవొద్దా? 25 వేల మంది పిల్లల బంగారు భవితను ఆగం చేయాలని చూస్తే ఊరుకోం' అని పేర్కొన్నారు.

తెలంగాణకే రొనాల్డ్ రోస్



- డీవోపీటీని ఆదేశించిన కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్
- ఐఏఎస్ శివశంకర్‌ను ఏపీకి ఎందుకు పంపలేదని నిలదీత

సాక్షి, హైదరాబాద్: ఐఏఎస్ అధికారి రొనాల్డ్‌రోస్‌ను తెలంగాణకు కేటాయించాలని కేంద్ర సిబ్బంది వ్యవహారాల విభాగం (డీవోపీటీ)ను కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) ఆదేశించింది. తనను ఏపీ కేటాయించడాన్ని సవాల్ చేస్తూ ఆయన వేసిన పిటిషన్‌పై బుధవారం క్యాట్ విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది జి.విద్యా సాగర్ వాదించారు. '2010 బ్యాచ్‌కు చెందినవారికి పరస్పర బదిలీకి అనుమతిచ్చి.. సీనియర్ అయిన (2006 బ్యాచ్) రొనాల్డ్ రోస్‌కు అవకాశం ఇవ్వలేదు. భారతి హోలికేరీ, జె.నివాస్ పరస్పరం బదిలీ అయ్యారు. ఐఏఎస్ అధికారుల బదిలీలపై గతేడాది కేంద్రం ఏర్పాటు చేసిన ఖండేల్కర్ కమిటీ సీనియారిటీ, పరస్పర బదిలీల అంశాలను పరిశీలించకుండానే నివేదిక ఇచ్చింది. దీని ఆధారంగానే రొనాల్డ్‌రోస్ ను ఏపీకి కేటాయించారు' అని చెప్పారు. వాదనలు విన్న బెంచ్.. రొనాల్డ్ రోస్‌పై ఖండేల్కర్ కమిటీ నివేదికను రద్దు చేసింది. ఆయనను తిరిగి తెలంగాణకు కేటాయించాలని డీవోపీటీని ఆదేశించింది.

అమలుచేస్తారా? హాజరవుతారా?

మరో ఐఏఎస్ అధికారి శివశంకర్ లోథేటిని మళ్లీ ఏపీకి కేటాయించాలని తాము ఇచ్చిన ఆదేశాలను డీవోపీటీ అమలు చేయకపోవటంపై క్యాట్ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆదేశాలను అమలు చేస్తారా? లేదా మా ముందు హాజరవుతారా? అని ప్రశ్నించింది. ఆదేశాలను 4 వారాల్లో అమలు చేయాలని తేల్చిచెప్పింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. రాష్ట్ర విభజన సమయంలో శివశంకర్‌ను తెలంగాణకు కేటాయించినా, ట్రిబ్యునల్ ఆదేశాలతో ఏపీలో విధులు నిర్వహిస్తున్నారు. 2024 అక్టోబర్‌లో ఎవరి రాష్ట్రాలకు వారు వెళ్లాలని కేంద్రం ఇచ్చిన ఆదేశాలను సవాల్‌చేస్తూ క్యాట్‌కు, హైకోర్టుకు వెళ్లిన అధికారులకు చుక్కెదురైంది. దీంతో కేటాయించిన రాష్ట్రాల్లో అధికారులు రిపోర్టు చేశారు. ఇందులో భాగంగా శివశంకర్ తెలంగాణకు వచ్చారు. ఆయన వేసిన పిటిషన్‌లో వాదనలు ముగియడంతో ఏపీకి కేటాయించాలని డీవోపీటీని ఆదేశిస్తూ ఫిబ్రవరి 28న క్యాట్ ఆదేశాలిచ్చింది. ఆ ఆదేశాలు అమలు కాకపోవంటతో క్యాట్‌లో శివశంకర్ ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం వాదనలు విన్న ధర్మాసనం, డీవోపీటీపై ఆగ్రహం వ్యక్తం చేసింది. జూన్ 5లోగా ఉత్తర్వులను అమలు చేయాలని.. లేనిపక్షంలో ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో చెప్పాలని ఆదేశించింది.

గ్రూప్-1 ప్రాథమిక ఎంపిక జాబితా విడుదల

▶ మొదటి పేజీ తరువాయి

ఏ కేటగిరీలోనూ అభ్యర్థులు షార్ట్‌ఫాల్ లేదని కమిషన్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ప్రాథమిక జాబితాలో ఉన్న అభ్యర్థులకు ఈ నెల 16వ తేదీ నుంచి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నట్లు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16, 17, 19, 21 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పబ్లిక్ గార్డెన్‌లోని సురవరం ప్రతాపరెడ్డి యూనివర్సిటీ క్యాంపస్‌లో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని చెప్పారు. గ్రూప్–1 నోటిఫికేషన్‌లోని అనెక్జర్–6లో నిర్దేశించిన విధంగా అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, స్వీయ ధ్రువీకరణతో రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. ఈ నెల 15 నుంచి 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు.

గైర్హాజరైతే ఉద్యోగం పోయినట్లే...

ధ్రువపత్రాల పరిశీలనకు నిర్దేశించిన తేదీల్లో అభ్యర్థులు తప్పనిసరిగా హాజరు కావాలని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. నిర్దేశించిన తేదీల్లో హాజరు కాకపోయినా, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురాకపోయినా తదుపరి అవకాశం ఉండదని వెల్లడించింది. ధ్రువపత్రాల పరిశీలనకు అభ్యర్థుల సంఖ్య తగ్గితే తదుపరి మెరిట్ అభ్యర్థులకు సమాచారం ఇచ్చి ధ్రువపత్రాల పరిశీలనకు అవకాశం కల్పించనున్నట్లు వివరించింది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మల్లన్న

లోకేశ్వరం: పంటలను కాపాడుకునేందుకు బోర్లు వేసినా నీరు పడక, అప్పులు తీర్చే దారిలేక ఒక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం రాజూర గ్రామంలో బుధవారం జరిగిన ఈ సంఘటనపై ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన పతాని నడిపి మల్లన్నకు ఎనిమిది ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పదేళ్లుగా పంటల సాగుకు.. అప్పు చేసి 30 బోర్లు వేయించాడు. కానీ బోర్లలో చుక్క నీరు రాలేదు. ఈసారి యాసంగిలో రెండు ఎకరా ల్లో మొక్కజొన్న సాగు చేశాడు. నీరందక కళ్ల ముందే ఎండిపోయే దశకు చేరింది. పంటను కాపాడుకునేందుకు.. ఈ యాసంగిలోనే రెండు బోర్లు తవ్వించినా ఫలి తం లేకపోయింది. బ్యాంకు, ప్రైవేటు అప్పులు రూ.8 లక్షల వరకు ఉన్నాయి. అప్పులు ఎలా తీర్చాలో తెలియక నడిపి మల్లన్న (56) చేనులోనే చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతునికి భార్య నర్సవ్వ, కుమారుడు మహేశ్, కూతురు మానస ఉన్నారు.

'భూదాన్'పై ముగ్గురితో విచారణ కమిటీ వేశాం

నాగారం భూములపై హైకోర్టుకు వెల్లడించిన సర్కార్

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం సర్వే నెం.181, 182లోని మొత్తం 103.22 ఎకరాల భూములపై నిజానిజాలు తేల్చేందుకు విచారణ కమిటీ వేసినట్లు హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. మొత్తం భూదాన్ భూములపై కూడా ఈ ముగ్గురు సభ్యుల కమిటీ ఉన్నత స్థాయి విచారణ చేస్తుందని స్పష్టం చేసింది. నివేదిక అందిన వెంటనే న్యాయస్థానానికి సమర్పిస్తామని, మూడు వారాలు గడువు కావాలని కోరింది. దీంతో న్యాయస్థానం తదుపరి విచారణను ఈనెల 21కి వాయిదా వేసింది.

ఉద్యమకారులపై పాలకుల రాజ్యహింస

- ప్రజాసంఘాల రాష్ట్ర నేతలు లక్ష్మణ్, విమలక్క



మాట్లాడుతున్న వేణుగోపాల్. చిత్రంలో విమలక్క తదితరులు

దేవరుప్పుల: దేశంలో దోపిడీ వ్యవస్థకు పెద్దపీట వేయడానికే ప్రజా ఉద్యమకారులపై పాలక వర్గాలు రాజ్యహింస కొనసాగిస్తున్నాయని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, ఎన్. వేణుగోపాల్ ఆరోపించారు. ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు, రచయిత మిడ్కో గుముడవెల్లి రేణుక సంస్మరణ సభను బుధవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో నిర్వహించారు. సభకు అమరుల బంధుమిత్రుల సంఘం అధ్యక్షురా లు బి.పద్మకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మిడ్కో విప్లవ సాహితీ కృషిపై పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ సంధ్య, విరసం నేత అరుసువల్లి కృష్ణ, మాభూమి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మసాగర్ బరాజ్ డిజైన్లు ఓకే !

నిర్ధారించిన సీడబ్ల్యూసీలోని ప్రాజెక్టుల మదింపు విభాగం

- బరాజ్ డిజైన్ల పట్ల సీడబ్ల్యూసీ సంతృప్తి వ్యక్తీకరణ
- పంప్‌హౌస్‌లు, జల విద్యుదుత్పత్తి కేంద్రం డిజైన్లతో మళ్లీ డీపీఆర్ సమర్పించాలని సూచన
- రాష్ట్రానికి లేఖ రాసిన సీడబ్ల్యూసీలోని ప్రాజెక్టుల మదింపు విభాగం



సాక్షి, హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతల పథకం –సీతమ్మసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టులో భాగంగా నిర్మించబోయే సీతమ్మసాగర్ బరాజ్ డిజైన్లు సరిగ్గానే ఉన్నాయని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)లోని ప్రాజెక్టుల మదింపు విభాగం సంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో ఈ ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీలోని టెక్నికల్ అడ్వైయిజరీ కమిటీ (టీఏసీ) అనుమతులకు లైన్‌క్లియర్ అయ్యిందని నీటిపారుదల శాఖ అధికారవర్గాలు తెలిపాయి. సీతమ్మసాగర్ బరాజ్ డిజైన్లను పునఃపరిశీలించిన తర్వాతే అనుమతుల విషయంలో ముందుకెళతామని ఇటీవల జరిగిన టీఏసీ సమావేశంలో కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ తేల్చి చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు డిజైన్లను సీడబ్ల్యూసీకి రాష్ట్ర నీటిపారుదల శాఖ సమర్పించింది. తమ పరిశీలనకు వచ్చిన అంశాలను తెలియజేస్తూ సీడబ్ల్యూసీలోని ప్రాజెక్టుల మదింపు విభాగం డైరెక్టర్ మనోజ్‌కుమార్ మీనా ఈ నెల 4న రాష్ట్రానికి లేఖ రాశారు. ప్రాజెక్టు బరాజ్ స్థిరత్వాన్ని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాల మేరకు విశ్లేషించగా, సరిగ్గానే ఉన్నట్టు తేలిందన్నారు. భూకంపాల విషయంలో డిజైన్ల రూపకల్పనలో అనుసరించిన ప్రమాణాలను సమర్పించలేదని, దీంతో అవి సంభవించిన సందర్భాల్లో బరాజ్ స్థిరత్వాన్ని విశ్లేషించడం సాధ్యం కాలేదని తెలిపారు. బరాజ్ నిర్మిత స్థలంలో భూకంపాల ప్రభావంపై ఐఐటీ రూర్కీతో అధ్యయనం చేయిస్తున్నామని రాష్ట్ర అధికారులు వివరణ ఇచ్చారని పేర్కొన్నారు. బరాజ్ నుంచి దిగువనకు దూకే వరద ఉధృతితో బరాజ్‌కు ఎలాంటి నష్టం జరగకుండా డిజైన్ల రూపకల్పనలో తగిన ఏర్పాట్లు చేసినట్టు గుర్తించామని తెలిపారు. అయితే, 2డీ మోడల్ స్టడీ నిర్వహించి నీటి ఉధృతిని నిర్ధారించాల్సి ఉందన్నారు.


పవర్‌హౌస్ డిజైన్లు సమర్పించలేదు

హైడ్రో మెకానికల్ పరికరాలకు సంబంధించిన డిజైన్ లెక్కలతోపాటు బరాజ్ గేట్లు, స్టాప్ లాగ్ గేట్లు, పవర్ హౌస్‌కు సంబంధించిన ఇన్‌టేక్ గేట్లు, డ్రాఫ్ట్ ట్యూబ్ గేట్స్‌కు సంబంధించిన డ్రాయింగ్స్‌ను సమర్పించలేదని ఆ లేఖలో సీడబ్ల్యూసీ తెలిపింది. గత నెలలో రాష్ట్ర అధికారులు తమకు బరాజ్ ప్రధాన గేట్లు, స్లూయిజ్ రేడియల్ గేట్లకు సంబంధించిన డ్రాయింగ్స్‌ను సమర్పించగా, అవి కూడా సరైన రీతిలో ఉన్నట్టు నిర్ధారించామని వెల్లడించింది. పవర్ హౌస్‌కు సంబంధించిన డ్రాయింగ్స్‌ను టీజీ జెన్‌కో తయారు చేస్తుందని, అవి తయారైన తర్వాత సమర్పిస్తామని అధికారులు తెలిపారని పేర్కొంది.

నవీకరించిన డీపీఆర్‌ను మళ్లీ సమర్పించండి

తమకు సమర్పించిన సీతారామ ఎత్తిపోతల పథకం డీపీఆర్‌లో కీలక స్ట్రక్చర్లు అయిన ఇన్‌టేక్, వాటర్ కండక్టర్ సిస్టమ్‌కు సంబంధించిన డిజైన్ లెక్కలు, పంప్‌హౌస్ డిజైన్లు, పెన్‌స్టాక్ డిజైన్లు వంటివి లేవని సీడబ్ల్యూసీ పేర్కొంది. ప్రాజెక్టులో భాగంగా 280 మెగావాట్ల జలవిద్యుత్ కేంద్రాన్ని నిర్మించనుండగా, వీటికి సంబంధించిన డ్రాయింగ్స్ సైతం సమర్పించలేదని తెలిపింది. జలవిద్యుత్ కేంద్రం నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఆమోదించలేదని, టీజీ జెన్‌కో వీటికి సంబంధించిన డిజైన్లను రూపొందిస్తుందని అధికారులు తెలిపారని వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత డీపీఆర్‌తో నీటి పంపింగ్/ఎత్తిపోతలతో పాటు విద్యుదుత్పత్తి కేంద్రానికి సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించలేమని స్పష్టం చేసింది. ఈ అంశాలన్నింటినీ పొందుపరిచి నవీకరించిన డీపీఆర్‌ను మళ్లీ సమర్పించాలని కోరింది.

టారిఫ్‌లకు ట్రంప్ బ్రేక్



చైనా తప్ప మిగతా దేశాలకు 90 రోజుల విరామం

చైనాపై మాత్రం 125 శాతం బాదుడు • తక్షణం అమల్లోకి

బీజింగ్/వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉన్నట్టుండి వెనక్కు తగ్గారు. తన ఎడాపెడా టారిఫ్‌ల దెబ్బకు ప్రపంచ మార్కెట్లు కుదేలవడమే గాక ఆర్థిక మాంద్య పరిస్థితులు తలెత్తడంతో పునరాలోచనలో పడ్డారు. చైనా మినహా 75 పై చిలుకు దేశాలపై విధించిన ప్రతీకార సుంకాల అమలును 90 రోజుల పాటు వాయిదా వేస్తున్నట్టు బుధవారం ప్రకటించారు. ''ఆ దేశాలు చైనా మాదిరిగా మాపై తిరిగి ప్రతీకార చర్యలకు పాల్పడలేదు. పైగా టారిఫ్‌లపై మాతో చర్చలకు ముందుకొస్తున్నాయి. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నా'' అని సొంత సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్‌సోషల్‌లో పోస్ట్ చేశారు. దాంతో భారత్ సహా ఆయా దేశాలకు తాత్కాలికంగా ఊరట లభించింది. భారత్‌పై ట్రంప్ 26 శాతం అదనపు సుంకాలు విధించడం తెలిసిందే. లెసొతో (50 శాతం), మడగాస్కర్ (47), వియత్నాం (46), తైవాన్ (32), దక్షిణ కొరియా (25), జపాన్, ఈయూ (20) తదితర దేశాలపైనా భారీగా వడ్డించారు. బుధవారం అమల్లోకి వచ్చిన ఈ సుంకాలు 24 గంటలు కూడా గడవకముందే వాయిదా పడ్డాయి. అయితే ఆ దేశాలన్నింటిపైనా 10 శాతం బేస్‌లైన్ టారిఫ్ మాత్రం కొనసాగుతుందని ట్రంప్ స్పష్టం చేశారు. చైనాపై మాత్రం ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ''మాపట్ల, ప్రపంచ మార్కెట్ల పట్ల చైనా ఏమాత్రమూ గౌరవం చూపలేదు. పట్టు వీడి దిగి రావాల్సింది పోయి అర్థం లేని దూకుడుకు పోయింది'' అంటూ తీవ్రంగా ఆక్షేపించారు. చైనాపై ఇప్పటికే విధించిన 104 శాతం సుంకాలను ఏకంగా 125 శాతానికి పెంచుతున్నట్టు ప్రకటించారు. అవి తక్షణం అమల్లోకి వచ్చాయని ట్రంప్ స్పష్టం చేశారు. ఒక దేశంపై అమెరికా విధించిన అత్యధిక సుంకాలు ఇవే కావడం విశేషం! ట్రంప్ దూకుడుపై తామేమీ చేతులు ముడుచుకు కూచోబోమన్న డ్రాగన్ దేశం అన్నంత పనీ చేసింది. అమెరికాపై మరో 50 శాతం ప్రతీకార సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించింది. ''ఇప్పటికే ప్రకటించిన 34 శాతంతో కలిపి గురువారం నుంచి అమెరికా ఉత్పత్తులన్నింటి మీదా 84 శాతం సుంకాలు వసూలు చేస్తాం. అవి గురువారం నుంచే అమల్లోకి వస్తాయి'' అని పేర్కొంది. దాంతో పెద్దన్నల పోట్లాట కాస్తా ముదురు పాకాన పడింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దాదాపు సగం మేరకు వాటా ఉండే అమెరికా, చైనా టారిఫ్‌ల యుద్ధం తారస్థాయికి చేరింది. మరోవైపు అమెరికా దిగుమతి చేసుకునే అన్నిరకాల ఆటో ఉత్పత్తులపైనా గత గురువారం నుంచే 25 శాతం టారిఫ్ అమల్లోకి వచ్చింది. ఇది ప్రస్తుతానికి కార్లపై మాత్రమే వసూలవుతున్నా మే 3 నుంచి ఆటో విడిభాగాలకూ వర్తించనుంది. దీనికి ప్రతీకారంగా అమెరికా ఆటో ఉత్పత్తులపై బుధవారం నుంచే 25 శాతం సుంకాలు విధిస్తున్నట్టు కెనడా కూడా ప్రకటించింది.

దేశాలన్నీ కాళ్ల బేరానికి: ట్రంప్

తన టారిఫ్‌ల దెబ్బకు ప్రపంచ దేశాలు విలవిల్లాడుతున్నాయని ట్రంప్ చెప్పుకున్నారు. ''టారిఫ్‌లను తప్పించుకునేందుకు ఏం చేయడానికైనా సిద్ధమంటున్నాయి. దయచేసి ఒప్పందం చేసుకుందామంటూ కాళ్లబేరానికి వస్తున్నాయి'' అంటూ గొప్పలు పోయారు. ఆ క్రమంలో ఓ బూతు పదాన్నీ అధ్యక్షుడు ఉపయోగించారు!

తగ్గే ప్రసక్తే లేదు: చైనా

అమెరికా దుందుడుకు చర్యలను దీటుగా ఎదుర్కొంటామని, ఈ విషయంలో తగ్గే ప్రసక్తే లేదని చైనా కుండబద్దలు కొట్టింది. ఆ దేశంపై సుంకాలను 84 శాతానికి పెంచుతున్నట్టు చైనా కస్టమ్స్ టారిఫ్ కమిషన్‌ను ఉటంకిస్తూ అధికార వార్తా సంస్థ జిన్‌హువా వెల్లడించింది. అంతేకాదు, ''ఇప్పటికే ప్రకటించినట్టు మరో 12 యూఎస్ కంపెనీలను ఎగుమతి నియంత్రణ జాబితాలో చేరుస్తున్నాం. వీటితో పాటు మా అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ తైవాన్‌కు ఆయుధాల విక్రయం వంటి చర్యలకు దిగిన ఆరు అమెరికా సంస్థలను అనుమానాస్పద జాబితాలో చేరుస్తున్నాం'' అని కమిషన్ ప్రకటించింది. అమెరికాది ఫక్తు ఏకపక్ష పోకడ అని దుయ్యబడుతూ చైనా శ్వేతపత్రం కూడా విడుదల చేసింది. ఇరుదేశాల కీలక ప్రయోజనాలను పరస్పరం గౌరవించుకుంటూ సాగాల్సింది పోయి మతిలేని నిర్ణయాలు తీసుకుంటోందంటూ తూర్పారబట్టింది. అమెరికా టారిఫ్‌లను తీవ్ర తప్పిదంగా అభివర్ణించింది. అవి చైనా హక్కులను, ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయంటూ దుయ్యబట్టింది. దీనిపై ప్రపంచ వాణిజ్య సంస్థలో బుధవారం అదనపు దావా కూడా వేసింది.

హాలీవుడ్ సినిమాలపై నిషేధం

అమెరికాపై మరిన్ని ప్రతీకార చర్యలకు చైనా సన్నద్ధమవుతోంది. అందులో భాగంగా హాలీవుడ్ సినిమాలపై కూడా నిషేధం విధించాలని యోచిస్తున్నట్టు సమాచారం. అదే జరిగితే వందలాది కోట్ల డాలర్ల విలువైన చైనా మార్కెట్ హాలీవుడ్‌కు దూరమవుతుంది. ఆ పరిశ్రమకు ఇది పెద్ద దెబ్బే'' అని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అమెరికా తర్వాత ప్రపంచంలో రెండో అతి పెద్ద సినీ మార్కెట్ చైనాయే. దీనితోపాటు అమెరికాపై చైనా పరిశీలనలో ఉన్న ఇతర ప్రతీకార చర్యలు...

- చైనాతో వ్యాపారం చేస్తున్న అమెరికా సేవా రంగ సంస్థలపై ఆంక్షలు, నిషేధాలు
- సోయాబీన్ తదితర అమెరికా వ్యవసాయోత్పత్తులపై భారీ సుంకాలు
- చైనాలో ఉన్న అమెరికా కంపెనీలపై అనుచిత మేధో సంపత్తి లబ్ధి అభియోగాలపై విచారణ

ఈయూ అదనపు టారిఫ్‌లు

బ్రసెల్స్: అమెరికాకు యూరోపియన్ యూనియన్ కూడా మరో సుంకాల షాకిచ్చింది. ఈయూ స్టీల్, అల్యూమినియం దిగుమతులపై ట్రంప్ విధించిన 25 సుంకాలకు ప్రతీకార చర్యలు ప్రకటించింది. ఏకంగా 2,300 కోట్ల డాలర్ల విలువైన అమెరికా ఉత్పత్తులపై అదనపు సుంకాలు విధిస్తున్నట్టు బుధవారం పేర్కొంది. ఇవి దశలవారీగా అమల్లోకి వస్తాయి. ఉత్పత్తుల పేర్లు చెప్పకపోయినా, కొన్నింటిపై ఏప్రిల్ 15 నుంచి, మరికొన్నింటిపై మే 15, ఇంకొన్నింటిపై డిసెంబర్ 1న సుంకాల వసూలు మొదలవుతుందని వివరించింది. ''ఈయూపై అమెరికా సుంకాలు అన్యాయ.ం ఇరుపక్షాలకే గాక ప్రపంచ ఆర్థిక వ్యవస్థకే హానికరం కూడా'' అంటూ ఈయూ ఎగ్జిక్యూటివ్ కమిషన్ దుయ్యబట్టింది. అమెరికా, ఈయూ వార్షిక వర్తక విలువ ఏకంగా 1.8 లక్షల కోట్ల డాలర్లు కావడం విశేషం! ఈ నేపథ్యంలో ట్రంప్‌కు హెచ్చరికగా మాత్రమే తాజా సుంకాలను ప్రకటించినట్టు భావిస్తున్నారు. ఈయూ ఉత్పత్తులన్నింటిపైనా ట్రంప్ 20 శాతం సుంకాలు విధించడం తెలిసిందే.

వెంటనే వెళ్లిపోండి.. లేదంటే రోజుకు రూ. 86 వేలు కట్టండి

- బహిష్కరణకు గురైన వారికి ట్రంప్ సర్కారు అల్టిమేటం
- కఠినచర్యలూ తప్పవన్న హోంల్యాండ్ విభాగం

వాషింగ్టన్: దేశంలో తిష్టవేసిన లక్షలాది మంది అక్రమ వలసదారులను వేర్వేరు ప్రభుత్వ శాఖలు, భిన్న దర్యాప్తు సంస్థల ద్వారా గుర్తించి స్వదేశానికి వెనక్కి పంపుతున్న డొనాల్డ్ ట్రంప్ సర్కార్ వారికి మరో హెచ్చరిక జారీ చేసింది. తామే స్వయంగా గుర్తించి, బలవంతంగా పంపేసేలోపు స్వీయ బహిష్కరణ ద్వారా దేశాన్ని వీడాలని సూచించింది. సున్నితంగా సూచిస్తూ ఇచ్చిన ఆదేశాలను పెడచెవిన పెడితే పెద్ద జరిమానా చెల్లించుకోక తప్పదని అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం స్పష్టంచేసింది. ఇప్పటికే దేశ బహిష్కరణ ఆదేశాలను అందుకున్న అక్రమవలసదారులు ఇంకా అమెరికా గడ్డపైనే నివసిస్తుంటే వారికి రోజుకు 998 డాలర్ల(దాదాపు రూ.86,469) చొప్పున జరిమానా విధిస్తామని, పట్టుబడ్డాక వారి నుంచి ఈ మొత్తం నగదును ముక్కుపిండి మరీ వసూలు చేస్తామని హోమ్‌ల్యాండ్ విభాగం ప్రకటించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదలచేసింది.

చెల్లించకుంటే ఆస్తుల జప్తు

బహిష్కరణ నోటీసు అందుకున్న రోజు నుంచి ప్రతిరోజూ 998 డాలర్ల చొప్పున జరిమానా విధించనున్నారు. అంతటి భారీ మొత్తాలను చెల్లించని, చెల్లించలేని అక్రమ వలసదారుల ఆస్తులను జప్తుచేస్తామని సంబంధిత ఈ–మెయిల్స్‌లో ప్రభుత్వం ప్రస్తావించింది. ట్రంప్ గతంలో అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఈ జరిమానాలకు సంబంధించి 1996లో తీసుకువచ్చిన చట్టాన్ని తొలిసారిగా అమలు చేశారు. ఇలా బహిష్కరణ నోటీసు అందుకున్నాక అమెరికాలోనే నివసిస్తే వాళ్లకు గరిష్ఠంగా ఐదు సంవత్సరాలపాటు ఈ జరిమానా విధించే వీలుంది. రోజుకు 998 డాలర్ల చొప్పున జరిమానాను ఎదుర్కొంటే అలాంటి అక్రమవలసదారుడు ఐదేళ్లలో ఏకంగా 10లక్షల డాలర్ల జరిమానాను చెల్లించాల్సి ఉంటుంది. ఇంతటి భారీ మొత్తాలను వాళ్లు ఎలాగూ కట్టలేరుకాబట్టి అలాంటి వ్యక్తుల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనంచేసుకోనుందని ట్రంప్ యంత్రాంగంలోని ఒక సీనియర్ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

గతంలోనూ పెనాల్టీలు

ట్రంప్ తొలిసారిగా అధ్యక్షబాధ్యతలు నిర్వర్తించి కాలంలోనూ కొద్దిమంది అక్రమ వలసదారులపై ఇలా భారీ జరిమానాలు విధించారు. ఆనాడు శరణార్థులుగా వచ్చి చర్చిల్లో రహస్యంగా ఆశ్రయం పొందుతున్న 9 మంది అక్రమవలసదారులపై ట్రంప్ సర్కార్ ఏకంగా లక్షల డాలర్ల పెనాల్టీ విధించింది. తర్వాత కాస్త కనికరం చూపించి నలుగురిపై తలో 60 వేల డాలర్ల జరిమానా విధించింది. అయితే ఈ అంశం కోర్టుల దాకా వెళ్లింది. ఆ తర్వాత అధ్యక్షపగ్గాలు చేబట్టిన జో బైడెన్ వెంటనే జరిమానాల విధింపును రద్దుచేశారు. సంబంధిత విధానపర నిర్ణయాలనూ 2021లో ఉపసంహరించుకున్నారు.

కోటికిపైగా అక్రమ వలసదారులు

వలసదారుల సలహాల సంస్థ 'ఎఫ్‌డబ్ల్యూడీ.యూఎస్' గణాంకాల ప్రకారం అమెరికాలో దాదాపు 1,00,00,000కిపైగా అక్రమ వలసదారులు ఉన్నారు. వీళ్లంతా ఒంటరిగా ఉండట్లేరు. వీళ్ల రక్త సంబంధీకులు, కుటుంబసభ్యులు, బంధువుల్లో కొందరికి చట్టబద్ధమైన స్థిరనివాస హోదా, పౌరసత్వం ఉన్నాయి. వాళ్లతో కలిసి ఈ అక్రమవలసదారులు జీవిస్తున్నారు. ఇలా 'మిక్స్‌డ్ స్టేటస్' ఉన్న కుటుంబాలు అమెరికాలో లక్షల్లో ఉన్నాయి. వలసదారుల్లో తక్కువ ఆదాయం ఉన్న వాళ్లే ఎక్కువ.

ఇక ఫార్మా వంతు!

- వాటిపైనా భారీ సుంకాలు
- అతి త్వరలో ప్రకటన: ట్రంప్

వాషింగ్టన్: ఎడాపెడా టారిఫ్‌లతో వీరంగం వేస్తున్న అమెరికా అధ్యక్షుని దృష్టి ఇప్పుడు ఫార్మా రంగంపై కూడా పడింది. ఇప్పటిదాకా విధించిన టారిఫ్‌ల నుంచి వాటిని మినహాయించడం తెలిసిందే. కానీ వాటిపైనా అదనపు సుంకాలు వేయనున్నట్టు ట్రంప్ తాజాగా మరో బాంబు పేల్చారు. ''ఫార్మాస్యూటికల్స్ మీద కూడా భారీగా టారిఫ్‌లు వేయనున్నాం. అవి ఎంతన్నది అతి త్వరలో ప్రకటిస్తాం'' అని మంగళవారం రాత్రి రిపబ్లికన్ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన వెల్లడించారు. ''ఆ తర్వాత ఫార్మా కంపెనీలన్నీ చైనాను వీడతాయి. మరెన్నో ఇతర దేశాలను కూడా ఉన్నపళంగా వదిలేస్తాయి. రెక్కలు కట్టుకుని మరీ అమెరికాలో వచ్చి వాలతాయి. ఎందుకంటే వాటి ఉత్పత్తులను అమ్ముకోవాలి కదా! వాటికి అతి పెద్ద మార్కెట్ అమెరికాయే. అవన్నీ అమెరికాలోనే ప్లాంటు తెరవాలి. ఇక్కడే ఉత్పత్తి చేపట్టాలి. చైనాలోనో, మరో దేశంలోనో కాదు'' అని చెప్పుకొచ్చారు.

మరో 26 రఫేల్ జెట్లు

- 22 సింగిల్–సీటర్ జెట్లు, 4 ట్విన్–సీటర్ జెట్లు
- ప్రతిపాదనకు సెక్యూరిటీ కేబినెట్ కమిటీ ఆమోదం
- ఫ్రాన్స్ నుంచి కొనుగోలుకు త్వరలో ఒప్పందం
- విలువ రూ. 63 వేల కోట్లు



న్యూఢిల్లీ: ఆధునిక అవసరాలకు తగ్గట్టుగా నావికాదళాన్ని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఫ్రాన్స్ నుంచి 26 రఫేల్ మెరైన్ ఫైటర్ జెట్ల కొనుగోలుకు అంగీకారం తెలిపింది. భారత్, ఫ్రాన్స్ ప్రభుత్వాల మధ్య కుదిరే ఈ భారీ ఒప్పందం విలువ రూ.63,000 కోట్లు. ఒప్పందంపై త్వరలో సంతకాలు చేసే అవకాశాలు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. 26 ఫైటర్ జెట్లలో 22 సింగిల్–సీటర్ జెట్లు, 4 ట్విన్–సీటర్ జెట్లు ఉన్నాయి. భారత నావికా దళానికి ఈ యుద్ధ విమానాలు సరఫరా చేయడంతోపాటు వాటి నిర్వహణ, మరమ్మతులు, విడిభాగాల సరఫరా, సిబ్బందికి శిక్షణ కూడా ఒప్పందంలో భాగమే. కీలకమైన ఈ డీల్‌కు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని సెక్యూరిటీ కేబినెట్ కమిటీ బుధవారం ఆమోద ముద్ర వేసింది. 26 రఫేల్ మెరైన్ ఫైటర్ జెట్ల అప్పగింత ప్రక్రియ రాబోయే ఆరేళ్లలో పూర్తి కానుంది. మొదటి బ్యాచ్ యుద్ధవిమానాలు 2029లో ఫ్రాన్స్ నుంచి భారత నేవీకి అందుతాయి. 2031 నాటికి అన్ని విమానాల అప్పగింత పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రెండు దేశాల ప్రభుత్వాల మధ్యే ఒప్పందం కుదరనుంది. విమానాల అప్పగింత, వాటి నిర్వహణ విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఆ నిర్ణయం తీసుకున్నారు.

సముద్ర గగనతలంపై పట్టు

రష్యా నుంచి కొనుగోలు చేసిన మిగ్–29కే యుద్ధ విమానాలు భారత నావికా దళానికి సేవలందిస్తున్నాయి. వీటి స్థానంలో రఫేల్ ఫైటర్ జెట్లను దశలవారీగా ప్రవేశపెట్టబోతున్నారు. భారత విమాన వాహక నౌకలైన ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్ నుంచి వీటిని ఆపరేట్ చేస్తారు. అత్యాధునిక ఎలక్ట్రానిక్, ఆయుధ వ్యవస్థతో కూడిన రఫేల్ ఫైటర్ జెట్లతో సముద్ర గగనతలంపై భారత నావికాదళం పట్టు మరింత పెరుగనుంది. మరోవైపు సముద్ర ఉపరితలంపైనే కాకుండా సముద్ర అంతర్భాగంలోనూ పోరాట పటిమను పెంచుకొనే దిశగా ఇండియన్ నేవీ అడుగులు వేస్తోంది.

జైన మతంతో భారత్‌కు గుర్తింపు

- సవాళ్లకు పరిష్కారాలు జైన ధర్మంలో ఉన్నాయి
- ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి
- తొమ్మిది ప్రతిజ్ఞలు చేద్దామని ప్రజలకు పిలుపు



న్యూఢిల్లీ: భారతదేశ గుర్తింపును నిర్మించడంలో జైన మతం అమూల్యమైన పాత్ర పోషించిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదం, యుద్ధాలు, ధ్వంసమవుతున్న పర్యావరణం వంటి పెను సవాళ్లకు అసలైన పరిష్కార మార్గాలు జైన ధర్మంలో ఉన్నాయని ఉద్ఘాటించారు. 'నవకర్ మహామంత్ర దివస్' సందర్భంగా బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానమంత్రి ప్రసంగించారు. జైన మతంతో ముడిపడి ఉన్న ప్రాచీన కట్టడాలు, జైన గురువుల బోధనలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. పార్లమెంట్ భవనంలో జైన తీర్థంకరుల విగ్రహాలకు స్థానం కల్పించినట్లు తెలిపారు. జైన మత ప్రభావం మన పార్లమెంట్‌లో స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. సమాజంలో ఒకరికొకరు సహకరించుకుంటూ శాంతియుతంగా జీవించాలని జైనిజం బోధిస్తున్నట్లు గుర్తుచేశారు. హింసను ఎంతమాత్రం అంగీకరించదని పేర్కొన్నారు. శాంతి, సౌభ్రాతృత్వం, పర్యావరణ పరిరక్షణను బోధించే జైనమత సూత్రాలు అందరికీ ఆచరణీయమని పిలుపునిచ్చారు. భారత ఆధ్యాత్మిక వైభవానికి జైన సాహిత్యం వెన్నుముకగా నిలుస్తోందని ప్రధాని మోదీ కొనియాడారు. జైన సాహిత్యాన్ని కాపాడేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రాచీన గ్రంథాలను డిజిటలైజ్ చేసే పథకం తీసుకొచ్చామని తెలిపారు. పాళీ, ప్రాకృత బాషలను ప్రాచీన భాషలుగా గుర్తించామని వివరించారు.

మనమంతా తొమ్మిది ప్రతిజ్ఞలు చేద్దామని మోదీ సూచించారు. అవేమిటంటే...

1. నీటిని సంరక్షించుకుందాం.. జల సంరక్షణ మనందరి బాధ్యత
2. మాతృమూర్తి పేరిట ఒక మొక్క నాటుదాం
3. పరిశుభ్రతను ప్రోత్సహిద్దాం
4. స్థానిక ఉత్పత్తులనే ఉపయోగిద్దాం
5. దేశంలో పర్యటిద్దాం.. పర్యాటకాన్ని ప్రోత్సహిద్దాం.. పేదలకు సాయం అందిద్దాం
6. రసాయనాలకు తావులేకుండా ప్రకృతి వ్యవసాయం చేద్దాం
7. ఆహారంలో భాగంగా తృణధాన్యాలు స్వీకరిద్దాం.. తద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుందాం.
8. వంట నూనెల వినియోగాన్ని కనీసం 10 శాతం తగ్గించుకుందాం
9. క్రీడలు, యోగాను మన నిత్యజీవితంలో ఒక భాగంగా మార్చుకుందాం

భారత్‌కు రాణా తరలింపు!

- నేటి మధ్యాహ్నం కల్లా ఢిల్లీకి
- అనంతరం తీహార్ జైలుకు

న్యూఢిల్లీ: 2008 నాటి ముంబై ఉగ్రవాద దాడుల సూత్రధారి, పాకిస్తాన్ సంతతి ఉగ్రవాది తహవూర్ రాణాను అమెరికా నుంచి భారత్‌కు తరలిస్తున్నట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. రాణాను తీసుకొని భారత దర్యాప్తు అధికారులు అమెరికా నుంచి బుధవారం రాత్రి 7.10 గంటలకు(భారత కాలమానం ప్రకారం) ప్రత్యేక విమానంలో బయలుదేరారు. గురువారం మధ్యాహ్నంకల్లా ఢిల్లీకి చేరుకోనున్నారు. ఢిల్లీకి చేరుకున్న తర్వాత జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) రాణాను అధికారికంగా అరెస్టు చేస్తుంది. అనంతరం కట్టుదిట్టమైన భద్రత మధ్య రాణాను తీహార్ జైలుకు తరలిస్తారు. రాణా భద్రత కోసం జైలులో ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేశారు. జైలు చుట్టూ పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించారు. ముంబై ఉగ్రవాద దాడుల కేసులో ఢిల్లీలోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టులో రాణాపై విచారణ ప్రారంభం కానుంది. కేసు విచారణ ఢిల్లీలోనే జరుగుతుంది కాబట్టి రాణాను ముంబైకి తరలించే అవకాశం లేదని అంటున్నారు. అమెరికా నుంచి రాణా తరలింపు ప్రక్రియను జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది. తనను ఇండియాకు అప్పగించకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ రాణా దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌ను అమెరికా సుప్రీంకోర్టు ఇటీవలే తిరస్కరించింది. దాంతో అతడిని ఇండియాకు అప్పగించేందుకు అవరోధాలు తొలగిపోయాయి.




పనిచేయండి లేదా వైదొలగండి

- బాధ్యతల్ని విస్మరించిన వాళ్లు రిటైరైతే మంచిది: ఖర్గే
- ఏఐసీసీ వేదికగా నేతలకు హెచ్చరికలు

అహ్మదాబాద్: అత్యంత కీలకమైన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) జాతీయ సమావేశం వేళ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే పార్టీలో సంస్కరణల ఆవశ్యకతను ప్రధానంగా ప్రస్తావించారు. ముఖ్యమైన పదవుల్లో కొనసాగుతూ పనిచేయని నేతలు పక్కకు తప్పుకోవాలని హితవు పలికారు. అప్పగించిన బాధ్యతలను విస్మరిస్తున్న నేతలు రాజకీయ సన్యాసం చేయాలని కటువుగా మాట్లాడారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సబర్మతీ నదీ తీరంలో బుధవారం జరిగిన 84వ ఏఐసీసీ జాతీయ సమావేశంలో ఖర్గే సుదీర్ఘ ప్రారంభోపన్యాసం చేశారు.

పార్టీకి సాయపడకపోతే తప్పుకోండి

''పార్టీకి ఉపయోగపడని నేతలు తప్పుకోవాలి. పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. పదవుల్లో అలంకారప్రాయంగా తిష్టవేసిన నేతలు రాజకీయ సన్యాసం చేయాలి. పార్టీని బలోపేతం చేయడంలో జిల్లా కాంగ్రెస్ కమిటీలది ఇకపై అత్యంత క్రియాశీలక పాత్ర. డీసీసీ అధ్యక్షులకు అదనపు అధికారాలను కట్టబెడతాం. కొత్త డీసీసీ అధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుంది. జిల్లా అధ్యక్షుడు అత్యంత ప్రతిభావంతులైన నేతలతో బూత్ కమిటీ, మండల్ కమిటీ, బ్లాక్ కమిటీ, జిల్లా కమిటీలను ఎన్నుకోవాలి. ఈ ప్రక్రియలో వివక్షకు తావులేదు. అభ్యర్థుల ఎన్నికల ప్రక్రియలో జిల్లా అధ్యక్షులనూ భాగస్వాములను చేస్తాం'' అని అన్నారు. ''ఎన్నికల్లో ఎన్నో అక్రమాలు జరుగుతున్నాయి. మహారాష్ట్రలో బీజేపీ ఇలాగే అక్రమంగా గెలిచింది. అందుకే మళ్లీ బ్యాలెట్ పేపర్‌కు మారడం ఉత్తమం. పార్టీలు ఎన్నికల ప్రక్రియలో అవకతవకలను ఎత్తిచూపితే వాటిని ఆపాల్సిన ఎన్నికల సంఘం ఆ పార్టీలనే తప్పుబడుతోంది. 500 ఏళ్లనాటి పాత విషయాలను తవ్వితీసి మతవిద్వేషాలను బీజేపీ ప్రభుత్వం రాజేస్తోంది'' అన్నారు. ''మరో స్వాతంత్ర్య పోరాటానికి వేళైంది. అన్యాయం, అసమానత, వివక్ష, పేదరికం, మతతత్వం అనే శత్రువుల చెర నుంచి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొద్దాం. గతంలో విదేశీపాలకులు ఈ అన్యాయం, అసమానత, వివక్షలను ఎగదోస్తే ఇప్పుడు సొంత(బీజేపీ) ప్రభుత్వమే ఈ దారుణాలకు ఒడిగడుతోంది. నాడు విదేశీయులు మతతత్వాన్ని అనుకూలంగా మల్చుకున్నారు. ఇప్పటి(బీజేపీ) ప్రభుత్వాలూ అదే పనిచేస్తున్నాయి. నాడు గెలిచాం. నేడూ గెలిచి తీరతాం'' అని ఖర్గే అన్నారు.



ప్రైవేటీకరణపై..

''మోదీ సర్కార్ ఇటీవలికాలంలో అవకాశం చిక్కిన ప్రతిసారీ కొత్త నినాదం ఇస్తోంది. ప్రజల దృష్టి మరల్చడమే వాళ్ల అసలు ఉద్దేశం. ప్రజాస్వామ్యాన్ని చాలా నెమ్మది నెమ్మదిగా అంతంచేస్తున్నారు. దేశ సంపదను కొద్దిమంది బడా వ్యాపారవేత్తలకే ధారాదత్తం చేస్తున్నారు. మొత్తం ప్రైవేటీకరిస్తూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను నిరుపయోగంగా మారుస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే మోదీ ప్రభుత్వం, మోదీ కలసి ఏకంగా దేశాన్నే అమ్మేయడం ఖాయం. లోక్‌సభలో విపక్షనేతకే పార్లమెంట్‌లో మాట్లాడే అవకాశం దక్కకపోతే ఇక ప్రజల వాణి ఎలా పార్లమెంట్‌లో ప్రతిధ్వనించగలదు?'' అని లోక్‌సభ స్పీకర్‌ను పరోక్షంగా ఖర్గే విమర్శించారు.

తొలిసారిగా 'గుజరాత్' తీర్మానం

సాధారణంగా ఏఐసీసీ సమావేశంలో జాతీయ అంశాలపై కాంగ్రెస్ నేతలు తీర్మానాలు చేస్తారు. కానీ పార్టీ చరిత్రలో తొలిసారిగా ఒక రాష్ట్రం(గుజరాత్)ను దృష్టిలో ఉంచుకుని ఒక ప్రత్యేక తీర్మానం చేయడం గమనార్హం. గుజరాత్‌లో దాదాపు 30 ఏళ్లుగా కాంగ్రెస్ ప్రతిపక్ష పాత్రకే పరిమితమైన నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీ పునర్వైభవమే లక్ష్యంగా '' గుజరాత్‌లో కాంగ్రెస్ ఎందుకు ఆవశ్యమంటే?' పేరిట ఈ తీర్మానం చేశారు. 'నూతన గుజరాత్, నూతన కాంగ్రెస్' నినాదంతో ఈసారి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ నిర్ణయించింది. పార్టీకి గెలిపిస్తే గుజరాత్‌లో సామాజిక న్యాయమే ధ్యేయంగా దళితులు, గిరిజనులు, ఓబీసీలు, మైనారిటీల్లో కులగణన చేపడతామని పార్టీ హామీ ఇచ్చింది. న్యాయపథ్ పేరిట మరో కీలక తీర్మానాన్నీ పార్టీ ఆమోదించింది. '' ప్రజలందరి ఐక్యత సాధనే కాంగ్రెస్ జాతీయత. ప్రభుత్వం ముస్లింలు, క్రైస్తవులను లక్ష్యంగా చేసుకోవడంతో ఆ వర్గాలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాయి. ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవహేళన చేయడంతోపాటు ఘోర నేరానికి పాల్పడుతోంది'' అని తీర్మానించారు.

క్రైస్తవులు, సిక్కుల హక్కులనూ హరిస్తారు: రాహుల్

సమావేశంలో పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ మాట్లాడారు. '' వక్ఫ్ చట్టం పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకం. మతస్వేచ్ఛపై దాడి ఇది. బీజేపీ–ఆర్ఎస్ఎస్‌లు త్వరలోనే క్రైస్తవులు, సిక్కుల మత హక్కులనూ హరించబోతున్నారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ మేగజైన్‌లో వ్యాసం చదివితే మీకూ ఈ విషయం అర్థమవుతుంది. ట్రంప్ సృష్టించిన సుంకాల సునామీ భారత్‌ను చుట్టేయనుంది. వైట్‌హౌస్‌లో మోదీ, ట్రంప్ ఫొటో సెషన్ గమనించారా?. ఈసారి ప్రేమగా హత్తుకోవడానికి బదులు సుంకాలతో సరిపెడతానని మోదీ ముఖంమీదే ట్రంప్ చెప్పారు. అయినా మోదీ ఒక్కమాట మాట్లాడలేకపోయారు. ఇటీవల బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు మొహమ్మద్ యూనుస్ మోదీ ఎదుటే భారత్‌పై అభాండాలు మోపుతుంటే ప్రధాని నోట మాట రాలేదు. 56 అంగుళాల ఛాతీ ఎటుపోయింది?'' అని మోదీపై రాహుల్ విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాహుల్ పొగిడారు. '' కులగణన ద్వారా దేశానికి తెలంగాణ రాష్ట్రం దిక్సూచీగా మారింది. ఓబీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల ఫలాలు ఇస్తోంది. 50 శాతం రిజర్వేషన్ల పరిమితి గోడను కేంద్రంలో మేం బద్దలుకొడతాం'' అని రాహుల్ గాంధీ అన్నారు.

మోదీకి రష్యా ఆహ్వానం

విక్టరీ డే పరేడ్‌లో పాల్గొనాలని కోరిన రష్యా

మాస్కో: చిరకాల మిత్రదేశం రష్యా మరోసారి భారత్‌ను తమ దేశంలో ప్రత్యేక కార్యక్రమాలకు విశిష్ట అతిథిగా ఆహ్వానించింది. ఈ మేరకు మే 9వ తేదీన జరగబోయే విక్టరీ డే పరేడ్‌లో పాల్గొనాల్సిందిగా భారత ప్రధాని మోదీకి రష్యా ఆహ్వానం పంపింది. ఈ వివరాలను రష్యా ఉప విదేశాంగ మంత్రి ఆంద్రీ రుడెంకో బుధవారం చెప్పారు. మోదీతో పాటు పలు దేశాధినేతలకూ రష్యా ఆహ్వానాలు పంపింది. 1945 జనవరిలో జర్మనీపై సోవియట్ సైన్యం యుద్ధం మొదలెట్టింది. ఈ యుద్ధంలో నాజీల సారథ్యంలోని జర్మనీ ఓడిపోయింది. మే 9వ తేదీన ఇరుదేశాల కమాండర్స్–ఇన్–చీఫ్‌లు సంయుక్తంగా లొంగుబాటు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇందుకు గుర్తుగా ప్రతిఏడాది మే 9న రష్యా విజయోత్సవ ర్యాలీని చేపడుతోంది. మోదీ 2019లో ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు రష్యాలోని వ్లాడివోస్టాక్ నగరంలో పర్యటించారు. తర్వాత దాదాపు ఐదేళ్ల తర్వాత గత ఏడాది జూలైలో మోదీ రష్యాలో పర్యటించారు. 22వ రష్యా–భారత్ సదస్సులో భాగంగా మాస్కోకు వెళ్లి వచ్చారు. గత ఏడాది అక్టోబర్‌లోనూ కజన్ సిటీలో జరిగిన బ్రిక్స్ దేశాల సదస్సులో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగానే భారత్‌కు రావాల్సిందిగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను మోదీ ఆహ్వానించారు. ఆ ఆహ్వానాన్ని మన్నించి పుతిన్ ఈ ఏడాది చివర్లో భారత్‌లో పర్యటించనున్నారు. అయితే వచ్చే నెలలో జరిగే 80వ విక్టరీ డే కార్యక్రమంలో మోదీకి బదులుగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ భారత్ తరఫున హాజరయ్యే అవకాశముందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. '' భారత ప్రాతినిధ్యాన్ని త్వరలోనే మేం ప్రకటిస్తాం'' అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ బుధవారం చెప్పారు.

సాక్షి హైదరాబాద్

గురువారం ׀ 10 ׀ ఏప్రిల్ ׀ 2025



వార్షిక పరీక్షలకు ఫీజుల మెలిక!
గ్రేటర్ పరిధిలో ప్రైవేటు పాఠశాలల తీరు మారడం లేదు. సాధారణ వార్షిక పరీక్షలకు కూడా ఫీజుల మెలిక పెట్టడం విస్మయానికి గురిచేస్తోంది.
-8లో



సహజ 'లక్ష'ణాలతో.. లగ్జరీ వాటర్..
ప్రతి మనిషికీ అత్యంత అవసరమైనది నీరు. కొందరు ప్రముఖులు ఏకంగా లక్షల రూపాయలు విలువైన వాటర్ బాటిళ్లు కొని మరీ తాగుతున్నారు.
- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
37.0/24.0

వాతావరణం
నగరంలో గురువారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 37, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

హనుమాన్ శోభాయాత్రకు

భారీ బందోబస్తు

తాడ్‌బండ్ ఆలయం వద్ద అధికారులతో సీపీ సమీక్ష



కంటోన్మెంట్: వీర హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా సాగేలా చూడాలని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు. శనివారం గౌలిగూడ నుంచి తాడ్‌బండ్ వీరాంజనేయ స్వామి ఆలయం వరకు శోభాయాత్ర సాగే రూట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. తాడ్‌బండ్ దేవాలయం వద్ద ముగింపు ఏర్పాట్లపై స్థానిక అధికారులు, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నేతలతో కలిసి సమీక్ష నిర్వహించారు. హనుమాన్ శోభాయాత్రకు 3 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శోభాయాత్ర మార్గాన్ని హిందూ ధార్మిక సంఘాల నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. గౌలిగూడ నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. గత ఏడాది జరిగిన లోటుపాట్లను సరి చేసుకుంటూ ఈసారి శోభాయాత్రను విజయవంతమయ్యేలా కృషి చేస్తామని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. రహదారుల మరమ్మతులు, మంచినీటి సౌకర్యంతో పాటు పలు అంశాలపై సూచనలు చేశామని పేర్కొన్నారు. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 42 ర్యాలీలు శోభాయాత్రలో కలుస్తాయన్నారు.

ఎయిర్‌పోర్టులోకి చెత్త వేయొద్దు

బల్దియా అధికారుల డప్పు చాటింపు



డప్పు కళాకారులతో చాటింపు వేయిస్తున్న జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ అధికారులు

సనత్‌నగర్: బేగంపేట ఎయిర్‌పోర్ట్ ప్రహరీని ఆనుకుని ఉన్న బస్తీ నివాసితులు తమ ఇళ్ల నుంచి వచ్చే చెత్తా చెదారం, ఇతరత్రా వ్యర్థాలను ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో వేయకుండా జీహెచ్‌ఎంసీ శానిటేషన్ వాహనాలకు అందించాలంటూ బుధవారం ఆయా బస్తీల్లో అవగాహన కలిగించారు. ఎయిర్‌పోర్ట్ సమీప బస్తీలైన శ్యాంలాల్ బిల్డింగ్స్ తాతాచారి కాలనీ, భగత్‌సింగ్ నగర్ తదితర బస్తీలకు చెందిన ప్రజలు ఇళ్లలోని వ్యర్థాలను విమానాశ్రయ ప్రాంగణంలోకి వేస్తున్నారు. వీటిని తినడానికి వివిధ రకాల పక్షులు వస్తున్నాయి. ఈ క్రమంలో టేకాఫ్ అయ్యే, ల్యాండింగ్ అయ్యే క్రమంలో విమానాలకు ఇవి అడ్డుగా వస్తున్నాయి. ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో చెత్త, వ్యర్థాలను పడేయడంతో కలుగుతున్న ఇబ్బందులను ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులు జీహెచ్‌ఎంసీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులతో కలిసి జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ డీసీ దాకూ నాయక్, శానిటేషన్ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యర్థాలను విమానాశ్రయం ప్రాంగణంలోకి డంప్ చేయవద్దని ఇంటింటికి తిరిగి అవగాహన కలిగిచారు. అలాగే డప్పు చాటింపు వేయించారు. జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన ట్రాలీ ఆటోల్లోనే చెత్త వేయాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు ఎస్ఎస్ ధనాగౌడ్, జవాన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎఫ్ బృందాలకు హైడ్రా కమిషనర్ కితాబు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వివిధ ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు చేసిన డీఆర్‌ఎఫ్ బృందాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అభినందించారు. బుధవారం హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్యాయత్నం చేసిన మహిళను, గత వారం కురిసిన భారీ వర్షం నేపథ్యంలో మూసీనదిలో చిక్కుకున్న ఇద్దరిని డీఆర్‌ఎఫ్ బృందాలు కాపాడాయి. బుద్ధభవన్‌లోని హైడ్రా ప్రధాన కార్యాలయంలో వీరిని అభినందించిన రంగనాథ్ ప్రమాదం ఎలా వస్తుందో తెలియదని, డీఆర్‌ఎఫ్ బృందాల అనునిత్యం అప్రమత్తతతో ఉండాలని సూచించారు. ఈ రెస్క్యూ ఆపరేషన్లు చేసిన డీఆర్‌ఎఫ్ మార్షల్ ఫక్రుద్దీన్, సహాయక సిబ్బంది ఎ. రమేష్, ఎస్.శ్రీనివాస్, ఎండీ ఇమాముద్దీన్, కె.కార్తీక్ కుమార్‌లను రంగనాథ్ ప్రశంసించారు.



దిల్‌సుఖ్ నగర్‌లోని ఏ వన్ మిర్చి సెంటర్ (నాడు)



దిల్‌సుఖ్ నగర్‌లోని ఏ వన్ మిర్చి సెంటర్ (నేడు)



16 రోజుల్లో.. ఉగ్ర విధ్వంసం

నగరాన్ని రెండోసారి టార్గెట్ చేసిన రియాజ్

- 2012 నవంబర్ 28న యాసీన్ భత్కల్‌కు ఆదేశాలు
- 2013 ఫిబ్రవరిలోనే నగరానికి వచ్చిన ఉగ్రవాదులు
- అన్నీ సమకూరిన తర్వాత జంట పేలుళ్లతో మారణహోమం



బాంబు అమర్చిన సైకిల్ ఇదే (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో:

ఒక సూత్రధారి.. మరో సహాయకుడు.. నలుగురు పాత్రధారులు.. 16 రోజుల ఆపరేషన్.. 25 కేజీల పేలుడు పదార్థం... వెరసీ.. 18 ప్రాణాలు. 2023 ఫిబ్రవరిలో జరిగిన దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల నేపథ్యమిదీ. ఈ కేసులోనే జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఐదుగురు ఇండియన్ ముజాహిదీన్ (ఐఎం) ఉగ్రవాదులకు విధించిన ఉరి శిక్షను మంగళవారం హైకోర్టు సమర్థించిన విషయం విదితమే.

పాక్ నుంచి కథ నడిపిన రియాజ్...

పాకిస్థాన్‌లో ఉన్న ఐఎం వ్యవస్థాపకుడు రియాజ్ భత్కల్ 2007లో మాదిరిగానే హైదరాబాద్‌ను మరోసారి టార్గెట్ చేయాలని 2012లో నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు యాసీన్ భత్కల్‌కు ఈ–మెయిల్ ద్వారా ఆదేశాలు ఇచ్చాడు. ఇతడు అసదుల్లా అక్తర్ అలియాస్ హడ్డీ, వఖాస్, తెహసీన్ అక్తర్, ఎజాజ్ షేక్‌లను రంగంలోకి దింపాడు. అప్పటి వరకు వీరంతా మంగుళూరులోనే ఉన్నారు. పేలుళ్ల ఆపరేషన్ పూర్తి చేయడానికి షెల్టర్ వెతకడం కోసం 16 రోజుల ముందు (2013 ఫిబ్రవరి 5న) నగరానికి చేరుకున్న మోను అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. హడ్డీ అదే నెల 10న హైదరాబాద్ చేరుకున్నాడు. గదితో పాటు చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించి సంతృప్తి చెందిన హడ్డీ తిరిగి మంగుళూరు వెళ్లాడు. భత్కల్స్ ఆదేశాల మేరకు మంగుళూరులోని యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద ఓ గుర్తుతెలియని వ్యక్తి నుంచి 25 కేజీల అమోనియం నైట్రేట్ పేలుడు పదార్థం, 30 డిటొనేటర్లు ఉన్న బంగారం రంగు బ్యాగ్ ఇతడికి అందింది.

సైకిళ్లు, కుక్కర్లు ఇక్కడే కొనుగోలు..

ముందు హడ్డీతో పాటు వఖాస్ సైతం పేలుడు పదార్థాలతో సిటీకి వచ్చారు. మలక్‌పేట, అబిడ్స్, దిల్‌సుఖ్‌నగర్‌ల్లో రెక్కీ చేసినా.. దిల్‌సుఖ్‌నగర్‌నే టార్గెట్ చేశారు. 2013 ఫిబ్రవరి 19న చిన్న బాంబు తయారు చేసిన హడ్డీ అబ్దుల్లాపూర్‌మెట్ కొండల్లో టెస్ట్ బ్లాస్ట్ చేశాడు. ఆ మరుసటి రోజు (2013 ఫిబ్రవరి 20) హడ్డీ, వఖాస్, మోను ముగ్గురూ కలిసి మలక్‌పేట వెళ్లి... యశోదా ఆస్పత్రి నుంచి టీవీ టవర్ వైపునకు వచ్చే మార్గంలో ఉన్న ఓ సైకిల్ రిపేరింగ్ దుకాణం నుంచి పాత సైకిల్ కొన్నారు. మరొకటి కావాలనగా దాని యజమాని పాత బస్తీలోని జుమ్మేరాత్ బజార్ వెళ్లాలని సూచించాడు.



107 బస్టాప్ (నాడు)



107 బస్టాప్ (నేడు)

మలక్‌పేట రైల్వేస్టేషన్‌లో పార్క్ చేసి..

ఆ సైకిల్‌ను మలక్‌పేట రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ చేసి.. ముగ్గురూ ఆటోలో లక్డీకాపూల్ వెళ్లి మంగుళూరు వెళ్లేందుకు టికెట్లు రిజర్వ్ చేసుకున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌కు తిరిగి వస్తూ బాంబుల తయారీకి ఎల్బీ నగర్‌లో రెండు ప్రెషర్ కుక్కర్లు, ఆ సమీపంలోని పండ్ల వ్యాపారుల నుంచి కొన్ని ఖాళీ చిన్న సైజు అట్ట పెట్టెలు కొనుగోలు చేశారు. బి–డే (బ్లాస్ట్ డే) అయిన 2013 ఫిబ్రవరి 21 ఉదయం వఖాస్‌కు బాంబుల తయారీ బాధ్యతల్ని అప్పగించిన హడ్డీ, మోను 11 గంటల ప్రాంతంలో పాతబస్తీలోని జుమ్మేరాత్‌బజార్‌కు చేరుకున్నారు. అక్కడ మరో పాత సైకిల్ కొనుగోలు చేసి దాన్ని కూడా తీసుకుని మలక్‌పేట రైల్వేస్టేషన్ పార్కింగ్‌లో మొదటి సైకిల్ పెట్టిన చోటే పెట్టి ఇంటికి వెళ్లారు. మధ్యాహ్నం 3 గంటలకు బాంబుల తయారీ పూర్తయింది.

విధ్వంసానికి ముందే గది ఖాళీ..

రెక్కీ ప్రకారం ఏ–1 మిర్చి సెంటర్, దాని వెనుక రోడ్డులో అనునిత్యం రద్దీగా ఉండే మద్యం దుకాణం వద్ద బాంబులు పెట్టాలి. 2013 ఫిబ్రవరి 21 సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఈ త్రయం అబ్దుల్లాపూర్‌మెట్‌లోని గదిని ఖాళీ చేసింది. రెండు కుక్కర్ బాంబుల్ని పట్టుకున్న ముగ్గురూ షేర్ ఆటోలో ఎల్బీనగర్‌కు, అక్కడ నుంచి ప్రత్యేక ఆటోలో మలక్‌పేట వచ్చారు. రైల్వేస్టేషన్ పార్కింగ్ నుంచి సైకిళ్లను తీసుకున్నారు. ప్యాక్ చేసిన బాంబుల్ని వాటిపై పెట్టుకున్న ముగ్గురూ దిల్‌సుఖ్‌నగర్‌కు వచ్చారు. మొదటి సైకిల్ తీసుకుని మోను, రెండో సైకిల్‌తో వఖాస్ వెళ్లగా... హడ్డీ గడ్డిఅన్నారం చౌరస్తా వద్ద ఎదురు చూశాడు. మోను నేరుగా వెళ్లి ఏ–1 మిర్చి సెంటర్ వద్ద సైకిల్ పెట్టాడు. మద్యం దుకాణం వరకు చేరే సమయం లేదని నిర్ధారించుకున్న వఖాస్ 107 బస్టాప్ వద్ద పార్క్ చేసి వెళ్లిపోయాడు. పేలుళ్లు జరిగిన అనంతరం హడ్డీ, మోను గడ్డిఅన్నారం చౌరస్తా నుంచి ఆటోలో లక్డీకాపూల్‌లోని ట్రావెల్స్ కార్యాలయం వద్దకు వెళ్లారు. అక్కడ నుంచి ట్రావెల్స్‌కు చెందిన షటిల్ సర్వీస్ వ్యానులో రేతిబౌలి చౌరస్తా చేరుకుని అక్కడ నుంచి ట్రావెల్స్ బస్సులో మంగుళూరు వెళ్లిపోయారు. సైకిల్ పెట్టిన తరవాత వేరే మార్గంలో మోను నగరాన్ని దాటి వెళ్లిపోయాడు.

ఇక బస్తీమే సవాల్!

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నిక

- ముగిసిన ఉపసంహరణల గడువు
- బరిలో నిలిచిన బీజేపీ, ఎంఐఎం


సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు ఉపసంహరణల గడువు బుధవారంతో ముగిసింది. నామినేషన్ పత్రాల స్క్రూటినీలో మిగిలిన ఇద్దరు అభ్యర్థులు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు (బీజేపీ), మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి (ఎంఐఎం)లు పోటీలో మిగిలారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఎమ్మెల్సీ స్థానానికి తగినంతమంది ఓటర్ల బలం లేకపోయినప్పటికీ బీజేపీ అభ్యర్థి నామినేషన్ వేయడంతో ఉపసంహరణలోగా ఏమైనా జరగవచ్చని భావించిన వారూ ఉన్నారు. గడువులోగా ఎవరూ ఉపసంహరించుకోకపోవడంతో ఇక ఎన్నిక అనివార్యంగా మారింది.

ఈ నెల 23వ తేదీ (బుధవారం) ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇందుకోసం అధికారులు ఇప్పటికే రెండు పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఈ ఎన్నికకు ఓటర్లుగా ఉన్న 31 మంది ఎక్స్ అఫీషియో సభ్యులకు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం గ్రౌండ్ ఫ్లోర్‌లోని బిల్డింగ్ మెయింటనెన్స్ రూమ్‌లో, 81 మంది కార్పొరేటర్లకు లైబ్రరీ రూమ్‌లో పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఉన్న ఎంఎస్ ప్రభాకర్‌రావు పదవీకాలం మే 1న ముగిసిపోనుండటంతో ఈ ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఎంఎస్ ప్రభాకర్‌రావు అప్పట్లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికవడం, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆయన కాంగ్రెస్‌లో చేరడం తెలిసిందే.

భూ సేక'రణమే'

హై సిటీ ప్రాజెక్టులకు సంబంధించి..

- కేబీఆర్ చుట్టూ ఫ్లై ఓవర్లు, తదితర పనులకు సేకరించాల్సిన ఆస్తులు: 299
- నష్టపరిహారం రూ. 741 కోట్లు
- ఎప్పటికయ్యేనో.. ఎలా చేస్తారో?



సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన హైసిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పనుల్లో భాగంగా కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి దాదాపు రూ.1,090 కోట్లతో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు తదితర పనులకు పరిపాలన ఆమోదం తెలిపింది. ఇప్పటికే వాటికి టెండర్లు కూడా పిలిచారు. కానీ ఇంకా టెండర్లు ఖరారు కాలేదు. టెండర్లు ఖరారు చేసి ఎన్నికైన కాంట్రాక్టు ఏజెన్సీలతో ఒప్పందం కుదుర్చుకునే లోగా ఆయా ప్రాంతాల్లో పనులు చేసేందుకు ఎలాంటి ఆటంకాల్లేకుండా స్థలాలు అప్పగించాల్సి ఉంది. అందుకుగాను ఎన్నో ఆస్తులు సేకరించి భూసేకరణ చేయాల్సి ఉంది. అక్కడ భూవిలువలు ఎంతో ఎక్కువగా ఉన్నాయి. అంతేకాదు, సేకరించాల్సిన ఆస్తుల్లో రాజకీయనేతలు, సినీ ప్రముఖులవి కూడా ఉన్నాయి. సంప్రదింపులతో సేకరణకు అంగీకరించేవారు ఎందరుంటారో తెలియదు కానీ.. ఏ రకంగా సేకరించాలన్నా దాదాపు రూ. 741 కోట్లు ఆస్తులు, భూసేకరణలకే చెల్లించాల్సి ఉంది. ఈ పనుల్లో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లతో పాటు బంజారాహిల్స్ విరించి హాస్పిటల్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ వరకు రహదారి అభివృద్ధి పనులు కూడా ఉన్నాయి. సదరు పనులు చేపట్టేందుకు సర్వే నిర్వహించిన జీహెచ్‌ఎంసీ దాదాపు 56,621 చదరపుగజాల స్థలాన్ని (విరించి హాస్పిటల్ జంక్షన్– జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్‌కు అవసరమైన స్థలం కాక)సేకరించాల్సి ఉంటుందని, అందుకు 299 ఆస్తులపై ప్రభావం పడుతుందని గుర్తించింది. ఇంత భారీగా నష్టపరిహారం చెల్లించాల్సిన ఇన్ని ఆస్తుల సేకరణ సంబంధిత అధికారులకు కత్తిమీద సాము వంటిదేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సామాన్య ప్రజలుండే ప్రాంతాల్లోనైతే సేకరణ కష్టాలు ఒక రకంగా ఉంటే, వీఐపీల ఆస్తుల సేకరణలో మరో రకమైన కష్టాలుంటాయని వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఆస్తుల సేకరణ ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

ఎస్సార్‌డీపీ తరహాలో..

ఆస్తుల సేకరణ మొత్తం పూర్తికానిదే పనులు చేపట్టాలంటే ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి. అందుబాటులో ఉన్న స్థలంలో పనులు ప్రారంభించి చేసుకుంటూ పోతామని, భూసేకరణలు పూర్తవుతున్న కొద్దీ మిగతా ప్రాంతాల్లోనూ పనులు చేస్తామని సంబంధిత ఇంజినీర్లు చెబుతున్నారు. ఎస్సార్‌డీపీలో భాగంగా గతంలోనూ ఎన్నో పనులు అలాగే చేశామని చెప్పారు.

భూసేకరణకు టీడీఆర్..

భూ సేకరణలకు చెల్లించాల్సిన నిధులే రూ.741 కోట్లు ఉండటంతో, వీలైనంత మేరకు ఆస్తులు కోల్పోయే వారికి నగదు పరిహారం బదులు టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) హక్కులివ్వాలనే యోచనలో జీహెచ్‌ఎంసీ ఉంది. తద్వారా జీహెచ్‌ఎంసీకి, ప్రభుత్వానికి నిధుల భారం తగ్గుతుంది. గతంలో ఎస్సార్‌డీపీలో భాగంగా చేసిన ప్రాజెక్టుల పనుల్లోనూ భూసేకరణలకు టీడీఆర్ హక్కులు గణనీయంగా (దాదాపు రూ.10వేల కోట్లు) ఇచ్చారు. ప్రస్తుతం టీడీఆర్ డిమాండ్ పెరగనుందని ప్రచారం జరుగుతున్న తరుణంలో ఆస్తులు కోల్పోయే వారు సైతం అందుకు అంగీకరిస్తారనే తలంపులో ఉన్నారు.

సేకరించాల్సిన ఆస్తులు ఎక్కడ ఎన్నో వివరాలిలా ఉన్నాయి.

ఎక్కడ	దూరం (కి.మీ.)	ఆస్తులు	స్థలం (చ.గ)	అంచనా (రూ.కోట్లు)దాదాపు
కేబీఆర్, ముగ్ధ జంక్షన్లు	1.80	40	7,884.21	60.00
జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్	2.00	47	13,390.48	115.00
రోడ్‌నెం.45 జంక్షన్– జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్	1.20	36	6,249.65	125.00
ఫిల్మ్‌నగర్ జంక్షన్	1.40	43	9,927.82	105.00
మహారాజా అగ్రసేన్ జంక్షన్	1.20	34	5,531.14	76.00
క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్	1.20	18	13,638.00	60.00
విరించి హాస్పిటల్ జంక్షన్– జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్	6.50	81	----	200.00
మొత్తం	--	299	56,621.30	741.00

తస్మాత్ జాగ్రత్త

నల్లాకు మోటార్ బిగిస్తే రూ.5 వేల జరిమానా

తక్షణమే సీజ్.. కనెక్షన్ కట్

- సరఫరా సమయంలో లైన్‌ల వారీగా తనిఖీలు
- రంగంలోకి లైన్‌మన్ నుంచి ఎండీ వరకు
- నల్లా నీటి సరఫరాలో 'లో ప్రెషర్' సమస్యకు చెక్
- టార్గెట్ 'మోటార్ ఫ్రీ ట్యాప్ వాటర్' కార్యాచరణ
- ఈ నెల 15 నుంచి వాటర్ స్పెషల్ డ్రైవ్

సాక్షి, సిటీబ్యూరో: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు జలమండలి ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటి వరకు తాగునీరు సరఫరాలో ఎలాంటి కొరత లేనప్పటికీ కొందరు వినియోగదారుల తీరుతో లోప్రెషర్ (తక్కువ ఒత్తిడి)తో నీటి సరఫరా సమస్య ఉత్పన్నం కావడాన్ని జలమండలి సీరియస్‌గా పరిగణించింది. నల్లాకు అక్రమంగా మోటార్లు బిగించే కనెక్షన్‌దారులపై కొరడా ఝుళిపించాలని నిర్ణయించింది. జరిమానాలు, మోటార్ల సీజ్‌కు సిద్ధమైంది.

జూమ్ మీటింగ్‌ల ద్వారా ఆదేశాలు..

జలమండలి ద్వారా సరఫరా జరిగే నల్లా నీరు లో పెష్రర్‌తో కాకుండా ఎప్పటి మాదిరిగానే సరఫరా జరిగే విధంగా జలమండలి ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇటీవల లో ప్రెషర్ ఫిర్యాదులు అధికంగా వచ్చిన ఓ అండ్ డివిజన్ 6లోని సుమారు 110 లైన్‌మెన్లతో ఎండీ అశోక్ రెడ్డి ప్రత్యేక జూమ్ మీటింగ్ నిర్వహించారు. లో ప్రెషర్ నీటి సరఫరా కారణాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో నీటి సరఫరా, ప్రస్తుతం నీటి సరఫరా ఎంజీడీలు, సమయాల్లో ఎలాంటి తేడా లేనప్పటికీ.. కొన్ని కనెక్షన్లకు ఎక్కువ, తక్కువ నీరు సరఫరా కావడమేంటని ప్రశ్నించారు. మోటార్లు బిగించే నల్లా కనెక్షన్ల దారులను గుర్తించి, తక్షణమే మోటార్లను సీజ్ చేసి జరిమానా విధించాలని సూచించారు. అదే విధంగా అన్నీ సర్కిల్ సీజీఎం, డివిజన్ జీఎం, డీజీఎం, సెక్షన్ మేనేజర్లతో కూడా జూమ్ మీటింగ్ నిర్వహించి నీటి సరఫరాలో సాధారణ ప్రెషర్ ఉండే కొనసాగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రత్యేకంగా 'మోటార్ ఫ్రీ ట్యాప్ వాటర్' పేరుతో కార్యాచరణ ప్రకటించారు.

నాలుగు దశల తనిఖీలు..

వేసవిలో 'మోటార్ ఫ్రీ ట్యాప్ వాటర్' లక్ష్యంగా నాలుగు దశల తనిఖీలకు జలమండలి సిద్ధమైంది. నల్లా నీటి సరఫరాలో లో ప్రెషర్‌కు చెక్ పెట్టి సాధారణ స్థాయి ఒత్తిడితో నీటి సరఫరా జరిగేలా 'మోటార్ ఫ్రీ ట్యాప్ వాటర్' పేరుతో ఈ నెల 15 (మంగళవారం) నుంచి వాటర్ స్పెషల్ డ్రైవ్ అమలుకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. క్షేత్ర స్థాయిలో నల్లా నీటి సరఫరా సమయంలో లైన్‌మన్ నుంచి ఎండీ వరకు పర్యటించి తనిఖీలు నిర్వహించనున్నారు. వేసవి ముగిసే వరకు ఆకస్మిక తనిఖీలు కొనసాగనున్నాయి.


- మొదటి దశలో లైన్‌మెన్లు వాటర్ వాల్వ్ తిప్పగానే సరఫరా చేసే లైన్లలో కనెక్షన్ టు కనెక్షన్ పరిశీలించి వాటర్ ప్రెషర్, మోటార్ల వినియోగాన్ని గుర్తిస్తారు.
- రెండో దశలో మరుసటిరోజు (రోజు విడిచి రోజు) సెక్షన్ మేనేజర్ అదే లైన్‌లో నల్లా నీటి సరఫరా.. మోటార్ల వినియోగాన్ని గుర్తించి నల్లాకు మోటార్ బిగిస్తే రూ.5 వేలు జరిమానా విధించి తక్షణమే మోటార్ సీజ్ చేస్తారు. క్యాన్ నెంబర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి కనెక్షన్ తొలగిస్తారు. ఆ తర్వాత లైన్‌ల వారీగా (క్యాన్ నెంబర్ల జాబితా)ను 'మోటార్ ఫ్రీ ట్యాప్ వాటర్' లైన్లుగా జీఎంలకు నివేదిక సమర్పిస్తారు.
- మూడో దశలో మేనేజర్ల నివేదిక ఆధారంగా జీఎంలు క్షేత్ర స్థాయిలో లైన్లను ర్యాండమ్‌గా పరిశీలించి సంతృప్తి వ్యక్తమైతే సీజీఎంలకు నివేదిక సమర్పిస్తారు. అక్కడి నుంచి డైరెక్టర్, డైరెక్టర్ నుంచి మేనేజింగ్ డైరెక్టర్ లాగిన్‌కు రోజువారీగా ఆన్‌లైన్‌లో నివేదిక సమర్పిస్తారు.
- నాలుగో దశలో ఆ నివేదికలను బట్టి క్రాస్ చెక్ కోసం సీజీఎం, డైరెక్టర్, ఎండీలు క్షేత్ర స్థాయిలో ర్యాండమ్‌గా తనిఖీలు నిర్వహిస్తారు. జరిమానాలు విధించడం, మోటార్లు సీజ్ చేయడం కొనసాగిస్తారు.



తప్పుడు నివేదిక సమర్పిస్తే...

మోటార్ ఫ్రీట్యాప్ వాటర్ సర్వేలో ఏ స్థాయిలోనూ సమగ్ర పరిశీలన జరపకుండా తప్పుడు నివేదిక సమర్పిస్తే సంబంధిత అధికారి పనితీరు అంచనా వేసి ర్యాంకింగ్ విధించడంతో పాటు మెమో జారీ చేయాలని జలమండలి నిర్ణయించింది. అదేవిధంగా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసే డ్యాష్‌బోర్డులో ఆన్‌లైన్ ఆధారంగా ప్రతిరోజూ నివేదికలను పర్యవేక్షిస్తారు. ఇప్పటికే వాటర్ వాల్వ్‌ను జియో ట్యాగింగ్ చేసి ఆన్‌లైన్ లాగిన్‌కు అనుసంధానం చేశారు. సెక్షన్ నుంచి ఎండీ వరకు పర్యవేక్షించేందుకు వెసులుబాటు కల్పించారు.

మోటార్ బిగింపు చట్టరీత్యా నేరం



మహా నగరానికి తాగు నీరు అందించేందుకు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సుదూర ప్రాంతాల నుంచి పైపులైన్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నాం. అందరికీ నీరు సమపాళ్లలో పంపిణీ కావాలి. కొన్ని ప్రాంతాల్లో వినియోగదారులు తమ నల్లాలకు అక్రమంగా మోటార్లు విధిస్తున్నారు. ఇది చట్టరీత్యా నేరం. జలమండలి నిబంధనల ప్రకారం జరిమానా విధించడంతో పాటు మోటార్లు సీజ్ చేస్తాం. వినియోగదారులెవరూ నల్లాకు మోటార్లు బిగించవద్దు. నీటి సమస్యలపై జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313కి ఫిర్యాదు చేయవచ్చు.

– అశోక్ రెడ్డి, జలమండలి ఎండీ

జరిమానాల ప్రత్యేక మొబైల్ యాప్ ఆవిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: నల్లాలకు మోటార్లను బిగించి అక్రమంగా నీటిని తోడినా, తాగునీటి ఇతర అవసరాలకు వినిగియోగించే వారిపై జరిమానాలను విధించేందుకు రూపొందించిన ప్రత్యేక మొబైల్ యాప్‌ను బుధవారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి నల్లాలకు మోటార్లను బిగించినా, తాగడానికి కాకుండా ఫ్లోర్లు కడగడం, వాహనాలు శుభ్రం చేయడం, గార్డెనింగ్, ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి ఓవర్ ఫ్లో, నిర్మాణ పనుల కోసం నీటిని వధా చేస్తే జరిమానా విధించడానికి ఈ యాప్‌ని రూపొందించినట్లు వెల్లడించారు. రెండు రోజుల్లో ఈ యాప్‌ని జీఎం నుంచి క్షేత్రస్థాయిలోని లైన్‌మెన్ల వరకు అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించారు. అక్రమంగా మోటార్లను బిగించి నీటిని తోడుతున్న వారిని, నీటి వృథా చేస్తున్న వినియోగదారులను గుర్తించి ఫొటోతో సహా యాప్‌లో అప్‌లోడ్ చేయడం.. సదరు కనెక్షన్ గుర్తించి ట్యాగ్ చేయడంతో వెంటనే ఆ కన్స్యూమర్ కనెక్షన్ అకౌంట్‌కు పెనాల్టీ జమవుతుందన్నారు. కార్యక్రమంలో జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్, ఈఎన్సీ– ఆపరేషన్ డైరెక్టర్– 2 వీఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్ డైరెక్టర్– 1 అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న మయాంక్ మిట్టల్

సాక్షి, సిటీబ్యూరో: పెండింగ్ బకాయిలపై దృష్టి సారించి ఆదాయం పెంచేందుకు చర్యలు చేపట్టాలని జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ సీజీఎం, జీఎం, డీజీఎంలను ఆదేశించారు. బుధవారం ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ ఇప్పటివరకు అధిక బకాయి ఉన్న కనెక్షన్లను గుర్తించి ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రతినెల బోర్డుకు మరింత ఆదాయం సమకూరనుందన్నారు. దీర్ఘ కాలంగా బిల్లులు చెల్లించని వాణిజ్య కనెక్షన్ల నుంచి బకాయిలు వసూలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జలమండలి ఈఎన్సీ (ఆపరేషన్) డైరెక్టర్-2 వీఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్ డైరెక్టర్-1 అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్షిక పరీక్షలకు ఫీజుల మెలిక!

- ప్రైవేట్ స్కూళ్లలలో ఆగని దోపిడీ
- ఫీజులు చెల్లించలేదని హాల్ టికెట్లు నిరాకరణ
- వార్షిక పరీక్షలకు దూరమవుతున్న విద్యార్థులు


ఆందోళన నిర్వహిస్తున్న పేరెంట్స్

సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేటు పాఠశాలల తీరు మారడం లేదు. సాధారణ వార్షిక పరీక్షలకు కూడా ఫీజుల మెలిక పెట్టడం విస్మయానికి గురిజేస్తోంది. బుధవారం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. పబ్లిక్ పరీక్షల తరహాలోనే ఆరు నుంచి తొమ్మిదవ తరగతి వరకు ప్రశ్న పత్రాలను ప్రభుత్వం ఆయా పాఠశాలలకు అందజేసింది. తొలిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తెలుగు సబ్జెక్టు పరీక్ష జరిగింది. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో వార్షిక పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో ప్రారంభమైనప్పటికీ..కొన్ని ప్రైవేటు స్కూల్స్ మాత్రం ఫీజుల వసూళ్లకు తెగబడి చిన్నారులను పరీక్షలకు దూరం చేశాయని తెలుస్తోంది. స్కూలు ఫీజు చెల్లించలేదనే కారణంగా పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం విద్యార్థుల పట్ల ఆక్రోషాన్ని ప్రదర్శించాయి. రూ.1000, రూ.2000 బకాయిలు ఉన్న విద్యార్థులను కూడా మొదటి రోజు పరీక్షలు రాయనివ్వకుండా అడ్డుకున్నారని తెలుస్తోంది. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇలా జరుగుతోందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఫీజుల నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాసబ్‌ట్యాంక్‌లో..

నగరంలోని మాసబ్‌ట్యాంక్‌లో గల ఒక ప్రైవేటు స్కూల్ యాజమాన్యం ఫీజులు చెల్లించలేదని 6వ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు పలువురు విద్యార్థులను తొలి రోజు తెలుగు పరీక్షకు అనుమతించలేదు. స్కూల్ ఫీజు చెల్లించని విద్యార్థులకు హాల్ టికెట్లను జారీ చేసినా, పరీక్ష రాయించినా చర్యలు తీసుకుంటామని ఉపాధ్యాయులకు సదరు స్కూల్ యాజమాన్యం హెచ్చరించింది. దీంతో పరీక్ష హాల్లో కూర్చున్నా..ఫీజు చెల్లించని విద్యార్థుల చేతుల్లోని ప్రశ్న, జవాబు పత్రాలను ఉపాధ్యాయులు లాక్కున్నారు. గంటలపాటు విద్యార్థులను పరీక్ష హాలు బయటే నిల్చో పెట్టారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు స్కూల్‌కు చేరుకొని ప్రిన్సిపాల్ ఆఫీస్‌ను ముట్టడించి ఆందోళనకు దిగారు. దీంతో విద్యార్థులకు చివరి రోజున మళ్లీ పరీక్ష రాసే అవకాశం కల్పిస్తామని సదరు స్కూల్ ప్రిన్సిపాల్ హామీ ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన విరమించారు.

విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

హిమాయత్‌నగర్: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.4 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం దశల వారీగా విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ విద్యా, ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నప్పటికీ ఇంతవరకు ప్రభుత్వం 14 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థుల బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ ఎత్తివేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రలు తక్షణమే మానుకోవాలని, లేని పక్షంలో అన్ని విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలతో నిరవధికంగా బంద్ చేస్తామని హెచ్చరించారు. ఫీజు బకాయిలు చెల్లించాలని బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఫీజులు చెల్లించక పోవడంతో వార్షిక పరీక్షల్లో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల హాల్ టికెట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు పరీక్షలు రాస్తామా లేదా? అని తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు.

క్షణికావేశం..పెను విషాదం!

- కుటుంబ కలహాలతో భార్య ఆత్మహత్య..
- మరుసటి రోజు భవనంపై నుంచి దూకి భర్త..
- అనాథగా మిగిలిన 11 నెలల బాలుడు


నగేష్, శిరీషల పెళ్లి ఫోటో (ఫైల్)

హయత్‌నగర్: భార్యాభర్తల మధ్య ఏర్పడిన చిన్న తగాదా ఇరువురి ఉసురు తీసింది. 11 నెలల బాలుడిని అనాథను చేసింది. హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన ఈ విషాద ఘటన వివరాలు పోలీసులు తెల్పిన మేరకు ఇలా ఉన్నాయి. సంపంగి నగేష్ (25), శిరీష(20) భార్యాభర్తలు. రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 11 నెలల కుమారుడు ఉన్నాడు. హయత్ నగర్ ముదిరాజ్ కాలనీలో నివసిస్తూ జీహెచ్‌ఎంసీ కార్మికులుగా పని చేస్తున్నారు. మంగళవారం భార్యా భర్తల మధ్య చిన్న వివాదం తలెత్తింది. దీంతో మనస్తాపం చెందిన శిరీష క్షణికావేశంలో..ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆమె మృతదేహన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. శిరీష తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నగేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. బంధువుల పూచీకత్తుతో రాత్రి 9 గంటలకు వదిలి పెట్టారు.

ఆవేదనతో భర్త ఆత్మహత్య...

భార్య మరణంతో తీవ్ర ఆవేదనకు గురైన నగేష్ బుధవారం తెల్లవారుజామున హయత్‌నగర్‌లోని రిలయన్స్ డిజిటల్ షోరూం భవనం పైకి ఎక్కి కిందకు దూకాడు. రక్తం మడుగులో పడి ఉన్న మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించిన పోలీసులు..నగేష్ ఒక్కడే భవనంపైకి ఎక్కి కిందకు దూకినట్లుగా నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాపం పసికందు...

భార్యా భర్తలిద్దరూ ఒక రోజు తేడాలో ఆత్మహత్యకు పాల్పడడంతో ముదిరాజ్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారిన 11 నెలల బాలుడిని చూసి బంధువులు, స్థానికులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

పది గంటలు సాగిన క్రిశాంక్, దిలీప్‌ల విచారణ


విచారణ కోసం గచ్చిబౌలి పీఎస్‌కు వచ్చిన బీఆర్ఎస్ నేతలు క్రిషాంక్, దిలీప్

గచ్చిబౌలి: కంచ గచ్చిబౌలి భూములపై ఏఐతో ఫేక్ వీడియోలు పెట్టారన్న కేసులో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ క్రిశాంక్ మన్నె, డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌ల విచారణ 10 గంటల పాటు కొనసాగింది. ఏఐ ఫేక్ వీడియోలు పోస్ట్ చేశారనే ఫిర్యాదులపై గచ్చిబౌలి పీఎస్‌లో ఐదు కేసులు నమోదయ్యాయి. నోటీసులు అందుకున్న క్రిషాంక్, దిలీప్‌లు బుధవారం ఉదయం 11.30 గంటలకు విచారణ నిమిత్తం గచ్చిబౌలి పీఎస్‌కు వచ్చారు. రాత్రి 9.30 గంటలకు విచారణ ముగియడంతో బయటకు వచ్చారు. అనంతరం బీఆర్ఎస్ నేత క్రిశాంక్ మాట్లాడుతూ కంచ గచ్చిబౌలి భూములు బ్యాంక్‌లో తనఖా పెట్టి తీసుకున్న 10 వేల కోట్ల అప్పు గురించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి జింకలు, నెమళ్లు లేవన్నందుకే పోస్టులు పెట్టామని అన్నారు. పోలీసులు ఏడు గంటల పాటు ఎలాంటి ప్రశ్నలు అడగలేదని, ఆ తర్వాత అడిగిన దాదాపు 60 ప్రశ్నలకు సమాధానం ఇచ్చామని చెప్పారు. దిలీప్ కొణతం మాట్లాడుతూ కంచ గచ్చిబౌలి భూములను విధ్వంసం చేసింది ప్రభుత్వమని, నిజాలు బయటకు తీసుకొచ్చినందుకే తమను కేసుల పేరిట వేధిస్తున్నారని చెప్పారు. ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదన్నారు.

సైబర్ కేటుగాడి డబుల్ యాక్షన్

- సమీప బంధువైన వివాహితకు వేధింపులు
- ఆపై తానే ఆమెకు సహాయం చేస్తున్నట్లు బిల్డప్
- అరెస్టు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ వివాహితను మారుపేరుతో ఆన్‌లైన్‌లో వేధించిన సమీప బంధువు, వాస్తవంలో ఆమెకు సహాయం చేస్తున్నట్లు నటించాడు. ఆమె భర్త సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మెహదీపట్నం ప్రాంతానికి చెందిన అతుల్ సింగ్ గతంలో ఓ యువతిని ప్రేమించాడు. వీరిద్దరికీ వివాహం జరగాల్సి ఉండగా ఆఖరి నిమిషంలో రద్దు అయింది. వేరే వ్యక్తితో వివాహమైన ఆమెపై కక్షకట్టిన అతుల్ సింగ్ ఇన్‌స్టాగామ్‌లో నకిలీ పేరుతో ఐడీ సృష్టించాడు. దాని నుంచి అశ్లీలంగా మార్ఫింగ్ చేసిన ఫొటోను ఆమెకు పంపాడు. మరోసారి ఆమె సోదరిదీ ఇలానే చేసి షేర్ చేశాడు. అలా పంపుతున్నది ఎవరో తెలియని బాధితురాలు ఆ ఐడీతో చాటింగ్ చేసింది. ఈ నేపథ్యంలో తనకు రూ.10 లక్షలు చెల్లించాలని లేదంటే ఆ ఫొటోలను సోషల్‌మీడియాలో పెడతానని అతుల్ బెదిరించాడు. తొలుత విషయం భర్తకు చెప్పడానికి వెనుకాడిన బాధితురాలు ఈ సమస్యను పరిష్కరించాల్సిందిగా అతుల్ సింగ్‌ను కోరింది. ఏమీ తెలియని వాడిలా ఆమె నుంచి వివరాలు తెలుసుకున్న అతగాడు సహకరిస్తున్నట్లు నటించాడు. వేధిస్తున్న వ్యక్తితో బేరసారాలు చేశానని, రూ.6 లక్షలు చెల్లించానంటూ ఆమెకు చెప్పిన అతగాడు ఆ మేరకు తన బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను మార్ఫింగ్ చేశాడు. వేధింపులకు పాల్పడిన వ్యక్తిని తాను చెల్లించిన మొత్తం ఇవ్వాలంటూ ఆమెపై అతుల్ ఒత్తిడి తీసుకువచ్చాడు. ఇలా విషయం ఆమె భర్తకు తెలియడంతో అనుమానించిన ఆయన సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ పి.ప్రమోద్‌కుమార్, ఎస్సై వెంకటాద్రిలతో కూడిన బృందం ఈ కేసును దర్యాప్తు చేసింది. సాంకేతిక ఆధారాలను బట్టి అతుల్ నిందితుడిగా గుర్తించి అరెస్టు చేసింది. మరోపక్క నగరవాసి నుంచి రూ.19.61 లక్షలు కాజేసిన డిజిటల్ అరెస్టు కేసులోనూ ఓ నిందితుడిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఉంటున్న బీహార్ వాసి రంజిత్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఇతగాడు మరికొందరితో కలిసి డిజిటల్ అరెస్టు నేరానికి పాల్పడ్డాడు. ఇతడిని అరెస్టు చేసిన పోలీసులు నగరానికి తీసుకువచ్చి రిమాండ్‌కు తరలించారు.

పరీక్షలకు భయపడి.. 9వ తరగతి విద్యార్థి ఆత్మహత్య

నాగోలు: పరీక్షలకు భయపడి ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మాన్సూరాబాద్‌లోని ఏకలవ్యకాలనీకి చెందిన వెంకటకృష్ణంరాజు, ప్రశాంతి దంపతుల కుమారుడు సాయిదర్శన్ రాజు (14) నాగోలు సాయినగర్ కాలనీలోని నాగార్జున స్కూల్‌లో 9 వతరగతి చదువుతున్నాడు. ఈ నెల 7వ తేదీన మధ్యాహ్నం సాయి దర్శన్ రాజు భోజనం చేసి చదువుకునేందుకు తన గదికి వెళ్లి తలుపు మూసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత తల్లి కుమారుడికి స్నాక్స్ ఇవ్వడానికి తలుపు తట్టగా తెరవలేదు. కిటికీలు కూడా మూసి ఉన్నాయి. దీంతో ఆమె స్థానికులను పిలిచి తలుపు తెరవగా అప్పటికే సాయి దర్శన్ రాజు చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కనిపించాడు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది అక్కడకు వచ్చి సాయిదర్శన్ రాజును పరిశీలించి చనిపోయడాని నిర్ధారించారు. వార్షిక పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్న తన కుమారుడు మంచి మార్కులు వస్తాయో రావోననే భయంతో ఉరివేసుకుని ఉండవచ్చని తల్లి ప్రశాంతి ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు.

తక్కువ ధరకు ప్లాట్లు ఇప్పిస్తానని మోసం

మణికొండ: కొత్తగా వస్తున్న ట్రిబుల్ ఆర్ రోడ్డుకు సమీపంలో తమకు తెలిసిన కొత్త వెంచర్ వస్తోందని, అందులో తక్కువ ధరకు ప్లాట్లు ఇప్పిస్తామంటూ ఓ మహిళను మోసం చేసిన ఇద్దరు యువకులను నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పుప్పాలగూడ సెక్టార్ ఎస్సై మునీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పుప్పాలగూడ శివాలయం సమీపంలో ఉండే ఓ మహిళకు తక్కువ ధరకే ప్లాట్లు ఇప్పిస్తామని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కె.రాజేంద్రప్రసాద్, వి.గురుకుమార్ రూ.97 లక్షలు తీసుకున్నారు. తీరా ప్లాట్లు ఇప్పించకపోవటంతో అనుమానం వచ్చిన ఆ మహిళ నార్సింగి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితులకు బ్యాంకు ద్వారా పంపిన డబ్బు వివరాలు, వారు చూపించిన వెంచర్ల బ్రోచర్‌లు స్వాధీనం చేసుకుని విచారణ చేశారు. నిందితులు బ్రోచర్‌లో చూపినట్టుగా అక్కడ వెంచర్‌లే లేవని, వారు ఆమెను మోసం చేసినట్టు నిర్ధారించి బుధవారం ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి మోసాలకు గురైన వారు ఇంకెవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వాలని నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి సూచించారు.

భూ వివాదం.. ఉద్రిక్తం

- అనుచరులతో వచ్చి ప్లాట్లు, ప్రీకాస్ట్‌లను ధ్వంసం చేసిన వ్యక్తులు
- తిరగబడిన బాధితులు
- పలు వాహనాలు ధ్వంసం


ఘర్షణ వాతావరణంలో ఇరువర్గాలు

తుర్కయంజాల్: తుర్కయంజాల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 240, 241, 242లోని నెలకొన్న భూ వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. బుధవారం తెల్లవారుజామున కబ్జాదారులు ప్లాట్ల కడీలు, ప్రీకాస్ట్‌లను తొలగించడంతో పాటు, నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిని కూల్చడానికి ప్రయత్నిస్తుండగా ఒక్కొక్కరుగా చేరుకున్న ప్లాట్లు, ఇళ్ల యజమానులు, పక్క కాలనీవాసులు తిరగబడటంతో ఘర్షణ వాతావరణం నెలకొంది.

వివరాలు ఇవీ..

గుండ రాజమ్మ అనే మహిళ తన వారసత్వ వాటాగా రావాల్సిన ఆస్తి ఇవ్వలేదని 1984లో కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆమెకు సెప్టెంబర్ 2024లో అడ్వకేట్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా తుర్కయంజాల్ రెవెన్యూ సర్వే నంబర్ 240లోని 10.09 ఎకరాల వ్యవసాయ భూమిని కేటాయిస్తున్నట్లు కోర్టు తీర్పు ఇచ్చింది. దీని ఆధారంగా భూమిని ఆళ్ల రామకృష్ణ, సలాం, రిజ్వాన్ అనే ముగ్గురు వ్యక్తులకు ఆమె జీపీఏ చేసింది. వాళ్లు 2025 మార్చి నెల 26న ఇదే సర్వే నంబర్‌లోని వ్యవసాయ పొలానికి కంచె వేసే ప్రయత్నం చేయడంతో పాటు, పలు ఇళ్లు, ప్రీకాస్ట్ నిర్మాణాలను కూల్చి వేయించారు. దీంతో ఇక్కడ భూ వివాదం రాజుకుంది. ప్లాట్లు, ఇళ్ల యజమానులతో పాటు, పొలానికి చెందిన రైతులు కూడా కోర్టులను ఆశ్రయించారు. ఇటీవల 1.10 గుంటల పొలానికి ఇంజక్షన్ ఆర్డర్ వచ్చింది. అప్పటి నుంచి భూమిని కబ్జాలోకి తీసుకోవాలని భావిస్తున్న వారి అనుచరులు కాలనీలో నివసించే వారిని భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరిస్తున్నారు.

ఆలస్యంగా పోలీసుల రాక..

ఇరువర్గాల మధ్య వివాదం కొనసాగుతున్న పోలీసులు సుమారు గంటన్నర తరువాత సంఘటనా స్థలానికి చేరుకోవడం ఉద్రిక్త పరిస్థితులకు ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్లాట్ల యజమానులు 100 డయల్ చేయడంతో ఆలస్యంగా అక్కడికి చేరుకున్నారు. దీంతో అప్పటికే అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేశాక పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఏసీపీ కాశిరెడ్డి, ఎస్ఓటీ ఏసీపీ షాకీర్ హుస్సేన్, సీఐ శ్రీనివాస్‌లు పరిస్థితిని సమీక్షించారు. ఈ మేరకు ఇరువర్గాల మీద కేసులు నమోదు చేస్తామని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

తేనేటీగలు లేవడంతో..

ఈ విషయాన్ని ఎమ్మెల్యే రంగారెడ్డి దృష్టికి తీసుకునేందుకు ప్లాట్లు, ఇళ్ల యజమానులు తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఇక్కడ వీరికి జీపీఏ చేసుకున్న ఆళ్ల రామకృష్ణ తారసపడ్డాడు. దీంతో మాటామాటా పెరిగింది. ఒక్కసారిగా ఒకరిని ఒకరు తోసుకున్నారు. ఇదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడ చెట్టుకున్న తేనే తెట్టును రాయితో కొట్టడంతో ఒక్కసారిగా తేనెటీగలు లేచాయి. దీంతో ఎమ్మెల్యేతో సహా అంతా అక్కడి నుంచి పరుగులు తీశారు.

వంద మంది జేసీబీతో వచ్చి..

సుమారు వంద మంది బుధవారం తెల్లవారుజామున జేసీబీతో వచ్చి ప్లాట్ల కడీలను ధ్వంసం చేయడంతో పాటు, ప్రీకాస్ట్ నిర్మాణాలను కూల్చివేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి వద్ద వెళ్తుండగా ప్లాట్లు, ఇళ్ల యజమానులు అక్కడికి చేరుకున్నారు. ఆపాలని ప్రాధేయపడుతున్నా వినకుండా కబ్జాకు వచ్చిన వారి అనుచరులు ఒక్కసారిగా రాళ్లదాడి మొదలు పెట్టారు. దీంతో ప్లాట్లు, ఇళ్ల యజమానులు ఒకరికి ఒకరు సమాచారం చేరవేయడంతో అక్కడికి పదుల సంఖ్యలో చేరుకున్నారు. వీరికి పక్క కాలనీల వాసులు కూడా తోడవ్వడంతో ప్లాట్లను ధ్వంసం చేస్తున్న వారిని తరిమారు. ఈ క్రమంలో జేసీబీ, ఆటో, పలు బైక్‌లను ధ్వంసం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఓ బైక్‌కు నిప్పు పెట్టారు.

అమ్మతోడు.. ఆస్తికోసం కాదు

- విష్ణు నా కార్లు దొంగిలించాడు
- మంచు మనోజ్ ఆరోపణ
- మంచు టౌన్ షిప్ వద్ద మరోసారి ఉద్రిక్తత


విలేకరులతో మాట్లాడుతున్న మనోజ్

పహాడీషరీఫ్: జల్‌పల్లిలోని సినీ నటుడు మోహన్‌బాబుకు సంబంధించిన మంచు టౌన్‌షిప్ వద్ద మరోసారి వివాదం నెలకొంది. తాను లేని సమయంలో నార్సింగిలోని తన నివాసం వద్ద ఉన్న కార్లను విష్ణు దొంగలించాడని పేర్కొంటూ ఈ నెల 8న మంచు మనోజ్ నార్సింగి ఠాణాలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం ఉదయం 8.30 గంటలకు జల్‌పల్లి శివారులోని మంచు టౌన్‌షిప్ గేట్ ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని మీడియాను లోనికి రానివ్వకుండా టౌన్‌షిప్ చుట్టూ కిలోమీటర్ సరిహద్దులో ఆంక్షలు విధించారు. పోలీసుల సూచనతో 11.45 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోతూ మనోజ్ మీడియా ఎదుట తన ఆవేదన వెలిబుచ్చారు.

అమ్మపై ప్రమాణం

గతేడాది డిసెంబర్ 8వ తేదీ నుంచి మంచుటౌన్‌షిప్‌లో ఆరంభమైన గొడవ రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. జల్‌పల్లిలో మొదలైన ఈ గొడవ కాలక్రమేణా తిరుపతిలోని మోహన్‌బాబు వర్సిటీ వరకు తాకింది. జల్‌పల్లిలో తాజాగా మనోజ్ మీడియాతో మాట్లాడుతూ.. మార్చి 27న తాను, తన భార్య ఇంట్లో ఉన్న సమయంలో బయటి వ్యక్తులు గుమిగూడుతున్న విషయమై పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డికి ఫోన్‌తో పాటు, 100 డయల్‌కు కాల్ చేసి రక్షణ కల్పించాలని కోరామన్నారు. అయినప్పటికీ తననే ఇంటి నుంచి బయటికి రావాలని పోలీసులు తెలిపారన్నారు. ఏప్రిల్ 2న తన కుమార్తె మొదటి పుట్టిన రోజు ఇక్కడే పరిమితంగా చేసుకుందామనుకున్నప్పటికీ, స్థానిక పరిస్థితుల దృష్ట్యా రాజస్థాన్‌లోని జైపూర్ వెళ్లామన్నారు. అంతకుముందే నేను అక్కడ లేను, విష్ణును అక్కడ ఏమైనా చేసుకోమని మా అమ్మకు కూడా తెలిపానన్నారు. అమ్మపై ప్రమాణం.. ఇది ఆస్తి కోసం కాదు అన్నారు. తిరుపతిలోని యూనివర్సిటీలో జరుగుతున్న అవినీతి తంతును ప్రశ్నించినందుకే ఈ పరిస్థితి ఎదురైందన్నారు. డిసెంబర్ 8 నుంచి ఇప్పటి వరకు పహాడీషరీఫ్ పోలీసులు ఒక్క ఛార్జిషీట్ కూడా దాఖలు చేయలేదని, టౌన్‌షిప్‌లో తనకు సంబంధించి మూడు పెట్ డాగ్‌లు, పిల్లలకు సంబంధించి వస్తువులున్నాయని తెలిపారు. అవి తీసుకొని వెళ్తానని చెప్పినా లోనికి వెళ్లనీయడం లేదన్నారు. పోలీసులకు అన్ని ఆధారాలు ఇచ్చినా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. తాను రాజస్థాన్‌కు వెళ్లిన వెంటనే విష్ణు తన కార్లను చోరీ చేశారని ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇంట్లో ఉన్న తన పాత జ్ఞాపకాలను సైతం తొలగించారన్నారు. రౌడీషీటర్ల ఆగడాలపై సీఐకి చెబితే 'అవునా పాపం' కదా అంటున్నారు తప్పా చర్యలు శూన్యమన్నారు. కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్న ఘటనలపై తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పోలీసు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని ఆయన భావోద్వేగానికి గురయ్యారు. కోర్టు ఆదేశాలున్నా ఇంట్లోకి రానివ్వడం లేదన్నారు. బైండోవర్ విషయం తనకు వర్తించినప్పుడు, విష్ణుకు ఎందుకు వర్తించవని ఆయన మీడియా ముఖంగా ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబం కోసం సినిమాలో స్త్రీ వేషధారణలోనూ నటించానని ఆవేదన వ్యక్తం చేశారు. మనోజ్ సంబంధించిన ఎలాంటి విషయాలైనా కావాలంటే.. ఇస్తా బిడ్డ అని నాన్న విష్ణుకు హామీ ఇచ్చారని తెలిపారు. పోలీసులు తన ఫిర్యాదులపై ఎక్కడ కూడా ఛార్జిషీట్‌లో దాఖలు చేయలేదన్నారు. ఇదిలా ఉండగా మోహన్‌బాబు, ఆయన కుమారుడు విష్ణు యూపీలో కన్నప్ప సినిమా ప్రమోషన్‌లో సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను కలిసి సినిమా కథను వివరించారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 13, నల్లవంకాయ18, పొడుగువంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికం 35, పచ్చి కాకరకాయ 35, పందిరిబీర 35, క్యాబేజీ 08, క్యారెట్17, దొండకాయ28, గుండు బీనిస్ 65, గింజచిక్కుడు 55, గోకరకాయ 35, కీర 13, దోసకాయ 18, బీట్‌రూట్ 13, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 24, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 80, క్యాలీఫ్లవర్ 18, సొరకాయ 09, పొట్లకాయ 18, అరిటికాయ 09, మునగకాయ 4, మామిడికాయ 25, ముల్లంగి 4-5, ఉల్లిపొరక 28లుగా ఉన్నాయి. గమనిక: ఈ ధరలు గురువారం ఉదయం 9గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి.

వైభవంగా ధనలక్ష్మి దేవాలయ వార్షికోత్సవం



అమ్మవారి చీరను స్వీకరిస్తున్న కార్పొరేటర్ వనం సంగీత, శ్రీనివాస్‌యాదవ్ దంపతులు

శ్రీనగర్‌కాలనీ: ఎల్లారెడ్డిగూడ అమీర్‌పేట క్రాస్ రోడ్స్‌లోని ధనలక్ష్మి (సోనాబాయి) దేవాలయ వార్షికోత్సవం బుధవారం ఆలయంలో వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే మహాగణపతి పూజ, అష్టాదశ సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకం, శతకలశాభిషేకం , మహాలక్ష్మి హోమాలను పండిత ఆశీర్వచనాలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పట్టుచీరని సోమాజీగూడ కార్పొరేటర్ దంపతులు వనం సంగీత శ్రీనివాసయాదవ్ 55వేలకు దక్కించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకల్లో ఆలయ ఈఓ నరేందర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చక సిబ్బంది, ఉత్సవ కమిటీ ప్రతినిధులు చిన్న ముదిరాజ్, మనోజ్‌యాదవ్, మహేష్ ముదిరాజ్, శరత్‌గౌడ్, నాగరాజు, నరేందర్ యాదవ్, రవి పాల్గొన్నారు.

15న ఆలోచన సాధన సమితి ఆవిర్భావం



మన ఆలోచన సాధన సమితి పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం వాటా సాధించడమే లక్ష్యంగా మన ఆలోచన సాధన సమితి (మాస్) పనిచేస్తుందని సమితి వ్యవస్థాపకులు కటకం నర్సింగ్ రావు పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటలకు మన ఆలోచన సాధన సమితి ఆవిర్భావ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను వివిధ బీసీ కుల సంఘాల నాయకులతో కలిసి బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ బీసీ సంఘాల నాయకులు గడ్డం నర్సింహ గౌడ్, ఆనందం నేత, దేవేందర్, పూస నర్సింహ, గుండ్ల ఆంజనేయులు, శంకర్ ప్రజాపతి, చుక్కల సత్యనారాయణ, మంగిళిపల్లి శంకర్, చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ నెలంతా ఉచితంగా ఆటిజం స్క్రీనింగ్ టెస్టులు



సమావేశంలో మాట్లాడుతున్న మాధవి ఆదిమూలం

పంజగుట్ట: ఆటిజం వ్యాధిపట్ల ప్రతీ ఒక్కరికి అవగాహన ఎంతో అవసరమని అనన్య చైల్డ్ డవలప్‌మెంట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ క్లినిక్ నిర్వాహకురాలు మాధవి ఆదిమూలం తెలిపారు. ఏప్రిల్ ప్రపంచ ఆటిజం అవగాహన నెల అయిన ఏప్రిల్‌లో ఉచిత స్క్రీనింగ్, కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో డాక్టర్ చిన్నపిల్లల సైకియాట్రిక్ వైద్యులు శివ అనూప్ ఎల్లాతో కలిసి మాట్లాడారు. ఈ వ్యాధిని చిన్నారుల్లో రెండేళ్లలోపు గుర్తిస్తే నయం చెయొచ్చని తెలిపారు. ఈనెల మొత్తం తమ క్లినిక్‌లలో రెండేళ్ల లోపు పిల్లలకు ఉచితంగా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ వ్యాధితో బాధపడే పిల్లలను ఎలా గుర్తించాలనే అనే అంశంపై అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ అనిల్‌కుమార్, లక్ష్మీ ప్రసన్న, ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మస్తు..!

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు
- ఈనెల 22 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- రోజూ ఒక థీమ్‌తో పౌష్టికాహారంపై అవగాహన
- ఐసీడీఎస్ ఖైరతాబాద్ ప్రాజెక్టు పరిధిలో విస్తృతంగా ప్రచారం



ఫిలింనగర్‌లోని జ్ఞానీజైల్‌సింగ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషక విలువలు తెలియజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు..

బంజారాహిల్స్: మాతాశిశు సంరక్షణ, ఆరోగ్యవంతమైన సమాజానికి ఈనెల 8 నుంచి పోషణ పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. పోషకాహారం విలువలను తెలియజేసేలా ఈ కార్యక్రమాన్ని ఈ నెల 22వ తేదీ వరకు ఐసీడీఎస్ ఖైరతాబాద్-2 పరిధిలో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పూర్తిస్థాయిలో పోషకాహారం అందేలా చర్యలు తీసుకోనున్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని భద్రతకు పెద్దపీట వేస్తూనే ఇంకోవైపు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఐసీడీఎస్ ఖైరతాబాద్-2 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, బోరబండ, సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లలోని 151 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు కలిసి 20వేల మందికి పైగా ఉన్నారు.

అవగాహన ఇలా..

స్థానిక ఆహార పదార్థాలు, చిరుధాన్యాలను ఉపయోగించి అనుబంధ ఆహార వంటకాల తయారీపై ఈ రెండు వారాలు ప్రదర్శనలు చేపడతారు. తీవ్ర పోషణ లోపం ఉన్న చిన్నారుల గుర్తించి ఎన్ఆర్‌సీకి తరలించే ఏర్పాట్లు చేస్తారు. పండ్లు, కూరగాయలు, వ్యాయామం వల్ల ప్రయోజనాలను ప్రయోగాత్మకంగా తెలియజేస్తారు. సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేపడుతున్నారు. అంగన్‌వాడీ సిబ్బందితో పాటు వైద్య, ఆరోగ్య, శిశు సంక్షేమ శాఖ అధికారులను ఇందులో భాగస్వాములను చేస్తున్నారు.

తక్కువ బరువు, పోషణ లోపంతో ఉన్న చిన్నారుల గుర్తింపు..

ఐసీడీఎస్ ఖైరతాబాద్ ప్రాజెక్ట్ పరిధిలో తక్కువ బరువు, పోషణ లోపంతో ఉన్న చిన్నారులను ఇటీవలనే గుర్తించారు. గర్భిణులు, బాలింతలతో పాటు కేంద్రాలకు వచ్చే పిల్లలకు పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు గుడ్లు, బాలామృతం ఇస్తున్నారు. అయినప్పటికీ కొంతమంది పోషకాహారం లోపంతో బాధపడుతున్న బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ఉంటుండడంతో నివారణ కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం, ఇతర సేవలను పూర్తిగా వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

పక్షం రోజుల కార్యక్రమాలు ఇలా..

శిశువు జన్మించిన మొదటి వెయ్యి రోజులపై ప్రత్యేక దృష్టి అనే థీమ్ ప్రామాణికంగా ఈ కార్యక్రమాలు కొనసాగుతాయి. 15 రోజుల పాటు ఓ కార్యక్రమం చొప్పున పోషకాహార లోపాన్ని నివారించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తారు. గర్భిణుల సంరక్షణపై వారి కుటుంబ సభ్యులకు అవగాహన కలిగిస్తారు. పిల్లల వయస్సుకు తగిన ఎదుగుదల, తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తారు. శిశువులో ఇన్ఫెక్షన్ల నివారణకు, పరిశుభ్రత నిర్వహణపై తల్లిదండ్రులకు అవగాహన కలిగిస్తారు.

ఇదొక మంచి కార్యక్రమం



పోషణ పక్షోత్సవాల్లో భాగంగా పౌష్టికాహారంపై ఇక్కడ అవగాహన కలిగిస్తున్నారు. ఎలాంటి ఆహారం తీసుకుంటే బలంగా ఉండవచ్చో సూచిస్తున్నారు. సరైన పోషణ ద్వారా తల్లీపిల్లలు క్షేమంగా ఉండే విషయాలను ఇందులో తెలియజేస్తున్నారు. ప్రతిరోజూ మేము అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పౌష్టికాహారం ఎందులో లభిస్తుందో తెలుసుకునే అవకాశం లభిస్తోంది.

– హైమావతి

అందరికీ అవగాహన కల్పిస్తున్నాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు పోషణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే అవగాహన కలిగించాం. ప్రతిరోజూ ఒక థీమ్‌తో ముందుకువెళ్తున్నాం. బాలింతలు, గర్భిణులతో పాటు చిన్నారుల తల్లులకు పోషణ పదార్థాలపై అవగాహన పెంచుతున్నాం. బలమైన ఆహారం తీసుకోవడం ద్వారా కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉంటుందనే విషయాన్ని తెలియజేయడం జరుగుతుంది. గృహ సందర్శన కూడా చేస్తాం.

– శివమ్మ

18 నుంచి జ్యువెల్స్ షో

బంజారాహిల్స్: ప్రతిష్టాత్మక హైలైఫ్ ఎగ్జిబిషన్ సంస్థ ఈనెల 18 నుంచి హెచ్ఐసీసీలోని నోవాటెల్‌లో హైలైఫ్ జ్యువెల్స్ పేరుతో ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నం.10లో ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మోడల్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించబోయే భిన్న రకాల జ్యువెలరీని ధరించి ప్రదర్శించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ జ్యువెల్స్ షోలో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా తయారు చేసిన వజ్రాభరణాలను ప్రదర్శిస్తారని నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా మోడల్స్ కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

హయత్ ప్లేస్‌లో డీజే సౌండ్.

ముగ్గురిపై కేసు నమోదు

బంజారాహిల్స్: నిబంధనలు ఉల్లంఘించి అర్ధరాత్రి అధికశబ్దంతో డీజే ప్లే చేస్తున్న హోటల్ నిర్వాహకులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బంజారాహిల్స్ రోడ్డు నం.1లో ఉన్న హయత్ ప్లేస్ హోటల్‌లో రాత్రి 11 గంటల సమయంలో డీజే మ్యూజిక్ రోడ్ల పైకి వినిపిస్తూ స్థానికంగా న్యూసెన్స్ క్రియేట్ అయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు ఈ హోటల్ టెర్రస్‌పై నడుస్తున్న జింగ్ స్కైబార్ అండ్ లాంజ్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో బోగాటి నరేస్‌కుమార్ డీజే ప్లే చేస్తూ పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు బార్ మేనేజర్ రాబిన్ సహాయ్, సెక్యూరిటీ మేనేజర్ బాలినేని రామాంజనేయులు, డీజే ఆపరేటర్ బోగాటీ నరేస్ కుమార్‌లపై కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ కనెక్షన్లతో నీటి సమస్యంటూ ఆందోళన



సీసీ రోడ్డును తవ్వేసి అక్రమంగా నీటి కనెక్షన్లు పొందుతున్న వ్యక్తులు

వెంకటేశ్వరకాలనీ: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్‌నెం. 14 నందినగర్ బస్తీ ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో కొన్ని రోజులుగా సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పాత రోడ్డును తొలగించే క్రమంలో కొంత మంది నల్లా పైపులు తెగిపోయాయి. వాటిని మళ్లీ బిగించుకునే ముసుగులో కొంత మంది అక్రమంగా నల్లా కనెక్షన్లు పొందుతున్నారని దీనిని అరికట్టకపోతే బస్తీలో నీటి సమస్య తలెత్తుతుందని బస్తీవాసులు పేర్కొన్నారు. దీనిపై జలమండలి, విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని తెలిపారు. 10 రోజుల క్రితం విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయగా అక్రమంగా ఏర్పాటు చేసిన నల్లాలను తొలగించి వెళ్లిపోయారు.

- తాజాగా సీసీ రోడ్డు వేసేందుకు ఒక లేయర్ కాంక్రీట్ వేయగా ఆ లేయర్‌ను తవ్వేసి కొంతమంది రాత్రికి రాత్రే నల్లా కనెక్షన్‌లు పొందుతున్నారు. ఈ విషయాన్ని మరోసారి బస్తీవాసులు అధికారులకు దృష్టికి తీసుకెళ్లారు. విజిలెన్స్ అధికారులు రావడం లేదంటూ క్షేత్రస్థాయి సిబ్బంది చెబుతున్నారని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. పూర్తిగా సీసీ రోడ్డు వేసిన తర్వాత వీటిని తొలగించడం కష్టమని ఇప్పుడే వాటిని గుర్తించాలని వారు కోరుతున్నారు. ఈ అక్రమ కనెక్షన్లను అలాగే వదిలేస్తే భవిష్యత్‌లో బస్తీలోని వారందరికీ నీటి సమస్యలు తలెత్తుతాయని లో ప్రెషర్‌తో నీళ్లు వస్తాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాహితానికి పనిచేసే సంస్థలకు అండగా ఉండాలి

లిబర్టీ: సాహిత్య, సంస్కృతిక రంగాల్లో పని చేస్తూ ప్రజాహితమే ధ్యేయంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉండాలని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ కేంద్ర గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డికి విన్నవించారు. కేంద్ర ప్రభుత్వం పేదల కోసం నిరంతరం పని చేస్తున్న సంస్థలకు చేయూతనివ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. నిరంతరం విద్య, వైద్యం సాహిత్యం సాంస్కృతికక రంగాల కార్యక్రమాల నిర్వహించడంతో పాటు పేదరిక నిర్మూళన చేయూతనివ్వడం వంటి అనేక కార్యక్రమాలు తమ సంస్థ చేస్తుందని కేంద్ర మంత్రికి విన్నవించారు. సమాజం కోసం పని చేస్తున్న సంస్థలకు ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పేదరిక నిర్మూళన దేశ రాష్ట్ర అభివృద్ధి సమాజం కోసం పని చేయాలని సూచించారు.

పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలి

లిబర్టీ: పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి పి.వి.రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యవసర ధరలు ఖర్చులు పెరగడంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సిలిండర్ ధర 50 రూపాయలు పెంచిందని వెంటనే ఉపసంహరించుకోవాలని లేనిపోంలో ఇతర రాజకీయ పార్టీలను కలుపుకోని ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రోజు రోజుకు నిత్యవసర వస్తువుల ధరలు పెచ్చు పెరగడంతో పేదలు, సామన్యులు, కార్మికులు, కూలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే మళ్లీ సిలిండర్ ధర పెంచి ప్రభుత్వం భారం మోపిందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు నూనెలు, పప్పులు, దినుసులు, వెల్లుల్లిఅల్లం, ఉల్లిపాయ, కూరగాయల ధరలు ఒకవైపు భగ్గుమంటుంటే మరో పక్క సిలిండర్ ధర పెంచి ప్రజలపై భారం మోపిందని ఆరోపించారు. ఈ సమావేశంలో సౌభాగ్యవతి, పి.వి.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం.12లోని కమాన్‌లో మిథిలానగర్ రోడ్డులో కొలువుదీరిన శ్రీభవానీ శంకర, గణపతి, భక్త ఆంజనేయస్వామి సహిత నవగ్రహ ఆలయంలో శ్రీ భవానీ (పార్వతి) అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఈ వేడుకలు మొదటి రోజున కనులపండువగా జరిగాయి. ఈ నెల 11వ తేదీన ఉదయం 11 గంటలకు శ్రీభవానీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుంది. ఇందులో భాగంగానే మూడు రోజుల పాటు ఈ వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు. మొదటి రోజున భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి పూజాధికాల్లో పాల్గొన్నారు. ఆఖరు రోజున శివపార్వతుల కల్యాణ మహోత్సవం కూడా ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు పి.వేణుగోపాల్‌గౌడ్ వెల్లడించారు. వేడుకల్లో భాగంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఆలయాన్ని ఈ సందర్భంగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రత్యేకంగా విచ్చేసిన అర్చకులు, వేద పండితులు విగ్రహ ప్రతిష్ఠ పూజలను ఘనంగా జరిపారు.



విద్యుత్ సంస్థకు చెందిన నిచ్చెన మాయం

పంజగుట్ట: విద్యుత్ సంస్థకు చెందిన ఖరీదైన నిచ్చెన చోరీ చేసిన ఘటన పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. పంజగుట్ట ప్రతాప్ నగర్‌లో విద్యుత్ అంతరాయం ఉందని సోమవారం రాత్రి ఫిర్యాదు రావడంతో విద్యుత్ సంస్థకు చెందిన జూనియర్ లైన్‌మెన్ ఆకాష్ మరో ఉద్యోగి వచ్చి విద్యుత్ వైర్లను పరిశీలించారు. అక్కడ అంతా సక్రమంగా ఉండటంతో దగ్గర్లోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెక్ చేసేందుకు వెళ్లారు. వచ్చి చూసేసరికి నిచ్చెన కనిపించలేదు. దీంతో అవాక్కయిన విద్యుత్ సంస్థ ఉద్యోగి ఆకాష్ పంజగుట్ట పోలీసులను బుధవారం ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అక్కడి సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు.

న్యూసెన్స్ చేస్తున్న వ్యక్తికి వారం రోజుల జైలు

బంజారాహిల్స్: మద్యం మత్తులో న్యూసెన్స్‌కు పాల్పడుతూ స్థానికంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న యువకుడికి న్యాయస్థానం వారం రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఫిలింనగర్‌కు చెందిన జే సతీష్ (26) కొంతకాలంగా మద్యం మత్తులో స్థానికంగా న్యూసెన్స్ క్రియేట్ చేయడమే కాకుండా స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఫిలింనగర్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి బుధవారం పదో ప్రత్యేక జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. కేసు తీవ్రతను గుర్తించిన న్యాయమూర్తి నిందితుడికి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఫిలింనగర్ పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం దొంగలించి.. తనఖా పెట్టి.!

పంజగుట్ట: చిన్నమ్మ ఇంటికి వచ్చి నమ్మకంగా ఉండి ఐదు తులాల బంగారు ఆభరణాలు దొంగిలించిన నిందితుడితో పాటు బంగారం తనఖా పెట్టుకున్న వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్న సంఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణానగర్‌లో నివాసం ఉండే వెంకటేష్(35) పంజగుట్ట ప్రతాప్ నగర్‌లో నివాసం ఉండే చిన్నమ్మ ఇంటికి వచ్చాడు. చిన్నమ్మ పనికి పోగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో బీరువా తాళాలు తెరిసి అందులోని ఐదు తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసి అక్కడనుండి పరారయ్యాడు. సదరు మహిళ విధులు ముగించుకుని వచ్చి చూడగా ఇంట్లో బీరువా చిందరవందగా ఉండటం, ఇంట్లో వెంకటేష్ కనిపించకపోవడం, బీరువాలోని బంగారు ఆభరణాలు కనిపించకుండా పోవడంతో ఆమె పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు బుధవారం నిందితుడు వెంకటేష్‌తో పాటు వెంకటేష్ చోరీ చేసిన బంగారం కుదవ పెట్టుకున్న కృష్ణానగర్‌కు చెందిన షాపు నిర్వాహకుడు నవీన్‌చంద్రను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

ప్రసాద వితరణ చేయిస్తా

అమీర్‌పేట: అమీర్‌పేట గురుద్వారాలో జరిగే బైసాకి వేడుకల సందర్భంగా హాజరైయ్యే భక్తులకు ప్రసాద వితరణ చేయిస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ నెల 13 నుండి మూడు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గురుద్వారా ప్రబంధ కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానం పలికారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

వెంగళరావునగర్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... వనపర్తి జిల్లాకు చెందిన యువతి స్థానిక యూసుఫ్‌గూడలో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తోంది. వరంగల్ జిల్లా ఆవుల అఖిల్ రహమత్‌నగర్‌లో ఉంటూ అదే సంస్థలో పని చేస్తున్నాడు. గత రెండేళ్ల కిందట అఖిల్ ప్రేమ ప్రపోజల్ చేశాడు. అయితే ఆమె తొలుత నిరాకరించినప్పటికీ అనంతరం పెళ్లి చేసుకుంటానని అతను చెప్పడంతో అంగీకరించింది. దాంతో తరచూ ఆమెను శారీరకంగా కలుస్తూ ఉన్నాడు. ఒకసారి గర్భం రావడంతో టాబ్లెట్స్ ఇచ్చి దానిని పోగొట్టాడు. కాగా అఖిల్ మరో అమ్మాయితో తిరుగుతూ ఉండటంతో మొదట ప్రేమించిన యువతి నిలదీసింది. తొలుత స్నేహితురాలని బుకాయించినప్పటికీ తర్వాత తననే పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. తనను మోసం చేశాడని యువతి అతని తల్లిదండ్రులకు బంధువులకు తెలియజేయగా పెద్దనాన్న అంగీకరించలేదు. అఖిల్ రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుంటానని ఆఫీస్‌కు తీసుకెళ్లాడు. అక్కడ నెలరోజులు గడువు ఇవ్వడంతో ఆమెను హుస్సేన్‌సాగర్‌కు తీసుకెళ్లి ఆమె వద్ద ఉన్న ఫోన్‌ను నీళ్లల్లో వేశాడు. అనంతరం తీవ్రంగా దుర్భాషలాడుతూ ఆమెను వేధిస్తూ వస్తున్నాడు. తనను మోసం చేసిన అఖిల్‌పై చర్యలు తీసుకోవాలని బాధితురాలు బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జాబ్ పేరుతో డబ్బులు వసూలు

నిందితులపై కేసు నమోదు

బంజారాహిల్స్: సాఫ్ట్‌వేర్ జాబ్ గ్యారంటీ పేరుతో డబ్బులు వసూలు చేసి మోసగించిన డైరెక్టర్లపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గుర్రంగూడకు చెందిన ఓ మహిళ తన కూతురు బీటెక్ పూర్తి చేయడంతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జాబ్ కోసం జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-36లోని సాయి గలేరియాలో ఉన్న ట్రైసన్ టెక్ అండ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో డైరెక్టర్‌గా పనిచేస్తున్న తుమ్మా దివ్యవాణిని సంప్రదించింది. ఈ మేరకు రూ.2.50 లక్షలు చెల్లిస్తే శిక్షణ ఇచ్చి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జాబ్ గ్యారంటీగా కల్పిస్తామని నమ్మించాడు. దీంతో బాధితురాలు రూ.2.50 లక్షలు చెల్లించింది. శిక్షణ లేకపోగా జాబ్ కూడా కల్పించలేదు. దీంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని బాధితురాలు పలుమార్లు ఈ కార్యాలయానికి వెళ్లగా అందులో రూ.85 వేలు మాత్రం తిరిగి చెల్లించాడు. మిగతా మొత్తం కావాలని డిమాండ్ చేస్తుండగా సిబ్బందితో అసభ్య పదజాలంతో దూషించడం మొదలుపెట్టారు. తాను మోసపోయానని తెలుసుకున్న బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ట్రైసన్ టక్ అండ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు తమ్మా దివ్యవాణి, మురారి రవికుమార్, బచ్చు వెంకట శివరామ కృష్ణారెడ్డి తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబీకుల చెంతకు బాలుడు



తప్పిపోయిన బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

బంజారాహిల్స్: తప్పిపోయిన బాలుడిని మూడు రోజుల పాటు వెతికి కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బంజారాహిల్స్ రోడ్ నం.11లోని గౌరీశంకర్ కాలనీకి చెందిన అనిల్ (16) అనే బాలుడు ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకపోవడంతో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పెట్రోకార్-2 కానిస్టేబుల్ రాజ్‌కుమార్ ఈ బాలుడిని పట్టుకునే ప్రయత్నంలో సీసీ కెమెరాలతో పాటు అన్ని పోలీస్‌స్టేషన్లకు లుక్ అవుట్ నోటీసులు పంపించారు. ప్రతిరోజూ అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో బాలుడిని గుర్తించే పనిలో భాగంగా సమాచారం తీసుకున్నాడు. ఎట్టకేలకు ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం బాలుడిని గుర్తించిన స్థానికులు అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే లుక్ అవుట్ నోటీసు చూసిన అక్కడి పోలీసులు బాలుడిని అదుపులోకి తీసుకుని బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వెళ్లిన పోలీసులు అనిల్‌ను క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలుడిని వెతికి పట్టుకోవడంలో చిత్తశుద్ధి ప్రదర్శించిన రాజ్‌కుమార్‌ను బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రలు ప్రత్యేకంగా అభినందించారు.

మతిస్థిమితం లేని బాలుడి అప్పగింత

వెంగళరావునగర్: మతిస్థిమితం సరిగా లేని బాలుడిని మధురానగర్ పోలీసులు గుర్తించి అతడి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... మధురానగర్ పీఎస్‌కు చెందిన పోలీసులు మంగళవారం అర్ధరాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా గుర్తుతెలియని బాలుడు లేడీస్ హాస్టల్‌లోకి ప్రవేశించాడని వారికి ఫోన్ వచ్చింది. దాంతో హుటాహుటిన పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం అతడిని పట్టుకుని విచారించారు. అతని మానసిక పరిస్థితి సరిగ్గా లేదని గ్రహించిన పోలీసులు తల్లిదండ్రుల వివరాలు అడగ్గా ఎల్లారెడ్డిగూడకు చెందిన రాజు తన తండ్రి అని చెప్పాడు. దాంతో ఆ బాలుడిని వారి ఇంటికి తీసుకెళ్లి రాజుకు చూపించగా అతడిని తమ కుమారుడని తెలిపారు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లాడని, మతిస్థిమితం సరిగ్గా ఉండదని తండ్రి తెలియజేశారు. దాంతో ఆ బాలుడిని పేరెంట్స్‌కు అప్పగించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్వీట్‌షాపు ఉద్యోగి ఆత్మహత్య

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం.13లోని ఎమరాల్డ్ స్వీట్‌షాపులో పనిచేస్తున్న బిహార్‌కు చెందిన యువకుడు అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్న ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బిహార్‌కు చెందిన సంతోష్‌యాదవ్ (28) కొంతకాలంగా ఎమరాల్డ్ స్వీట్స్‌లో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం విధులు ముగించుకుని స్వీట్ షాపు పైన తనకు కేటాయించిన గదికి వెళ్లిపోయాడు. అదే గదిలో ఉంటున్న రూమ్‌మేట్ అర్ధరాత్రి పని ముగించుకుని వెళ్లి గది తలుపు తట్టగా ఎంతకూ తలుపు తీయలేదు. దీంతో కిటికీలో నుంచి లోపలికి చూడగా సంతోష్‌యాదవ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. ఈ ఘటనపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ఎమ్మెల్సీ కవితను విమర్శిస్తే ఊరుకోం'

పంజగుట్ట: మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కవిత దీక్ష చేస్తే కాంగ్రెస్ నాయకులు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ శివశంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కవిత దీక్ష చేసిన ప్రాంగణాన్ని ఫినాయిల్‌తో శుభ్రం చేస్తామని కొంతమంది కాంగ్రెస్ నాయకులు అంటున్నారు, అదే ఫినాయిల్‌తో ముందు మీ నోర్లు శుభ్రం చేసుకోవాలి'అని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫ్రంట్ ప్రతినిధులు యాదగిరి ముదిరాజ్, శివకుమార్, హరితో కలిసి ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని, కేంద్రంపై నెపం నెట్టేసి చేతులు దులుపుకున్నారని, ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకువెళతానని చెప్పి కేవలం కాంగ్రెస్ నాయకులతో ధర్నా చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. బీసీల కోసం ఉద్యమించే వారిని ఏమైనా అంటే సహించేది లేదని హెచ్చరించారు.

మ్యారేజ్ బ్యూరోస్ జేఏసీ ప్రమాణస్వీకారం



మ్యారేజ్ బ్యూరోస్ జేఏసీ ప్రమాణస్వీకారంలో మాట్లాడుతున్న దైవజ్ఞ శర్మ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ మ్యారేజ్ బ్యూరోస్ అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ(టీఎంబీఏ జేఏసీ) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. జేఏసీ చైర్మన్‌గా డీఎం అర్జున్‌రావ్, వైస్ చైర్మన్‌గా యాదగిరి రెడ్డి, కార్యదర్శిగా శోభారాణి, కార్యవర్గ సభ్యులుగా మహ్మద్ సలీమ్, యోహానా, కందస్వామి దయానంద్, రామచందర్, క్షత్రజ్ఞ, అనిల్ ప్రమాణ స్వీకారం చేశారు. విశిష్ట అతిథి దైవజ్ఞ శర్మ మాట్లాడుతూ పెళ్లిళ్లు కూడా దైవ కార్యంతో సమానమని, అందులో వచ్చిన ఆదాయంలోని కొంతభాగాన్ని దానధర్మాలకు ఉపయోగించాలని సూచించారు. అర్జున్ రావ్ మాట్లాడుతూ పెళ్లి సంబంధాల విషయంలో మధ్యవర్తులను మోసగిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని అన్నారు. మధ్యవర్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ మ్యారేజ్ బ్యూరోల అసోసియేషన్ల అధ్యక్షులు రాఘవేంద్ర, గాయత్రి, రంజితరెడ్డి, భూపాల్ రెడ్డి, రాజునాయుడు, శ్రీ విద్య, దుర్గ సాగర్, కొండస్వామి తదితరులు పాల్గొన్నారు.

'భారత వాహిని' యాప్ ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: భారత వాహిని మొబైల్ యాప్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బుధవారం ఆవిష్కరించారు. యువతీ, యువకులకు సనాతన ధర్మంలోని ఎన్నో సూక్ష్మ విషయాలను వివరణాత్మకంగా ఈ యాప్ వివరిస్తుందన్నారు. 50 మందికిపైగా భారతీయ రుషుల గురించి, భగవద్గీతలోని 18 అధ్యాయాలు, వాల్మీకి రామాయణంలోని ఏడు కాండాలు, మహాభారతంలోని 18 పర్వాలు, అష్టాదశ పురాణాలు, హిందూ దేవీదేవతల స్తోత్రాలతోపాటు 50పైగా యోగాసానాలు, అనేక వ్యాధులు, నివారణోపాయాల గురించిన సమాచారం ఈ యాప్‌లో అందుబాటులో ఉంచినట్లు భారతీ సేవా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ శివ సుబ్రహ్మణ్యం తెలిపారు.

అంగన్‌వాడీల్లో హాజరు శాతం పెరగాలి

- సరిగా పనిచేయని టీచర్ల కు మెమోలు
- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సాక్షి,సిటీబ్యూరో: పోషక విలువలు గల ఆహారాన్ని అందించడంతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలపై నమ్మకం కలిగించి హాజరు శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ పథకాలపై మహిళా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావుతో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సూపర్‌వైజర్ నెలకు 15 సెంటర్లను, సీడీపీఓలు 10 సెంటర్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని అన్నారు. కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం తక్కువగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రతి సెగ్మెంట్ క్రింది నుంచి ఐదవ స్థానంలో ఉన్న అంగన్‌వాడి టీచర్లకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని సీసీఐ, శిశు విహార్, అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలోని 0-5 సంవత్సరాలలోపు పిల్లలకు ఆర్ బీఎస్ కే వైద్యులచే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆరోగ్యరీత్యా వివిధ రకాల టీకాలు అందించాలని, పుట్టుక లోపాలు, ఎదుగుదల లోపాలు, అనుకున్న దాని కంటే ఎక్కువ బరువుతో పాటు వివిధ సమస్యలతో బాధ పడుతున్నవారికి గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అంగన్ వాడీ కేంద్రాల నిర్వహణ, శిశు విహార్, చిల్డ్రన్ హోమ్, రెస్క్యూ హోం, సఖి కేంద్రం నిర్వహణ, పోక్సో చట్టం అమలు, బేటీ బచావో -బేటీ పడావో, హెల్ప్ లైన్ నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా పోషణ పక్షం గోడపత్రికను ఆవిష్కరించి పోషణ పక్షం వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు.

భూములపై కొర్రీ..

సుందరీకరణపై వర్రీ

- బాపూఘాట్ వద్ద రక్షణ శాఖ భూములు ఇవ్వాలని సర్కార్ విజ్ఞప్తి
- శిక్షణ సంస్థ, స్కూల్ భూములు ఇచ్చేందుకు కేంద్రం విముఖత
- ఎలా ముందుకు వెళ్లాలో తెలియక అధికారుల మల్లగుల్లాలు
- 120-150 ఎకరాలకే పరిమితం కానున్న గాంధీ సరోవర్

సాక్షి, సిటీబ్యూరో: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్ మూసీ సుందరీకరణకు బాలారిష్టాలు వచ్చి పడ్డాయి. నగరంలోని లంగర్ హౌస్ ప్రాంతంలో ఉన్న బాపూఘాట్ వద్ద చేపట్టే గాంధీ సరోవర్‌కు అవసరమైన భూముల సమీకరణ సవాల్‌గా మారింది. ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.5 కి.మీ., హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న 8.5 కి.మీ.. మొత్తం 20 కి.మీ. మేర మూసీకి పునరుజ్జీవం కల్పించాలని సీఎం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే బాపూఘాట్ వద్ద కేంద్ర రక్షణ శాఖ పరిధిలో 221 ఎకరాల భూమి ఉంది. ఆయా భూములను మూసీ సుందరీకరణకు బదలాయించాలని కోరుతూ ఇటీవల మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) రక్షణ శాఖను కోరింది. ఆ భూమికి బదులుగా రంగారెడ్డి జిల్లా రావిర్యాల మండలంలోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్సీఐ)కు చెందిన భూములను ఇస్తామని ప్రతిపాదించింది. అయితే సర్కారు ప్రతిపాదనలను రక్షణ శాఖ బుట్టదాఖలు చేసినట్లు తెలిసింది. దీంతో బాపూఘాట్ వద్ద మూసీ పునరుజ్జీవంపై ఎలా ముందుకెళ్లాలనే అంశంపై ఎంఆర్‌డీసీఎల్ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

పునరాలోచనలో అధికారులు..

రక్షణ శాఖ పరిధిలో ఉన్న 221 ఎకరాలు భూముల్లో రంగారెడ్డి జిల్లాలో 171, హైదరాబాద్ జిల్లాలో 50 ఎకరాలు కేంద్రీకృతమై ఉన్నాయి. ఈ ప్రాంతంలో రక్షణ శాఖ పాఠశాల, మైదానం, శిక్షణ సంస్థ



లున్నాయి. అయితే పాఠశాల, శిక్షణ కేంద్రాలను వేరేచోటుకు తరలించేందుకు రక్షణ శాఖ విముఖత వ్యక్తం చేసింది. మైదానం, ఇతర స్థలాల అప్పగింతకు మాత్రం సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. ఇవి కాకుండా బాపూఘాట్ వద్ద రాష్ట్ర ప్రభుత్వానికి 34 ఎకరాలు ఉన్నాయి. ఇందులో 27 ఎకరాలు బాపూఘాట్‌కు చెందినవి కాగా, 7 ఎకరాలు పర్యాటక శాఖకు చెందినవి. ఆయా భూములు రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోనే ఉండటంతో వీటి సమీకరణకు ఇబ్బందులు లేవని ఓ అధికారి తెలిపారు. బాపూఘాట్ వద్ద 200 ఎకరాల్లో బాపూఘాట్‌ను అభివృద్ధి చేద్దామని నిర్ణయించగా, భూమి సరిపడా అందుబాటులో లేకపోవడంతో అధికారులు పునరాలోచనలో పడ్డారు.

గాంధీ సరోవర్..

జంట జలాశయాల సంగమంగా చెప్పుకునే బాపూఘాట్‌ను గాంధీ సరోవర్‌గా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. ఇక్కడ ప్రపంచంలో అత్యంత ఎత్తయిన గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడంతోపాటు ఎడ్యుకేషన్ హబ్, లండన్‌లోని ఐలైక్ ఫెసిలిటీ, ఇతర వినోద కేంద్రాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. సీఎం ఆదేశాల మేరకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అయితే తాజాగా కేంద్రం కొర్రీతో గాంధీ సరోవర్ 120-150 ఎకరాలకే పరిమితమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

ప్రైవేట్ భూముల సమీకరణ సవాలే..

బాపూఘాట్ వద్ద ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భూముల సమీకరణ ప్రభుత్వానికి పెద్ద సవాలే. ఈ ప్రాంతంలో పట్టా భూములు 39 ఎకరాలున్నాయి. వీటిని ప్రభుత్వం సమీకరించాల్సి ఉంది. ఇప్పటికే ఆయా భూముల్లో అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత గృహాలు, వాణిజ్య సముదాయాలున్నాయి. అయితే ఆయా నివాసాలను కూల్చడమా? లేక పరిహారంగా ఆయా బాధితులకు వేరే చోట భూములు ఇవ్వడమా అనే అంశం తేలాల్సి ఉంది.

సివీడ్ ఆధారిత బయోప్లాస్టిక్ అభివృద్ధి

పేటెంట్‌ను దక్కించుకున్న సీబీఐటీ విద్యార్థులు



బయోప్లాస్టిక్ వస్తువులతో అధ్యాపకులు, విద్యార్థులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) బయోటెక్నాలజీ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు కలిసి సివీడ్ ఆధారిత బయోప్లాస్టిక్‌ను అభివృద్ధి చేశారు. దానికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావటంతోపాటు ఇటీవల జరిగిన పోటీలో ఎస్‌బీఐ యూత్ ఐడియాథాన్ టాప్ 100 ఐడియాలలో చోటు దక్కించుకుంది. బయోటెక్నాలజీ అధ్యాపకులు డాక్టర్ వై.రాజశ్రీ, డాక్టర్ కె.ధర్మలింగం బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యానికి దీనితో చెక్ పెట్టవచ్చన్నారు. సంప్రదాయ ప్లాస్టిక్‌కు వస్తువుల రూపంలో బయోప్లాస్టిక్‌తో టీ కప్పులు, ప్లేట్‌లు, బ్యాగులు, బౌల్స్, ప్యాకేజింగ్ మెటీరియల్స్ తయారు చేశామన్నారు. అవి వాడటంతోపాటు పడేసిన తరువాత పర్యావరణానికి, సమాజానికి మేలు చేస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే వాటి పరిశోధనపై పేటెంట్‌ను సాధించామని, రాబోయే రోజుల్లో స్టార్టప్‌గా ఉత్పత్తి చేసి మార్కెట్‌లోకి తేవాలనే ఆలోచనతో ఉన్నామని చెప్పారు. విద్యార్థులు పి.వి. కశ్యప్, ఎస్.శివప్రసాద్, టి.క్రాంతి పరిశోధనలో తమతో కలిసి పనిచేశారన్నారు.

11 నుంచి రైతు మహోత్సవం



సేంద్రియ మేళా 2025 కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎగ్జిబిషన్ ఎకనామిక్ కమిటీ ప్రతినిధులు

అబిడ్స్: అగ్రి హార్టికల్చర్ సొసైటీ, ఎగ్జిబిషన్ సొసైటీ ఎకనామిక్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో రైతు మహోత్సవం సేంద్రీయ మేళా-2025 నిర్వహిస్తున్నట్లు అగ్రి హార్టికల్చర్ సొసైటీ ప్రతినిధులు డాక్టర్ రవీంద్రబాబు, వీరభద్రరావు, రంగారావు, సూర్యకళ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాగులో సాంకేతికత, అధిక దిగుబడి వంగడాలు, సేంద్రియ పంటలు, బిందు సేద్యం వంటి వాటి గురించిన పూర్తి సమాచారాన్ని ఈ మహోత్సవంలో ఏర్పాటు చేసే స్టాళ్ల ద్వారా వివరిస్తామన్నారు. వర్షాలు పడే కన్నా ముందే మంచి విత్తనాలు ఎక్కడ దొరుకుతాయి, ఏఏ విత్తనాలను వినియోగించాలనే అంశాలపై రైతులకు, విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఎకనామిక్ కమిటీ ఉపాధ్యక్షులు ఆదిత్య మార్గం, సెక్రెటరీ జీవీ రంగారెడ్డి, డాక్టర్ సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- ఉస్మానియా యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్స్‌తోపాటు యూజీసీ వ్యవహారాల డీన్ కార్యాలయం ఆధ్వర్యంలో మహనీయుల జయంతి ఉత్సవాలు ఉదయం 11 గంటల నుంచి జరుగుతాయి.
- కొత్తగూడ ఇజ్జత్‌నగర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఉదయం 10 గంటల నుంచి ఫుడ్ ఇండియా ఎక్స్-2025 జరుగుతుంది.
- సోమాజిగూడ రాజ్‌భవన్ రోడ్‌లోని ది పార్క్ హోటల్‌లో సాయంత్రం 6 గంటల నుంచి డీజే నైట్ కార్యక్రమం థండరిన్ థర్స్‌డే పేరిట జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

వక్ఫ్ బిల్లు చరిత్రాత్మకం

-ఎంపీ లక్ష్మణ్

సుల్తాన్‌బజార్: పేద ముస్లింలకు సరైన న్యాయం జరగాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ వక్ఫ్ చట్టానికి సవరణలు చేశారని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. అఖండ భారత్ సంఘర్షణ సమితి, టైగర్ నరేంద్ర సేవాదళ్ ఆధ్వర్యంలో ఆలే నరేంద్ర స్మారకోపన్యాస కార్యక్రమం బుధవారం సాయంత్రం కోఠిలోని వైఎంఐఎస్ ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ కె.లక్ష్మణ్ హాజరై ప్రసంగిస్తూ 2014 తర్వాత నరేంద్ర మోదీ ప్రధానిగా అనేక సంస్కరణలను తీసుకువచ్చి పేదల అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వాలు కాంగ్రెస్, మజ్లిస్ నాయకుల లబ్ధి కోసమే వక్ఫ్‌బోర్డ్‌కు వివిధ అధికారాలు కల్పించాయని ఆరోపించారు. అన్ని ఇస్లామిక్ దేశాల్లో వక్ఫ్‌బోర్డు ప్రభుత్వాల అధీనంలోనే నడుస్తుంటే, భారతదేశంలో మాత్రం స్వయం ప్రాతిపదికంగా నడిచిందన్నారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తిరుపతిని వక్ఫ్‌బోర్డుతో పోలుస్తూ మాట్లాడుతున్నారని, టీటీడీ బోర్డు ఆదాయంలో అన్ని మతస్తులకు విద్య, వైద్యం అందిస్తున్నారని తెలిపారు. వక్ఫ్‌బోర్డు వల్లా లక్షల ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సామాజిక, రాజకీయ విశ్లేషకులు డాక్టర్ పి.భాస్కర యోగి, సాయికృష్ణ, ఆలె భాస్కర్‌తోపాటు నగర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలి



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎ.కోదండ రెడ్డి

వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి

హిమాయత్‌నగర్: విద్యా, వైద్యం కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిన నేపథ్యంలో వ్యవసాయ రంగాన్ని కాపాడాల్సిన బాధ్యత (వ్యవసాయ విస్తరణ అధికారు(ఏఈఓ)లపై ఉందని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎ.కోదండరెడ్డి అన్నారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో వ్యవసాయ విస్తరణ అధికారుల ఐక్య వేదిక అధ్యక్షుడు బదావత్ రాజ్‌కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా కోదండరెడ్డి హాజరై ఐక్యవేదిక ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్, డైరీ-2025ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని గాడిన పెట్టే అపార అనుభవం ఏఈవోలకే ఉందన్నారు. ఎరువుల వాడకంపై రైతులకు ఏఈఓలు అవగాహన కల్పించాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చారని, ఆయనకు వ్యవసాయం మీద మక్కువ ఉందని, సలహాలు సూచనలు ఇస్తే ప్రభుత్వం స్వీకరిస్తుందని అన్నారు. ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేసిందని, దీర్ఘకాలిక రైతు రుణాలను మాఫీ చేసిందని చెప్పారు. గ్రామ పాలనా అధికారులను వ్యవసాయ శాఖకు అనుసంధానం చేయాలని, విస్తరణ అధికారులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి కళ్యాణి, కోశాధికారి పి.ప్రవీణ్, వైస్ ప్రెసిడెంట్ తిరుపతయ్య, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు సునీత, ఆదర్శ రైతు సంఘం అధ్యక్షుడు లింగయ్య, అధికార ప్రతినిధి రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



లంగర్‌హౌస్: మత్తు పదార్థాల నివారణలో యువత ప్రధాన పాత్ర పోషించాలని నార్కోటిక్ విభాగం డైరెక్టర్ సందీప్ శాండిల్య అన్నారు. వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్ర నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మత్తు నివారణకు రాష్ట్రంలోని 30 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 202 మంది విద్యార్థులు పోస్టర్లను పోటీ పడి ప్రదర్శించారు. ఈ సందర్భంగా సందీప్ శాండిల్య మాట్లాడుతూ మత్తు పదార్థాల ఊబిలో చిక్కుకుంటున్న వారిని రక్షించేందుకు సమాజంలో ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని అన్నారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా ఎస్పీలు రూపేష్ చెన్నూరి, పి.సీతారాం, డీఎస్పీ సుబ్బరామిరెడ్డి, నోడల్ అధికారిణి అన్నపూర్ణ, వాసవీ అకాడమి ఆఫ్ ఎడ్యుకేషనల్ అధ్యక్షులు పి.రాంమోహన్ రావు, సీఇఓ బాలాజి తదితరులు పాల్గొన్నారు.

ఆడంబరమెరుగని ఆదర్శ నేత 'చంద్ర'



చందానగర్: భారత కమ్యూనిస్టు పార్టీలోని అత్యున్నత స్థానమైన జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి నిర్వహించినా ఆడంబరమెరుగని ఆదర్శ నేత చంద్ర రాజేశ్వర్‌రావు అని సీపీఐ సీనియర్ నాయకుడు కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో చంద్ర రాజేశ్వర్‌రావు 31వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కార్యదర్శులు చెన్నమనేని వెంకటేశ్వరరావులతో కలిసి ఆయన నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంతోపాటు భారత స్వాతంత్ర్య, సంస్థాన విలీన పోరాటాల్లోనూ ఆయన పాత్ర చాలా కీలకమన్నారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య, లౌకిక వాద రక్షణ, దేశ సమైక్యతకు ఆయన చేసిన కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సంధ్యాకుమారి, కంభంపాటి అంజయ్య, చెన్నకేశవరావు, ఉజ్జిని రత్నాకర్‌రావు, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ రజిని, మహిళా సంక్షేమ కేంద్ర డైరెక్టర్ జోశ్యభట్ల కల్పన, సభ్యులు కనపర్తి జ్యోత్స్న, లలిత, రాష్ట్ర ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌పీఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

హెచ్‌పీఎస్‌లో ఫీజులు తగ్గించాలని ఆందోళన

రామంతాపూర్: రామంతాపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం ఏకపక్షంగా పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'ఫీజులు ఫుల్ బోధనలో నాణ్యత నిల్'అన్నట్లుగా పాఠశాల పరిస్థితి ఉందన్నారు. వెంటనే అనుభవం కలిగిన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు. చాలాకాలంగా కొనసాగుతున్న ప్రిన్సిపాల్‌ను తొలగించాలని, పేరెంట్స్, టీచర్స్ అసోసియేషన్‌ను రద్దు చేసి నూతన కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. సమస్యలపై విద్యాశాఖ కార్యదర్శి, పాఠశాల బోర్డు ఆఫ్ గవర్నర్‌ను త్వరలోనే కలిసి వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలను దశలవారీగా కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.

'బిల్డ్ నౌ'తో సర్వేయర్ల ఉనికి ప్రశ్నార్థకం



గచ్చిబౌలి ఎస్కీలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రైవేట్ సర్వేయర్లు

గచ్చిబౌలి: 'బిల్డ్ నౌ'అప్లికేషన్‌ను తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ట్రయల్ నిర్వహిస్తోందని, భవనాల ప్లాన్ తప్పనిసరి కాకపోవడంతో తాము రోడ్డున పడే పరిస్థితి ఉందని ప్రైవేట్ సర్వేయర్లు ఆందోళన వ్యక్తం చేశారు. భవనాల అనుమతి కోసం గత ప్రభుత్వం తీసుకొచ్చిన టీఎస్ బీపాస్ స్థానంలో తీసుకువచ్చిన బిల్డ్ నౌ అప్లికేషన్‌పై గచ్చిబౌలిలోని ఎస్కీలో లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీ)లకు రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నిరసన తెలిపారు. 600 చదరపు గజాల విస్తీర్ణంలో భవన నిర్మాణానికి ప్లాన్ తప్పనిసరి కాదని బిల్డ్ నౌ అప్లికేషన్‌లో పేర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాన్ ఆప్షన్ లేకపోవడంతో బిల్టప్ ఏరియా, సెట్ బ్యాక్స్, రోడ్ ఎఫెక్ట్ వివరాలు ఉండవన్నారు. నాలా, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ఎంత దూరం ఉండాలనే విషయాల్లోనూ దరఖాస్తుదారులకు అవగాహన ఉండదని పేర్కొన్నారు. ప్లాన్ ఉంటేనే బ్యాంకులు రుణాలు ఇచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం టీఎస్ బీపాస్ మాదిరిగానే ప్లాన్ ఆప్షన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ డీటీసీపీ జాయింట్ డైరెక్టర్ రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి

టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ



సమావేశంలో పాల్గొన్న అల్లం నారాయణ తదితరులు

అబిడ్స్: హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని గగన్ విహార్ టీఎన్జీఓ భవన్‌లో జరిగిన హైదరాబాద్ అడ్‌హక్ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ జర్నలిస్టులకు నివాస స్థలాలు అందించే విషయంలో ప్రభుత్వాలు అలసత్వవైఖరిని అవలంబిస్తున్నాయని అన్నారు. గత కొంతకాలంగా జర్నలిస్టుల హెల్త్ కార్డులు కార్పొరేట్ వైద్య శాలల్లో పనిచేయటం లేదని, ఈహెచ్‌ఎస్‌తోపాటు జేహెచ్‌ఎస్ కూడా అన్ని ఆసుపత్రుల్లో చెల్లుబాటయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రిడిటేషన్ కార్డులను తగ్గిస్తే ఆందోళన బాట తప్పదని హెచ్చరించారు. టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ మాట్లాడుతూ తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఏర్పడి మే 31వ తేదీకి 25 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా రజతోత్సవాలు జరుపుకునే విషయమై అన్ని జిల్లాల బాధ్యులతో చర్చించి నిర్ణయిస్తామని తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో అమలవుతున్న జర్నలిస్టుల పెన్షన్ విధానాన్ని తెలంగాణలో కూడా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి పి.యోగానంద్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి రమణ కుమార్, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు అవ్వారి భాస్కర్, రాష్ట్ర నాయకురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఎన్నిక

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) హైదరాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతిసాగర్ బుధవారం ప్రకటించారు. జిల్లా టీయూడబ్ల్యూజే అధ్యక్షుడుగా సీహెచ్ రాకేష్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం.మల్లేష్, అజయ్, సువర్ణ, ప్రధాన కార్యదర్శి ఎస్.సోమేశ్వర్, సంయుక్త కార్యదర్శులుగా రమేష్, ఆర్.ప్రవీణ్ కుమార్, కార్య నిర్వాహక కార్యదర్శులుగా ఆర్.వెంకట్, ఎస్.వెంకట్, కోశాధికారిగా వి.బాపూరావు, కార్యవర్గ సభ్యులుగా ఎస్.సంతోష్‌లను సభ్యులు ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా యార నవీన్‌కుమార్ ఎన్నికైనట్లు తెలిపారు.

అన్ని ఐశ్వర్యాలకూ మూలం గోమాతే



మాట్లాడుతున్న సాధ్వి నిర్మలానంద యోగ భారతి

పంజగుట్ట: అన్ని ఐశ్వర్యాలకూ మూలం గోమాతే అని సాధ్వీమాతా నిర్మలానంద యోగ భారతి అన్నారు. మే 18న రాష్ట్రంలోని గోశాలల నిర్వాహకుల, గో పోషకుల సదస్సును లక్డీకాపూల్‌లోని వాసవీ సేవా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ నిపుణులు విజయ్ రామ్, గ్రామభారతి నిర్వాహకులు ఆకుతోట రామారావు, మా పల్లె సంస్థ నిర్వాహకులు నర్సింహారెడ్డి, శ్రీ కామధేను గోవర్ధనగిరి గో విజ్ఞాన అనుసంధాన సంస్థ నిర్వాహకులు డాక్టర్ మురళీధర్‌తో కలిసి మాట్లాడారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మాదిరిగా తెలంగాణ ప్రభుత్వం కూడా గోశాలలు, గో పోషకులను ఆదుకోవాలన్నారు. వచ్చే నెల 18వ తేదీన జరిగే సదస్సుకు ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తామని వారు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గోశాలల నిర్వాహకులు, గో పోషకుల సమస్యలకు పరిష్కారాలు చూపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ గోసేవ ట్రస్ట్ నిర్వాహకులు కె.శ్రీధర్, లవ్ ఫర్ కౌ నిర్వాహకులు జస్మత్ పటేల్, గోవత్స్ ఫౌండేషన్ నిర్వాహకులు మురళి పలోడ్, సురభి ఫౌండేషన్ నిర్వాహకులు సాయి బాబు తదితరులు పాల్గొన్నారు.

రూ. 1.75 కోట్లకు టోకరా

చంచల్‌గూడ: నమ్మించి రూ.1.75 కోట్లకు టోకరా వేసి తప్పించుకు తిరుగుతున్న పాత నేరస్తుడిపై బాధితుడు బుధవారం సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కుర్మగూడకు చెందిన డి.యశువర్దన్‌తో గుంటూరుకు చెందిన సురేష్ పంచారియా అనే వ్యక్తి తన మిత్రుల ద్వారా పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో నాచారంలో తనకు ఫ్యాక్టరీ ఉందని యశువర్దన్‌తో నమ్మబలికాడు. వ్యాపార విస్తరణ నిమిత్తం యశువర్దన్‌కు చెందిన జీ+3 అంతస్తుల భవనంపై 2019లో రుణం తీసుకున్నాడు. దాదాపు రూ. 2.5 కోట్లు బ్యాంకు రుణం రాగా, అందులో సురేష్ రూ.1.75 కోట్లు తీసుకున్నాడు. కొన్ని నెలల తర్వాత అతడు బ్యాంకుకు రుణం చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో బ్యాంక్ అధికారులు యశువర్దన్ భవనాన్ని సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. సురేష్ ఇదివరకు నగరంలో ఎంతో మందిని ఈవిధంగానే మోసం చేసినట్లు తాజాగా తెలిసిందని బాధితుడు తెలిపారు.



- ఢిల్లీ, పుణె, బెంగళూరు, ముంబై నుంచి హైదరాబాద్‌కు
- నెదర్లాండ్స్, సెర్బియా, టర్కీ, బెల్‌గ్రేడ్, బ్రెజిల్ తదితర దేశాలకు చెందిన ఆర్టిస్టుల సందడి

సిటీలో ప్రతిష్టాత్మక జాజ్ ఫెస్టివల్..

సాక్షి సిటీ బ్యూరో: ప్రతిష్టాత్మక వరల్డ్ జాజ్ ఫెస్టివల్‌కు నగరం వేదిక కానుంది. వరల్డ్ జాజ్ ఫెస్టివల్ ఆధ్వర్యంలోని 5వ ఎడిషన్ ఢిల్లీతో ప్రారంభమవుతుంది. ఈ ఫెస్టివల్లో భాగంగా ఢిల్లీ అనంతరం పుణె, బెంగళూరు, ముంబైలలో కొనసాగి హైదరాబాద్‌లో ముగింపు పలుకనుంది. నగరంలోని శిల్పకళా వేదికగా ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ ఈ జాజ్ ఫెస్టివల్ జరగనుంది. ఈ ఫెస్టివల్లో నెదర్లాండ్స్, సెర్బియా, టర్కీ, బెల్‌గ్రేడ్, బ్రెజిల్ తదితర దేశాల నుంచి ప్రముఖ సంగీత కళాకారులు పాల్గొంటారు. 2020లో ప్రారంభించిన ఈ ఉత్సవం ప్రపంచం నలుమూలల నుంచి జాజ్ సంగీతానికి విశ్వవ్యాప్త వేదికను ఏర్పాటు చేసింది. దీనికి ముంబై, పుణె, బెంగళూరులో అద్భుత ప్రశంసలు లభించాయి. ఉత్సవానికి వివిధ దేశాలకు చెందిన కాన్సులేట్ అధికారులు, అగ్రశ్రేణి కార్పొరేట్ ప్రముఖులు, ప్రసిద్ధ మీడియా ప్రముఖులు పాల్గోనున్నారు. ఈ ఉత్సవం ప్రపంచంలోని అతిపెద్ద జాజ్ సంగీత ఉత్సవాల్లో ఒకటైన నెదర్లాండ్స్‌కు చెందిన అమెర్స్‌ఫోర్ట్ జాజ్ ఫెస్టివల్‌తో కలిసి నిర్వహిస్తున్నారు. ఈ ఫెస్టివల్లో రౌండ్ మిడ్‌నైట్ ఆర్కెస్ట్రా గ్రాజియెల్లా హన్సెల్ రివెరో, లూకాస్ సాంటానా (బ్రెజిలియన్), దక్షిణాఫ్రికా జాజ్ సంచలనం డారెన్ ఇంగ్లిష్, ఫెమ్కే మూరెన్ గ్రూప్ కరోలినా బ్రస్సే, ఆస్ట్రేలియన్ సాక్స్ మెజీషియన్ ఆడమ్ సిమ్మన్స్, పాంగ్ సాక్స్ ప్యాక్‌గర్ల్ తదితర పాన్ వరల్డ్ ఆర్టిస్టులు జాజ్ మ్యూజిక్‌తో సందడి చేయనున్నారు.





ప్రతి మనిషికీ ప్రాణవాయువు తరువాత అత్యంత ప్రామాణికమైనది నీరు. మనిషి దేహంలో సుమారు 60 నుంచి 70 శాతం నీరు ఉంటుంది. ఆహారం లేకుండా కొన్ని రోజులు బతకగలమేమో కానీ, నీరు అందకుంటే మాత్రం ప్రాణాపాయమే. అయితే ఇంతటి ప్రామాణికమైన నీరు ప్రస్తుతం వ్యాపారంగా మారిన విషయం విదితమే. నీటిని కూడా లీటర్ల చొప్పున అమ్మడం, మనం కొనడం సాధరణమైపోయింది. అయితే ఇటీవల నగరంలో జరిగిన సినిమా వేడుకలో ప్రముఖ టాలీవుడ్ సినీ హీరో ఓ వాటర్ బాటిల్‌తో నీరు తాగడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎందుకంటే సుమారు 330 మిల్లీలీటర్లు ఉండే ఈ వాటర్ బాటిల్ ధర అక్షరాలా 130 నుంచి 160 రూపాయలట. అంటే ఆ బ్రాండ్ ఒక లీటర్ నీరు సుమారు రూ.500. నిజంగా హైదరాబాద్‌లో వందలు, వేలు ఖర్చు చేసి ఒక లీటర్ నీటిని కొంటున్నారా.. అంటే? ఔననే సమాధానం వస్తుంది. వందలు వేలు కాదు.. కొందరు ప్రముఖులు ఏకంగా లక్షల రూపాయలు విలువైన వాటర్ బాటిళ్లు కొని మరీ తాగుతున్నారు. - సాక్షి, సిటీబ్యూరో

లీటర్ నీటికి సుమారు వెయ్యి రూపాయలు వెచ్చిస్తున్న వైనం

సహజసిద్ధంగా సేకరించడం, రసాయనాలు కలపకపోవడం ప్రత్యేకత

ప్రపంచంలో అత్యంత ఖరీదైన నీటి ధర రూ.65 లక్షలు





సహజ లక్షణాలతో..
లగ్జరీ వాటర్..
ఖరీదైన నీటికి కేంద్రంగా మారిన హైదరాబాద్

సాధారణంగా నగరంలో ఒక లీటర్ వాటర్ బాటిల్ ధర రూ.20లు. ఫ్లేవర్డ్ వాటర్ బాటిల్ లేదా స్పార్క్లింగ్ మినరల్ వాటర్ బాటిల్ ధర రూ.30 నుంచి 50 వరకూ ఉంటుంది. ప్రీమియం నేచురల్ మినరల్ వాటర్ బాటిల్ ధర రూ.40 నుంచి 100 వరకూ ఉంటుంది. వాటర్ బాటిళ్ల అమ్మకం ఐఎస్ఐ మార్క్, బ్రాండింగ్, ప్రభుత్వ నిబంధనలు తదితర అంశాల పై ఆధారపడి ఉంటుంది. వాస్తవానికి సహజ వనరైన నీటిని ఇంత ధరల్లో అమ్మడం కూడా అనైతికమని పలు సంస్థలు, సామాజిక వేత్తలు నినదిస్తున్నారు. కానీ హైదరాబాద్ వంటి మహానగరంలో నీటిని వేలకు వేలు పెట్టి మరీ తాగున్నారనే విషయం ఇటీవల కాలంలో ప్రాచుర్యంలోకి వస్తోంది. సాధారణంగా కొన్ని రెస్టారెంట్లకు వెళితే బయట 20 రూపాయలకు లభించే లీటర్ వాటర్‌బాటిల్ ధర 40 నుంచి 80 ఉంటుంది. దీనికి సొంత బ్రాండింగ్, నీటి స్వచ్ఛత, మినరల్స్ మిక్సింగ్ వంటి అంశాలను వెల్లడిస్తారు. దీనికి మించి నగరంలోని కొన్ని స్టార్ హోటళ్లలో 250 నుంచి 300 మి.లీ వాటర్‌బాటిల్ ధర సుమారు 200 రూపాయల నుంచి ప్రారంభమవుతుంది. నేచురల్ మినరల్ వాటర్ అని, నేచురల్లీ ఆల్కలైన్ వాటర్ అనీ విభిన్న పద్ధతుల్లో ఈ నీటిని అందిస్తున్నారు.





స్టార్ హోటళ్లలో అమ్మకాలు..

ఎన్విరాన్‌మెంటల్లీ సర్టిఫైడ్ బ్రాండ్స్ అంటూ లీటర్‌కు సుమారు వెయ్యిరూపాయల వరకూ ధర నిర్ణయిస్తున్నారు. నగరంలోని 3 స్టార్, 5 స్టార్ హోటళ్లలో జరిగే బిజినెస్ మీటింగ్స్, ఫంక్షన్స్‌లో ఈ తరహా వాటర్ బాటిళ్ల దర్శనమిస్తున్నాయి. అంతే కాదు.. సాధారణంగా లంచ్ లేదా డిన్నర్ కోసం వెళ్లిన నగరవాసులు సైతం ఈ నీటిని సేవిస్తుండటం విశేషం. నార్వేలోని భూగర్భ జలాల నుండి సేకరించిన వోస్ ఆర్టేసియన్ వాటర్ (12 బాటిళ్ల ప్యాక్ సుమారుగా 6,600), ఆరావల్లి పర్వత శ్రేణి నుంచి సేకరించిన ఆవా సహజ అల్కలైన్ వాటర్, క్రికెటర్ కోహ్లీ తాగే ఎవియన్ వంటి ఖరీదైన బ్రాండ్స్ నగరంలో లభిస్తుండటం విశేషం.



వంద శాతం సహజమట..!

వందలు వేలు కాదు.. ప్రపంచవ్యాప్తంగా తాగే నీటిని లక్షల విలువ చేసే బాటిళ్లలో అమ్మడం కూడా మొదలైంది. ఇంతటి ఖరీదైన వాటర్ బాటిళ్ల మన దేశంలో కూడా కొని తాగుతున్నారు కొందరు ధనవంతులు, సెలబ్రిటీలు. ప్రముఖ భారత క్రికెటర్ విరాట్ కోహ్లీ ఫ్రాన్స్ నుంచి దిగుమతి చేసుకునే ఏవియన్ నేచురల్ స్ప్రింగ్ వాటర్ మాత్రమే తాగుతాడు. ఈ నీరు వంద శాతం సహజ నీరు, ఫ్రాన్స్‌లోని ఏవియన్–లెస్–బెయిన్స్ సమీపంలోని సహజ వనరుల నుంచి సేకరించినవి. ఈ స్వచ్ఛమైన నీటిలో సహజ ఖనిజాలంటాయని, అంతేకాకుండా ఎలాంటి రసాయనాలతో కలుషితం కాదని నిర్ధారించినవి. విరాట్ కోహ్లీ ప్రతి యేటా సుమారు రూ.4.3 లక్షల వరకూ ఈ నీటి కోసం వెచ్చిస్తాడని సమాచారం.

వజ్రాల బాటిల్స్‌లో తాగే నీరు..



ప్రపంచంలో అత్యంత ఖరీదైన నీరుగా బెవర్లీ హిల్స్ 90 ఏ20 డైమండ్ ఎడిషన్ గుర్తింపు పొందింది. ఈ బ్రాండ్ లగ్జరీ కలెక్షన్ డైమండ్ ఎడిషన్ బాటిల్ ధర రూ.65 లక్షల వరకూ ఉంది. ఈ బాటిల్‌లో 600 జీ/వీఎస్ తెల్ల వజ్రాలు, 250కు పైగా నల్ల వజ్రాలతో అలంకరించిన బంగారు టోపీ సెట్ ఉంటుంది. ఆక్వా డీ క్రిస్టల్లో ట్రిబ్యూటో మోడిగ్లియాని అనే బ్రాండ్ వాటర్ బాటిల్ ధర రూ.44 లక్షలకు పైమాటే. ఈ బాటిల్ 2010లో అత్యంత ఖరీదైన వాటర్ బాటిల్‌గా గిన్నిస్ వరల్డ్ రికార్డును దక్కించుకుంది. ఫిజియన్, ఫ్రెంచ్ స్ప్రింగ్స్–ఐస్లాండ్ హిమ నదీ నుంచి సేకరించిన ఈ నీటిని 750 మి.లీ పరిమాణంలో 24–క్యారెట్ల బంగారు బాటిల్‌లో అందిస్తారు. దక్షిణ కాలిఫోర్నియాలోని పలోమర్ పర్వతం నుంచి సేకరించే బ్లింగ్ హెచ్20 ధర 2 లక్షల వరకూ ఉంది. నెవాస్ గ్లో–ఇన్–ది–డార్క్ బాటిల్ వాటర్ మాగ్నమ్ ధర దాదాపు రూ.1.32 లక్షలు.

సాలార్‌జంగ్ మ్యూజియంలో ఫొటో ఎగ్జిబిషన్

డబీర్‌పురా : సాలార్‌జంగ్ మ్యూజియంలోని సెంట్రల్ బ్యాంక్ సాలార్‌జంగ్ మ్యూజియం ఆధ్వర్యంలో భగవాన్ మహావీర్‌పై ఏర్పాటు చేసిన 62వ స్పెషల్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్‌ను సాలార్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ ఆశీష్ గోయల్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సాలార్‌జంగ్ మ్యూజియం క్యూరేటర్లు ఘన్‌శ్యామ్ కుసుం, ఆర్‌బి.నాయక్, అసిస్టెంట్ కమాండెంట్ మురళీధరణ్, సిబ్బంది పాల్గొన్నారు.



18న నగరంలో
వైట్‌థాన్–2025
కంటి క్యాన్సర్‌పై అవగాహన, నిధుల సేకరణే ఉద్దేశం

బంజారాహిల్స్: కంటి క్యాన్సర్‌పై అవగాహన, నిధుల సేకరణ నిమిత్తం ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో మే 18న యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో 'వైట్‌థాన్–2025' జరుగానుంది. ఇందులో భాగంగా బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, ఐ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ హెడ్ డాక్టర్ స్వాతి కలికి మాట్లాడుతూ కంటి క్యాన్సర్‌పై అవగాహన, నిధుల సేకరణే ఈ రన్ ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రాథమిక దశలోనే దీనిని గుర్తించవచ్చన్నారు. కంటి క్యాన్సర్‌తో పోరాడుతున్న పేద పిల్లలకు ఉచితంగా చికిత్స అందించనున్నామని తెలిపారు. ఈ ఏడాది అధికారిక మస్కట్ 'పియర్లీ' అన్నారు. ఇది కంటిలో 'వైట్ రిఫ్లెక్స్' (లూయకోకోరియా)ను ప్రదర్శిస్తుందన్నారు. ఇది రెటినోబ్లాస్టోమా క్యాన్సర్ లక్షణాల్లో ఒకటన్నారు. తల్లిదండ్రులు, సంరక్షకులు వైద్య సహాయం పొందాలన్న సందేశాన్ని ప్రచారం చేయడంలో సహాయపడుతుందన్నారు. 21 కేఎం, 10 కేఎం, 5కేఎం, 3కేఎం రన్స్ ఉన్నాయన్నారు. ఈ ఏడాది కొత్తగా పరిచయం చేసిన 21 కేఎం హాఫ్ మారథాన్ ఉందన్నారు. గత కొన్నేళ్లుగా ఈ రన్ ద్వారా సమీకరించిన నిధులతో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఉచితంగా మూడు వేలకు పైగా చికిత్సలు చేసిందన్నారు. ఇలాంటి కేసుల్లో 90 శాతం పిల్లల ప్రాణాలు కాపాడగలిగామన్నారు. అయితే చికిత్సకు ఆలస్యంగా రావడం వల్ల కేవలం 45 శాతం కేసుల్లో మాత్రమే చూపు తేగలిగామన్నారు. ప్రాథమిక దశలో రెటినోబ్లాస్టోమాను గుర్తించగలిగితే సులభంగా చికిత్స చేయవచ్చని తెలిపారు. వైట్‌థాన్ కోసం మే 18 లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 99591 54371, 99639 80259 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.





పతకాల రుచితెలిసి..

వంటల్లో సత్తా చాటుతున్న మేడ్చల్ మహిళ

- ప్రముఖ చెఫ్ ప్రేరణతో ఈ రంగంలోకి
- 32 గోల్డ్, 21 సిల్వర్, 41 బ్రాంజ్ మెడల్స్
- అంతర్జాతీయ స్థాయిలో బేకరీ విభాగంలో రాణిస్తున్న చెఫ్ దివ్యసారిక

పాఠశాలలో విద్యాభ్యాసం పొందుతున్న సమయంలో ఓ చెఫ్ వీడియోకు, అతని డ్రెస్ కోడ్‌కు ఆకర్షితురాలైన ఆ విద్యార్థిని చెఫ్‌గా మారాలని సంకల్పించుకుంది. అంతటితో ఆగకుండా ఆ దిశగా అడుగులు వేస్తూ మాస్టర్ చెఫ్‌గా పలువురి మన్ననలు పొందుతోంది. అనేక వంటల పోటీల్లో పతకాలను సొంతం చేసుకుంటూ తనదైన ముద్ర వేసుకుని బేకరీ విభాగంలో రాణిస్తోంది. ఆమే మేడ్చల్‌కు చెందిన మహిళా చెఫ్ దివ్యసారిక. తాను చెఫ్‌గా మారి స్థిరపడడం సరికాదని భావించి పాకశాస్త్ర ప్రావీణ్యంతో అధ్యాపకురాలిగా తనలాంటి ఎంతో మందిని చెఫ్స్‌గా మలుస్తోంది. - మేడ్చల్‌రూరల్

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం కొత్త మల్లయ్యపాలేనికి చెందిన దివ్యసారిక ఇంటర్ వరకూ అక్కడే చదువుకుంది. గుంటూరులోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న రోజుల్లో ఓ కార్యక్రమంలో భాగంగా పాఠశాల యాజమాన్యం పలు రంగాల్లో ప్రావీణ్యం పొందిన వారి వీడియోలను ప్రదర్శించింది. అందులో భాగంగా ఆస్ట్రేలియాకు చెందిన ఫేమస్ చెఫ్ థామస్ వీడియో, అతని యూనీఫాంకు ఆకర్షితురాలైంది దివ్యసారిక. అప్పుడే చెఫ్‌గా మారాలని నిర్ణయించుకుంది. మొదట ఇంట్లో వంటలు చేయడం ప్రారంభించింది. ఇంటర్ తర్వాత హోటల్ మేనేజ్‌మెంట్ చేయాలనే ఆలోచనను తండ్రి శివారెడ్డి, కుటుంబ సభ్యులు వ్యతిరేకించారు. తనకు ఇష్టమైన రంగంలో వెళ్తానంటూ పట్టుబట్టి హైదరాబాద్‌లో హాస్టల్‌లో ఉంటూ మూడేళ్ల పాటు బ్యాచిలర్ ఆఫ్ కలినరీ ఆర్ట్స్ కోర్సు పూర్తిచేసింది. చివరి సంవత్సరంలో హోటల్ హెచ్ఐసీసీలో అప్రెంటీస్‌లో చేరి అనంతరం అక్కడే చెఫ్‌గా చేరింది. తదనంతరం నోవోటెల్‌లో రెండున్నరేళ్ల పాటు చెఫ్‌గా చేసింది.



72 పోటీల్లో.. 94 పతకాలు..

బేకరీ విభాగంలో చెఫ్‌గా రాణిస్తున్న దివ్యసారిక ఇప్పటి వరకూ అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో 72 పోటీల్లో పాల్గొంది. మొదట విద్యార్థి దశలో 2013లో ఆంధ్రా కలినరీ చెఫ్ పోటీల్లో పాల్గొనేందుకు రూ.42 వేలు ఖర్చు చేసి పోటీలో పాల్గొంది. నిర్భయ గర్ల్‌చైల్డ్, మదర్ థీమ్‌తో చెఫ్‌గా తనదైన ముద్రతో మొదటి గోల్డ్‌మెడల్ సాధించింది. దీంతో పతకం రుచి చూసిన చెఫ్ దివ్య అంతర్జాతీయ స్థాయిలో మలేషియా, మారీషియస్, మాల్దీవులు వంటి దేశాలతో పాటు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. ఇటీవల ఢిల్లీలో జరిగిన పోటీల్లో పాల్గొని 4 గోల్డ్ మెడల్స్, 2 బ్రాంజ్ మెడల్స్ సాధించింది. 32 గోల్డ్ మెడల్స్, 21 సిల్వర్, 41 బ్రాంజ్ మెడల్స్‌తో పాటు నగదు పురస్కారాలు, అవార్డులు, ప్రశంసా పత్రాలు సొంతం చేసుకున్నట్లు దివ్యసారిక తెలిపింది.

లక్షల జీతం వదిలి..

మహిళా చెఫ్‌గా రాణిస్తున్న దివ్య ప్రముఖ హోటళ్లలో, విదేశాల్లో చెఫ్‌గా విధులు నిర్వహిస్తే రూ.లక్షల్లో వేతనం పొందే అవకాశం ఉన్నా.. తాను నేర్చుకున్నది నలుగురికీ బోధించాలనే ఉద్దేశంతో హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తుంది. గతంలో తెలంగాణ టూరిజంలో ఉద్యోగం వచ్చినా వెళ్లలేదు. ఇప్పటి వరకూ 300 మంది విద్యార్థులను చెఫ్‌లుగా తీర్చిదిద్దానని, వారిలో కొందరు విదేశాల్లో చెఫ్స్‌గా స్థిరపడ్డారని తెలిపారు.

రుచికరమైన ఆహారం అందించేందుకు..

చెఫ్స్‌గా మహిళలు రాణించాలనేదే నా కోరిక.. నా ప్రేరణతో మరికొందరు ఈ రంగంలో స్థిరపడాలి. ప్రజలకు నాణ్యమైన రుచికరమైన ఆహారం అందించేందుకు నా వంతు కృషి చేస్తున్నాను. నా ద్వారా ఈ రంగంలో స్థిరపడిన వారు చిరకాలం నన్ను గుర్తుంచుకుంటారు.. అదే నాకు ఆనందాన్నిస్తుంది.



క్లుప్తంగా...

ఆయుష్మాన్, విశ్వకర్మ అమలు చేయాలి

మాజీ ఎంపీ నర్సయ్య గౌడ్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, విశ్వకర్మ యోజన పథకాలను తెలంగాణలో అమలు చేయాలని బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశ్వకర్మ యోజనతో దేశవ్యాప్తంగా 18 సంప్రదాయ వృత్తుల వారిని ప్రోత్సహిస్తుండగా, తెలంగాణలో 4 లక్షల మంది దరఖాస్తుదారుల్లో 40 వేల మందికి శిక్షణ, టూల్ కిట్, రుణ రాయితీ లభించాయన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. రెండున్నర లక్షల దరఖాస్తుల పరిశీలన పూర్తికానివ్వకుండా, పథకం అమలును అడ్డుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం సైంధవ పాత్ర పోషిస్తోందని మండిపడ్డారు. వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లిం సామాజిక వర్గాల్లో కేంద్రం విశ్వాసాన్ని పెంచిందన్నారు. దేశంలో 9.4 లక్షల ఎకరాల వక్ఫ్ భూముల్లో 75 శాతం కబ్జా అయ్యాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ప్రైవేట్ ఆస్పత్రులు, ఫంక్షన్ హాళ్లు, వైద్య కళాశాలలు.. వక్ఫ్ బోర్డు యాజమాన్యాలు, సభ్యులు, ముతావల్లీలు, బడా నేతల చేతుల్లో ఉన్నాయని వివరించారు. ఆస్తులను కబ్జా చేసిన వారిపై కేంద్రం చట్టపరంగా చర్యలు తీసుకుంటుందని నర్సయ్య గౌడ్ చెప్పారు.

గాంధీభవన్‌లో ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలు

సాక్షి, హైదరాబాద్: ఎన్ఎస్‌యూఐ 55వ ఆవిర్భావ వేడుకలను బుధవారం గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కమిటీ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా, ఈ శిబిరంలో ఎన్ఎస్‌యూఐ నేషనల్ లీగల్ కమిటీ సభ్యుడు అక్బర్, ఇతర రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో నేషనల్ కోఆర్డినేటర్ ఫిరోజ్ ఖాన్, జాతీయ లీగల్ సెల్ సభ్యుడు అక్బర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రితేశ్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రచనారెడ్డి పాల్గొన్నారు.

మందుపాతర పేలి జవాన్‌కు తీవ్ర గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్‌బాంబు పేలగా ఒక జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బీజాపూర్ జిల్లా చిన్నకేడేపాల్‌లో ఉన్న సీఆర్పీఎఫ్ 196 బెటాలియన్ జవాన్లు బుధవారం కేడేపాల్ వాగు ప్రాంతానికి వెళ్తున్నారు. ఈక్రమంలో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్‌బాంబు పేలడంతో ఒక జవాన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ను సహచరులు బీజాపూర్ జిల్లా కేంద్రానికి తరలించారు.

పేదల కోసం ఎర్రజెండా పట్టిన యోధుడు చంద్ర రాజేశ్వర్‌రావు

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: భూస్వామ్య కుటుంబంలో జన్మించినా, పేద ప్రజల కోసం కమ్యూనిస్టు పార్టీలో చేరి ఎర్రజెండా పట్టిన మహనీయుడు చంద్ర రాజేశ్వర్‌రావు అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి కొనియాడారు. సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి సందర్భంగా బుధవారం మఖ్దూం భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ బనారస్ విశ్వవిద్యాలయంలో చదువుకుంటూ మార్క్స్, లెనిన్ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై రాజేశ్వర్‌రావు ఏఐఎస్ఎఫ్‌లో చేరారన్నారు. జాతీయస్థాయిలో, ఆంధ్ర, తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో రాజేశ్వర్‌రావు పాత్ర గణనీయమైనదని, 25 ఏళ్ల పాటు భారత కమ్యూనిస్టు పార్టీకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా సేవలందించి నాయకత్వ ప్రతిభను చాటారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, శంకర్ నాయక్, చందు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఎంబీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ కమిషన్ సిఫారసు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపికలో అత్యంత వెనుకబడిన కులాల (ఎంబీసీ)కు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ బీసీ కమిషన్ రాష్ట్రప్రభుత్వానికి సిఫారసు చేసింది. బుధవారం కమిషన్ కార్యాలయంలో చైర్మన్ జి.నిరంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈమేరకు తీర్మానించింది. గతనెలలో కమిషన్ పర్యటించిన వేములవాడ, జగిత్యాల, సిరిసిల్ల, ఆమనగల్, అచ్చంపేట ప్రాంతాల్లో సంచార జాతులవారి పరిస్థితి హృదయ విదారకంగా ఉందని నిరంజన్ తెలిపారు.

అవయవ దానంలో 'కార్పొరేట్' కుట్రలకు చెక్?

సాక్షి, హైదరాబాద్: అవయవ మార్పిడి పేరుతో జరుగుతున్న కార్పొరేట్ దందాకు చెక్ పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మానవ అవయవాల మార్పిడి చట్టం (టీహెచ్ఓఏ)- 1994లో ఉన్న కొన్ని లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకొని కార్పొరేట్ ఆసుపత్రులు సాగిస్తున్న అవయవ మార్పిడి వ్యాపారాన్ని అడ్డుకొనేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే 2014లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన టీహెచ్ఓటీఏ- తోటా (ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ యాక్ట్)ను అడాప్ట్ చేసుకొన్న రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టంలో రాష్ట్రాలకు ఇచ్చిన హక్కులను సద్వినియోగం చేసుకొంటూ, కొన్ని నిబంధనలను మార్చేందుకు నిపుణుల కమిటీని నియమించింది. ఈ కమిటీ సూచనల మేరకు సీఎం రేవంత్ రెడ్డి ఆమోదంతో త్వరలో కొత్త మార్గదర్శకాలను విడుదల చేయాలని ఆరోగ్యశాఖ నిర్ణయించింది.

ఒక్కో కేసు నుంచి 9 ఆర్గాన్స్ విక్రయం

జిల్లాల్లో గానీ, హైదరాబాద్‌లోని సాధారణ ప్రైవేటు ఆసుపత్రుల్లో గానీ బ్రెయిన్ డెడ్ అయిన కేసులు వెలుగు చూస్తే, కుటుంబసభ్యుల అనుమతితో ఆ విషయాన్ని ప్రభుత్వ 'జీవన్‌దాన్' నోడల్ ఆఫీస్‌కు తెలియజేయాల్సి ఉంటుంది. ఆ వ్యక్తి అవయవాలను సేకరించి 'జనరల్ పూల్' కింద అవయవ మార్పిడి కోసం వేచి ఉన్న వారికి అమరుస్తారు. ఇక్కడే కార్పొరేట్ దందా మొదలవుతోంది. జిల్లా కేంద్రాల్లో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులతో ఒప్పందాలు కుదుర్చుకొనే కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులు బ్రెయిన్ డెడ్ వ్యక్తిని హైదరాబాద్ ఆసుపత్రిలో చేర్పించి రికార్డులు మార్చి, బ్రెయిన్ డెడ్ డిక్లరేషన్ చేసి, అవయవాల మార్పిడిని వ్యాపారంగా మార్చుకుంటున్నారు. కార్పొరేట్ ఆసుపత్రికి వచ్చిన రోగిని కేవలం 24 గంటల్లోపు బ్రెయిన్ డెడ్‌గా డిక్లేర్ చేయడం ద్వారా ఒక అవయవం (సాధారణంగా కిడ్నీ) మాత్రమే జనరల్ పూల్‌కు పంపే అవకాశం ఉంటుంది. మిగిలిన గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, పాంక్రియాస్, చర్మం, పేగులు, శుక్లాలు వంటి 9 అవయవాలను కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులు విక్రయించుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

- చట్టంలోని లొసుగులతో దందా చేస్తున్న కొన్ని ఆస్పత్రులు
- ప్రస్తుత చట్టంలో కార్పొరేట్ ఆసుపత్రుల్లో బ్రెయిన్ డెడ్ అయితే కిడ్నీ మాత్రమే జనరల్ పూల్‌కు..
- ఇలాంటి నిబంధనలను మార్చేలా సూచనలు చేసిన రాష్ట్ర కమిటీ
- బ్రెయిన్ డెడ్ వ్యక్తి నుంచి 10 ఆర్గాన్స్‌లో 50% జనరల్ పూల్‌కు ఇచ్చేలా సిఫార్సు
- సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదంతో త్వరలో కొత్త మార్గదర్శకాలు



జనరల్ పూల్‌కు వాటా పెంచే సూచన

కార్పొరేట్ ఆసుపత్రుల్లో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి ఎక్కువ సంఖ్యలో జనరల్ పూల్‌కు ఆర్గాన్స్‌ను తీసుకునేలా నిపుణుల కమిటీ సూచనలు చేసినట్లు తెలిసింది. కార్పొరేట్ ఆసుపత్రిలో అవయవ మార్పిడికి సిద్ధంగా ఉన్న వ్యక్తికి అవసరమైన అవయవాన్ని అమర్చి, మిగతా అవయవాలను జనరల్ పూల్‌కు ఇవ్వడం, వాటిలో 'జీవన్‌దాన్'లో నమోదై ఉన్న వారికి కనీసం 50 శాతం ఆర్గాన్స్‌ను అందించాలని చెప్పింది. దీనివల్ల కార్పొరేట్ దందాకు చెక్ పెట్టాలని భావిస్తోంది.

డిక్లరేషన్ సమయాన్ని మార్చాలి

ప్రస్తుత చట్టంలో ఆస్పత్రికి వచ్చిన రోగికి చికిత్స చేస్తూ, మెదడు స్పందించడం మానేస్తే... 24 గంటల్లోపు బ్రెయిన్ డెడ్ డిక్లరేషన్ చేయాల్సి ఉంటుంది. దీన్ని ఆసరాగా తీసుకొన్న కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులు జిల్లాల నుంచి వచ్చిన రోగులను ఆసుపత్రిలో చేర్చుకొని రికార్డులు మార్చి కొన్ని గంటల ముందు బ్రెయిన్ డెడ్ డిక్లరేషన్ చేసి అవయవాలను సేకరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బ్రెయిన్ డెడ్ డిక్లరేషన్ టైమ్‌ను 48 గంటలు, లేదా 74 గంటలకు పెంచితే జిల్లాలు, దూరప్రాంతాల నుంచి వచ్చే రోగుల కుటుంబాలు, ఆర్ఎంపీలు, ఇతర డాక్టర్లతో బేరసారాలాడి ఆర్గాన్స్‌ను సేకరించే అవకాశం కోల్పోతారని కమిటీ భావిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వానికి కీలక మార్పులు సూచించినట్లు తెలిసింది.

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే అవయవదానాలపై..

రాష్ట్రంలో వేలాది ఆసుపత్రులు ఉన్నప్పటికీ అవయవ మార్పిడి చేసే అనుమతి హైదరాబాద్‌లోని 41 ఆసుపత్రులకు మాత్రమే ఉంది. అందులో ప్రభుత్వ పరిధిలోని నిమ్స్, గాంధీ, ఉస్మానియా, ఈఎస్ఐసీ ఆసుపత్రులు.. కాగా, మిగతా 37 ఆసుపత్రులు కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులే. ఇవి కాకుండా కరీంనగర్‌లోని అపోలో రీచ్, హైదరాబాద్‌లోని మరో ఏడు ఆసుపత్రులకు అవయవాలను సేకరించి భద్రపరిచేందుకు మాత్రమే అనుమతి ఉంది. నాలుగు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చిన అవయవాలను జనరల్ పూల్‌లోనే వరుస సంఖ్య ఆధారంగా కేటాయిస్తారు.

ప్రస్తుతం జీవన్‌దాన్ వద్ద ఆర్గాన్స్ కోసం వేచి చూస్తున్న వారు: **4,000**

హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ తప్పనిసరి

2019 ఏప్రిల్ ఒకటికి ముందు తయారైన అన్ని వాహనాలకు వర్తింపు

ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు గడువు.. ఆదేశాలు జారీ చేసిన రవాణా శాఖ

సాక్షి, హైదరాబాద్: ఇప్పటివరకు వాహనాలకు హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్ఎస్ఆర్‌పీ) లేకున్నా చూసీచూడనట్టు వెళ్లిన యంత్రాంగం ఇకపై కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధమవుతోంది. 2019 ఏప్రిల్ ఒకటో తేదీ తర్వాత తయారైన వాహనాలకు మాత్రమే ఈ హెచ్ఎస్ఆర్‌పీ ఏర్పాటు నిబంధన అమలులో ఉండగా, ఇక నుంచి 2019 ఏప్రిల్ ఒకటికి ముందు తయారైన వాహనాలకు కూడా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశిస్తూ రవాణాశాఖ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అంటే, అన్ని వాహనాలకు ఇకపై కచ్చితంగా హెచ్ఎస్ఆర్‌పీ ఉండాల్సిందేనన్నమాట. హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ల ఏర్పాటు ప్రక్రియ సుప్రీంకోర్టు ఆదేశాలతోనే అప్పట్లో అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. కానీ, దాని అమలులో యంత్రాంగం ఉదాసీనంగా ఉండటం, పాత వాహనాలకు ఆ నంబర్ ప్లేట్లు లేకపోవటాన్ని తీవ్రంగా పరిగణించిన సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల కీలక సూచనలు చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు రాష్ట్ర రవాణాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 2019 ఏప్రిల్ ఒకటికి ముందు తయారైన అన్ని వాహనాలకు హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు అమర్చుకోవాల్సిందేనని అందులో స్పష్టం చేసింది. ఇందుకు ఈ ఏడాది సెప్టెంబరు 30 వరకు గడువు ఇచ్చింది. ఆలోపు హెచ్ఎస్ఆర్‌పీలను ఏర్పాటు చేసుకోవాలని, వాటిని ఏర్పాటు చేసుకోని వాహనాలు గడువు తర్వాత రోడ్డెక్కితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని అందులో హెచ్చరించింది. ఫిట్‌నెస్ టెస్ట్ సహా వాహనాలకు సంబంధించి రవాణాశాఖ ద్వారా ఏ సేవ పొందాలన్నా ఈ నంబర్ ప్లేట్ ఉంటేనే సాధ్యమని, ఆ నంబర్ ప్లేటు లేని వాహనాలకు రవాణాశాఖలో ఎలాంటి సేవలు ఇవ్వబోమని, వాహనాలకు ఇన్సూరెన్స్ చేయటం కుదరదని తేల్చి చెప్పటం విశేషం. కొత్తగా వాహనాన్ని కొనుగోలు చేసిన సమయంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియతోపాటే హెచ్ఎస్ఆర్‌పీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. పాత వాహనదారులు ఈ నంబర్ ప్లేట్ కోసం www.siam.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని రవాణాశాఖ సూచించింది.

రుసుములు ఇలా.. హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ల ఏర్పాటుకు చార్జీలు ఇలా..

వాహన కేటగిరీ	సగటు రుసుము
ద్విచక్రవాహనం	రూ.320-380
దిగుమతి చేసుకున్న ద్విచక్రవాహనం	రూ.400-500
నాలుగు చక్రాల వాహనం	రూ.590-700
దిగుమతి చేసుకున్న నాలుగు చక్రాల వాహనం	రూ.700-860
మూడు చక్రాల వాహనం	రూ.350-450
వాణిజ్య వాహనాలు	రూ.600-800



పంపిణీ ఎలా సాధ్యం?

హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ల ఏర్పాటు విషయంలో ముందునుంచి ప్రభుత్వం పట్టీపట్టనట్టుగా వ్యవహరిస్తోంది. వాహనాలు కొంటున్న వారిలో 75 శాతం మంది వాటిని కాకుండా, నచ్చిన తరహాలో ఉండే సాధారణ నంబర్ ప్లేట్లనే ఏర్పాటు చేసుకుంటున్నా ఎలాంటి చర్యలు లేవు. వాహనాలను తనిఖీ చేసేప్పుడు హెచ్ఎస్ఆర్‌పీ లేకుంటే ఫైన్ కూడా విధించటం లేదు. దీంతో వాటి విషయంలో వాహనదారుల్లో శ్రద్ధే లేకుండా పోయింది. ఇక, రిజిస్ట్రేషన్ అవుతున్న వాహనాల సంఖ్యకు తగ్గట్టుగా రాష్ట్రంలో హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ల సరఫరా ఉండటం లేదు. ముందునుంచీ వీటి తయారీ, సరఫరా తీవ్ర గందరగోళంగా మారింది. ఇప్పటికీ అది అలాగే ఉంది. ఇప్పుడు ఒకేసారి పాత వాహనాలకు కూడా ఆ నంబర్ ప్లేట్లను అమర్చాలని ఆదేశాలివ్వటంతో వాటిని ఎలా సరఫరా చేస్తారో అధికారులకే తెలియాలి. తాజా ఆదేశం మేరకు దాదాపు 90 లక్షల వరకు నంబర్ ప్లేట్లను సరఫరా చేయాల్సి ఉంటుందని అంచనా. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కేంద్ర రవాణాశాఖ స్పష్టంగా ఆదేశించటంతో, దీనిని కచ్చితంగా అమలు చేయకతప్పని పరిస్థితి నెలకొంది. కానీ నంబర్ ప్లేట్ల తయారీ, సరఫరా అంశం అస్తవ్యస్తంగా ఉన్న నేపథ్యంలో, ఇది అధికారులకు కత్తిమీద సామే కానుంది.

అయ్యో..అంగన్‌వాడీ

- టీచర్లు, హెల్పర్ల ఉద్యోగ విరమణలకు ఏడాది
- ఇప్పటివరకు జాడలేని రిటైర్‌మెంట్ బెనిఫిట్ ఉత్తర్వులు
- ఆర్థిక సాయం కోసం 7 వేల మందికి పైగా ఎదురుచూపులు



సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగ విరమణ ప్రక్రియ ఏడాది పూర్తి చేసుకుంది. 65 సంవత్సరాలు పూర్తి చేసుకున్న టీచర్లు, హెల్పర్లను విధుల నుంచి రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ గతేడాది ఏప్రిల్ నుంచి తప్పించింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు 61 సంవత్సరాల వరకు సర్వీసులో కొనసాగుతుండగా, గౌరవ వేతనంతో విధులు నిర్వర్తిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు మాత్రం 65 సంవత్సరాల వరకు విధుల్లో కొనసాగే అవకాశం ప్రభుత్వం కల్పించింది. వారి సర్వీసులకు గుర్తింపుగా ఉద్యోగ విరమణ సమయంలో ప్రత్యేక ప్యాకేజీని గత ప్రభుత్వం ప్రకటించింది. విరమణ పొందే ప్రతీ అంగన్‌వాడీ టీచర్‌కు రూ.లక్ష, హెల్పర్‌కు రూ.50 వేల ఆర్థిక సాయంతో పాటు సామాజిక పింఛన్ ఇస్తామని చెప్పింది. అయితే ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయాన్ని టీచర్లు, హెల్పర్లు వ్యతిరేకించారు. కనీసం టీచర్‌కు రూ.2 లక్షలు, హెల్పర్‌కు రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై అప్పట్లో మౌఖికంగా మంత్రి ప్రకటన చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేస్తామని అసెంబ్లీ వేదికగా ప్రకటించింది. అయితే ఏడాది దాటినా ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడలేదు. ఇదిగో.. అదిగో..అంటూ అధికారులు చెబుతున్నా, ఆచరణలో సాధ్యం కాలేదు.

ఏడు వేల మందికి పైమాటే...

గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు దాదాపు ఏడు వేల మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఉద్యోగ విరమణ చేశారు. ఇందులో మెజారిటీ మంది ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందుకోలేదు. విధుల నుంచి తప్పించినా, ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పట్ల స్పష్టత లేకపోవడంతో అధికారులు సైతం చేతులెత్తేశారు. వీరంతా ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు, సీడీపీఓలు, జిల్లా సంక్షేమాధికారుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. కనీసం సామాజిక భద్రత పింఛన్ మంజూరు చేయాలని అర్జీ పెట్టుకున్నా, చాలామందికి మంజూరు కాలేదు. రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు, సంక్షేమ శాఖ గణాంకాల ప్రకారం ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి 5,250 మంది టీచర్లు, 2 వేల మంది హెల్పర్లు ఉద్యోగ విరమణ పొందారు. తాజాగా అంగన్‌వాడీల్లో కొలువుల భర్తీకి సంబంధించిన ఫైల్‌పై మంత్రి సీతక్క ఇటీవల సంతకం చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయానికి పంపారు. సీఎంఓ నుంచి కూడా ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్టు సమాచారం. ఈ ఫైల్‌లో పేర్కొన్న ఖాళీల్లో గతేడాది నుంచి ఉద్యోగ విరమణతో ఖాళీ అయిన వాటిని కూడా ప్రకటించారు. కొత్తగా ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నా, ఉద్యోగ విరమణ పొందిన వారికి ఆర్థిక సాయం అందించకపోవడం సరికాదని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. తక్షణమే ఆర్థిక సాయం చేయాలని కోరుతోంది.

కాలేజీలిచ్చారు.. పోస్టులు మరిచారు

ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అంతా గందరగోళం

- అదనపు డీఎంఈ హోదా లేకుండానే ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లు
- 74 పోస్టులకుగాను 17 మందికి మాత్రమే ఈ హోదా
- ఎన్ఎంసీ తనిఖీకి వస్తే 8 కొత్త కాలేజీలకు గుర్తింపు రద్దు ప్రమాదం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జిల్లాకో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం, వాటిలో అవసరమైన ఉన్నతస్థాయి పోస్టులను భర్తీచేయటంలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. వైద్య కళాశాలలు, వాటికి అనుబంధంగా ఉన్న ఆస్పత్రులకు ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లుగా అదనపు డీఎంఈ కేడర్‌లోనే పోస్టులను భర్తీ చేయాలనే విషయాన్ని మర్చిపోయింది. వైద్య కళాశాలలు, అనుబంధ ఆస్పత్రులున్న చోట అదనపు డీఎంఈ హోదాల్లో 74 వరకు ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లను నియమించాల్సి ఉండగా, 17 చోట్ల మాత్రమే ఆ హోదాలో పనిచేస్తున్నారు. అదనపు డీఎంఈలను నియమించాలని ఆరోగ్యశాఖ పంపిన ఫైలును సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)లో నెలన్నరగా తొక్కిపెట్టారు. డీఎంఈ ఆఫీస్, ఆరోగ్య శాఖ కార్యదర్శి కార్యాలయం నుంచి ఎన్ని ప్రయత్నాలు చేసినా జీఏడీ అధికారులు ఈ ఫైలుకు క్లియరెన్స్ ఇవ్వడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

8 కళాశాలలకు కష్టమే..

రాష్ట్రంలో 34 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉండగా, వాటికి అనుబంధంగా ఆస్పత్రులు కూడా పనిచేస్తున్నాయి. ఇవి జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొత్తగా 8 మెడికల్ కాలేజీలకు అనుమతి ఇచ్చింది. ఈ కాలేజీలతోపాటు అనుబంధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా అదనపు డీఎంఈ కేడర్ పోస్టులు లేవు. ఈ నెలలో ఎన్ఎంసీ ఈ కాలేజీల తనిఖీకి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఎన్ఎంసీ తనిఖీల్లో రెగ్యులర్ విధానంలో ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లు లేరని గుర్తిస్తే కాలేజీల అనుమతులు రద్దయ్యే ప్రమాదం ఉందని డీఎంఈ వర్గాలు చెపుతున్నాయి. ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించి అదనపు డీఎంఈ హోదాలో ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లను వెంటనే నియమించాలని కోరుతున్నారు. జీఏడీలో ఆగిపోయిన ఫైల్‌ను కదిలిస్తే పదోన్నతుల ద్వారా సుమారు 50 మంది సీనియర్ ప్రొఫెసర్లకు ఈ హోదాలో రెగ్యులర్ పోస్టులు దక్కే అవకాశం ఉంది.

కూతురిని చంపి.. తల్లి ఉరేసుకుని..

అక్షరాభ్యాసం చేయించిన చేతులతోనే అంతమొందించిన వైనం

పెద్దపల్లి రూరల్: ఉన్నత చదువులు చదివింది.. కన్నబిడ్డకు విద్యాబుద్ధులు ప్రాప్తించేలా చూడాలంటూ రెండ్రోజుల క్రితమే బాసరలోని సరస్వతీదేవి అమ్మవారి ఎదుట అక్షరాభ్యాసం చేయించింది.. ఇంతలో ఏమైందో ఏమో.. క్షణికావేశంలో కన్న కూతురినే కడతేర్చింది.. ఆపై తానూ ఉరివేసుకుంది. పెద్దపల్లి టీచర్స్ కాలనీలో బుధవారం రాత్రి వెలుగుచూసిన ఈ ఘటనపై మృతురాలి కుటుంబసభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి ఎల్ఐసీ కార్యాలయంలో పని చేస్తున్న లోక వేణుగోపాల్‌రెడ్డికి సాహితి (29)తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె రితన్య (2) ఉంది. టీచర్స్ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. బుధవారం భర్త ఇంట్లో లేని సమయంలో.. సాహితి కూతురు రితన్యకు ఉరివేసి చంపి, తర్వాత తానూ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సాహితికి రాత్రి తల్లిదండ్రులు ఫోన్‌చేసినా ఎత్తలేదు. దీంతో అనుమానించి ఇరుగుపొరుగు వారితో మాట్లాడి సమాచారం తెలుసుకోవడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. ఎంటెక్ చదివిన సాహితి ఎక్కువగా ఆలోచిస్తుండేదని, సన్నగా ఉన్నాననే వేదనతో ఉండేదని కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఆ బాధ తాలూకు క్షణికావేశంలోనే సాహితి.. కూతురిని చంపి, ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని భావిస్తున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.



అక్షరాభ్యాసం చేయించి..

రెండు రోజుల క్రితమే బాసరలో చిన్నారి రితన్యతో తల్లిదండ్రులు అక్షరాలు దిద్దించారు. వచ్చే విద్యాసంవత్సరంలో కరీంనగర్‌లోని ఓ పాఠశాలలో నర్సరీలో చేర్పించాలని నిర్ణయించుకున్నారు. ఇంతలోనే ఈ ఘోరం చోటుచేసుకుంది. సాహితి ఆత్మహత్యకు ముందు రాసిన లేఖలో.. భర్త వేణుగోపాల్‌రెడ్డి మంచివాడేనని స్పష్టం చేసింది. తన చావుకు ఎవరూ బాధపడొద్దని, తాను లేకుండా బిడ్డ ఎలా ఉంటుందోననే వేదనతోనే.. వెంట తీసుకెళ్తున్నానని లేఖలో పేర్కొంది.

ఆత్మీయ భరోసా అమలు అంతంతే!

జనవరి 26న ప్రారంభించిన సీఎం

- ఆ తర్వాత ఎమ్మెల్సీ కోడ్ పేరుతో తాత్కాలికంగా నిలిపివేత
- పూర్తిస్థాయిలో ఉపాధి కూలీల ఖాతాల్లోకి చేరని సొమ్ము



సాక్షి, హైదరాబాద్: భూమిలేని ఉపాధిహామీ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ఇప్పటివరకు ఈ పథకం కింద 83,887 మంది ఉపాధి కూలీలకు రూ. 50.33 కోట్లు చెల్లించారు. మిగతా 4,13,857 మంది కూలీలకు రూ.298 కోట్లు ఇవ్వాల్సి ఉంది. దీనికి సంబంధించి టోకెన్ చెక్కులు జనరేట్ అయ్యాయని అధికారులు చెబుతున్నా, ఉపాధికూలీల ఖాతాల్లోకి మాత్రం ఈ డబ్బు జమ కావడం లేదు. 2023-24లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద 20 రోజులు పనిచేసిన సొంతభూమి లేని ఉపాధికూలీలకు (జాబ్‌కార్డులు కలిగిన వారికి) ఏడాదికి రూ.12 వేలు (ఆరునెలలకు రూ.6వేలు చొప్పున) చెల్లిస్తామంటూ ఆ పథకాన్ని జనవరి 26న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు.

పైలట్ ప్రాజెక్టుగా...

ఒక్కో జిల్లా..ఒక్కో మండలంలోని ఒక్కో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. 26న పథకాన్ని ప్రారంభించాక...29వ తేదీ నిర్వహించిన గ్రామసభల్లో దరఖాస్తులు తీసుకొని, అర్హులను ఎంపిక చేసి రూ.6 వేల అందజేత వంటి ప్రక్రియ చేపట్టారు. అయితే ఇది పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ఈ పథకం కింద గతంలో గుర్తించిన 5.80 లక్షల లబ్ధిదారులు, అదనంగా కొత్తగా రెండులక్షల దాకా దరఖాస్తులు అందాయి. వీటిని కూడా అధికారులు పరిశీలించాక, ఎక్కువ సంఖ్యలో అనర్హులు ఉన్నారని (భూమి ఉన్నవారు, 20 రోజులు పని చేయని వారు) తేలినట్టు అధికారవర్గాల సమాచారం.ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పేరుతో జనవరి చివరి వారంలో దీని అమలును ఆపేశారు. కోడ్ ముగిశాక కూడా ఉపాధికూలీల ఖాతాల్లోకి రూ.6 వేల మొత్తాన్ని పూర్తిస్థాయిలో జమచేయలేదనే విమర్శలున్నాయి.

ఆయా జిల్లాల్లో ఇదీ పరిస్థితి

'నాకు గుంట భూమి కూడా లేదు. పదిహేను రోజుల కింద మా ఊళ్లో జరిగిన గ్రామసభలో నన్ను ఆత్మీయభరోసా కింద ఎంపిక చేసి నా పేరు చదివి వినిపించారు. ఇప్పటివరకైతే నాకు డబ్బులు రాలేదు' అని జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడిచర్లకు చెందిన ఇజ్జగిరి సరోజన వాపోయింది.

- హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామానికి చెందిన ఉపాధి కూలీ జాగిలపు విజయకు 2023-24లో 60 రోజుల ఉపాధి పని పూర్తి చేసుకుంది. ఈమెకు ఎలాంటి వ్యవసాయ భూమి లేదు. ఈమె ఆత్మీయ భరోసా పథకానికి అర్హురాలు. ఇప్పటికీ ఈమెకు రూ.6 వేలు ఖాతాలో వేయలేదు. ఇవి ఎప్పుడు అందుతాయి? అని ఎదురుచూస్తోంది.
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 85 వేల మంది లబ్ధిదారులు ఎంపికయ్యారు. అయితే గతంలో ఎంపిక చేసిన వారి మినహా మళ్లీ కొత్తవారిని ఈ పథకం కింద ఎంపిక చేయలేదని తెలుస్తోంది.

2021-22ను ప్రామాణికంగా తీసుకోవాలి

గ్రామసభల్లో కొందరు లబ్ధిదారులను ఎంపిక చేసినా ఎమ్మెల్సీ కోడ్ పేరు చెప్పి, అప్పుడు డబ్బులు వేయలేదు. ఆ తర్వాత కూడా ఉపాధి కూలీల ఖాతాల్లో పడటం లేదు. 2021-22లో ఉపాధి హామీ కింద అత్యధికంగా 'పర్సన్‌డేస్' నమోదైనందున.. 2023-24కు బదులు 2021-22ను ప్రామాణికంగా తీసుకోవాలని పీఆర్ మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశాం. 2022-23లో రాష్ట్రంలో 4.4 లక్షల జాబ్‌కార్డులు, 15.8 లక్షల మంది పేర్లను ఉపాధిహామీ డేటాబేస్ నుంచి తొలగించారు. 2023-24లో రాష్ట్రంలోని 156 గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను విలీనం చేసిన ఉపాధి కూలీలకూ దీనిని వర్తింపచేయాలి.

– పి.శంకర్, జాతీయ కార్యదర్శి, దళిత బహుజన ఫ్రంట్



మెనోపాజ్‌లో వచ్చే శారీరక, మానసిక మార్పుల గురించి ప్రతి మహిళా అవగాహన పెంచుకోవాలి. ఈ ట్రాన్స్‌ఫర్మేటివ్ స్టేజ్‌లోని తమ శారీరక, మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెట్టాలి. నిర్లక్ష్యం చేయకూడదు. నిస్పృహకు లోను కారాదు.

- షబానా ఆజ్మీ, నటి



మెనోపాజ్ దశలోని మహిళలు ముందు తమ పట్ల తాము శ్రద్ధ తీసుకోవాలి. వాళ్లు ఎదుర్కొంటున్న శారీరక, మానసిక సమస్యల గురించి నిస్సంకోచంగా కుటుంబంతో చర్చించి, సపోర్ట్ అడగాలి. ఎమోషనల్ చాలెంజెస్‌కి డీలా పడిపోకుండా కుటుంబ సభ్యుల మద్దతుతో వాటిని నార్మలైజ్ చేసుకోవాలి.

- ప్రీతి జింటా, నటి

మెనోపాజ్ అర్థం చేసుకుందాం

‘నేనిప్పుడు ఫ్రిజ్ డోర్ ఎందుకు తెరిచానబ్బా..?’ ఎంత చించుకున్నా అరుంధతికి గుర్తు రావడం లేదు. ‘ముందిక్కడి నుంచి వెళ్లు...’ చిన్న విషయానికే పెద్దగా అరిచేసింది ప్రతిమ. కంగుతిన్నాడు భర్త. ఆఫీస్‌లో సీరియస్ వర్క్‌లో ఉన్న అపర్ణ ఒక్కఉదుటన లేచి వాష్‌రూమ్‌లోకి వెళ్లి ఏడ్వసాగింది. ఎందుకంత దుఃఖం వచ్చిందో తెలియదు ఆమెకు. పనిమీద ఏకాగ్రత కుదరట్లేదు వైశాలికి. మాలతికి జాయింట్ పెయిన్స్, నీలిమకు నీరసంగా, నిస్సత్తువగా ఉంటోంది. విజయ డిప్రెసివ్‌గా ఫీలవుతోంది. దిగులు వెంటాడుతోంది. కారణం లేకుండానే ఆందోళన చెందుతోంది ప్రేమ. జీవనాసక్తి లేదు. గిరిజ అయితే కళావిహీనంగా మారిపోయింది. రజితకు ఉన్నట్టుండి వేడి ఆవిర్లు వస్తున్నాయి. క్షణంలో జ్వరమొచ్చినట్టుగా అయిపోతోంది. వీణకు నిద్ర కరవైంది. దాంపత్య జీవితం పట్లా ఆసక్తి పోయింది. దాంతో భర్త ఆమెను సాధిస్తూ తన అసంతృప్తిని వ్యక్తపరుస్తున్నాడు.

2026 కల్లా దేశంలో దాదాపు 40 కోట్ల మంది మహిళలు మెనోపాజ్ దశకు చేరుకోనున్నారని అంచనా!

నలభై ఏళ్ల కంటే ముందే మెనోపాజ్ వచ్చేస్తే దాన్ని ప్రీమెచ్యూర్ మెనోపాజ్ అంటారు. మన దేశంలో 2.2 శాతం మంది మహిళలు ప్రిమెచ్యూర్ మెనోపాజ్‌లో ఉన్నట్లు అంచనా. నలభైనుంచి నలభై నాలుగేళ్ల మధ్య వయసులో గనుక మెనోపాజ్ దశ మొదలైతే దాన్ని అర్లీ మెనోపాజ్ అంటారు. ఈ దశలో ఉన్న మహిళల సంఖ్య 16. 2 శాతం.

దేశంలో మెనోపాజ్ సగటు వయసు నలభై ఆరున్నరేళ్లు. అయితే ప్రాంతాల వారీగా ఈ సగటు వయసులో తేడాలున్నాయి. దక్షిణ భారతదేశంలో 46 ఏళ్లు. ఉత్తర భారతంలో 45.5, మధ్య భారతంలో 47.8, పశ్చిమ భారతంలో 46.2, తూర్పు భారతంలో 47.3 ఏళ్లు.

ముందు తరాల వారితో పోలిస్తే.. మెనోపాజ్ సింప్టమ్స్‌కి ఆధునిక జీవన శైలి, అధిక ఒత్తిడి, శారీరక వ్యాయామం లేకపోవడం, స్థూలకాయం, రోజులో ఎక్కువ సమయం ఫోన్లలో గడపడం వంటివన్నీ కారణాలుగా చెబుతున్నారు నిపుణులు.

ఫ్యూబర్టీ, మాతృత్వంలాగే స్త్రీ జీవితంలో మెనోపాజ్ కూడా శారీరక, మానసిక మార్పులతో కూడిన సహజమైన దశ! అయితే... ఇది సాఫీగా సాగిపోయే దశ కాదు. కొన్ని హార్మోన్ల ఉత్పత్తి మందగించి ఎన్నో శారీరక, మానసిక సమస్యలకు కారణమవుతుంది. అవి స్త్రీ దైనందిన జీవితాన్ని కూడా ప్రభావితం చేస్తోంది. ఇంత తీవ్రమైన అంశం మన సాంస్కృతిక నేపథ్యం కారణంగా సైలెంట్‌గా ఉండిపోయింది. ఆ సైలెన్స్ మెనోపాజ్ మీద అవగాహన కొరవడేలా చేస్తాయి. ఎంతలా అంటే సమాజం సంగతి అటుంచి మెనోపాజ్ ఎఫెక్ట్స్ మీద ఆ దశను అనుభవిస్తున్న స్త్రీలకే తెలియనంతగా! అందుకే ఆ నిశ్శబ్దాన్ని ఛేదించాలి... మెనోపాజ్ మీద విస్తృతమైన చర్చ కొనసాగాలి. అప్పుడే సమాజం ఆమెను అర్థం చేసుకోగలుగుతుంది. తన వంతు మద్దతు అందించగలుగుతుంది. ఆ ప్రయత్నంలో భాగంగానే నేటి నుంచి సాక్షి ఫ్యామిలీలో మెనోపాజ్ అవేర్‌నెస్ క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తోంది.



పైన చెప్పిన మహిళలవే కాదు 40- 50 మధ్య వయస్సు వనితలందరివీ దాదాపు అవే సమస్యలు! మెనోపాజ్ ఎఫెక్ట్స్! చిత్రవిచిత్రమైన ఆ పరిస్థితి అనుభవిస్తున్న వాళ్లకే అర్థంకాకపోతే కుటుంబ సభ్యులు, ఆఫీస్ సిబ్బందికేం అర్థమవుతుంది.. వాళ్ల సహకారమెలా అందుతుంది! దీని మీద అవగాహన కల్పించేందుకు రమావైద్య, ఊర్వశి ఝా అనే వైద్యులు 1995 (ముంబై)లోనే తమ ప్రయత్నాన్ని ప్రారంభించారు ‘ద ఇండియన్ మెనోపాజ్ సొసైటీ’ని స్థాపించడం ద్వారా ఇది ఇప్పటికీ తన సేవలను అందిస్తూనే ఉంది. జర్నలిస్ట్, రచయిత, మహిళా హక్కుల కార్యకర్త శైలీ చోప్రా కూడా ‘మెనోపాజ్’ మీద అవగాహన కల్పించేందుకు, దానికి సంబంధించిన మెడికల్ కేర్, కమ్యూనిటీ సపోర్ట్‌ను కూడగట్టేందుకు ఉద్యమిస్తున్నారు. మెనోపాజ్‌కి సంబంధించి విప్లవమే రావాలి అంటూ ఆమె రోడ్ షోస్ చేస్తున్నారు. గైనకాలజిస్ట్‌ల ప్రకారం వరుసగా పన్నెండు నెలలు నెలసరి రాకపోతే మెనోపాజ్ వచ్చినట్టే! రుతుక్రమంలోని స్త్రీలు తప్పించుకోలేని దశ అది! కానీ మన సాంస్కృతిక నేపథ్యం దీనిగురించి మాట్లాడనివ్వకుండా చేస్తోంది. దాని మీద విస్తృతమైన చర్చ జరిగితేనే అదో వినకూడని మాటలా కాకుండా సాధారణమైన అంశగా మారుతుంది. మెనోపాజ్ ఫేజ్‌లోని మహిళల శారీరక, మానసిక ఆరోగ్యం గురించి ఆలోచన మొదలవుతుంది. ఆ దశలో వాళ్లు తీసుకోవాల్సిన పోషకాహారం మొదలు శారీరక వ్యాయామం, ధ్యానం, ఎమోషనల్ బ్యాలెన్స్ లాంటివాటి మీద ఎరుక వస్తుంది. అప్పుడే మెనోపాజ్ ప్రభావాన్ని స్త్రీ సమర్థంగా ఎదుర్కోగలదు. ఈ ఉద్యమంలో పాలు పంచుకుంటూ సాక్షి ఫ్యామిలీ కూడా శారీరక, మానసిక వైద్యనిపుణుల విశ్లేషణలు, వివరాలు, సలహాలు, సూచనలతో నేటినుంచి మెనోపాజ్ అవేర్‌నెస్ క్యాంపెయిన్‌ను మొదలుపెడుతోంది.

నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్ 2019-21) డేటా ప్రకారం.. ప్రీమెచ్యూర్, అర్లీ మెనోపాజ్ గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా కనపడుతోంది. దానికి పేదరికం, నిరక్షరాస్యత వంటివి కారణాలుగా చూపెడుతోంది. మద్యపానం, ధూమపానం, పోషకాహారలోపం, బహిష్టు సమయంలో అపరిశుభ్రంగా ఉండటం, అనారోగ్య పద్ధతులు అనుసరించడం కూడా ప్రీమెచ్యూర్ మెనోపాజ్‌కి కారణాలని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అధిక సంతానం,18 ఏళ్లకే తొలి కాన్పు, పన్నెండేళ్ల లేదా అంతకంటే చిన్నవయసులో రుతుక్రమం ప్రారంభం అవడం లాంటి వాటివల్లా ప్రీమెచ్యూర్ మెనోపాజ్ రిస్క్ పెరగొచ్చని తెలుపుతున్నాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాల కన్నా బిహార్‌లో ప్రీమెచ్యూర్ మెనోపాజ్ రేట్ ఎక్కువగా కనబడుతోందని సర్వేల సారాంశం. అలాగే యాభై పైబడ్డాక కూడా నెలసరి కొనసాగిన వాళ్లల్లో బ్రెస్ట్ క్యాన్సర్ డెవలప్ అయ్యే రిస్క్ ఎక్కువ.

– సరస్వతి రమ

కూల్ సమ్మర్

ఏసీ లేకున్నా ఎంత హాయి!





వేసవి వచ్చిందంటే చాలు... ఫ్యాన్ నాన్‌స్టాప్‌గా తిరగాల్సిందే. ఏసీ ఎప్పుడూ పని చేయాల్సిందే. కరెంట్ బిల్లు భారం సంగతి ఎలా ఉన్నా... ఏసీల అధిక వినియోగం వల్ల పర్యావరణానికి నష్టం జరుగుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని బెంగళూరుకు చెందిన వారణాసి సత్యప్రకాష్ ‘వారణాసి హౌజ్’ను సృష్టించాడు. ఏసీ అవసరం లేకుండానే ఈ ఇల్లు చల్లగా ఉంటుంది. ఇంటి నిర్మాణం విషయానికి వస్తే... హీట్ ట్రాపింగ్ సిమెంట్ గోడలకు బదులుగా బోలు మట్టి బ్లాకులను ఎంచుకున్నాడు. ఇవి ఉష్ణోగ్రతను సహజంగా నియంత్రిస్తాయి. వేసవిలో ఇంటిని చల్లగా, చలికాలంలో వెచ్చగా ఉంచుతాయి. ఫ్రెంచ్ కిటికీల వల్ల తగినంత వెంటిలేషన్ ఉంటుంది. ఇంటి రూపకల్పనలో ఉష్ణోగ్రతను నియంత్రించడానికి, భూగర్భ జలాలను రీచార్జ్ చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చేపల కొలను, నీటి ప్రవాహాలు, బావి ఉన్నాయి. కారు షెడ్‌కు దగ్గరలో అందమైన పూలతోట... వర్షపు నీటిని భద్రపరిచే ఏర్పాటు కూడా కనిపిస్తాయి. ఆర్టిఫిషియల్ కూలింగ్ అవసరం లేకుండా రెడ్ ఆక్సైడ్ ఫ్లోర్స్, ఫైన్ వుడ్ ఇంటీరియర్స్, నేచురల్ చిమ్నీ... మొదలైనవి కనిపిస్తాయి.‘క్రాస్ వెంటిలేషన్, డిస్‌ప్లేస్‌మెంట్ వెంటిలేషన్ సూత్రాలను మిళితం చేసి ఇంటికి రూపకల్పన చేశాం’ అంటున్నాడు సత్యప్రకాష్.

తగ్గే ప్రసక్తే ల్యా..

● చిరుతకు చెమటలు పట్టించిన శునకం



వంగపండు ‘ఏం పిల్లడో’ పాటలో ‘పులుల్ని మింగిన గొర్రెలున్నయట’ అనే మాట వినిపిస్తుంది. ఇప్పుడు ఆ పాటలో ‘చిరుతకు చెమటలు పుట్టించిన కుక్కలున్నయట’ అనే మాటను చేర్చవచ్చు. ఈ కథనం ఊళ్లోకి ప్రవేశించిన చిరుతపై తీవ్రంగా కన్నెర్ర చేసిన శునకం గారి గురించి. ఒక అర్ధరాత్రి... ఊరంతా గుర్రు పెట్టి నిద్రపోతోంది. చిన్న అలికిడి కూడా లేదు. ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఒక చిరుత పులి వీధిలోకి వచ్చింది. ఆ తరువాత ఒక ఇంట్లోకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్నప్పుడు... ‘భౌభౌ’ అనే శబ్దం వినిపించింది. మామూలుగానైతే.... ‘నన్ను బెదిరించేంత సీన్ నీకు లేదు’ అని ఆ ఇంటి కాపలా కుక్కపై చిరుత కన్నెర్ర చేయాలి.

అయితే సదరు చిరుత మాత్రం కుక్క అరుపులు విని వెనక్కి తిరిగి చూడకుండా పరుగో... పరుగు!

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వీడియో 3.5 మిలియన్‌ల వ్యూస్‌తో దూసుకుపోతోంది. ఇది ఏ ప్రాంతానికి చెందిన వీడియో క్లిప్ అనేది తెలియదుగానీ నెట్‌వాసులు జోక్‌లు విపరీతంగా పేలుస్తున్నారు.

● వికాసం

చలనమే విజయం



ఆదివాసీ మహిళలకు ఆధార్ కార్డ్ ఉంటుందో లేదో. మరి డ్రైవింగ్ లైసెన్స్ ఉంటుందా? వారు ఒక టూ వీలర్ కలిగి డ్రైవింగ్ నేర్చుకుని ఉంటే కొండ మిట్టల దారుల్లో మైళ్ల కొద్దీ నడక నుంచి విముక్తి అవుతారు. ఉపాధికి మార్గాలు వెతుకుతారు. సమయం సద్వినియోగం చేసుకుంటారు. కాని ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో వారికి డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాలు సమకూర్చే ప్రయత్నాలు ఏం జరుగుతున్నాయోగానీ కేరళలో జరుగుతున్నాయి.

ఇలా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మన్యం ప్రాంతాలలో కూడా చేయగలరేమో ఆలోచించాలి. ఎందుకంటే ఇది మంచి ఫలితాలను ఇస్తోంది. సరిగా చెప్పాలంటే మంచి పని ఎప్పుడూ మంచి ఫలితాలనే ఇస్తుంది.

గిరిజన గూడేలు అడవుల్లో, కొండల్లో ఉంటాయి. వారు బాహ్య ప్రపంచంతో తెగిపోయి ఉన్నట్టుగా భావిస్తారు. దానికి కారణం ఆ గూడేలకు దారులు ఉండవు. ఉన్నా సరిగా ఉండవు. నాలుగు చక్రాల వాహనాలు తిరిగేలా కొన్ని దారులు మాత్రమే ఉంటాయి. అందుకే వీరు ఎక్కువగా కాలి నడక మీద ఆధార పడతారు. రోజులో ఎక్కువ సమయాన్ని వీరు నడకకోసమే వెచ్చించాల్సి ఉంటుంది. హైవే మీద కూడా వీరు అలవాటు కొద్దీ నడిచే వెళుతుంటారు.. లేదా డబ్బు లేక కూడా. అలా నడుస్తున్నవారిలో మహిళలను చూసి వీరి ట్రాఫిక్ నియమాలను తెలుపుదాం అనుకున్నారు ‘దేవికులం’ అనే టౌన్‌కు చెందిన సబ్ రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసు అధికారులు.

ఈ ఊరు కేరళలోని ఇడుక్కి జిల్లాలో ఉంది. దేవికులం చుట్టుపక్కల దాదాపు 25 గిరిజన గూడేలు ఉన్నాయి. ఈ గూడేలలోని మహిళలకు టూ వీలర్స్ లేవు. ఒకవేళ కొనగలిగినా వీరికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండదు. అందుకే అధికారులు కేవలం రోడ్ సేఫ్టీ గురించి చెప్పాలనుకున్నారు.

టెస్ట్ పాసైన మహిళ

గత సంవత్సరం అధికారులు గిరిజన మహిళలను పిలిచి రోడ్డు జాగ్రత్తలు వివరిస్తున్నప్పుడు సుగంతి అనే గిరిజన మహిళ ‘సార్ నేను డ్రైవింగ్ నేర్చుకోగలనా’ అని అడిగింది. అధికారులు వెంటనే సమాధానం చెప్పలేక పోయారు. ఎందుకంటే కేరళలో డ్రైవింగ్ లైసెన్సు మన రాష్ట్రాల్లో కొన్ని చోట్ల జరిగినట్టుగా పరీక్షలు పాస్ కాకుండా పొందలేరు. పరీక్ష రాయాల్సిందే. గిరిజన మహిళ రాయగలదా అనుకున్నారు. ‘మా ఆశ్చర్యం కొద్దీ ఆమె డ్రైవింగ్ నేర్చుకోవడమే కాదు పరీక్ష పాసై లైసెన్సు పొందింది’ అన్నారు ఆర్‌టిఏ అధికారులు. అప్పుడే వారికి ఆలోచన వచ్చింది... గిరిజన స్త్రీలకు డ్రైవింగ్ నేర్పాలని.

మా జీవితాలు మారాయి

డ్రైవింగ్ లైసెన్స్ పొంది కొత్తదో సెకండ్ హ్యాండ్‌తో ఒక టూ వీలర్‌ను ఏర్పాటు చేసుకున్నాక ఇక్కడ చాలామంది గిరిజన స్త్రీల జీవనం మారింది. ‘మేం పని కోసం వెళ్లగలుగుతున్నాం. ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందగలుగుతున్నాం’ అని వారు అంటున్నారు. టూ వీలర్ నడపడానికి సౌకర్యవంతమైన డ్రస్సులు కూడా వేసుకోవాల్సి ఉంటుంది. ‘గిరిజన నియమాలు అందుకు ఒప్పుకోవు. కాని గూడెం పెద్దలు పరిస్థితి అర్థం చేసుకుని అనుమతి ఇస్తున్నారు’ అంటున్నారు మహిళలు. చీర కాకుండా పంజాబీ డ్రస్సుల వంటివి జీవితంలో మొదటిసారి టూవీలర్లు నడపడానికే వీరు ధరిస్తున్నారు. ‘మాలో కొందరికి టూవీలర్ నడపడం వచ్చినా డ్రైవింగ్ లైసెన్స్ ఎలా పొందాలో తెలియక భయం భయంగా బండ్లు నడుపుతూ బతికే వాళ్లం. ఇప్పుడు లైసెన్సులు ఇవ్వడం వల్ల మా భయం పోయింది. మేము ధైర్యంగా టౌన్లకు వెళ్లి సరుకులు అమ్ముతాం’ అంటున్నారు.

‘స్వప్నం’ ఉన్న గిరిజన మహిళలు ఎందరో. వారికీ చలనం ప్రాప్తమవ్వాలి.

‘కనావు’... అంటే ‘స్వప్నం’



దేవకులం ఆర్.టి.ఓ. అధికారులు గిరిజన మహిళల కోసం ‘కనావు’ అనే కార్యక్రమం రూపొందించారు. కనావు అంటే స్వప్నం. డ్రైవింగ్ నేర్చుకొని, స్వీయ చలనం కలిగి తమ కలలు సాధించుకోవాలనే స్ఫూర్తిని ఇస్తూ ఈ కార్యక్రమం రూపొందించారు. ఇందులో డ్రైవింగ్ అవసరాన్ని చెప్పే కౌన్సెలింగ్, గూడెం పెద్దలు ఇందుకు అభ్యంతరం పెట్టకుండా వారి అనుమతి తీసుకోవడం, ఉచిత మెడికల్ ఎగ్జామినేషన్, టూ వీలర్ కొనుక్కునేందుకు ఫండ్ పొందే మార్గాలు... ఇవన్నీ ఉంటాయి. మహిళలు నడపడానికి అనువైన తేలిక పాటి టూవీలర్ డ్రైవింగ్‌ను దేవకులం చుట్టుపక్కల ఉన్న గూడేల్లోని మహిళలకు నేర్పించసాగారు. ఇప్పటికి చాలామంది స్త్రీలు ఈ లైసెన్సులు పొందారు. కొందరు వాహనాలు సమకూర్చుకున్నారు. సొంత వాహనం మీద సొంతగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్లడం అంటే ఏమిటో వారి అనుభవంలోకి వచ్చాక పెదాల మీద వచ్చిన చిరునవ్వు చూడదగ్గది.

● మన(సు)లో మాట

ఆయన ప్రవర్తనతో నరకం కనిపిస్తోంది!

మా మామయ్యకు 65 ఏళ్లు. ఆయనకు బీపీ, షుగర్ చాలా కాలంగా ఉన్నాయి. సంవత్సరం క్రితం ‘పార్కిన్సన్’ జబ్బు వచ్చిందని చెప్పారు. ఇక్కడే సరాల డాక్టర్‌కి చూపిస్తున్నాం. కొన్ని రోజులుగా ఆయన ప్రవర్తనలో మార్పు వచ్చింది. మా అత్తగారిని విపరీతంగా అనుమానిస్తున్నారు. ఇంటికి ఎవరైనా మగవాళ్ళు వస్తే వాళ్ళకి, మా అత్తగారితో అక్రమ సంబంధం అంటగడుతున్నారు. అలాగే రాత్రుళ్ళు ప్రశాంతంగా నిద్రపోకుండా మధ్యలో లేచి బయటకు, ఇంట్లోకి తిరుగుతున్నారు. మాకు ఎవరికీ కనపడని మనుషులు ఆయనకు కనపడుతున్నారు. ఈమధ్య అనుమానం నా మీద కూడా మొదలైంది. ఇంట్లో ఆడవాళ్ళని బయటకు వెళ్ళనీయట్లేదు. మా ఆయనకి చెప్తే వాళ్ళ నాన్నను మందలించడానికి ఇబ్బంది పడుతున్నారు. ఆయన ప్రవర్తనతో, మాటలతో మాకు నరకం కనిపిస్తోంది.

- భానుప్రియ, మదనపల్లె

మీరు రాసిన దాన్ని బట్టి మీ మామ గారికి గతంలో ఎప్పుడూ మానసిక సమస్యలు లేవు, బీపీ, షుగర్ మాత్రమే ఉన్నాయి, ఈ మధ్యే ‘పార్కిన్సన్’ జబ్బు వచ్చిందని తెలుస్తోంది. మెదడులో ‘డోపమైన్’ అనే రసాయనం స్థాయి తగ్గినప్పుడు పార్కిన్సన్ జబ్బు, అదే డోపమైన్ పెరిగినపుడు ‘సైకోసిస్’ జబ్బు వస్తుంది. పార్కిన్సన్ జబ్బులో డోపమైన్ రసాయనం స్థాయి తగ్గడం వల్ల చేతులు వణకడం, నిదానంగా నడవడం, శరీరంలో కదలికలు తగ్గడం లాంటివి జరుగుతాయి. మందులు వాడినపుడు డోపమైన్ లెవల్స్ పెరిగి వారిలో ఈ లక్షణాలు మెరుగవుతాయి. ఐతే ఇలా మందులు వాడే వారిలో కొందరికి అనుమానాలు, భ్రాంతులు వంటి సైడ్ ఎఫెక్ట్స్ కూడా కనపడతాయి. దీనికి ప్రధాన కారణం డోపమైన్ లెవెల్స్ అవసరానికి మించి పెరగడం. మీ మామ గారి విషయంలో జరిగింది కూడా ఇదే! కనుక ముందు మీ న్యూరాలజిస్ట్‌ని కలిసి మందులు తగ్గిస్తారో లేదా మారుస్తారో కనుక్కోండి. అలా కుదరని పక్షంలో సైకోసిస్ లక్షణాలు తగ్గడం కోసం కొన్నాళ్ళు సైకియాట్రిస్ట్ పర్యవేక్షణలో ఉండి ‘యాంటీ సైకోటిక్’ మందులు వాడాల్సి ఉంటుంది. ఇలా మందులు వాడినప్పుడు పార్కిన్సన్ జబ్బు లక్షణాలు కొంత పెరగవచ్చు కూడా! అందుకే హాస్పిటల్లో డాక్టరు పర్యవేక్షణలో అడ్మిట్ అయి వైద్యం చేయించుకోవడం మంచిది. మీరు ధైర్యంగా ఉండండి. ఆయన కావాలని ఇదంతా చేయడం లేదని గ్రహించండి. వీలైనంత త్వరగా దగ్గర్లోని మానసిక వైద్యున్ని సంప్రదించండి.

ఆల్ ది బెస్ట్!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్,
విజయవాడ.

మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ:
sakshifamily3@gmail.com



మ్యాక్స్‌వెల్‌పై జరిమానా

ముల్లాన్‌పూర్: ఐపీఎల్ మ్యాచ్‌లో క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడిన పంజాబ్ కింగ్స్ ప్లేయర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్‌పై గవర్నింగ్ కౌన్సిల్ చర్య తీసుకుంది. మ్యాక్స్‌వెల్ మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానాగా విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను కూడా అతని ఖాతాలో వేసింది. ఈ ఆసీస్ ఆటగాడు చేసిన తప్పేమిటనే దానిపై స్పష్టత లేకున్నా... ఆర్టికల్ 2.2 ప్రకారం శిక్ష విధిస్తున్నట్లు ప్రకటించింది. 'మ్యాచ్ సందర్భంగా క్రీడాసామగ్రిని నష్టపరచడం' ఈ నిబంధన కిందకు వస్తుంది. మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను ఈ ఉల్లంఘనకు పాల్పడ్డాడు.

నకమురాతో అర్జున్ గేమ్ 'డ్రా'

ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్‌స్లామ్ ర్యాపిడ్ టోర్నీలో భాగంగా... ప్రపంచ రెండో ర్యాంకర్ హికారు నకమురా (అమెరికా)తో పారిస్‌లో జరిగిన క్వార్టర్ ఫైనల్ తొలి గేమ్‌ను భారత గ్రాండ్‌మాస్టర్, తెలంగాణ ప్లేయర్ ఇరిగేశి అర్జున్ 77 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. రెండో గేమ్ నేడు జరుగుతుంది. 12 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో రౌండ్ రాబిన్ దశ ముగిశాక భారత్ నుంచి అర్జున్ మాత్రమే క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు.



ఆర్య-రుద్రాంక్ష్ జోడీకి రజతం

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్‌కు ఏడో పతకం

బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో భారత్‌కు ఏడో పతకం లభించింది. బుధవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ఆర్య బోర్సే-రుద్రాంక్ష్ బాలాసాహెబ్ పాటిల్ జోడీ రజత పతకం సొంతం చేసుకుంది. ఫైనల్లో ఆర్య-రుద్రాంక్ష్ ద్వయం 9-17 పాయింట్ల తేడాతో జిఫె వాంగ్-బుహాన్ సాంగ్ (చైనా) జోడీ చేతిలో ఓడిపోయింది. కాంస్య పతక మ్యాచ్‌లో నర్మద నితిన్ రాజు-అర్జున్ బబూటా (భారత్) జంట 13-17 పాయింట్ల తేడాతో ఫెర్నాండా రుసో-మార్సెలో జూలియన్ గిటిరెజ్ (అర్జెంటీనా) జోడీ చేతిలో ఓడిపోయింది. మహిళల ట్రాప్ ఈవెంట్‌లో భారత షూటర్లు నిరాశపరిచారు. నీరూ 115 పాయింట్లతో 12వ స్థానంలో, ప్రగతి దూబే 110 పాయింట్లతో 17వ స్థానంలో, భవ్య త్రిపాఠి 106 పాయింట్లతో 26వ స్థానంలో నిలిచారు. పురుషుల ట్రాప్ ఈవెంట్‌లోనూ



భారత షూటర్లెవరూ ఫైనల్ చేరలేకపోయారు. జొరావర్ సింగ్ సంధూ 119 పాయింట్లతో ఏడో స్థానంలో, పృథ్వీరాజ్ 117 పాయింట్లతో 16వ స్థానంలో, లక్ష్య్ 115 పాయింట్లతో 21వ స్థానంలో నిలిచారు. టాప్-6లో నిలిచిన వారు మాత్రమే ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. ప్రస్తుతం భారత్ నాలుగు స్వర్ణాలు, రెండు రజతాలు, ఒక కాంస్యంతో కలిపి ఏడు పతకాలతో రెండో స్థానంలో ఉంది.

భారత ఆర్చరీ జట్టుకు కాంస్యం

ఫ్లోరిడా (అమెరికా): అంతర్జాతీయ ఆర్చరీ కొత్త సీజన్‌ను భారత పురుషుల కాంపౌండ్ జట్టు కాంస్య పతకంతో ప్రారంభించింది. ప్రపంచకప్ స్టేజ్-1 టోర్నమెంట్‌లో భాగంగా బుధవారం జరిగిన పురుషుల కాంపౌండ్ టీమ్ విభాగంలో అభిషేక్ వర్మ, రిషభ్ యాదవ్, ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలేలతో కూడిన భారత జట్టు మూడో స్థానాన్ని దక్కించుకుంది. కాంస్య పతక మ్యాచ్‌లో అభిషేక్, రిషభ్, ఓజస్ త్రయం 230-224 పాయింట్ల తేడాతో మథియాస్ ఫులర్టన్, రస్మస్ బ్రామ్‌సెన్, మార్టిన్ డామ్స్‌బోలతో కూడిన డెన్మార్క్ జట్టును ఓడించింది. అంతకుముందు సెమీఫైనల్లో భారత్ 'షూట్ ఆఫ్'లో 219-219 (27-29) స్కోరుతో ఇటలీ జట్టు చేతిలో ఓడిపోయి కాంస్య పతక పోరుకు అర్హత సాధించింది.

జ్యోతి సురేఖ మాత్రమే...

మరోవైపు మహిళల కాంపౌండ్ విభాగంలో భారత్ నుంచి ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ వెన్నం జ్యోతి సురేఖ మాత్రమే ఈ టోర్నీలో ఆడుతోంది. ఇతర భారత క్రీడాకారిణులకు వీసా రాకపోవడంతో టీమ్ విభాగంలో భారత్ పతకావకాశాలు దెబ్బతిన్నాయి. క్వాలిఫయింగ్ వ్యక్తిగత విభాగంలో జ్యోతి సురేఖ 691 పాయింట్లు స్కోరు చేసి ఐదో స్థానంలో నిలిచింది. తొలి రౌండ్‌లో చిలీకి చెందిన ఒలియా ప్రాడోతో జ్యోతి సురేఖ ఆడుతుంది. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో రిషభ్ యాదవ్-జ్యోతి సురేఖ జోడీ పోటీపడుతుంది.



రిషభ్ యాదవ్, ఓజస్ ప్రవీణ్, అభిషేక్ వర్మ

లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో కాంపౌండ్ ఈవెంట్

2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ ఆర్చరీ క్రీడాంశంలో కొత్తగా కాంపౌండ్ ఈవెంట్‌ను జత చేశారు. ప్రస్తుతం ఒలింపిక్స్‌లో ఆర్చరీ క్రీడాంశంలో రికర్వ్ కేటగిరీలో మాత్రమే పోటీలు నిర్వహిస్తున్నారు. రికర్వ్ విభాగంలో ఐదు ఈవెంట్స్‌లో (పురుషుల, మహిళల వ్యక్తిగత, టీమ్, మిక్స్‌డ్) పతకాలు అందజేస్తున్నారు. తాజాగా లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌ను కొత్తగా మెడల్ ఈవెంట్‌గా ప్రవేశ పెట్టనున్నారని వరల్డ్ ఆర్చరీ బుధవారం అధికారికంగా ప్రకటించింది. కాంపౌండ్ ఈవెంట్‌ను ఒలింపిక్స్‌లో చేర్చడంతో ఈ విభాగంలో భారత స్టార్స్ జ్యోతి సురేఖ, అభిషేక్ వర్మల నుంచి ఒలింపిక్ పతకాన్ని ఆశించవచ్చు.

టైటాన్స్ జైత్రయాత్ర

గుజరాత్ జట్టుకు వరుసగా నాలుగో విజయం

ఐపీఎల్‌లో మాజీ చాంపియన్ **గుజరాత్ టైటాన్స్ జోరు కొనసాగుతోంది. సీజన్ తొలి** మ్యాచ్‌లో ఓటమి తర్వాతి **నుంచి చెలరేగు**తున్న జట్టు వరుసగా నాలు**గో విజయంతో** అగ్ర స్థానానికి దూసుకెళ్లింది. **రాజస్తాన్** రాయల్స్‌తో పోరులో సాయి **సుదర్శన్ అండ్** టీమ్ మెరుపు బ్యాటింగ్‌**తో ముందుగా భారీ** స్కోరు నమోదు చేసి... ఆ **తర్వాత సొంత** మైదానంలో దానిని విజయ**వంతంగా** నిలబెట్టుకోగలిగింది. పేలవ బౌలింగ్ తర్వాత బ్యాటింగ్‌లోనూ బలహీనంగా కనిపించిన రాయల్స్ ఓటముల 'హ్యాట్రిక్' నమోదు చేసింది. ఛేదనలో హెట్‌మైర్, సామ్సన్ పోరాటం సరిపోక జట్టు చేతులెత్తేసింది.

- 58 పరుగులతో రాజస్తాన్ రాయల్స్ చిత్తు
- సుదర్శన్ అర్ధసెంచరీ, రాణించిన బౌలర్లు

అహ్మదాబాద్: శుబ్‌మన్ గిల్ సారథ్యంలోని గుజరాత్ టైటాన్స్ మరోసారి సమష్టి ప్రదర్శనతో ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. బుధవారం జరిగిన ఐపీఎల్ 18వ సీజన్ మ్యాచ్‌లో అన్ని రంగాల్లో ఆధిక్యం కనబర్చిన టైటాన్స్ 58 పరుగుల తేడాతో రాజస్తాన్ రాయల్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సాయి సుదర్శన్ (53 బంతుల్లో 82; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగగా... జోస్ బట్లర్ (25 బంతుల్లో 36; 5 ఫోర్లు), షారుఖ్ ఖాన్ (20 బంతుల్లో 36; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అండగా నిలిచారు. అనంతరం రాజస్తాన్ 19.2 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌటైంది. హెట్‌మైర్ (32 బంతుల్లో 52; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), సంజూ సామ్సన్ (28 బంతుల్లో 41; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించగా, ప్రసిధ్ కృష్ణకు 3 వికెట్లు దక్కాయి.

కీలక భాగస్వామ్యాలు...

ఆర్చర్ బౌలింగ్‌లో శుబ్‌మన్ గిల్ (2) ఆరంభంలోనే వెనుదిరిగినా... సుదర్శన్, బట్లర్ భాగస్వామ్యంలో జట్టు కోలుకుంది. వీరిద్దరు చక్కటి షాట్లతో స్కోరు బోర్డును నడిపించారు. తుషార్ దేశ్‌పాండే ఓవర్లో సుదర్శన్ 2 ఫోర్లు, సిక్స్ కొట్టడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 56 పరుగులకు చేరింది. రెండో వికెట్‌కు 47 బంతుల్లో 80 పరుగులు జోడించిన తర్వాత బట్లర్ వెనుదిరిగాడు. మరోవైపు సుదర్శన్ 32 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్నాడు. తీక్షణ ఓవర్లో వరుసగా 6, 4, 4 కొట్టి షారుఖ్ కూడా జోరు ప్రదర్శించాడు. అయితే తీక్షణ తర్వాతి ఓవర్లో అతను అవుట్ కావడంతో 62 పరుగుల (34 బంతుల్లో) మూడో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. రూథర్‌ఫర్డ్ (7) విఫలం కాగా, దూకుడుగా ఆడే



సాయి సుదర్శన్

ప్రయత్నంలో సుదర్శన్ సెంచరీ అవకాశం చేజార్చుకున్నాడు. చివర్లో తెవాటియా (12 బంతుల్లో 24 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), రషీద్ ఖాన్ (4 బంతుల్లో 12; 1 ఫోర్, 1 సిక్స్) ధాటిగా ఆడటంతో టైటాన్స్ భారీ స్కోరు నమోదు చేసింది. హైదరాబాద్‌తో జరిగిన గత మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో రాణించిన సుందర్‌ను గుజరాత్ ఈసారి ఆడించకపోగా... వ్యక్తిగత కారణాలతో హసరంగ మ్యాచ్‌కు దూరం కావడం రాజస్తాన్ బౌలింగ్‌ను బలహీనపర్చింది.

టపటపా...

ఛేదనలో ఏ దశలోనూ రాజస్తాన్ ఇన్నింగ్స్ గొప్పగా సాగలేదు. ఆరంభం నుంచి చివరి వరకు బ్యాటర్లలో తడబాటు కనిపించింది. గుజరాత్ బౌలర్లంతా సమష్టి ప్రదర్శనతో రాయల్స్‌ను కట్టడి చేశారు. రెండు పరుగుల వ్యవధిలో జైస్వాల్ (6), నితీశ్ రాణా (1) వెనుదిరగ్గా... సామ్సన్, రియాన్ పరాగ్ (14 బంతుల్లో 26; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ఆదుకునే ప్రయత్నం చేశారు. తాను ఆడిన తొలి 8 బంతుల్లోనే 3 సిక్స్‌లు కొట్టిన పరాగ్ ఎక్కువసేపు నిలవలేకపోగా, ధ్రువ్ జురేల్ (5) విఫలమయ్యాడు. 47 బంతుల్లో 102 పరుగులు చేయాల్సిన స్థితిలో సామ్సన్‌ను ప్రసిధ్ అవుట్ చేయడంతో రాయల్స్ ఆశలు గల్లంతయ్యాయి. చివర్లో హెట్‌మైర్ చేసిన ప్రయత్నం ఏమాత్రం సరిపోలేదు.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి) సామ్సన్ (బి) దేశ్‌పాండే 82; గిల్ (బి) ఆర్చర్ 2; బట్లర్ (ఎల్బీ) (బి) తీక్షణ 36; షారుఖ్ (స్టంప్డ్) సామ్సన్ (బి) తీక్షణ 36; రూథర్‌ఫర్డ్ (సి) సామ్సన్ (బి) సందీప్ 7; తెవాటియా (నాటౌట్) 24; రషీద్ (సి) జైస్వాల్ (బి) దేశ్‌పాండే 12; అర్షద్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు)** 217. **వికెట్ల పతనం:** 1-14, 2-94, 3-156, 4-163, 5-187, 6-201. **బౌలింగ్:** ఆర్చర్ 4-0-30-1, ఫారుఖీ 4-0-38-0, దేశ్‌పాండే 4-0-53-2, సందీప్ 4-0-41-1, తీక్షణ 4-0-54-2. **రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్:** యశస్వి జైస్వాల్ (సి) రషీద్ (బి) అర్షద్ 6; సామ్సన్ (సి) సాయికిషోర్ (బి) ప్రసిధ్ 41; నితీశ్ రాణా (సి) ఖెజ్రోలియా (బి) సిరాజ్ 1; పరాగ్ (సి) బట్లర్ (బి) ఖెజ్రోలియా 26; జురేల్ (సి) సుదర్శన్ (బి) రషీద్ 5; హెట్‌మైర్ (సి) సాయికిషోర్ (బి) ప్రసిధ్ 52; శుభమ్ దూబే (ఎల్బీ) (బి) రషీద్ 1; ఆర్చర్ (సి) గిల్ (బి) ప్రసిధ్ 4; తీక్షణ (సి) సుదర్శన్ (బి) సాయికిషోర్ 5; దేశ్‌పాండే (సి) రషీద్ (బి) సాయి కిషోర్ 3; సందీప్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (19.2 ఓవర్లలో ఆలౌట్)** 159. **వికెట్ల పతనం:** 1-10, 2-12, 3-60, 4-68, 5-116, 6-119, 7-144, 8-145, 9-150, 10-159. **బౌలింగ్:** సిరాజ్ 4-0-30-1, అర్షద్ 2-0-19-1, ప్రసిధ్ కృష్ణ 4-0-24-3, ఖెజ్రోలియా 3-0-29-1, రషీద్ 4-0-37-2, సాయికిషోర్ 2.2-0-20-2.



ప్రసిధ్ కృష్ణ

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
గుజరాత్	5	4	1	8	1.413
ఢిల్లీ	3	3	0	6	1.257
బెంగళూరు	4	3	1	6	1.015
పంజాబ్	4	3	1	6	0.289
లక్నో	5	3	2	6	0.078
కోల్‌కతా	5	2	3	4	-0.056
రాజస్తాన్	5	2	3	4	-0.733
ముంబై	5	1	4	2	-0.010
చెన్నై	5	1	4	2	-0.889
హైదరాబాద్	5	1	4	2	-1.629

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు X ఢిల్లీ
వేదిక: బెంగళూరు

రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

జూన్‌లో కన్నప్ప



విష్ణు మంచు, యోగి ఆదిత్యనాథ్, మోహన్‌బాబు, ప్రభుదేవా

విష్ణు మంచు హీరోగా నటించిన పాన్ ఇండియన్ మూవీ 'కన్నప్ప' కొత్త విడుదల తేదీపై స్పష్టత వచ్చింది. జూన్ 27న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. కొత్త రిలీజ్ డేట్‌కి సంబంధించిన పోస్టర్‌ని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విడుదల చేశారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన 'కన్నప్ప'లో ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించారు. మంచు మోహన్‌బాబు, బ్రహ్మానందం, ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, శరత్‌కుమార్, కాజల్ అగర్వాల్ తదితరులు ఇతర కీలక పాత్రధారులు. మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కావాల్సింది. వీఎఫ్ఎక్స్ పనుల ఆలస్యం వల్ల రిలీజ్‌ని వాయిదా వేశారు. కాగా మోహన్‌బాబు, విష్ణు, ప్రభుదేవా తదితరులు సోమవారం యోగి ఆదిత్యనాథ్‌ను కలిశారు. ఈ సందర్భంగా చిత్రకారుడు రమేష్ గొరిజాల గీసిన చిత్రపటాన్ని ముఖ్యమంత్రికి మోహన్‌బాబు బహూకరించారు. అనంతరం 'కన్నప్ప' కొత్త రిలీజ్ డేట్ (జూన్ 27) పోస్టర్‌ను ఆదిత్యనాథ్ విడుదల చేసి, యూనిట్‌ని అభినందించారు.

సమయం ఆసన్నమైంది



ఎన్టీఆర్

ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'ఎన్టీఆర్ నీల్' (వర్కింగ్ టైటిల్) సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో ఫిబ్రవరి 20న ప్రారంభమైంది. కానీ ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్ పాల్గొనలేదు. ఇప్పుడు ఈ సినిమా షూట్‌లో ఎన్టీఆర్ పాల్గొనే సమయం ఆసన్నమైందని, ఈ నెల 22 నుంచి చిత్రీకరణలో పాల్గొంటారని యూనిట్ బుధవారం పేర్కొంది.

వేట సాగెలే..!



నాని

నాని హీరోగా నటించిన తాజా చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి హీరోయిన్. వాల్ పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకాలపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ చిత్రం మే 1న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'అబ్కీ బార్ అర్జున్ సర్కార్' అనే పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేసి, ఈ సినిమా ట్రైలర్‌ను ఈ నెల 14న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 'వేటు వేసినా వేట సాగెలే... గీత గీసినా కోత మారునా నేడే... మాటు వేసినా ఆపదే ఇదే... యాడ దాగినా ఆప లేరులే..!' అంటూ సాగుతుందీ 'అబ్కీ బార్ అర్జున్ సర్కార్' పాట. సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ స్వరపరచిన ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యం అందించగా అనురాగ్ కులకర్ణి పాడారు. ''హిట్ 3' సినిమాలో నాని చేసిన అర్జున్ సర్కార్ పాత్ర వ్యక్తిత్వాన్ని తెలిపేలా ఈ పాట ఉంటుంది. తప్పుకు ప్రతీకారం తీర్చుకోవాలనుకునే అతని కఠినత్వం, శత్రువులకు అతనొక పీడ కలలా ఉండటం వంటి అంశాలను తెలిపేలా ఈ పాట ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ముచ్చటగా బంధాలే...



ప్రదీప్ చిలుకూరి, సయీ, విజయశాంతి, కల్యాణ్ రామ్, అశోక్‌వర్ధన్

కల్యాణ్ రామ్, సయీ మంజ్రేకర్ జంటగా నటించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ఈ సినిమాలో కల్యాణ్ రామ్ తల్లి పాత్రలో విజయశాంతి నటించారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'ముచ్చటగా బంధాలే ఇచ్చటనే కలిశాయే...' అంటూ సాగే రెండో పాటని ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విడుదల చేశారు. రఘురామ్ సాహిత్యం అందించిన ఈ పాటని హరిచరణ్ పాడారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో విజయశాంతి మాట్లాడుతూ- ''కల్యాణ్ రామ్ తల్లి గురించి చాలా అద్భుతంగా చెప్పాడు. ఈ సినిమా కోసం నిజాయతీగా చాలా కష్టపడ్డాం... చాలా పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నాను'' అన్నారు. కల్యాణ్ రామ్ మాట్లాడుతూ- ''ఒక అమ్మ ప్రాణాన్ని పణంగా పెట్టి బిడ్డకి జన్మనిస్తుంది. మనం వేసే ప్రతి అడుగు అమ్మ నేర్పిందే. అలాంటి అమ్మలని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఆ బాధ్యత కోసం మనం ఎంత త్యాగం చేసినా సరిపోదు. ఈ కథాంశంతో రూపొందిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ఈ నెల 12న మా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి తమ్ముడు (ఎన్టీఆర్) వస్తాడు'' అన్నారు.

హాయిగా నవ్వుకోవచ్చు

- ప్రదీప్ మాచిరాజు



'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' తొలి టికెట్‌ను కొనుగోలు చేసిన రామ్‌చరణ్‌తో ప్రదీప్

''అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రంలో వినోదం చాలా సహజంగా కుదిరింది. కుటుంబ ప్రేక్షకులు మా నుంచి ఎలాంటి కథని ఆశిస్తారో అలాంటి కథ ఈ సినిమాలో ఉంది. కుటుంబమంతా కలిసి మా సినిమా చూస్తూ రెండున్నర గంటలు హాయిగా నవ్వుకోవచ్చు'' అని ప్రదీప్ మాచిరాజు తెలిపారు. నితిన్-భరత్ దర్శకత్వంతో ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి జంటగా నటించిన చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. మాంక్స్- మంకీస్ బ్యానర్‌పై రూపొందిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రదీప్ మాచిరాజు మాట్లాడుతూ- ''సినిమా అంటే ప్యాషన్ ఉన్న నేను, నా మిత్రులందరూ కలిసి 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' నిర్మించాం. డైరెక్టర్స్ నితిన్-భరత్ అద్భుతంగా తీసి, నన్ను సర్‌ప్రైజ్ చేశారు. కథలో కామెడీ ఉన్న సినిమా చేసి చాలా కాలమైందని ఈ మూవీలో నటించిన బ్రహ్మానందంగారు ప్రశంసించడం సంతోషం. మైత్రీ మూవీ మేకర్స్ వారు మా చిత్రాన్ని రిలీజ్ చేస్తుండటంతో సినిమా విజయంపై మా నమ్మకం మరింత పెరిగింది'' అన్నారు.



వైష్ణవీ చైతన్య, సిద్ధు, బీవీఎస్ఎన్ ప్రసాద్, భాస్కర్

నా కామెడీ టైమింగ్ మిస్ కాలేదు

- సిద్ధు జొన్నలగడ్డ

''డీజే టిల్లు, టిల్లు స్క్వేర్ సినిమాలతో నాకు ఓ కామెడీ టైమింగ్ ఏర్పడింది. ఆ టైమింగ్‌ను 'జాక్' చిత్రంలో మిస్ అవ్వకుండా చేశారు భాస్కర్. ఈ చిత్రం రెండు వందల శాతం అందరికీ నచ్చుతుంది. ఎవర్నీ నిరాశపరచదు'' అని హీరో సిద్ధు జొన్నలగడ్డ చెప్పారు. 'బొమ్మరిల్లు' మూవీ ఫేమ్ భాస్కర్ దర్శకత్వంలో సిద్ధు జొన్నలగడ్డ, వైష్ణవీ చైతన్య జంటగా నటించిన చిత్రం 'జాక్-కొంచెం క్రాక్'. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి నిర్మాత సూర్యదేవర నాగవంశీ, దర్శకులు చందు మొండేటి, కార్తీక్ దండు, కల్యాణ్ శంకర్ అతిథులుగా హాజరై, 'జాక్' చిత్రాన్ని అందరూ చూసి సక్సెస్ చేయాలని కోరారు. 'బొమ్మరిల్లు' భాస్కర్ మాట్లాడుతూ- ''జాక్' మనందరి కథ. అందరూ చూసి ఎంజాయ్ చేయండి'' అన్నారు. ''జాక్' పెద్ద హిట్ అవుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు బీవీఎస్ఎన్ ప్రసాద్. ''ఈ చిత్రంలో నటించడం ఎంతో ఆనందంగా ఉంది'' అని వైష్ణవీ చైతన్య అన్నారు.

మనసున మోగే మంగళ నాదస్వరమే...



శర్వానంద్, సంయుక్త

'దర్శనమే మధుర క్షణమే... నీవు... నేను... ఇక మనమే... మనసున మోగే మంగళ నాదస్వరమే... నాదాక నిన్ను నడిపింది ప్రేమే...' అంటూ సాగుతుంది 'దర్శనమే' పాట. శర్వానంద్ హీరోగా నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ 'నారి నారి నడుమ మురారి'. ఈ చిత్రంలో సంయుక్త, సాక్షీ వైద్య హీరోయిన్లుగా నటిస్తున్నారు. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకాలపై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ చిత్రం నుంచి 'దర్శనమే...' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు విశాల్ చంద్రశేఖర్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా యాజిన్ నిజార్ పాడారు.

తెలంగాణ దండోరా



శివాజీ

శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మణిక, అనూష, రాధ్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో ముప్పానేని రవీంద్ర బెనర్జీ నిర్మిస్తున్నారు. ఈ సినిమా సెకండ్ షెడ్యూల్ మొదలైంది. 25 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో శివాజీ పాల్గొంటున్నారు. ''అగ్ర వర్ణాలకు చెందిన అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నా, అగ్ర వర్ణాలకు ఎదురు తిరిగినా ఎలాంటి దౌర్జన్యకాండ జరుగుతుందనే అంశాన్ని ఆధారంగా చేసుకుని 'దండోరా' తీస్తున్నాం. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో మన పురాతన ఆచారాలు, సాంప్రదాయాలను ఆవిష్కరిస్తూనే, హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల కలయికతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం'' అని యూనిట్ పేర్కొంది.

పోలీస్ స్టేషన్‌లో భూతాలు!



మనోజ్ బాజ్‌పాయ్



రామ్‌గోపాల్ వర్మ

'సత్య (1998), కౌన్ (1999), శూల్' (1999) వంటి సినిమాల తర్వాత బాలీవుడ్ నటుడు మనోజ్ బాజ్‌పాయ్, దర్శక-నిర్మాత రామ్‌గోపాల్ వర్మ మరో సినిమా చేయనున్నారు. తన తాజా చిత్రం 'పోలీస్ స్టేషన్ మే భూత్'లో మనోజ్ బాజ్‌పాయ్ నటించనున్నట్లు రామ్‌గోపాల్ వర్మ పేర్కొన్నారు. ఈ టైటిల్‌కి 'యూ కెనాట్ కిల్ ది డెడ్' అనేది క్యాప్షన్. ''హారర్, గ్యాంగ్‌స్టర్, రొమాంటిక్, పొలిటికల్, అడ్వెంచర్, థ్రిల్లర్స్... వంటి సినిమాలు చేశాను. కానీ ఇప్పటివరకు నేను హారర్ కామెడీ జానర్‌లో సినిమా చేయలేదు. 'పోలీస్ స్టేషన్ మే భూత్' హారర్ కామెడీ ఫిల్మ్. పోలీస్‌స్టేషన్‌లో ఓ భయంకరమైన ఎన్‌కౌంటర్ జరుగుతుంది. ఈ ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన గ్యాంగ్‌స్టర్స్ భూతాలు అవుతారు. దీంతో ఆ పోలీస్ స్టేషన్ హాంటెడ్ స్టేషన్‌గా మారిపోతుంది. మరి... ఈ గ్యాంగ్‌స్టర్ భూతాల నుంచి పోలీసులు ఎలా తప్పించుకుంటారు? అన్నదే ఈ సినిమా కథ'' అని 'ఎక్స్' వేదికగా రామ్‌గోపాల్ వర్మ పేర్కొన్నారు.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
380	137
73,847	22,399

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

నాస్‌డాక్	16,571	△ 1,303
డోజోన్స్	39,817	△ 2,171
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,679	▽ 231
డాక్స్	19,671	▽ 609
షాంఘై	3,187	△ 41
నికాయ్	31,714	△ 1,299

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	
90,161	△ 1,611
బంగారం (99.5 స్వచ్ఛత)	
89,800	△ 1,650
వెండి (కిలో)	
90,669	△ 306

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఛార్జీలు	84.05	87.68
£	బ్రిటన్ పౌండ్	ఛార్జీలు	107.73	112.68
€	యూరో	ఛార్జీలు	91.93	96.50
¥	జపాన్ ఎన్ (100)	ఛార్జీలు	47.00	69.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఛార్జీలు	49.69	54.63
S$	సింగపూర్ డాలర్	ఛార్జీలు	61.39	66.12
SAR	సౌదీ రియాల్	ఛార్జీలు	21.99	23.55
UAE D	యూఏఈ దిర్హామ్	ఛార్జీలు	22.48	24.26
¥	చైనా యువాన్	ఛార్జీలు	10.87	12.69



ఇక రుణాలు మరింత చౌక!

రుణగ్రహీతలకు మరోసారి ఆర్‌బీఐ శుభవార్త చెప్పింది. గృహ, వాహన, వ్యక్తిగత, కార్పొరేట్ రుణాలు మరింత చౌకగా లభించేలా.. ఈఎంఐల భారం ఇంకాస్త దిగొచ్చేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఒకపక్క ముదురుతున్న ట్రంప్ టారిఫ్ వార్.. మరోపక్క దిగజారుతున్న వృద్ధి నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థకు చేదోడుగా నిలుస్తూ... వరుసగా రెండోసారి కీలక పాలసీ రేట్లను తగ్గించింది. అంతేకాదు, సమీప భవిష్యత్తులో మరిన్ని రేట్ల కోతలు ఉంటాయన్న సంకేతాలివ్వడం విశేషం! ఆర్‌బీఐ చర్యలకు అనుగుణంగా కొన్ని బ్యాంకులు కూడా తక్షణం రుణాలపై వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి.



ముంబై: రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి పరపతి సమీక్షలోనూ వడ్డీ రేట్ల కోతకు ఓకే చెప్పింది. అమెరికా టారిఫ్‌ల దెబ్బకు ఆర్థిక వ్యవస్థకు గట్టిగానే సెగ తగిలే అవకాశం ఉండటంతో కీలక పాలసీ రేటు.. రెపోను వరుసగా రెండోసారి తగ్గించింది. దీంతో రెపో రేటు ఇప్పుడున్న 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గనుంది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సారథ్యంలోని పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సభ్యులు ఏకగ్రీవంగా ఈ నిర్ణయానికి ఓటేశారు. దీంతో బ్యాంకుల రుణ రేట్లు కూడా దిగిరానున్నాయి. ప్రతీకార సుంకాల్లో భాగంగా దాదాపు 60 దేశాలపై ట్రంప్ టారిఫ్‌లు విధించడం తెలిసిందే. భారత్‌పై కూడా 26 శాతం సుంకాలు వడ్డించారు. మరోపక్క, అమెరికాతో అమీతుమీ అంటూ చైనా కూడా దీటుగా సుంకాలతో విరుచుపడుతుండటంతో వాణిజ్య యుద్ధం అంతకంతకూ తీవ్రతరం అవుతోంది. ఈ నేపథ్యంలో నేపథ్యంలో వృద్ధికి మరింత దన్నుగా నిలిచేందుకు ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తగ్గింపు బాటలో కొనసాగుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి సమీక్షలో దాదాపు ఐదేళ్ల తర్వాత (2020 మే) తొలిసారి రెపో రేటును పావు శాతం తగ్గించింది. ఇప్పుడు మరో పావు శాతం కోతతో రెపో రేటు 2022 నవంబర్ స్థాయికి దిగొచ్చింది.

వృద్ధి రేటు అంచనాలు డౌన్...

ట్రేడ్ వార్, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితుల ప్రభావంతో మన ఎగుమతులు, ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం ఉంటుందని ఆర్‌బీఐ పేర్కొంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) జీడీపీ వృద్ధి అంచనాలను 6.7 శాతం నుంచి 6.5 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. మరోపక్క, మాంద్యం ఆందోళనలు, ఆర్థిక మందగమనం కారణంగా అంతర్జాతీయంగా చమురు రేటు దిగొస్తుండటంతో ద్రవ్యోల్బణం అంచనాలను కూడా 4.5 శాతానికి కుదించింది.

ఇతర ముఖ్యాంశాలు...

- పరపతి విధాన స్థితిని ఇప్పుడున్న 'తటస్థం' నుంచి 'సానుకూలానికి' తగ్గించింది. అంటే, ఎలాంటి తీవ్ర ప్రతికూలాంశాలు లేకపోతే, రాబోయే సమీక్షల్లో రేట్ల తగ్గింపు లేదా యథాతథ స్థితిని కొనసాగించడం జరుగుతుంది.
- పర్సన్-టు-మర్చంట్ (పీ2ఎం) పేమెంట్‌లకు సంబంధించి యూపీఐ లావాదేవీ పరిమితిని పెంచడానికి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కి అనుమతించింది. ప్రస్తుతం పర్సన్-టు-పర్సన్ (పీ2పీ), పీ2ఎం పరిమితి రెండూ రూ. లక్షగా ఉంది. అయితే, పీ2ఎంలో కొన్ని నిర్దిష్ట వినియోగాలకు రూ. 2 లక్షలు, రూ. 5 లక్షలు ఇలా అధిక పరిమితులకు మినహాయింపు ఉంటోంది. అయితే, ఇప్పుడు ఆర్‌బీఐ అనుమతితో పీ2ఎంపై ఉన్న రూ. లక్ష పరిమితిని యూజర్ల అవసరాలకు అనుగుణంగా పెంచడానికి ఎన్‌పీసీఐకి అవకాశం లభిస్తుంది. పీ2పీ పరిమితి మాత్రం రూ. లక్షగానే కొనసాగుతుంది.
- బంగారు రుణాలపై నిబంధనలను కఠినతరం చేస్తూ ముసాయిదా మార్గదర్శకాలను ఆర్‌బీఐ విడుదల చేసింది. రుణాల మంజూరు సమయంలో తనఖాగా పెట్టే పసిడి స్వచ్ఛత, బరువు లెక్కింపు ఇతరత్రా పద్ధతులకు సంబంధించి గోల్డ్ లోన్ పరిశ్రమలోని రుణదాతలంతా ఇకపై ఒకే విధమైన డాక్యుమెంటేషన్‌ను అనుసరించాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. అన్ని బ్రాంచీల్లోనూ ఒకే ప్రామాణిక విధానం అమలు చేయాలని ముసాయిదాలో పేర్కొంది.
- తదుపరి పాలసీ సమీక్ష 2025 జూన్ 4 నుంచి 6 వరకు జరుగుతుంది.

ఈఎంఐలు దిగొస్తాయ్..

- రెండోసారీ రెపో రేటు కోత
- 6.25% నుంచి 6%కి తగ్గింపు
- ట్రంప్ ట్రేడ్ వార్‌తో ఎకానమీకి, ఎగుమతులకు దెబ్బ
- వృద్ధి అంచనాలు 6.5%కి కట్
- పరపతి విధానం 'తటస్థం' నుంచి 'సానుకూలానికి' మార్పు
- మరిన్ని రేట్ల కోతలకు సంకేతం...
- ద్రవ్యోల్బణం అంచనాలు కూడా 4 శాతానికి కుదింపు
- ఆర్‌బీఐ పాలసీ సమీక్షలో కీలక నిర్ణయాలు

ఎకానమీకి దన్ను...



రెపో రేటు తగ్గింపుతో పాటు పరపతి విధాన స్థితిని తటస్థం నుంచి సానుకూలానికి మార్చడం అనేది దేశీ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలుస్తుంది. టారిఫ్ ప్రభావం నుంచి ఎకానమీకి చేదోడుగా నిలిచేందుకు ఈ చర్యలు తోడ్పడతాయి.

– సీఎస్ శెట్టి, ఎస్‌బీఐ చైర్మన్

వాహన పరిశ్రమకు సానుకూలం...



ఆర్‌బీఐ రెపో తగ్గింపుతో వాహన కొనుగోలుదారులపై భారం తగ్గుతుంది. దీనివల్ల మళ్లీ అమ్మకాలు పుంజుకుని ఆటోమొబైల్ రంగంలో సానుకూల సెంటిమెంట్ నెలకొంటుంది.

– శైలేష్ చంద్ర, సియామ్ ప్రెసిడెంట్

వృద్ధికి ఊతం...



ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో రెపో కోతతో పాటు పరపతి విధానాన్ని సానుకూలానికి మార్చడం మన ఆర్థిక వ్యవస్థకు చాలా పెద్ద ప్లస్. దీనికి ప్రభుత్వ సానుకూల ఆర్థిక విధానం కూడా తోడవ్వడంతో వృద్ధి పుంజుకుంటుంది.

– చంద్రజిత్ బెనర్జీ, సీఐఐ డైరెక్టర్ జనరల్

ఇళ్ల అమ్మకాలు పుంజుకుంటాయ్...



రియల్టీ రంగంలో వినియోగదారుల సెంటిమెంట్‌కు జోష్ నింపేలా సరైన సమయంలో రేట్ల కోత నిర్ణయం వెలువడింది. దీనివల్ల గృహ రుణాలపై వడ్డీ రేట్లు దిగొచ్చి... మధ్య ఆదాయ, అందుబాటు ధర ఇళ్ల విభాగాల్లో అమ్మకాలు పుంజుకుంటాయి.

– బొమన్ ఇరానీ, క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు

4 బ్యాంకులు బోణీ...

ఆర్‌బీఐ రెండోసారి రెపో తగ్గింపు ప్రకటనతో నాలుగు ప్రభుత్వ రంగ బ్యాంకులు బోణీ చేశాయి. ఇందులో ఇండియన్ బ్యాంక్ అత్యధికంగా రెపో ఆధారిత రుణ రేటు (ఆర్‌బీఎల్‌ఆర్)ను 35 బేసిస్ పాయింట్లు (0.35%) తగ్గించి 8.7%కి చేర్చింది. శుక్రవారం నుంచి అమల్లోకి రానుంది. ఇక పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఎల్‌ఆర్‌లో పావు శాతం కోతతో ఇప్పుడున్న 9.1% నుంచి 8.85 శాతానికి తగ్గించాయి. ఇవి వెంటనే అమల్లోకి వచ్చాయి. యూకో బ్యాంక్ గురువారం నుంచి అమలయ్యేలా ఆర్‌బీఎల్‌ఆర్‌ను 8.8%కి తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ప్రస్తుత, కొత్త రుణ గ్రహీతలకు వడ్డీ రేట్లు తగ్గను న్నాయి. ఇతర బ్యాంకులు కూడా త్వరలోనే ఇదే బాట పట్టే అవకాశం ఉంది.

నేను భారతంలో సంజయుడిని కాదు...



వడ్డీ రేట్లు ఏ స్థాయికి చేరుతాయో చెప్పలేను. నేను భారతంలో సంజయుడిని కాదు. సంజయ్‌ని మాత్రమే. నాకు అలాంటి దివ్య దృష్టి ఏదీ లేదు. పాలసీ నిర్ణయం కస్టమర్లకు బదిలీ అయ్యేందుకు తగినంత ద్రవ్య సరఫరా (లిక్విడిటీ)ను అందిస్తాం. తాజా ప్రతీకార సుంకాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొంది. ప్రపంచ వృద్ధి, ద్రవ్యోల్బణంపై ఇది ప్రతికూల ప్రభావం చూపనుంది. ఈ నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు తీవ్రంగా దిద్దుబాటుకు గురవుతున్నాయి. ముడిచమురు ధరలు దిగొస్తున్నాయి. దీంతో సెంట్రల్ బ్యాంకులు తమ దేశీ ప్రాధాన్యతలను అనుగుణంగా తగిన చర్యలు చేపట్టాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

– సంజయ్ మల్హోత్రా, ఆర్‌బీఐ గవర్నర్

గృహ రుణాలపై ఊరట ఇలా...

ఆర్‌బీఐ వరుసగా రెండో సారీ రెపో రేటును పావు శాతం తగ్గించడంతో గృహ రుణ గ్రహీతలకు మరింత ఊరట లభించనుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి తాజా రెపో రేటు కోతకు ముందు రూ.50 లక్షల గృహ రుణాన్ని 20 ఏళ్ల కాలానికి 8.75% వడ్డీ రేటుతో తీసుకున్నారనుకుందాం. అతనికి ప్రస్తుతం రూ.44,186 చొప్పున నెలవారీ వాయిదా(ఈఎంఐ) పడు తుంది. బ్యాంకులు ఈ పావు శాతం కోతను నేరు గా కస్టమర్లకు బదలాయిస్తే... వడ్డీ రేటు 8.5 శాతానికి తగ్గు తుంది. దీని ప్రకారం ఈఎంఐ రూ. 43,391కి దిగొస్తుంది. అంటే నెలకు రూ.795 చొప్పున మిగిలినట్లు లెక్క. మిగతా రుణ కాల వ్యవధిలో ఎలాంటి మార్పులు జరగకుండా అదే వడ్డీ రేటు కొనసాగితే మొత్తం వడ్డీ రూ. 1,90,649 ఆదా అవుతుంది. అయితే, రుణ కాల వ్యవధిలో ఎలాంటి మార్పు ఉండదు. ఒకవేళ నెలవారీ చెల్లించే ఈఎంఐని ఇంతకుముందు లాగే (రూ.44,186 చొప్పున) కొనసాగిస్తే.. రుణ కాల వ్యవధి 10 నెలలు తగ్గుతుంది.

20 ఏళ్ల కాల వ్యవధికి రూ.50 లక్షల గృహ రుణం

	ఈఎంఐ (రూ.లలో)	మొత్తం వడ్డీ (రూ.లలో)
వడ్డీ రేటు 8.75%	44,186	56,04,528
వడ్డీ రేటు 8.5%	43,391	54,13,879
ఎంత ఆదా	795	1,90,649

మార్కెట్‌ను వీడని నష్టాలు

అరశాతం పతనమైన సూచీలు



ముంబై: రెపో రేటును రెండోసారి తగ్గించడంతో పాటు భవిష్యత్తులో మరిన్ని కోతలు ఉంటాయని ఆర్‌బీఐ సంకేతాలు ఇచ్చినప్పటికీ.. ఆర్థిక వృద్ధి మందగమన ఆందోళనలతో ఇన్వెస్టర్లు అమ్మకాలకే మొగ్గుచూపారు. చైనాపై అమెరికా టారిఫ్‌లు 104 శాతానికి చేరుకోవడంతో అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మన మార్కెట్లు కూడా నష్టాల బాట పట్టాయి. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 380 పాయింట్లు పతనమై 73,847 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 137 పాయింట్లు నష్టపోయి 22,399 వద్ద నిలిచింది. విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాల ప్రభావాలతో రూపాయి విలువ భారీగా పతనమవుతోంది. డాలర్ మారకంలో బుధవారం 42 పైసలు క్షీణించి 86.68 వద్ద ముగిసింది. నాలుగు ట్రేడింగ్ సెషనల్లో భారత కరెన్సీ 138 పైసలు క్షీణించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

మరిన్ని పీఎస్‌యూల్లో ఇన్వెస్ట్ చేయాలి	అనిశ్చితిలోనూ పటిష్టంగా ఎగుమతులు

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

జర్నలిజం కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం ..ప్రభుత్వ గుర్తింపు పొందిన జర్నలిజం కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

కోర్సులు-అర్హతలు

- » **పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం(పీజీడీజే):** ఈ కోర్సు కాల వ్యవధి 12 నెలలు. కనీస విద్యార్హత డిగ్రీ.
- » **డిప్లొమా ఇన్ జర్నలిజం(డీజే):** ఈ కోర్సు కాల వ్యవధి 6 నెలలు. కనీస విద్యార్హత డిగ్రీ.
- » **డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం(డీటీవీజే):** ఈ కోర్సు కాలవ్యవధి 6నెలలు. కనీస విద్యార్హత డిగ్రీ.
- » **సర్టిఫికెట్ కోర్స్ ఆఫ్ జర్నలిజం(సీజే):** ఈ కోర్సు కాల వ్యవధి 6 నెలలు. కనీస విద్యార్హత పదో తరగతి.

కోర్సు విధానం

ఈ కోర్సులను రెగ్యులర్‌గాను, కరస్పాండెన్స్ పద్ధతి(దూర విద్య)లోనూ చేయవచ్చు. ఆన్‌లైన్ తరగతుల సౌకర్యం ఉంది. ఇంటి దగ్గర నుంచే పాఠ్యాంశాలు లైవ్‌లో వినవచ్చు. తెలుగు లేదా ఇంగ్లిష్‌ను బోధనా మాధ్యమంగా ఎంచుకోవచ్చు.

ప్రవేశాలు

- » ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు జరుగుతున్నాయి. కళాశాల వెబ్‌సైట్ www.apcj.in ద్వారా పేరు నమోదు చేసుకొని దరఖాస్తు ఫారాలు పొందొచ్చు.
- » **దరఖాస్తు ఫారాలు పొందడానికి చివరి తేది:** 19.04.2025
- » **అడ్మిషన్లు పొందడానికి చివరి తేది:** 28.04.2025
- » **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.apcj.in

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు (మ్యుజిషియన్) పోస్టులు



ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా అగ్నివీర్ వాయు (మ్యుజిషియన్).. ఇన్‌టేక్ 01/2026 నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **సంగీత వాయిద్యాలు:** కన్సర్ట్ ఫ్లూట్/పికోలో, ఒబో, ఈబీ/బీబీలో క్లారినెట్, ఈబీ/బీబీలో సాక్సోఫోన్, ఎఫ్/బీబిలో ఫ్రెంచ్ హార్న్,ఈబీ/సీ/బీబిలో ట్రంపెట్, బీబీ/జీలో ట్రోంబోన్, యుఫోనియం, ఈబీ/బీబీలో బాస్/ట్యూబా, కీబోర్డ్ /ఆర్గాన్/పియానో, గిటార్(ఆకొస్టిక్/లీడ్/బాస్),వయోలిన్, వయోలా, స్ట్రింగ్ బాస్,భారతీయ శాస్త్రీయ వాయిద్యాల్లోని ఏదైనా ఒక దాంట్లో నైపుణ్యాన్ని కలిగి ఉండాలి.
- » **అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాల/బోర్డు నుంచి మెట్రిక్యులేషన్/పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి లేదా తత్సమాన విద్యార్హత, నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలు, మ్యూజికల్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికేట్ ఉండాలి. వాయిద్య పరికరం వాయించడంలో ప్రావీణ్యం తప్పనిసరిగా ఉండాలి.
- » **వేతనం:** మొదటి ఏడాది రూ.30,000, రెండో ఏడాది రూ.33,000, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40,000.
- » **ఎంపిక విధానం:** మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ఇంగ్లిష్, అడాప్టబిలిటీ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 21.04.2025
- » **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేది:** 11.05.2025.
- » **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://agnipathvayu.cdac.in

- » బైపీసీతో ఎంబీబీఎస్, బీడీఎస్‌తో పాటు మరెన్నో కోర్సులు
- » ఆయుష్, బీఫార్మసీ, నర్సింగ్ సహా పలు కోర్సులు
- » వెటర్నరీ సైన్స్, అగ్రికల్చర్ కోర్సులు కూడా
- » ఏ కోర్సులో చేరినా.. బెస్ట్ కెరీర్స్ ఖాయం

బైపీసీతో విభిన్న కోర్సులివే!

'బైపీసీ'నా.. తర్వాత ఏంటి? అంటే... విద్యార్థుల నుంచి టక్కున వచ్చే సమాధానం.. ఎంబీబీఎస్‌లో చేరడం! అది కుదరకపోతే బీడీఎస్‌లోనైనా సీటు సొంతం చేసుకోవడం!! ఇందుకోసం నీట్‌లో ర్యాంకు సాధించేలా ఇంటర్ తొలిరోజు నుంచే కృషి చేస్తుంటారు! ఎంబీబీఎస్, బీడీఎస్‌లో సీటు రాకుంటే.. ఏం చేయాలి? అనే ప్రశ్న విద్యార్థులకు ఎదురవుతోంది. వాస్తవానికి బైపీసీ విద్యార్థులకు ఎంబీబీఎస్, బీడీఎస్‌తోపాటు మరెన్నో కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసిన విద్యార్థులకు ఉపయోగపడేలా.. బైపీసీతో విభిన్న కోర్సులు, కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..

ప్రస్తుతం బైపీసీ విద్యార్థులకు బ్యాచిలర్స్, పీజీ స్థాయిలో వినూత్న, విభిన్న కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆయుష్ కోర్సులు, బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ, నర్సింగ్, ఫార్మసీ వంటి పలు కోర్సుల్లో చేరే అవకాశముంది. వీటిలో ఏ కోర్సును పూర్తి చేసుకున్నా.. మెరుగైన కెరీర్ అవకాశాలు సొంతం చేసుకోవచ్చు.

ఆయుష్‌తో.. వైద్య రంగంలో కెరీర్

నీట్ యూజీలో ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థులు ఎంబీబీఎస్, బీడీఎస్‌ల్లో చేరుతుంటారు. ఎంబీబీఎస్, బీడీఎస్‌లకు ప్రత్యామ్నాయంగా నిలుస్తున్న కోర్సులే.. ఆయుష్ కోర్సులు! ఆయుర్వేదం, యోగా అండ్ నేచురోపతి, యునాని, సిద్ధ యోగ, హోమియోపతిలనే సంక్షిప్తంగా ఆయుష్ కోర్సులుగా పిలుస్తారు. ఇంటర్మీడియెట్ బైపీసీతో వైద్య రంగంలోనే కెరీర్ కోరుకునే వారు ఈ ఆయుష్ కోర్సులను ఎంచుకోవచ్చు. ఇటీవల కాలంలో అల్లోపతి వైద్యంతోపాటు సంప్రదాయ వైద్య రీతులుగా భావించే ఆయుష్ విభాగాలకు కూడా ఆదరణ పెరుగుతోంది.దీంతో ఈ కోర్సులు పూర్తి చేసుకున్నా.. వైద్య రంగంలో కెరీర్‌కు మార్గం వేసుకున్నట్లే!

బీహెచ్‌ఎంఎస్

బ్యాచిలర్ ఆఫ్ హోమియోపతిక్ మెడిసిన్ అండ్ సర్జరీ సంక్షిప్తంగా.. బీహెచ్‌ఎంఎస్. ఎంబీబీఎస్, బీడీఎస్ తర్వాత ఎంతో ఆదరణ పొందుతున్న కోర్సు ఇది. బీహెచ్‌ఎంఎస్ అర్హతతో నెలకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనంతో కొలువు సొంతం చేసుకునే అవకాశం ఉంది.ఉన్నత విద్యలో.. పీజీ స్థాయిలో మెటీరియా మెడికా, హోమియోపతిక్ ఫిలాసఫీ వంటి స్పెషలైజేషన్లకు డిమాండ్ నెలకొంది.

బీఏఎంఎస్

బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ.. బీఏఎంఎస్. ఈ కోర్సులోనూ ఎంబీబీఎస్‌లో మాదిరిగానే అనాటమీ, ఫిజియాలజీ, పెడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్ తదితర సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. వీటిలో నైపుణ్యం ద్వారా సహజ సిద్ధ ప్రక్రియలతో రోగులకు వైద్యం చేయగలిగే పట్టు లభిస్తుంది. ఉన్నత విద్యలో.. ఎండీ స్థాయిలో ఆయుర్వేద, ఎంఎస్-ఆయుర్వేద కోర్సులు చదవొచ్చు. ఎంబీబీఎస్‌లోని జనరల్ మెడిసిన్‌కు సరితూగే కాయ చికిత్స, జనరల్ సర్జరీకి సరితూగే శల్య తంత్ర పీజీలో స్పెషలైజేషన్లుగా ఉన్నాయి.

బీయూఎంఎస్

పూర్తిగా ప్రకృతి వైద్యంగా భావించే బీయూఎంఎస్(బ్యాచిలర్ ఆఫ్ యునానీ మెడికల్ సైన్స్) కోర్సు ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. బీయూఎంఎస్ పూర్తి చేసిన అభ్యర్థులు పీజీ స్థాయిలో గైనకాలజీ, సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్, జనరల్ మెడిసిన్, ఫార్మకాలజీలకు సరితూగే ఎండీ, ఎంఎస్ కోర్సులు చదివే అవకాశం ఉంది.



బీఎన్‌వైఎస్

బైపీసీ విద్యార్థులకు వైద్య రంగంలో అందుబాటులో ఉన్న మరో ప్రత్యామ్నాయ కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ నేచురోపతిక్ మెడికల్ సైన్సెస్ (బీఎన్‌వైఎస్). ఈ కోర్సును పూర్తి చేసిన వారికి యోగా, సిద్ధ యోగా వంటి విధానాల ద్వారా చికిత్స చేయగలిగే నైపుణ్యాలు లభిస్తాయి.

ఆయుష్ ప్రవేశాలు ఇలా

ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాలకు కూడా నీట్ యూజీ ర్యాంకు ఆధారంగానే కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేస్తారు. నీట్-యూజీ స్కోర్ ఆధారంగా.. ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయ్యాక.. ఆయుష్ కోర్సులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. వచ్చిన దరఖాస్తులు, అందుబాటులో ఉన్న సీట్లు, అభ్యర్థుల ప్రాథమ్యాలను పరిగణనలోకి తీసుకొని ప్రవేశం కల్పిస్తారు.

బీవీఎస్‌సీ అండ్ ఏహెచ్

బైపీసీ విద్యార్థులకు డాక్టర్ హోదా కల్పించే మరో కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ(బీవీఎస్‌సీ అండ్ ఏహెచ్). జంతువులకు వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు, పశువుల గర్భధారణ పద్ధతులపై అవగాహన కల్పించే కోర్సు ఇది. దీన్ని పూర్తి చేసుకుంటే.. పౌల్ట్రీ ఫారాలు, ప్రభుత్వ, ప్రైవేటు పశువైద్య ఆసుపత్రులు, పశుసంవర్థక శాలలు, వన్యమృగ సంరక్షణ కేంద్రాలు,జంతు ప్రదర్శనశాలలు, డెయిరీ ఫామ్స్, గొర్రెల పెంపక కేంద్రాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. తెలుగు రాష్ట్రాల్లో.. ఏపీలోని శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ, తెలంగాణలోని పి.వి.నరసింహరావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలో బీవీఎస్‌సీ అండ్ ఏహెచ్ కోర్సు అందుబాటులో ఉంది.

బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ

బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ.. సంక్షిప్తంగా బీపీటీ. వైద్య రంగంలో స్థిరపడాలనుకునే వారికి ప్రత్యామ్నాయంగా నిలుస్తున్న కోర్సు. ఈ కోర్సు పూర్తి చేస్తే ఫిజియోథెరపిస్ట్‌గా ఉద్యోగం దక్కించుకోవచ్చు. అదే విధంగా స్వయం ఉపాధి అవకాశాలు అందుకోవచ్చు.

పారా మెడికల్ కోర్సులు

బైపీసీ విద్యార్థులకు కెరీర్ అవకాశాలను ఖాయం చేస్తున్న కోర్సులు.. పారా మెడికల్ కోర్సులు. వీటిలో న్యూరో ఫిజియాలజీ టెక్నాలజీ, ఆప్టోమెట్రిక్ టెక్నాలజీ, రెనాల్ డయాలసిస్ టెక్నాలజీ, పెర్‌ఫ్యూజన్ టెక్నాలజీ, కార్డియాక్ కేర్ టెక్నాలజీ అండ్ కార్డియో వ్యాస్కులర్ టెక్నాలజీ, అనెస్థీషియాలజీ టెక్నాలజీ అండ్ ఆపరేషన్ థియేటర్, ఇమేజింగ్ టెక్నాలజీ కోర్సులు ముఖ్యమైనవి. వీటిని పూర్తి చేయడం ద్వారా హాస్పిటల్స్‌లోని ఆయా విభాగాల్లో టెక్నీషియన్స్‌గా ఉపాధి పొందొచ్చు.

బీఎస్సీ నర్సింగ్

బైపీసీ విద్యార్థులకు వైద్య రంగంలోనే కెరీర్ అందించే మరో కోర్సు.. బీఎస్సీ నర్సింగ్. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసుకున్న వారు నేరుగా నర్సులుగా కెరీర్ ప్రారంభించొచ్చు. పీజీ స్థాయిలో ఎమ్మెస్సీ నర్సింగ్ కోర్సులో మెడికల్ సర్జన్ నర్సింగ్, కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్, పీడియాట్రిక్స్, సైకియాట్రిక్ నర్సింగ్, ఆబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ నర్సింగ్, మెంటల్ హెల్త్ నర్సింగ్ తదితర స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి. వీరికి ఆస్పత్రుల్లో, ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో సూపర్‌వైజర్ల స్థాయిలో ఉద్యోగాలు లభిస్తాయి.

అగ్రికల్చర్ బీఎస్సీ

బైపీసీ విద్యార్థులకు అందుబాటులో మరో బెస్ట్ కోర్సు.. అగ్రికల్చరల్ బీఎస్సీ. వ్యవసాయ సాగు విధానాల్లో ఆధునిక పద్ధతులు, నూతన పరికరాల వినియోగం వంటి నైపుణ్యాలను అందించే కోర్సు ఇది. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ప్రైవేటు రంగంలో విత్తన ఉత్పాదక సంస్థలు, పౌల్ట్రీ ఫామ్స్‌లో అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వ విభాగంలో వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ వంటి ఉద్యోగాలు దక్కించుకోవచ్చు. బ్యాంకుల్లో సైతం రూరల్ బ్యాంకింగ్ ఆఫీసర్ల విభాగంలో కొలువులు అందిపుచ్చుకోవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ(ఏపీ), ఆచార్య జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ (తెలంగాణ) పరిధిలో పలు కళాశాలల్లో ఈ కోర్సును అందిస్తున్నారు.

బీఎఫ్ఎస్‌సీ

బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్(బీఎఫ్ఎస్‌సీ).. మత్స్య పెంపకం, సంరక్షణ,సేకరణ వంటి వాటికి సంబంధించి ప్రత్యేక పద్ధతులు, శాస్త్రీయ విధానాలపై అవగాహన కల్పించే కోర్సు ఇది. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ఆక్వాకల్చర్ సంస్థలు, ఆక్వా రీసెర్చ్ సంస్థలు ప్రధాన ఉపాధి వేదికలు. తెలంగాణలో పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ, ఏపీలో శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలో ఈ కోర్సు అందుబాటులో ఉంది.

బీటెక్-ఫుడ్ టెక్నాలజీ

ప్రస్తుత పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న మరో కోర్సు.. బీటెక్-ఫుడ్ టెక్నాలజీ. ఆహార ఉత్పత్తుల తయారీ, నాణ్యత, ప్రాసెసింగ్ సంబంధిత నైపుణ్యాలు అందించే కోర్సు ఇది. వీరు ఫుడ్ ప్రొడక్షన్ యూనిట్స్, ప్యాకేజ్డ్ ఫుడ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ సంస్థల్లో కొలువుదీరొచ్చు.

బీఎస్‌సీ (సీఏబీఎం)

బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ కమర్షియల్ అగ్రికల్చర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (సీఏబీఎం)... వ్యవసాయ విధానంలో ఆధునిక పద్ధతులు, లాభదాయకతపై అవగాహన కల్పించే కోర్సు ఇది. వీరికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, క్రాప్ పొడక్షన్ కంపెనీలలో మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. అగ్రికల్చరల్ అనుబంధ కోర్సుల్లో ప్రవేశాలను ఈఏపీసెట్‌లో అగ్రికల్చర్ స్ట్రీమ్ ర్యాంకు ఆధారంగా ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేస్తారు.

బీఎస్సీ (బీజెడ్‌సీ)

బైపీసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న సంప్రదాయ డిగ్రీ కోర్సు.. బీఎస్సీ(బీజెడ్‌సీ). ప్రస్తుతం బీజెడ్‌సీలోనూ మైక్రోబయాలజీ, జెనెటిక్స్, హ్యూమన్ జెనెటిక్స్, బయో టెక్నాలజీ, బయో ఇన్ఫర్మాటిక్స్ వంటి వినూత్న కాంబినేషన్లు అందుబాటు ఉన్నాయి. ఈ సబ్జెక్ట్‌లతో బీఎస్సీ పూర్తి చేసి.. తర్వాత సంబంధిత స్పెషలైజేషన్లతో పీజీతో లైఫ్ సైన్సెస్ విభాగాల్లో కొలువులు సొంతం చేసుకునే అవకాశం ఉంది. బీఎస్సీ తర్వాత ఇంటిగ్రేటెడ్ పీజీ + పీహెచ్‌డీ కోర్సులు చేసే అవకాశం కూడా ఉంది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-సోషియాలజీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-బ్యాంకింగ్ అవేర్‌నెస్

క్లుప్తంగా...

బెట్టింగ్ యాప్‌లపై సిట్ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నియంత్రణలో భాగంగా రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన బెట్టింగ్ కేసుల పురోగతిని ప్రభుత్వం ఇటీవల నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పరిశీలిస్తోంది. సిట్ దర్యాప్తునకు సంబంధించి సీఐడీ చీఫ్ శిఖాగోయల్ ఆధ్వర్యంలో బుధవారం సమీక్షా సమావేశం జరిగింది. కేసుల దర్యాప్తు, విచారణ కోసం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)ను రూపొందించాలని ఐజీ రమేశ్‌రెడ్డి సహా సిట్ సభ్యులు ఈ సమావేశంలో నిర్ణయించారు. వివిధ దశల్లో ఉన్న కేసుల దర్యాప్తు గురించి చర్చించారు. కేసుల తీవ్రత, చట్టపరమైన అంశాల గురించి పటిష్టమైన చర్యలు తీసుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతోపాటు బెట్టింగ్ యాప్స్ సంబంధిత కేసులను సులువుగా దర్యాప్తు చేసేందుకు సిట్ కేంద్రంగానే ఇన్వెస్టిగేటివ్ సపోర్ట్ సెంటర్ ఏర్పాటు చేసే విధంగా సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు అవసరమైన సిబ్బందిని వివిధ విభాగాల నుంచి సమీకరించేందుకు సిట్ ప్రయత్నాలు చేస్తోంది. ఎస్‌ఓపీ అనంతరం సంబంధిత యూనిట్ అధికారులు అనుసరించాల్సిన ప్రొసీజర్, అవసరమైన శిక్షణ, ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నారు.

'ముసద్దీలాల్'పై ఈడీ విచారణ నిలిపివేత

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: బంగారం కొనుగోలులో అక్రమాలతో లబ్ధి పొందారని ముసద్దీలాల్ జెమ్స్ అండ్ జ్యువెల్లర్స్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన కేసు విచారణను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు రూ.225 కోట్ల మేర మెటల్స్ అండ్ మినరల్స్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎంఎంటీసీ)కి నష్టం కలిగించారని 2013లో సీబీఐ కేసు నమోదు చేసింది. దీని ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసి.. కంపెనీతో పాటు సుఖేశ్‌గుప్తా, రవిప్రసాద్, మోహన్‌రావు, అనురాగ్‌లను నిందితులుగా పేర్కొంటూ చార్జిషీట్ దాఖలు చేసింది. నిందితులకు సమన్లు జారీ చేసింది. సమన్లను సవాల్ చేస్తూ 'ముసద్దీలాల్' హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై జస్టిస్ ఎన్.తుకారాంజీ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఈడీకి నోటీసులు జారీ చేశారు. తదుపరి ఆదేశాలిచ్చే వరకు ఈడీ దర్యాప్తు నిలిపివేస్తూ ఉత్తర్వులిచ్చారు.

మలిదశ బీసీ ఉద్యమానికి అడుగులు

- తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్ హరిశంకర్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందని తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్ హరిశంకర్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మలిదశ బీసీ ఉద్యమాన్ని నిర్మించే దిశగా తెలంగాణ బీసీ జేఏసీ అడుగులు వేస్తోందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దశాబ్దాలుగా బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, విద్యా పరంగా తీవ్రమైన అన్యాయాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వాటి సాధనకు బీసీలు గళం విప్పేలా చైతన్యపరచడమే తమ ప్రధానోద్దేశమని వెల్లడించారు. ఇందులో భాగంగా జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో బీసీ సంఘాలు, సమూహాలు, ప్రజలతో చర్చలు జరిపి.. ఉద్యమ బలోపేతానికి కార్యాచరణ రూపొందిస్తామని ప్రకటించారు. చైతన్య ర్యాలీలతో గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై అవగాహన కల్పిస్తామని వివరించారు. నాయకత్వ నిర్మాణం కోసం జిల్లా అధ్యక్షులు, కన్వీనర్లు, నియోజకవర్గ బాధ్యుల నియామకాల ద్వారా.. బలమైన సంస్థాగత నిర్మాణం చేపడతామని తెలిపారు.



శిక్ష కాదు.. శిక్షణ..!

నేరం చేసిన వ్యక్తిలో పరివర్తన తీసుకురావటమే జైలు శిక్ష ప్రధాన ఉద్దేశం. ఈ లక్ష్యాన్ని 'అక్షరాలా' నిజం చేస్తోంది తెలంగాణ జైళ్లశాఖ. దారితప్పిన వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక 'శిక్ష'ణ ఇస్తోంది. నిరక్షరాస్యులుగా జైలుకు వచ్చే ప్రతి ఖైదీ కనీసం తన పేరు రాయటం నేర్చుకుని సంతకం పెట్టేలా విద్య నేర్పుతున్నారు. ఆసక్తి ఉన్న ఖైదీలను పోస్టు గ్రాడ్యుయేషన్ డిగ్రీ వరకు పూర్తిచేసేలా ప్రోత్సహిస్తున్నారు. తెలంగాణ జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి సౌమ్యా మిశ్రా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఖైదీల విద్యాభ్యాసానికి కీలక చర్యలు చేపట్టారు. ఖైదీలు పాఠశాల స్థాయి విద్యను పూర్తిచేసేలా మొదటిసారి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్‌ఐఓఎస్)తో ఇటీవలే అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు.

ఖైదీలకు విద్యాబుద్ధులు నేర్పుతున్న జైళ్ల శాఖ

బీఏ, ఎంఏ, ఎమ్మెస్సీ సైకాలజీ పూర్తి చేసిన పలువురు ఖైదీలు	అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీతో జైళ్లశాఖ ఎంఓయూ	ఎన్‌ఐఓఎస్‌తో పాఠశాల విద్యపై ఒప్పందం
అక్షరాస్యత కోసం 'థంబ్ ఇన్.. సైన్ ఔట్' కార్యక్రమం	2024లో 15,896 మందికి కనీస విద్య నేర్పిన అధికారులు	

థంబ్ ఇన్...సైన్ ఔట్..

జైలుకు వచ్చే ప్రతి ఖైదీ కనీస విద్య నేర్చుకోవాలన్న ఉద్దేశంతో జైళ్లశాఖ 'థంబ్ ఇన్..సైన్ ఔట్'కార్యక్రమాన్ని చేపట్టింది. నిరక్షరాస్యులైన ఖైదీలకు చదవడం, రాయడం నేర్పడం దీని ప్రధాన ఉద్దేశం. వేలిముద్ర వేసే స్థితిలో జైలుకు వచ్చే ఖైదీ.. శిక్ష పూర్తిచేసుకొని వెళ్లేటప్పుడు సంతకం పెట్టి వెళ్లాలనేది ఈ కార్యక్రమ లక్ష్యం. ప్రతి ఖైదీ జైలు లోపలికి రాగానే అడ్మిషన్ (జైలులో చేర్చే సమయం) సమయంలో వారి వివరాలు నమోదు చేస్తారు. ఆ రికార్డుల్లో ఎవరైనా ఖైదీ వేలిముద్ర వేస్తే.. వెంటనే వారి వివరాలు ప్రత్యేకంగా నమోదు చేసుకుని థంబ్ ఇన్.. సైన్ ఔట్‌లో చేర్చి విద్య నేర్పుతారు. రాష్ట్రంలోని అన్ని జైళ్లలో కలిపి 2024లో 15,896 మంది ఖైదీలు ఈ ప్రాథమిక విద్యా కార్యక్రమం నుంచి ప్రయోజనం పొందారు.

ఎన్‌ఐఓఎస్ కింద 106 మందికి శిక్షణ

ఐదు, ఆరో తరగతి తర్వాత చదువు మానేసిన ఖైదీలు 10వ తరగతి పూర్తి చేసేలా ఎన్‌ఐఓఎస్‌లో శిక్షణ ఇస్తున్నారు. వారికి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అన్నీ జైళ్లశాఖనే సమకూరుస్తోంది. కనీసం రెండేళ్ల శిక్షాకాలం ఉన్న ఖైదీలకు పదో తరగతి పరీక్షలకు శిక్షణ ఇస్తున్నారు. ఎన్‌ఐఓఎస్ కింద చర్లపల్లి, నిజామాబాద్ సెంట్రల్ జైళ్లు, మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లా జైళ్లు, హైదరాబాద్ మహిళా ప్రత్యేక జైలులో సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది 106 మంది ఖైదీలకు ఎస్‌ఎస్‌సీ బోర్డు పరీక్షలు రాసేలా శిక్షణ కొనసాగుతోంది.

ప్రత్యేక టీచర్లతో తరగతులు

జైళ్లలో ఖైదీలకు చదువు చెప్పేందుకు ప్రత్యేక టీచర్లను నియమించారు. చర్లపల్లి, చంచల్‌గూడల్లో ఒక్కరు చొప్పున రెగ్యులర్ టీచర్లు ఉన్నారు. జిల్లా జైళ్లలో స్థానిక కలెక్టర్ల సహకారంతో ఔట్ సోర్సింగ్ విధానంలో టీచర్లను నియమించారు. జీవిత ఖైదు, ఎక్కువ కాలం శిక్ష పడిన ఖైదీల్లో డిగ్రీ, ఆపై విద్యార్హతలు ఉన్నవారితో కూడా ఇతర ఖైదీలకు శిక్షణ ఇస్తున్నారు.

అందుబాటులో గ్రంథాలయాలు

విద్యార్హత, శిక్షా కాలాన్ని బట్టి ఖైదీలు వారికి నచ్చిన కోర్సులు చేసేలా అధికారులు ప్రోత్సహిస్తున్నారు. డిగ్రీ, పీజీ కోర్సులను అందించేందుకు చర్లపల్లి సెంట్రల్ జైలులో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా ప్రత్యేక అధ్యయన కేంద్రాన్ని స్థాపించారు. బీఏ, ఎంఏ, ఎంఎస్సీలో విద్య అందిస్తున్నారు. జైళ్లలోనే వారికి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. అన్ని జైళ్లలో గ్రంథాలయాలు సైతం అందుబాటులో ఉన్నాయి. రోజులో కొంత సమయం పుస్తకాలు చదివేందుకు ఖైదీలకు అవకాశం కల్పిస్తున్నారు.

సాక్షి, హైదరాబాద్



ఖైదీల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకే..

జైలుకు వచ్చిన తర్వాత ఖైదీలు ఖాళీగా ఉంటే వారిలో డిప్రెషన్, నేర ఆలోచనలు పెరుగుతాయి. అందుకే వారి దృష్టిని చదువు వైపు మళ్లిస్తున్నాం. విద్యార్హత పెంచుకోవడంతో ఖైదీల్లోనూ ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. చదువు వారిలో మెంటల్ కంట్రోల్ పెంచుతుంది. తప్పుచేసి జైలుకు వచ్చినా.. విద్యార్హత కలిగిన మంచి పౌరులుగా తిరిగి సమాజంలోకి వెళతారు. ఏదైనా ఉపాధి దొరికేలా ఇది ఉపయోగపడుతుంది.

-సౌమ్యా మిశ్రా, డీజీ, జైళ్లశాఖ

2014 నుంచి ఇప్పటివరకు జైళ్లలో ఖైదీల చదువు వివరాలు:

బీఏ	ఎమ్మెస్సీ సైకాలజీ	ఎంఏ
118	35	16

టీటీడీ తరహాలో నిత్యాన్నదాన సత్రం

- వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ సిద్ధం
- రూ.35.25 కోట్లతో రెండెకరాల్లో నిర్మాణానికి డిజైన్లు రెడీ
- రోజుకు 15 వేల మంది భక్తుల భోజనానికి సీటింగ్



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర దేవాలయం భక్తులకు తీపికబురు మోసుకొచ్చింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల ఆకలి తీర్చేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో నిత్యాన్నదాన సత్రం నిర్మాణానికి వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీడీఏ) సిద్ధమైంది. ఇందుకోసం కావాల్సిన డిజైన్లను ఇప్పటికే సిద్ధం చేసుకున్న వీటీడీఏ.. భవనం రూపురేఖలు, డిజైన్, భక్తుల రద్దీ, అవసరాలు, భవిష్యత్తులో విస్తరణ తదితర అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ డిజైన్లను ఖరారు చేసినట్లు తెలిపింది. వీటీడీఏకి ప్రభుత్వం ఇప్పటికే కేటాయించిన భూమిలో నుంచి రెండు ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఈ నిత్యాన్నదాన సత్రం నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.35.25 కోట్లు వెచ్చించనున్నారు. వీటీడీఏ ఈ భవనం నిర్మాణం బాధ్యతలను ఆర్అండ్‌బీకి అప్పగించింది. ఆర్అండ్‌బీ స్వయంగా నిర్మించకున్నా.. బుధవారం టెండర్లు ఆహ్వానించింది. నిర్మాణాన్ని స్వయంగా పర్యవేక్షణ చేయనుంది.

రెండంతస్తుల్లో..

మొత్తం రెండంతస్తుల్లో నిర్మించనున్న ఈ భవనంలో తొలి అంతస్తులో భక్తులకు భోజన ఏర్పాట్లు చేయనున్నారు. ఏకకాలంలో 1,500 మంది భోజనం చేసేలా సీటింగ్‌కి రూపకల్పన చేశారు. ఒకరోజుకు 15,000 మంది భోజనం చేసే వీలుంది. ఇక గ్రౌండ్ ఫ్లోర్‌లో వాహనాల పార్కింగ్, లడ్డూ కౌంటర్, దుకాణాలు, వాణిజ్య సముదాయాలు ఉండేలా రూపొందించారు. భవిష్యత్తులో భక్తుల రద్దీ పెరిగితే రెండో అంతస్తును కూడా భోజనశాలగా వినియోగించనున్నారు. రెండో అంతస్తు వినియోగంలోకి వస్తే.. రోజుకు 30,000 మంది భక్తులు భోజనం చేసే వీలుంది. భవన నిర్మాణాన్ని 15 నెలలు లేదా ఏడాదిన్నర కాలంలో పూర్తి చేయాలని వీటీడీఏ లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం వ్యవహారాన్ని సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.



కోతలయ్యాయి కోతులొచ్చాయి

రామన్నపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కోతుల బెడదతో రైతులు అవస్థలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యపు రాశులపైకి ఎగబడి ధాన్యాన్ని బుక్కుతూ.. ఆగమాగం చేస్తున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయం దగ్గరలో సీసీరోడ్డుపై పోసిన ధాన్యపు రాశులపై బుధవారం వానరమూకలు ఇలా చేరి తినడం కనిపించింది.

సీఎం చేతుల మీదుగా...

- 14న నీటిపారుదల శాఖలో 423 మందికి నియామక పత్రాలు
- ఏర్పాట్లపై సమీక్షించనున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖలో నియామకమైన 199 మంది జూనియర్ టెక్నికల్ అధికారులు (జేటీఓ), 224 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు (ఏఈ) కలిపి మొత్తం 423 మందికి ఈ నెల 14న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేయనున్నారు. రాజేంద్రనగర్‌లోని వాలంతరిలో ఈ కార్యక్రమం జరగనుంది. అనంతరం నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం అక్కడే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై సమీక్ష నిర్వహించనున్నారు. ఇప్పటికే నీటిపారుదల శాఖలో ప్రభుత్వం 667 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను నియమించగా, మరో 1,597 మంది లష్కర్లు, 281 మంది హెల్పర్లను అవుట్ సోర్సింగ్ విధానంలో నియమించడానికి అనుమతిచ్చింది. కాగా, సీఎం కార్యక్రమంకోసం ఇప్పటికే నీటిపారుదల శాఖ పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసింది. బుధవారం తుది దశ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా పూర్తి చేశారు. ఇప్పటికే 677 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల (ఏఈఈ)లకు స్వయంగా సీఎం అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చిన విషయం విదితమే. మరోవైపు ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించడానికి వీలుగా గురువారం నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వాలంతరిని సందర్శించనున్నారు. ఈ సందర్భంగా వాలంతరి కార్యక్రమాలను కూడా ఆయన సమీక్షిస్తారు. గత 11 ఏళ్లకాలంలో తొలిసారిగా మునుపెన్నడూ లేని విధంగా నీటిపారుదల శాఖలో భారీగా నియామకాలు చేపట్టడం గమనార్హం. తాజా నియామక ప్రక్రియ పూర్తయితే ఏడాదిన్నర కాలంలో 2,978 మందికి ఉద్యోగాలు లభించినట్లవుతుంది.

రోజా.. మరింత తాజా!

- కట్ రోజెస్‌ను రెట్టింపు రోజులు తాజాగా ఉంచే పేపర్ ఆవిష్కరణ
- మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ ఘనత

(సాక్షి స్పెషల్ డెస్క్)







సహజ పూల అందమే వేరు. అతిథులకు, ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలిపే పుష్పగుచ్ఛాల్లో రంగురంగుల కట్ ఫ్లవర్స్ మెరుస్తూ మురిపిస్తూ ఉంటాయి. అయితే, త్వరగా వాడిపోవటం వీటి ప్రధాన సమస్య. దీనిని అధిగమించటానికి మైసూరులోని కేంద్రీయ ఆహార సాంకేతిక పరిశోధనా సంస్థ (సీఎఫ్‌టీఆర్ఐ) సరికొత్త పేపర్‌ను తయారుచేసింది. రోజా పూలను ఈ పేపర్‌లో చుట్టి పెడితే సాధారణంకంటే రెట్టింపు కాలం తాజాగా ఉంటాయని సంస్థ చెబుతోంది. విదేశాలకు కట్ ఫ్లవర్స్ ఎగుమతిచేసే సమయంలో త్వరగా వాడిపోవటం వల్ల 20 నుంచి 25 శాతం వరకు నష్టం వస్తోంది. ఈ నష్టాన్ని నివారించడానికి కేంద్ర శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధనా మండలి (సీఎస్ఐఆర్) ఫ్లోరీకల్చర్ మిషన్‌ను ప్రారంభించింది. అందులో భాగంగానే (సీఎఫ్‌టీఆర్ఐ) ఈ పేపర్‌ను తయారుచేసింది. దీనిపై పేటెంట్ కూడా పొందింది. 2020లో ప్రపంచ కట్ ఫ్లవర్ మార్కెట్ విలువ 1,761 కోట్ల డాలర్లు. ఇది 2027 నాటికి 2,668 కోట్ల డాలర్లకు పెరుగుతుందని అంచనా. ఫ్లోరీకల్చర్ మార్కెట్‌లో మన దేశ వాటా 2020లో రూ.18,760 కోట్లు. 2026 నాటికి ఇది రూ.54,640 కోట్లకు పెరుగుతుందని అంచనా. కట్ రోజెస్ ఎగుమతిలో మన దేశం 15వ స్థానంలో ఉంది.

కొత్త పేపర్ ప్రయోజనాలు ఇవీ..

- పర్యావరణహితంగా తయారైన ఈ పేపర్‌లో రోజా కట్ ఫ్లవర్స్‌ను చుట్టి పెడితే చాలు.
- ప్యాకింగ్‌లో ఖరీదైన, విషతుల్యమైన రసాయనాలు వాడనవసరం లేదు.
- సాధారణ ప్యాకింగ్‌లో కన్నా రెట్టింపు రోజులు పూలు తాజాగా ఉంటాయి.
- గులాబీ రేకులు, ఆకులు వాడిపోకుండా, రాలకుండా ఉంటాయి.
- రైతులు, వ్యాపారులు, ఎగుమతిదారుల ఆదాయం పెరుగుతుంది.
- ఈ పేపర్ రసాయన రహితమైనది. త్వరగా కుళ్లిపోతుంది.
- వ్యాక్యూమ్ ప్యాక్‌లో ఈ పేపర్లు ఉంటాయి. ప్యాకెట్ విప్పిన తర్వాత నెల రోజుల్లోపు వాడుకోవాలి.



సహపంక్తి భిక్షలో కేటీఆర్

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు బుధవారం హనుమాన్ పూజలో పాల్గొని మాలధారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. జిల్లాలో హనుమాన్ మాలధారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించి మాలధారులతో కలిసి భిక్ష (భోజనం) చేశారు. అంతకుముందు హనుమాన్ మాలధారుల సామూహిక భజన సంకీర్తనల్లోనూ పాల్గొన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పార్టీ నాయకులు జిందం చక్రపాణి, జెడ్పీ మాజీ చైర్మన్ న్యాలకొండ అరుణ, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలే లోకం.. బడిలో నివాసం..

ఉదయం, సాయంత్రం విద్యార్థుల ఇళ్లకు..

- చదువులపై తల్లిదండ్రులతో మాటామంతీ..
- పాఠశాల నిర్వహణ, బోధనపై ప్రత్యేక శ్రద్ధ
- బీబీపేట జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం రవీంద్రారెడ్డి కృషి




సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: బడి ముగిశాక ఏ ఉపాధ్యాయుడైనా ఇంటికి వెళ్తారు.. కానీ ఒక ప్రధానోపాధ్యాయుడు పాఠశాల తనది.. పిల్లలను కుటుంబసభ్యుల్లా భావిస్తున్నారు. పాఠశాలలోనే ఉంటూ.. విద్యార్థుల ఇళ్లకు రోజూ వెళ్తూ.. చదువును పర్యవేక్షిస్తూ.. అనుక్షణం వారి ఉన్నతికి కృషి చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయనే కామారెడ్డి జిల్లా బీబీపేట టీఎస్ఎన్ఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెడ్మాస్టర్ మూల రవీంద్రారెడ్డి. 2023 సెప్టెంబర్ 25న వరంగల్ జిల్లా నుంచి బదిలీపై రవీంద్రారెడ్డి వచ్చారు. ఆయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అదే బడిలో నివసిస్తున్నారు. రెండు రోజుల సెలవులు వచ్చినప్పుడే.. సొంతూరు వరంగల్‌కు వెళ్తారు. స్కూల్లో మొత్తం 610 మంది విద్యార్థులు ఉన్నారు.

బడిలోనే ఉంటూ..

పాఠశాల నిర్మించిన సమయంలోనే ఉపాధ్యాయుల కోసం పై అంతస్తులో గదులు నిర్మించారు. హెడ్మాస్టర్ రవీంద్రారెడ్డి అందులోనే ఉంటున్నారు. ఆయన రోజూ ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్తారు. వారేం చదువుతున్నారో పరిశీలించి.. తల్లిదండ్రులతో మాట్లాడి వస్తారు. పిల్లలు పాఠశాలకు గైర్హాజరైనా, తక్కువ మార్కులు వచ్చినా తల్లిదండ్రులను పిలిచి మాట్లాడతారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం



కార్పొరేట్ విద్యాసంస్థలో లేని సౌకర్యాలన్నీ మా పాఠశాలలో ఉన్నాయి. మంచి ఉపాధ్యాయుల బృందం ఉంది. ఆధునిక పద్ధతుల్లో బోధన సాగిస్తున్నాం. పిల్లలు బాగానే చదువుతున్నారు. ఇంకా మెరుగవ్వాలి. విద్యార్థులను తీర్చిదిద్దడానికి మరింతగా ప్రయత్నిస్తాం.

- మూల రవీంద్రారెడ్డి, హెడ్మాస్టర్, బీబీపేట, కామారెడ్డి జిల్లా

ఎస్‌ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు పాస్‌పోర్టు రద్దు

- గతంలోనే సస్పెండ్ చేసిన ఆర్‌పీఓ
- ఇటీవల రెడ్‌కార్నర్ నోటీసు జారీచేసిన ఇంటర్‌పోల్
- దీని ఆధారంగా రద్దుకు సిఫార్సు చేసిన హైదరాబాద్ పోలీసులు
- సానుకూలంగా నిర్ణయం తీసుకున్న పాస్‌పోర్టు అధికారులు



సాక్షి, హైదరాబాద్: అక్రమ ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు పాస్‌పోర్టు రద్దు అయ్యింది. ఈయనపై ఇటీవల ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే. దీని ఆధారంగా పాస్‌పోర్టు రద్దు చేయాలని కోరుతూ హైదరాబాద్ పోలీసులు రీజినల్ పాస్‌పోర్టు కార్యాలయానికి (ఆర్‌పీఓ) లేఖ రాశారు. దీంతో ప్రభాకర్‌రావు పాస్‌పోర్టును రద్దు చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

గత ఏడాది మార్చిలో పరారీ...

టి.ప్రభాకర్‌రావు 2023 డిసెంబర్ 4న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను చూసిన వెంటనే తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. అక్రమ ఫోన్‌ట్యాపింగ్ కేసు, తదితర పరిణామాలను గమనించిన ఆయన గత ఏడాది మార్చిలో తిరుపతి వెళ్లి అటు నుంచే చెన్నై మీదుగా అమెరికా వెళ్లిపోయారు. తనపై అరెస్టు వారెంట్ జారీ చేయొద్దంటూ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన సమయంలో ప్రభాకర్‌రావు తాను వైద్యం కోసం అమెరికా వచ్చానని, షెడ్యూల్ ప్రకారం 2024 జూన్ 26న తిరిగి వస్తానంటూ వివరణ ఇచ్చారు. ఆపై జూలైలో ఈ-మెయిల్ ద్వారా దర్యాప్తు అధికారి రాసిన లేఖలో తన ఆరోగ్యం మరింత క్షీణించిందని, ఇప్పట్లో తిరిగి రాలేనని స్పష్టం చేశారు.

అప్పుడు ఇంపౌండ్...ఇప్పుడు క్యాన్సిల్

రాష్ట్ర పోలీసులు తొలుత ఆర్‌పీఓ ద్వారా ప్రభాకర్‌రావు పాస్‌పోర్టు ఇంపౌండ్ (సస్పెన్షన్) చేయించారు. ఆపై పాస్‌పోర్టు పూర్తిగా రద్దు చేయాలంటూ మరో ప్రతిపాదన పంపారు. ఈ ఫైల్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వద్ద పెండింగ్‌లో ఉండగానే, ప్రభాకర్‌రావు తన న్యాయవాదుల ద్వారా పాస్‌పోర్టు ఇంపౌండ్ చేయడాన్ని ఎంఈఏ జాయింట్ సెక్రటరీ వద్ద సవాల్ చేశారు. ఓ వ్యక్తిపై చార్జిషీట్ దాఖలు కావడం, న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయడం, బెయిలబుల్ వారెంట్ జారీ కావడం జరిగితేనే పాస్‌పోర్టు రద్దుకు ఆస్కారముంది. ప్రభాకర్‌రావు విషయంలో ఈ మూడూ ఉండటంతోపాటు ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ నోటీసు కూడా జారీ చేసింది. దీని ఆధారంగా పోలీసులు ఆర్‌పీఓకు మరో లేఖ రాయడం ద్వారా ప్రభాకర్‌రావు పాస్‌పోర్టు రద్దు చేయించారు.

రద్దు అయినా.. రప్పించడం ప్రహసనమే

ప్రభాకర్‌రావు పాస్‌పోర్టు రద్దయిన సమాచారం ఎంఈఏ, ఇమిగ్రేషన్ అధికారుల వద్ద మాత్రమే ఉంటుంది. ఆయన అమెరికా నుంచి మరో దేశానికి రాకపోకలు సాగించినా గుర్తించలేరు. కేవలం పాస్‌పోర్టు పేజీలు అయిపోవడం, గడువు తీరిపోవడం, పోగొట్టుకోవడం వంటివి జరిగితే.. ఆ దేశంలో ఉన్న భారత రాయబార కార్యాలయానికి వెళ్లినప్పుడు మాత్రమే అధికారులు దాన్ని స్వాధీనం చేసుకుంటారు. ఆపై ఎమర్జెన్సీ సర్టిఫికెట్ జారీ చేయడం ద్వారా బలవంతంగా భారత్‌కు పంపుతారు. అలా కాకుంటే ప్రభాకర్‌రావు తనంతట తానుగా తిరిగి వస్తే...ఎల్‌ఓసీ మాదిరిగా విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులు పట్టుకొని పోలీసులకు అప్పగిస్తారు. దీంతో పోలీసులు ప్రభాకర్‌రావును అమెరికా డిపోర్టేషన్‌కు (బలవంతంగా తిప్పిపంపడం) సన్నాహాలు చేస్తున్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) ద్వారా ఆ దేశ ఏజెన్సీలను సంప్రదించి రెడ్‌కార్నర్ నోటీసుతోపాటు ఇతర వివరాలు అందిస్తున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
గురువారం। 10-4-2025



లింగమయ్య దర్శనానికి వెళ్తున్న భక్తులు(ఫైల్)



జాలువారుతున్న సలేశ్వరం జలపాతం

తెలంగాణ అమర్‌నాథ్.. సలేశ్వరం

నల్లమలలో లింగమయ్య స్వామి దర్శనానికి సాహస యాత్ర రేపటి నుంచి..

ఏటా మూడురోజులు మాత్రమే దర్శనం

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో కొండలు, లోయల్లో కొలువైన లింగమయ్యస్వామి

ఏటా చైత్ర శుద్ధ పౌర్ణమి రోజు చెంచుల ప్రత్యేక పూజలు

తెలంగాణ అమరనాథ్ యాత్రగా పిలుచుకునే సలేశ్వరం జాతర ఈనెల 11 నుంచి 13 వరకు కొనసాగనుంది. ఎత్తయిన కొండలు, జాలువారే జలపాతం, నీటి గుండాలు, ప్రకృతి రమణీయమైన లోయలో కొలువుదీరిన సలేశ్వరం లింగమయ్యను దర్శనం చేసుకోవాలంటే సాహస యాత్ర చేయాల్సిందే. ఎత్తయిన కొండలు ఎక్కుతూ, లోయలు దిగుతూ, సెలయేళ్లు, రాళ్లను దాటుకుంటూ సుమారు 6 కిలోమీటర్ల మేర కాలినడకన ప్రయాణించి సలేశ్వరం లింగమయ్యను చేరుకోవలసి ఉంటుంది. సలేశ్వర క్షేత్రం దట్టమైన అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో ఉండటంతో.. ఏడాదిలో మూడు రోజులు మాత్రమే లింగమయ్య దర్శనానికి అనుమతి ఉంటుంది. చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్థానిక చెంచులు నిర్వహించే ఈ జాతరకు లక్ష మందికి పైగా ప్రజలు హాజరవుతారు.

-సాక్షి, నాగర్‌కర్నూల్



నల్లమలలో కొలువైన సలేశ్వరం లింగమయ్య

రమణీయ ప్రకృతి నడుమ..

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ కావడంతో పులులు, వన్యప్రాణుల సంరక్షణను దృష్టిలో ఉంచుకుని ఎవరినీ అడవిలోకి అనుమతించరు. ఏటా మూడు రోజులు మాత్రమే లింగమయ్య దర్శనానికి అటవీశాఖ అనుమతిస్తుంది. ఈనెల 11 నుంచి 13 వరకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకే అడవిలోకి వాహనాలకు ప్రవేశం ఉంటుంది. ఎంతో కష్టపడి ఎత్తయిన కొండలు ఎక్కుతూ, ఏటవాలుగా ఉన్న బండలను దాటుకుంటూ, లోయల్లోకి దిగుతూ సలేశ్వర లోయ ప్రాంతానికి చేరుకుంటారు. అక్కడి ప్రకృతి రమణీయతకు.. అప్పటిదాకా పడ్డ కష్టాన్ని భక్తులు మర్చిపోయి మధురానుభూతి పొందుతారు. సుమారు 200 అడుగుల ఎత్తు నుంచి జాలువారే జలపాతం చూపరులను మంత్రముగ్ధుల్ని చేస్తుంది. ఇక్కడి సలేశ్వర గుండంలోనే పులులు, వన్యప్రాణులు దాహం తీర్చుకుంటాయి.

చెంచులే పూజారులు..

సలేశ్వరం లింగమయ్య ఉత్సవాల్లో స్థానిక చెంచులే పూజారులుగా వ్యవహరిస్తారు. ఏటా చైత్ర శుద్ధ పౌర్ణమి రోజు లింగమయ్యకు ప్రత్యేక పూజలు చేస్తారు. ఎత్తయిన కొండల మధ్య, సుమారు 200 మీటర్ల లోతులో ఉన్న లోయ అడుగునున్న గుహలో లింగమయ్య స్వామి కొలువయ్యాడు. కేవలం పిడికెడు ఎత్తులో ఉన్న శివలింగాన్ని దర్శించుకునేందుకు ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, హైదరాబాద్ జిల్లాలు సహా.. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు పోటెత్తుతారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో దారిపొడవునా ఉచిత భోజనం, మంచినీటి సౌకర్యాలను కల్పిస్తారు.

ఎలా చేరాలంటే..

సలేశ్వరం లింగమయ్య దర్శనం చేసుకోవాలంటే హైదరాబాద్ – శ్రీశైలం జాతీయ రహదారిలో మన్ననూర్ తర్వాత వచ్చే ఫర్హాబాద్ చౌరస్తాకు చేరుకోవలసి ఉంటుంది. శ్రీశైలం నుంచి వచ్చే వారు దోమలపెంట, వటవర్లపల్లి మీదుగా ఫర్హాబాద్ చౌరస్తాకు చేరుకోవాలి. అక్కడి నుంచి అటవీ మార్గంలో 31 కిలోమీటర్ల దూరంలోని రాంపూర్ పెంటకు చేరుకోవాలి. అక్కడి నుంచి మరో 3 కిలోమీటర్ల దూరం ఎత్తయిన కొండలు, లోయలు దాటుకుంటూ ట్రెక్కింగ్ చేసి సలేశ్వరం చేరుకోవాల్సి ఉంటుంది. భక్తి పారవశ్యంతో వస్తున్నాం.. లింగమయ్య.. అంటూ భక్తులు చేసే స్మరణతో నల్లమల మార్మోగుతుంది. లింగమయ్య ఉత్సవాల కోసం ఆర్టీసీ అచ్చంపేట నుంచి ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేస్తోంది.



ఆదాయం పెంచుకునేదెట్లా?

పకడ్బందీ కార్యాచరణ రూపొందిస్తున్న వాణిజ్య పన్నుల శాఖ

- తప్పుడు ఐటీసీ క్లెయిమ్‌ల నుంచి ఆడిటింగ్ వరకు ఎప్పటికప్పుడు తనిఖీలు
- పన్ను చెల్లింపుదారులతో ప్రతినెలా రాష్ట్ర, డివిజన్ స్థాయిల్లో సమావేశాలు
- ఫేక్ రిజిస్ట్రేషన్లపై ప్రత్యేక దృష్టి.. జాయింట్ కమిషనర్లతో భేటీలో కీలకచర్చ
- ఈ ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 శాతం రాబడులు పెంచుకునే యోచన

సాక్షి, హైదరాబాద్: ఆదాయం పెంచుకునే మార్గాల అన్వేషణలో వాణిజ్య పన్నుల శాఖ నిమగ్నమైంది. గతఏడాది రాబడి లక్ష్యంగా రూ.85,112 కోట్లు నిర్దేశించుకోగా, సరైన పర్యవేక్షణ, అధికారుల మధ్య సమన్వయం లోపంతో అది రూ.75,154 కోట్లకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో రానున్న ఆర్థిక సంవత్సరానికిగాను నిర్దేశించుకున్న రూ.88,463 కోట్ల లక్ష్యాన్ని ఎలా చేరుకోవాలన్న దానిపై ఆ శాఖ కమిషనర్ హరిత దృష్టి సారించారు. గత ఆర్థిక సంవత్సరంలో వచ్చిన మొత్తం కంటే కనీసం 20 శాతం అదనంగా రాబడి తీసుకురావాలనే లక్ష్యంతో పలు సంస్కరణలు తీసుకురావాలని ఆమె భావిస్తున్నారు. ప్రతి సర్కిల్‌కు ఓ టార్గెట్‌ను నిర్దేశించారు. ఆ సర్కిల్ పరిధిలో ఉన్న డీలర్లు, వారి వార్షిక టర్నోవర్ ఆధారంగా రాష్ట్రంలోని అన్ని సర్కిళ్లకు టార్గెట్‌ను విభజించారు. పన్ను ఎగవేతదారుల సమాచారాన్ని ఇచ్చేవారి వివరాలు గోప్యంగా ఉంచడం, డీలర్ల వ్యాపార లావాదేవీలపై గట్టి నిఘా ఉంచడం, ఆదాయ లక్ష్యాన్ని ప్రతి రోజూ, ప్రతినెలా నిశితంగా పరిశీలించే విధంగా డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేయడం, సోదాలు నిర్వహించడం, ఆడిట్ పక్కాగా నిర్వహించడంలాంటి చర్యలకు హరిత నేతృత్వంలోని వాణిజ్య పన్నుల శాఖ ఉపక్రమిస్తోంది. ఈ ఏడాది మొత్తం 1,000 వ్యాపార సంస్థలను ఆడిట్ చేసి అదనంగా రూ.1,000 కోట్లు రాబట్టే విధంగా ప్రణాళిక రచించినట్టు తెలుస్తోంది.

కీలకాంశాలపై సమీక్ష

ఇటీవల కమిషనర్ హరిత ఆ శాఖలోని ఉన్నతాధికారులతో కీలక సమీక్ష నిర్వహించారు. మొత్తం 15 అంశాలపై చర్చించారు. రిటర్నులను స్రూటినీ చేసేందుకుగాను పకడ్బందీ యంత్రాంగ ఏర్పాటు, అన్ని స్థాయిల్లోని అధికారులకు శిక్షణ, ఆడిటర్ జనరల్ నివేదికల నిశిత పరిశీలన, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలను ఉధృతం చేయడం, తనిఖీల నిర్వహణ, ప్రతినెలా క్రమం తప్పకుండా సమీక్ష సమావేశాల నిర్వహణ, రాష్ట్ర, డివిజన్ స్థాయిలో పన్ను చెల్లింపుదారులతో ప్రతినెలా సమావేశాలు, లిక్కర్, పెట్రోలియం ఉత్పత్తుల రాబడుల అంచనాల పర్యవేక్షణ, పాత బకాయిలు రాబట్టడం, ఐజీఎస్టీ చెల్లింపులు, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కింద తప్పుడు క్లెయిమ్‌ల గుర్తింపు, ఫేక్ రిజిస్ట్రేషన్లపై నిఘా, జాయింట్ కమిషనర్ల స్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థ పటిష్టం లాంటి అంశాలపై చర్చించి రాబడి పెంపునకు అనుగుణంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ దిశగా ముందుకెళ్లడం ద్వారా పన్నుల శాఖ రాబడులను మొదటి నెల నుంచే పెంచాలని నిర్ణయించడం గమనార్హం.

సెంటు భూమి లేని జేఎన్‌టీయూహెచ్

దశాబ్దాల తరబడి లీజు.. ఏటా రూ. 1.30 లక్షల చెల్లింపు

భూమి ఇవ్వాలని కోరిన వీసీలు ● ఎన్ని లేఖలు రాసినా స్పందించని ప్రభుత్వాలు



సాక్షి, హైదరాబాద్: జవహర్‌లాల్ సాంకేతిక విశ్వవిద్యాలయం పేరుతో సెంటు భూమి కూడా లేదు. ప్రస్తుతం లీజుకు తీసుకున్న భూమిలోనే వర్సిటీ నడుస్తోంది. సాంకేతిక విద్యలో పలు వినూత్న కోర్సులను ఈ వర్సిటీ అందిస్తోంది. లేబొరేటరీలు, లైబ్రరీలు, తరగతి గదులు, విశాల ప్రాంగణంలో జేఎన్‌టీయూహెచ్ విస్తరించింది. వేల మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. రాష్ట్రంలోని 154 ప్రైవేటు కాలేజీలకు జేఎన్‌టీయూహెచ్ అనుబంధ గుర్తింపునిస్తోంది. అయినా గజం భూమి లేకపోవడం వల్ల జాతీయ స్థాయి ర్యాంకులకు దరఖాస్తు చేసేప్పుడు ఇదో సమస్యగా మారుతోంది. ఎన్ఐఆర్ఎఫ్, న్యాక్ ర్యాంకింగ్‌కు దరఖాస్తు చేసేప్పుడు వర్సిటీకి సొంత భూమి ఉండటాన్ని ఓ ప్రామాణికంగా తీసుకుంటారు. భూమి లేని కారణంగా ర్యాంకులు పడిపోతున్నాయని అధ్యాపకులు అంటున్నారు.

లీజుకు ఇప్పటికీ రూ. వంద కోట్లు

జేఎన్‌టీయూహెచ్ 1967లో కాలేజీగా ఏర్పడింది. 1972లో దీన్ని యూనివర్సిటీగా మార్చారు. 1984లో హైదరాబాద్ కూకట్‌పల్లిలోని హౌసింగ్ బోర్డుకు చెందిన వంద ఎకరాల భూమిని లీజు పద్ధతిలో యూనివర్సిటీకి కేటాయించారు. ప్రస్తుతం ఏటా రూ.1.30 లక్షల లీజు చెల్లిస్తున్నారు. హౌసింగ్ బోర్డును ప్రభుత్వం రోడ్లు, భవనాల శాఖలో విలీనం చేసింది. దీంతో లీజు మొత్తాన్ని ఆ శాఖకు చెల్లించాల్సి వస్తోంది. యూనివర్సిటీ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకూ రూ. వంద కోట్లకు పైగా లీజుకే చెల్లించారు. వాస్తవానికి భూమి ఖరీదు కన్నా లీజుకే ఎక్కువ చెల్లించామని యూనివర్సిటీ అధికారులు చెబుతున్నారు. దీంతోపాటు ఆస్తి పన్ను కింద కూడా భారీగా చెల్లించాల్సి వస్తోంది. యూనివర్సిటీకి లీజు కింద ఇచ్చే నిధులను ప్రభుత్వం సమకూర్చడం లేదు. దీంతో విద్యార్థుల ఫీజుల నుంచే చెల్లించాల్సి వస్తోంది.

దయచేసి భూమి ఇవ్వండి

ప్రస్తుతం ఉన్న భూమిని యూనివర్సిటీకి కేటాయించాలని ప్రతీ వీసీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు లేఖలు రాశారు. పరిశీలిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంతవరకూ స్పందించిన దాఖలాల్లేవు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసే ప్రతీ జేఎన్‌టీయూహెచ్ కాలేజీలకూ సొంత భూములిస్తున్నారు. వీటన్నింటికీ కేంద్ర బిందువైన జేఎన్‌టీయూహెచ్‌కు భూమి కేటాయించడం సమంజసమని వీసీలు తమ లేఖల్లో పేర్కొంటున్నారు. లీజు భూమిలోనే అనేక భవనాలు నిర్మించుకున్నామని, భవిష్యత్ అవసరాల కోసం మరి కొన్ని భవనాల నిర్మాణం అనివార్యమని ప్రభుత్వానికి అధికారులు తెలిపారు. సొంత భూమి ఇవ్వడం వల్ల జాతీయ స్థాయి ర్యాంకుల విషయంలోనూ పోటీ పడే వీలుందంటున్నారు. వర్సిటీకి వంద ఎకరాలను హౌసింగ్ బోర్డు కేటాయిస్తే... ఇందులో 14 ఎకరాలు కబ్జాలకు గురైనట్టు తేలింది. 2000 సంవత్సరంలో వర్సిటీ అధికారులు జరిపిన సర్వేలో ఇది బయటపడింది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, జేఎన్‌టీయూహెచ్‌కు భూమి కేటాయించి, ఉన్నతి పెంచాలని విద్యార్థులు, అధికారులు కోరుతున్నారు.

ఆర్టీఏ ఆదాయం అంతంతే!

గ్రేటర్ మూడు జిల్లాల్లో రూ.4,270.95 కోట్ల వసూలు

- రాష్ట్రవ్యాప్తంగా రూ.6,761.81 కోట్ల ఆదాయం
- రాబడి లక్ష్యం రూ.8,178 కోట్లు.. 82.68 శాతమే రాక
- ఈవీలపై రూ.197 కోట్ల జీవితకాలపన్ను మినహాయింపు
- నగరంలో 58 వేలు దాటిన ఎలక్ట్రిక్ వాహనాలు



గ్రేటర్‌లోని మూడు జిల్లాల్లో ఆర్టీఏ ఆదాయం (రూ.కోట్లలో)

జిల్లా	ఆదాయం
హైదరాబాద్	1,358.97
రంగారెడ్డి	1,655.56
మేడ్చల్	1,246.42
మొత్తం	4,270.95

గ్రేటర్‌లో ఈవీల అమ్మకాలు

సంవత్సరం	ఈవీలు
2020–21	2,603
2021–22	14,785
2022–23	39,111
2023–24	61,507
2024–25	58,916

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటైన రవాణాశాఖ రాబడి ఈసారి భారీగా తగ్గింది. ప్రభుత్వ లక్ష్యంలో 82 శాతం మాత్రమే రాబడి వచ్చింది. అత్యంత కీలకమైన గ్రేటర్ హైదరాబాద్‌లో కూడా ఆదాయం భారీగా తగ్గింది. ఇక్కడ ఆర్టీఏ ఆదాయానికి ఎలక్ట్రానిక్ వాహనాలు గండి కొట్టాయి. ఆర్థిక సంవత్సరం మొత్తంలో గ్రేటర్‌లోని మూడు జిల్లాల పరిధిలో జీవితకాల పన్ను, ఫీజులు, గ్రీన్‌ట్యాక్స్ తదితర రూపాల్లో రూ.4,270 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. ఇది రవాణాశాఖ మొత్తం ఆదాయ అంచనాలో 63.16 శాతం మాత్రమే కావడం గమనార్హం. రవాణా శాఖకు సాధారణంగా ఏటా సుమారు 70 శాతం ఆదాయం ఈ మూడు జిల్లాల నుంచే వస్తోంది. ఈవీలకు పన్ను రాయితీ ఇవ్వడం కూడా ఆదాయం తగ్గటానికి ఒక కారణమని అధికారులు తెలిపారు.

జోరుగా ఈవీలు

నగరంలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ప్రభుత్వం గతేడాది జీవితకాల పన్ను నుంచి వీటికి మినహాంపునివ్వడంతో అమ్మకాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం 58,916 ఈవీలు నమోదయ్యాయి. గతేడాది నవంబర్ నుంచే సుమారు 20 వేల ఈవీలు అమ్ముడైనట్లు అంచనా. కార్లు, బైక్‌లతోపాటు సరుకు, ప్రయాణికుల రవాణా ఈవీలకు కూడా ప్రభుత్వం పన్ను మినహాయింపునివ్వడంతో రవాణాశాఖ ఆదాయంపై ప్రభావం పడినట్లు అధికారులు తెలిపారు. ఈవీలపై వాహనదారులకు సుమారు రూ.197 కోట్ల పన్ను మినహాయింపు లభించింది. 'రాష్ట్రవ్యాప్తంగా రవాణాశాఖ ఆదాయం ఈ ఏడాది 82.68 శాతం మాత్రమే నమోదైంది. లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఇంకా రూ.1,400 కోట్లు రావాలి. ఈవీలతోపాటు పన్ను చెల్లించని వాహనాల నుంచి త్రైమాసిక పన్ను లభించకపోవడం వంటి కారణాల వల్ల టార్గెట్‌ను చేరుకోలేకపోయాం' అని ఒక అధికారి వివరించారు.



రాష్ట్రంలో రవాణాశాఖ ఆదాయం ఇలా.. (2024-25 రూ. కోట్లలో)

కేటగిరీ	లక్ష్యం	వసూళ్లు	శాతం
లైఫ్‌ట్యాక్స్	6,024.97	4,915.68	81.59
త్రైమాసిక పన్ను	1,083.58	9,00.62	83.12
గ్రీన్‌ట్యాక్స్	75.68	68.11	90
ఫీజులు	648.10	538.21	83.04
జరిమానాలు	186.03	203.54	109.41
యూజర్ చార్జీలు	159.65	135.65	84.97
మొత్తం	8,178	6,761.81	82.68



తల్లి ప్రేమంటే ఇదే...!

ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో సూర్యుడు తనప్రతాపాన్ని చూపుతున్నాడు. ఎండ వేడి తాళలేక..చిత్తు కాగితాలు ఏరుకునే ఓ కుటుంబం మండుటెండ నుంచి ఇలా రక్షణ పొందుతున్నారు. తమ రిక్షా వెనుక భాగంలో పైన అట్టపెట్టెలు పరుచుకుని తన చిన్నారికి ఎండ తీవ్రత తగలకుండా తల్లి చూసుకుంటుండగా.. ఆ దృశ్యాన్ని సాక్షి బంధించింది.

– పవన్, సాక్షి, ఫొటోగ్రాఫర్, విజయవాడ



వ్యర్థాల హోరం..సాగర తీరం..

వర్షం అందరికీ ఆహ్లాదాన్ని పంచుతుంది. అయితే విశాఖ సాగర తీరంలో మాత్రం పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉంటుంది. వాన కురిసిన సందర్భంలో కాలువల్లో వ్యర్థాలు, ప్లాస్టిక్ వస్తువులు, కొబ్బరి బొండాలు వంటివి ప్రవాహ వేగానికి కొట్టుకువచ్చి తీరానికి చేరుతున్నాయి. ఆహ్లాదాన్ని పంచే సాగర తీరం దీని ఫలితంగా అధ్వానంగా తయారు అవుతోంది.

– ఎండీ నవాజ్, సాక్షి, ఫొటోగ్రాఫర్ విశాఖపట్నం

సమ్మర్ యాపిల్.. గిరాకీ సూపర్

వేసవి కాలం వచ్చేయడంతో తాటిముంజులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అనంతపురంలో వీటి అమ్మకాలు బాగా జోరందుకున్నాయి. ఫుట్‌పాత్‌ల మీద సమీప గ్రామాల వ్యాపారస్తులు వీటిని అమ్మకానికి పెడుతున్నారు. నగరంలోని మెడికల్ కాలేజీ సమీపంలోని ఫుట్‌పాత్‌పై తాటిముంజలను భారీగా పెట్టి ఇలా అమ్మకానికి ఉంచారు.

– వీరేష్, సాక్షి, ఫొటోగ్రాఫర్, అనంతపురం



క్లుప్తంగా...

పాక్ జలసంధి ఈత యాత్ర పరిశీలకునిగా సురేష్



నరసరావుపేట ఈస్ట్: భారత్ నుంచి శ్రీలంక వరకు గురువారం ప్రారంభం కానున్న సాహసోపేతమైన ఈత యాత్రకు పల్నాడు జిల్లా నరసరావుపేటకి చెందిన స్విమ్మింగ్ కోచ్ జి.సురేష్‌ను పరిశీలకునిగా నియమిస్తూ భారత స్విమ్మింగ్ ఫెడరేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. తమిళనాడులోని ధనుష్కోటి నుంచి శ్రీలంకలోని తలైమన్నార్‌ను కలిపే పాక్ జలసంధి గుండా సాగే 29 కిలోమీటర్ల ఈత యాత్రలో 10 మంది స్విమ్మర్లు పాల్గొంటారని సురేష్ తెలిపారు. రెండు దేశాల నుంచి అవసరమైన అన్ని అనుమతులు తీసుకున్నట్లు వివరించారు. ఇరు దేశాలను కలుపుతున్న పాక్ జలసంధి దాటడం కఠినతరమైన యాత్రగా పేర్కొన్నారు. ధనుష్కోటి వద్ద హిందూ మహాసముద్రం, అరేబియా, బంగాళాఖాతం కలుస్తుండటంతో బలమైన అలలు, అంతర్ ప్రవాహాలు అధికంగా ఉంటాయన్నారు.

పట్టణాలలో పెంచిన ఆస్తి పన్ను తగ్గించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు



సాక్షి, అమరావతి: పట్టణాలలో ఆస్తి పన్ను గత సంవత్సరంతో పోలిస్తే 15 శాతం, 2020–21 సంవత్సరాలతో పోల్చితే 30 శాతం పెంచుతూ ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా ఆదేశాలు ఇచ్చిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తెలిపారు. దీనివలన ప్రజలపై రూ.320 కోట్లు భారం పడుతుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో కూటమి పార్టీలు ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని సమీక్షిస్తామని, పన్నులు పెంచబోమని హామీ ఇచ్చారని, మేనిఫెస్టోలో పెట్టారని పేర్కొన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. పట్టణాలలో పౌర సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టకుండా ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు పన్నుల పెంపుపై దృష్టి పెట్టడం తగదన్నారు. హామీ ఇచ్చిన విధంగా ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని రద్దు చేయాలని, పెంచిన ఇంటి పన్నును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

గృహ నిర్మాణ సంస్థ ఎండీగా శివప్రసాద్

సాక్షి, అమరావతి: రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ ఎం.శివప్రసాద్‌కు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగించారు. ఈమేరకు బుధవారం ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి కె. విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఎండీ రాజాబాబు ఏపీపీఎస్సీ కార్యదర్శిగా నియమితులైన విషయం తెలిసిందే.

మెప్మా మహిళా ఉత్పత్తులకు బ్రాండింగ్

మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్

సాక్షి, అమరావతి: పట్టణాలు, నగరాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసే ఉత్పత్తులకు బ్రాండింగ్‌తో పాటు విస్తృత మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ తెలిపారు. ప్రస్తుతం 28 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో 7 లక్షల మంది వివిధ ఉత్పత్తులు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారన్నారు. లైవ్లీహుడ్స్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ యాక్సలరేషన్ ప్లాన్ (లీప్) అమలుపై బుధవారం తాడేపల్లిలో శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ తేజ్ భరత్ మాట్లాడుతూ.. పట్టణ సమాఖ్యల సభ్యుల్లో చాలా మంది పచ్చళ్లు, పేపర్ ప్లేట్స్, పూజా సామగ్రి, సబ్బులు వంటి వస్తువులు తయారు చేసేవారు ఉన్నారన్నారు. వీరికి ఆయా ఉత్పత్తుల బ్రాండింగ్, మార్కెటింగ్‌పై శిక్షణ ఇవ్వడంతో పాటు మరింతగా అభివృద్ధి చెందేందుకు మెప్మా అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో 30 వేల మంది సభ్యులను పారిశ్రామికవేత్తలుగా, ఇప్పటికే వ్యాపారం చేస్తున్న 10 వేల మందిని అత్యుత్తమ వ్యాపారవేత్తలుగా మార్చాలని నిర్ణయించామన్నారు.

రసాయనాలు కుమ్మరిస్తున్నారు!



పెరుగుతున్న రసాయన ఎరువుల వినియోగం

- రైతులకు భారంగా మారిన పెట్టుబడి వ్యయం
- ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహకాలు అరకొరే!
- గాడి తప్పిన గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ విధానం
- స్పందించని రాష్ట్ర ప్రభుత్వం

కర్నూలు(అగ్రికల్చర్): రసాయన ఎరువుల ఎక్కువ వినియోగంతో ఎన్నో అనర్థాలు ఉన్నాయనే విషయాన్ని చాలా మంది రైతులు గుర్తించలేకపోతున్నారు. వివిధ పంటల్లో ఉత్పాదకతను పెంచుకునేందుకు విచ్చలవిడిగా వాడుతున్నారు. దీంతో భూమి స్వభావం దెబ్బతింటోంది. చాలా చోట్ల పొలాలు చౌడుబారుతున్నాయి. పర్యావరణం కూడా కలుషితం అవుతోంది. పంట ఉత్పత్తుల్లో కెమికల్స్ అవశేషాలు ఉండటంతో మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభించని పరిస్థితి ఏర్పడింది. కర్నూలు జిల్లాలో 2023–24లో 2,04,318 టన్నుల రసాయన ఎరువులు వాడగా.. 2024–25లో 2,34,144 టన్నులు వినియోగించారు. మొత్తం 29,826 టన్నుల వినియోగం పెరిగింది. అయినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు. రైతులకు అవగాహన కల్పించడం.. ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహాలు పెంచడం... తదితర విషయాలపై దృష్టిసారించడం లేదు.

ఎకరాకు 185 కిలోల రసాయన ఎరువులు

రాష్ట్రంలోనే అత్యధికంగా కర్నూలు జిల్లాలో 96 వేల ఎకరాల్లో మిర్చి సాగైంది. పత్తి కూడా జిల్లాలో అత్యధికంగా సాగు అవుతోంది. 2024 ఖరీఫ్‌లో 10,55,517 ఎకరాలు, రబీలో 2,14,692 ఎకరాలు ప్రకారం మొత్తంగా 12,70,209 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. నీటిపారుదల కింద సాగు చేసే పంటలకు విపరీతంగా రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. సగటున ఎకరాకు 160 కిలోల వరకు రసాయన ఎరువులు వాడవచ్చు. అయితే 2024–25లో ఎకరాకు సగటున 185 కిలోల రసాయన ఎరువులు వినియోగించారు. 2024–25లో భూసార పరీక్షలు పెద్ద ఎత్తున నిర్వహించి.. వాటి ఫలితాలను రైతులకు అందచేసినప్పటికీ రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోయింది.

ఖర్చు తడిసి మోపెడు

రసాయన ఎరువుల వినియోగం భారీగా పెరుగుతుండటంతో వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. వివిధ కంపెనీలు రసాయన ఎరువుల ధరలు ఇష్టానుసారంగా పెంచుతున్నాయి. 10–26–26, 12–32–16 రసాయన ఎరువుల 50కిలోల బస్తా ధర రూ.1,720 ఉందంటే ధరలు ఏ స్థాయిలో పెరుగుతున్నాయో తెలుస్తోంది. దీంతో రైతులకు ఖర్చు తడిసిమోపెడు అవుతోంది. మిర్చి, వరి సాగులో అడ్డగోలుగా రసాయన ఎరువులను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పండించిన పంటల్లో కూడా కెమికల్స్ అవశేషాలు ఉంటున్నట్లుగా శాస్త్రీయంగా నిర్ధారణ అవుతోంది.

'ప్రకృతి'సాయం కరువే!

రసాయన ఎరువుల వినియోగం లేకుండా ప్రకృతి వ్యవసాయం చేస్తే ప్రజారోగ్యానికి పెద్దపీట వేసినట్లే. అయితే జిల్లాలో ప్రకృతి వ్యవసాయంలో పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా ఉంది. కాగితాల్లో వేలాది ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం కనిపిస్తోంది. 2024–25లో 50 వేల ఎకరాలకుపైగా ప్రకృతి వ్యవసాయం చేసినట్లు లెక్కలు ఉన్నప్పటికీ వాస్తవం నామమాత్రమే. స్వచ్ఛందంగా ప్రకృతి వ్యవసాయం చేసేవారు జిల్లాలో 70 నుంచి 80 మంది వరకు ఉన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహించకపోవడం, విరివిరిగా సాయం అందించడం.. తదితర కారణాలతో చాలా మంది రైతులు ముందుకు రావడం లేదు.

గ్యాప్..తూచ్


రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీస్ (గ్యాప్) కింద ప్రతి మండలంలో పొలంబడి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చేసిన సిఫార్సుల మేరకే కెమికల్స్ వాడాలి. ప్రతి మండలంలోని 50 నుంచి 100 ఎకరాల వరకు 'గ్యాప్'కింద ఆహార పంటలు సాగు చేశారు. ప్రతి వారం పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తూ వచ్చినప్పటికీ రసాయన ఎరువులు వాడకం తగ్గలేదు. పలు పంటల శ్యాంపుల్స్‌లో కెమికల్స్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది.

చర్యలు తీసుకుంటున్నాం

2024–25 సంవత్సరంలో సాగు విస్తీర్ణం పెరిగినందున రసాయన ఎరువుల వినియోగం పెరిగింది. 2023–24 సంవత్సరంతో పోలిస్తే దాదాపు 30 వేల టన్నులు అదనంగా వినియోగించారు. కెమికల్స్ వినియోగాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాం. గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీస్ కింద రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు పొలంబడి నిర్వహిస్తున్నాం.

– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

రసాయన ఎరువుల వినియోగం సంవత్సరాల వారీగా (టన్నుల్లో)..



ఎరువు పేరు	2023-24	2024-25
యూరియా	56,468	63,178
డీఏపీ	16,130	18,081
ఎంవోపీ	1,722	2,731
కాంప్లెక్స్	1,27,452	1,47,430
ఎస్ఎస్‌పీ	2,546	2,717
కంపోస్ట్	--	4
ఎఫ్‌వోఎం	--	3
మొత్తం	2,04,318	2,34,144

వినియోగంలో దేశంలో రెండో స్థానం

రసాయన ఎరువుల వినియోగంలో నంద్యాల జిల్లా రికార్డుల్లోకి ఎక్కింది. 2024–25 వ్యవసాయ సంవత్సరంలో రాష్ట్రంలోనే ఎరువుల వినియోగంలో మొదటి స్థానంలో నిలిచింది. మరో విశేషమేమిటంటే దేశంలోనే ఎరువుల వినియోగంలో నంద్యాల జిల్లా రెండవ స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ, రసాయన ఎరువుల మంత్రిత్వ శాఖ మంత్రి జేపీ నడ్డా పార్లమెంటు వేదికగా ఇటీవల ప్రకటించారు. ఈ జిల్లాలో ప్రధానంగా వరి సాగు చేస్తారు. కాగా యూరియా 3 బస్తాల వేయాల్సి ఉండగా... 10 బస్తాల వరకు వినియోగించారు. రికార్డు స్థాయిలో నంద్యాల జిల్లాలో 3.75 లక్షల టన్నులు వినియోగించిట్లు సమాచారం. ఎరువులు ఈ స్థాయిలో వినియోగించారంటే ఆహార పంటల్లో కెమికల్స్ అవశేషాలు ఏ స్థాయిలో ఉంటాయో ఊహించుకోవచ్చు.



ఇవీ నష్టాలు..

- మిర్చి, పత్తి, వరి, మొక్కజొన్న, వివిధ కూరగాయల పంటలకు రసాయన ఎరువుల వాడకం ఎక్కువగా ఉంటోంది. దీంతో ఈ పంట ఉత్పత్తుల్లో కెమికల్స్ అవశేషాలు ఉంటున్నట్లు తెలుస్తోంది.
- కెమికల్స్‌తో పండించిన ఆహార ఉత్పత్తులు తీసుకుంటే ప్రజలు పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
- గతంలో పశువుల ఎరువులు వాడేవారు. అలాగే పొలాల్లో నాలుగైదు రోజుల పాటు గొర్రెల మందను ఉంచేవారు. కెమికల్స్ లేని ఆహారం తీసుకోవడంతో అప్పటి వారు ఇప్పటికీ ఆరోగ్యంగా ఉంటున్నారు.
- ప్రస్తుతం పలు రసాయన ఎరువులతో, మందులతో పండించిన ఆహారం తీసుకుంటుండటంతో జబ్బులు పెరిగిపోతున్నాయి.



శ్రీవారి దర్శనానికి 8 గంటలు


తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 65,201 మంది స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.93 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

నేటి నుంచి శ్రీవారి వసంతోత్సవాలు

తిరుమల : తిరుమలలో గురువారం నుంచి శ్రీవారి ఆలయంలో వసంతోత్సవాలు నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు కనులపండువగా వేడుకలు జరిపించనున్నారు. వసంతోత్సవాలకు బుధవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఈ మేరకు తొలిరోజు శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామివారు ఊరేగింపుగా వసంత మండపానికి వేంచేపు చేయనున్నారు. స్నపన తిరుమంజనసేవలో సేదతీరనున్నారు. అనంతరం మాడవీధుల్లో ఊరేగుతూ ఆలయంలోకి ప్రవేశించనున్నారు. ఈ క్రమంలోనే రెండో రోజు సర్వాలంకారభూషితులైన దేవదేవేరులు స్వర్ణరథంపై విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు. మూడోరోజు మలయప్పతోపాటు రుక్మిణీ సమేత కృష్ణస్వామి, సీతారామలక్ష్మణులు వేర్వేరు పల్లకీల్లో ఊరేగనున్నారు.

3 వసంతోత్సవాలకు అంకురార్పణ

రాపూరు: శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వసంతోత్సవాలకు బుధవారం రాత్రి వేదపండితులు అంకురార్పణ చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో ప్రత్యేక హోమం చేశారు. ఆలయ ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి మాట్లాడుతూ స్వామి వారికి వేసవి తాపాన్ని తగ్గించేందుకు చైత్రమాసం వసంత రుతువులో వసంతోత్సవాలు నిర్వహించడం ఆచారమన్నారు.



విద్యార్థిని సృజనకు అభినందన

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీలో బీఫార్మసీ విద్యార్థిని వైష్ణవీ హరీష్ తన సృజనాత్మకతను ఆవిష్కరించారు. స్మార్ట్ డిజిటల్ స్టెతస్కోప్‌ను రూపొందించారు. యూఎస్ ఎంబసీ సహకారంతో ఉకాన్ గ్లోబల్ సంస్థ భాగస్వామ్యంతో ఢిల్లీలోని అమెరికన్ సెంటర్‌లో నిర్వహించిన స్టార్టప్ నెక్సస్ కోహోర్ట్–20 ప్రోగ్రామ్‌లో ఈ పరికరం ప్రదర్శించి సర్టిఫికెట్ అందుకున్నారు. బుధవారం ఈ మేరకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ, విభాగాధిపతి ప్రొఫెసర్ జోత్స్నారాణి అభినందనలు తెలిపారు.

వెటర్నరీ వర్సిటీలో మధ్యప్రదేశ్ మంత్రి

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో బుధవారం మధ్యప్రదేశ్ మంత్రి లకన్ పాటిల్ పర్యటించారు. ఈ సందర్భంగా వీసీ రమణ, డీన్ వీరబ్రహ్మయ్య, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ శ్రీలతతో సమావేశమయ్యారు. వర్సిటీలో చేపట్టిన పరిశోధనలు, పశువైద్య విద్య, పలు విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పశువైద్య శాలను పరిశీలించారు.

'ప్రసవం వరకు విధిగా వైద్య పరీక్షలు ముఖ్యం'

తిరుపతి తుడా: స్విమ్స్‌లో బుధవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డైరెక్టర్ కమ్ వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడారు. తల్లులు, నవజాతి శిశువుల ఆరోగ్య సంరక్షణ, మాతా–శిశు మరణాలకు అడ్డుకట్ట వేయడంపై అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశమన్నారు. డెలివరీ సమయంలో అధికంగా హైబీపీ వలన మరణాలు సంభవిస్తున్నాయని, గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవించే వరకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకుంటే ఇలాంటి పరిస్థితి రాదన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజ్, పిడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ పునీత్, డాక్టర్ ప్రత్యూష, మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికలాఫీసర్ డాక్టర్ స్రవంతి, స్విమ్స్ గైనకాలజి విభాగం డాక్టర్ భార్గవి, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆశా వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

రియల్.. ఢమాల్

కూటమి పాలనలో పశ్చిమ గోదావరిలో పడకేసిన రియల్ ఎస్టేట్

- నిలిచిన క్రయవిక్రయాలు.. జిల్లాలో తగ్గిన రిజిస్ట్రేషన్లు
- పడిపోయిన రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం
- గతంలో 70 శాతానికి పైగా ఆదాయం
- కూటమి పాలనలో గత ఏడాది 63 శాతానికి తగ్గుదల

సాక్షి, భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. ఏడాది కాలంగా క్రయవిక్రయాలు తగ్గిపోయి రిజిస్ట్రేషన్ల శాఖ లక్ష్యాన్ని చేరుకోవడం గగనంగా మారింది. కరోనా విలయతాండవం సమయంలో సైతం లేని గడ్డు పరిస్థితులు కూటమి పాలనలో ఎదురవుతున్నాయి. రిజిస్ట్రేషన్ చార్జీలను ప్రభుత్వం అడ్డగోలుగా పెంచడం ఈ రంగాన్ని మరింత కుంగదీస్తోంది.

పిల్లల చదువులు, ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం పట్టణ జీవనం కోరుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది. స్థానికంగా స్థిర నివాసం ఏర్పరుచుకునేందుకు వారు ఆసక్తి కనబర్చేవారు. జిల్లాలోని పట్టణ, మండల కేంద్రాలు, సమీప గ్రామాల్లో సుమారు రెండు వేల వరకు లే అవుట్లు వెలిశాయి. ఎక్కడికక్కడ అపార్ట్‌మెంట్లు పుట్టుకొచ్చాయి. స్థలాలు, ప్లాట్ల క్రయ విక్రయదారులతో కొన్నేళ్ల పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కళకళలాడాయి. 2019 నుంచి 2024 మధ్యకాలం స్థిరాస్థి రంగానికి స్వర్ణయుగంగా మారింది. విద్య, వైద్య రంగంలో గత ప్రభుత్వం అండగా నిలవడంతో ప్రజల జీవన వ్యయం తగ్గింది. అన్ని వర్గాల వారికి మేలుచేసేలా అమలుచేసిన సంక్షేమ పథకాలు వారి ఆదాయాన్ని మరింత పెంచాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడం, వ్యవసాయం, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు రాయితీలు, ప్రోత్సాహకాల రూపంలో ప్రభుత్వం అండగా నిలవడంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడి స్థిరాస్థి రంగంలో కొనుగోళ్లు పెరిగాయి. గత ఐదేళ్లలో ఏటా ప్రభుత్వం నిర్దేశించిన రాబడి లక్ష్యం 70 శాతానికి తగ్గలేదు. కరోనా విలయతాండవం చేసిన 2020, 2021 సంవత్సరాల్లో సైతం 76 నుంచి 95 శాతం వరకు లక్ష్యాన్ని చేరుకోవడం గమనార్హం.

స్థిరాస్థి రంగం కుదేలు

కూటమి పాలనలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. గతంలోని వెంచర్లు, అపార్ట్‌మెంట్లపై కొన్నిచోట్ల కూటమి నేతలు రాబందుల్లా పడ్డారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారు. వర్షాలు, వరదలు, దళారుల దోపిడీలతో తొలకరి పంట నష్టపోగా, గిట్టుబాటు ధరలు లేక ఆక్వా సాగు నిరాశజనకంగా తయారైంది. సంక్షేమ పథకాలను ప్రభుత్వం అటకెక్కించడంతో జనం వద్ద డబ్బుల్లేక మార్కెట్‌లో మనీ రొటేషన్ తగ్గిపోయింది. దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ పండుగల్లో రెడీమేడ్, కిరాణా, బంగారం, ఫ్యాన్సీ, హోమ్‌నీడ్స్ తదితర వ్యాపారాలు సగం కూడా జరగని పరిస్థితి ఎదురైంది. రియల్ ఎస్టేట్ రంగంలో క్రయవిక్రయాలు తగ్గిపోయాయి. సైట్లు అమ్ముడుపోక అప్పులు చేసి వెంచర్లు వేసిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పిల్లల చదువులు, వివాహాలు, ఇతర అవసరాల నిమిత్తం ఉన్న కాస్త ఆస్తిని అమ్మకానికి పెట్టినా కొనేవారు లేక సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో నెలకు రెండు మూడు ప్లాట్లు విక్రయించే వారు గత కొన్ని నెలలుగా ఒక్క ప్లాటు కూడా విక్రయించలేని పరిస్థితి.



లేఅవుట్


తగ్గిన ఆదాయం


ముందెన్నడూ లేని విధంగా రిజిస్ట్రేషన్ శాఖలో గత ఆర్థిక సంవత్సరంలో రాబడి లక్ష్యం కేవలం 63 శాతం నమోదైంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి భూముల విలువను 10 నుంచి 40 శాతం వరకు పెంచడం అంతంతమాత్రంగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగాన్ని మరింత దెబ్బతీసింది. గత ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో 17,394 రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ. 67.7 కోట్లు ఆదాయం సమకూరగా ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో 15,645 రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.58.07 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు భారీగా పెరగడం, ప్రజలు బంగారం కొనుగోలుకు ఆసక్తి చూపడం వల్ల రిజిస్ట్రేషన్లు తగ్గాయని అభిప్రాయపడుతున్నారు.



దేశంలో ఏ రామాలయానికి వెళ్లినా రాముడి కుడివైపున లక్ష్మణుడు, ఎడమ వైపున సీతాదేవి, పాదాల దగ్గర నమస్కార భంగిమలో హనుమంతుడి విగ్రహాలు దర్శనమిస్తాయి. కానీ ఈ ఆలయంలో ఆంజనేయుడి విగ్రహం ఉండదు. అలాంటి అరుదైన ఆలయమే ఒంటిమిట్ట రామాలయం. ఏకశిలపైన సీతారామలక్ష్మణ విగ్రహాలున్న ఈ ఆలయంలో రాముడు యోగముద్రలో దర్శనమివ్వడం విశేషం.

ఆంధ్ర అయోధ్య ఒంటిమిట్ట రామాలయం





ఆంధ్రా అయోధ్యగా... అపర భద్రాద్రిగా గుర్తింపు పొందిన వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట కోదండ రామాలయంలోని గర్భగుడిలో మనకు ఏకశిలపైన సీతారామలక్ష్మణ విగ్రహాలు కనిపిస్తాయి తప్ప హనుమంతుడి విగ్రహం ఉండదు. ఈ ఆలయ నిర్మాణ సమయానికి రాముడికి హనుమంతుడు పరిచయం కాలేదనీ.. అందుకే ఇక్కడ హనుమంతుడి విగ్రహం లేదనే కథ ప్రచారంలో ఉంది. అయితే ఆలయానికి అభిముఖంగా సంజీవరాయస్వామి పేరుతో ఒంటిమిట్ట క్షేత్రపాలకుడుగా ఆంజనేయస్వామి ఆలయం నిర్మితమైంది. ఈ ఆలయంలో స్వామివారు సీతారామలక్ష్మణులకు ఎదురుగా నిలబడి అంజలి ఘటిస్తున్నట్లుగా ఎత్తైన విగ్రహంతో నిలచి, భక్తులను కాపాడుతూ ఉంటారు.

స్థలపురాణం...

ఈ ఆలయ నిర్మాణానికి సంబంధించి వివిధ కథలు ప్రచారంలో ఉన్నాయి. పద్నాలుగేళ్ల వనవాస సమయంలో రాముడు సీతా లక్ష్మణ సమేతుడై ఈ అరణ్యంలోనూ కొంతకాలం గడిపాడట. ఆ సమయంలో మృకండు, శృంగి అనే మహర్షుల ఆశ్రమం ఇక్కడే ఉండేదట. వాళ్లు చేసే యజ్ఞయాగాలకు రాక్షసులు ఆటంకం కలిగించడంతో రాముడు వాళ్లను హతమార్చి యాగరక్షణ చేశాడట. అందుకు ప్రతిగా ఈ మహర్షులు ఏకశిలపైన సీతారామ లక్ష్మణుల విగ్రహాలను చెక్కించారనీ... అయితే ఆ తరువాత రాముడి భక్తుడైన జాంబవంతుడు ఆలయం నిర్మించి ఆ విగ్రహాలను అందులో ప్రతిష్ఠించాడనీ అంటారు. ఈ ఆలయానికి సంబంధించి మరో కథ కూడా ప్రాచుర్యంలో ఉంది. ఈ ప్రాంతంలో ఒంటడు, మిట్టడు అనే ఇద్దరు అన్నదమ్ములు ఉండేవారట. బోయవాళ్లైన వీళ్ల ఈ అటవీప్రాంతాన్ని సంరక్షించేవారు. ఓసారి ఈ ప్రాంతానికి ఉదయగిరిని పాలించే కంపరాజు వచ్చాడు, ఈ అన్నదమ్ములు రాజుకు అన్నిరకాల సేవలు చేయడమే కాక చుట్టూ ఉన్న ప్రాంతాలనూ చూపించారు. ఆ రాజు ఆనందించి ఏదయినా కోరుకోమని అడగగా, ఇక్కడ రామాలయం కట్టించమని కోరారట. రాజు ఈ ప్రదేశాన్ని పరిశీలించి గుడి కట్టేందుకు అవసరమైన నిధుల్ని అందించి ఆ బాధ్యతను వీళ్లకే అప్పగించి వెళ్లిపోయాడు. వీళ్లిద్దరూ ఎంతో భక్తిశ్రద్ధలతో కొన్నేళ్లు కష్టపడి ఈ ఆలయాన్ని నిర్మించారట. వాళ్లిద్దరూ కట్టించడం వల్లే ఈ ఆలయానికి ఒంటిమిట్ట రామాలయం అనే పేరు వచ్చిందని అంటారు. ఆ తరువాత ఉదయగిరి రాజు సోదరుడైన బుక్కరాయలు తన దగ్గరున్న నాలుగు సీతారామలక్ష్మణ ఏకశిల విగ్రహాల్లో ఒకదాన్ని ఈ ఆలయంలో ప్రతిష్ఠించాడని చెబుతారు.

ఈ ఆలయంలోని రామతీర్థాన్ని రాముడే సీతకోసం ఏర్పాటు చేశాడని అంటారు. మొదట ఆ తీర్థాన్ని రామబుగ్గ అనేవారనీ.. క్రమంగా అదే రామతీర్థం అయ్యిందనీ చెబుతారు. ఎందరో ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసినా... ఆంధ్రావాల్మీకిగా గుర్తింపు పొందిన వావిలికొలను సుబ్బారావు అనే రామభక్తుడు ఈ రామాలయాన్ని పునరుద్ధరించినట్లు చరిత్ర చెబుతోంది. స్వామికి విలువైన ఆభరణాలను సమకూర్చేందుకు ఆ భక్తుడు టెంకాయ చిప్పను పట్టుకుని భిక్షాటన చేసి సుమారు పది లక్షల రూపాయలు సేకరించాడట.

విశేష పూజలు...

మూడు గోపుర ద్వారాలున్న ఈ ఆలయ ముఖద్వారం ఎత్తు సుమారు 160 అడుగులుంటుంది. శేషాచల పర్వత పంక్తిలో ఆదిశేషుని తలభాగంగా తిరుమల క్షేత్రం మధ్యభాగంగా దేవుని గడప (కడప), ఒంటిమిట్ట, అహోబిలం తోకభాగంగా శ్రీశైల క్షేత్రాలను అభివర్ణిస్తారు. దేవుని కడప క్షేత్రాన్ని సందర్శించి తిరుమలకు వెళ్లే భక్తులు ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామాలయాన్ని దర్శించి వెళ్లడం అనాదిగా జరుగుతోంది. ఎత్తైన గోపురాలు, విశాలమైన ఆలయ ప్రాంగణం, సుందరమైన మండపాలు, విజయనగర సామ్రాజ్య వైభవాన్ని తెలిపే రమణీయ శిల్పసంపద ఈ ఆలయాన్ని దర్శించిన భక్తులకు, పర్యాటకులకు కనువిందు చేస్తుంది.



ఈ ఆలయాన్ని అద్భుత ధామంగా తీర్చిదిద్దడంలో చోళరాజులు, విజయనగర పాలకులు ఇతోధికమైన కృషి చేశారు. దేవాలయ ముఖమండపంలో రామాయణ, భారత, భాగవతాలలోని వివిధ ఘట్టాలను కనులకు కట్టే శిల్పాలున్నాయి. సీతాదేవికి అంగుళీయకాన్ని చూపిస్తున్న హనుమంతుడు, లంకకు వారధిని నిర్మించే వానరులు, శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిని పైకెత్తే దృశ్యం, వటపత్రశాయి, శ్రీ కృష్ణుని కాళీయ మర్దనం, నర్తకీమణుల బొమ్మలు ఉన్నాయి. అలాగే ముఖద్వారంపై దేవతలు, రాక్షసులు క్షీరసాగర మథనం చేసే దృశ్యం, ఒక బొమ్మలో ఏనుగు– ఆవు కనిపించేలా చెక్కిన సుందర శిల్పాలు కనువిందు చేస్తాయి. ఆలయ ద్వారపాలకులుగా అంజలి ముద్రతో శోభిల్లే జయవిజయుల శిల్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ఆధ్యాత్మిక కేంద్రం

ఇక్కడ స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహించడంతోపాటూ శ్రీరామనవమి సమయంలో తొమ్మిది రోజులపాటు ప్రత్యేక ఉత్సవాలను చేస్తారు. చతుర్దశి నాడు కల్యాణం, పౌర్ణమిరోజు రథోత్సవం నిర్వహిస్తారు. బమ్మెర పోతనామాత్యుడు ఒంటిమిట్ట కేంద్రంగా భాగవత రచన చేసి, ఆ కావ్యాన్ని ఒంటిమిట్ట కోదండ రామునికే అంకితం ఇచ్చారట. అందుకే ఒంటిమిట్ట ఆలయంలో పోతన విగ్రహం కూడా ఉంది.

– డి.వి.ఆర్.



కడప నుంచి తిరుపతికి వెళ్లే ప్రధానమార్గంలో కడపకు 24 కి.మీ. దూరంలో మండలకేంద్రం ఉంది. ఈ గ్రామం త్రేతాయుగం నాటిదని స్థలపురాణం వివరిస్తోంది. ఒకే శిలలో సీతారామ లక్ష్మణులు చెక్కబడి ఉండడంతో ఒంటిమిట్టకు ఏకశిలానగరంగా పేరు వచ్చింది. ఆంజనేయుడు లేని రామాలయంగా ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామాలయం దేశంలోనే పేరుగాంచింది. సుదీర్ఘచరిత్ర, అపురూపమైన శిల్పసంపద, ఆసక్తి గొలిపే స్థలపురాణం ఈ ఆలయాన్ని సమున్నత స్థానంలో నిలబెడుతున్నాయి.

ధర్మ సందేహం



హనుమంతునికి ఎన్ని ప్రదక్షిణలు చేయాలి ?

హనుమంతునకు ప్రదక్షిణలు ఇష్టం. ఏ దేవాలయానికి వెళ్ళినా మూడు ప్రదక్షిణాలు చెస్తాం. కాని హనుమంతుని ఆలయానికి వెళ్లినప్పుడు ఐదు ప్రదక్షిణాలు చేయాలి. 'ప్రదక్షిణ నమస్కారాన్ సాష్టాంగాన్ పంచ సంఖ్యాయా' అని ఆర్ష వాక్యం. మామూలుగా ప్రదక్షిణలు చేసేటప్పుడు కూడా ప్రదక్షిణ శ్లోకాలు చదువుకోవాలి. సకల రోగ, భూతప్రేత పిశాచాది బాధలు తొలగుటకు, అభీష్టసిద్ధికి ప్రదక్షిణలు చేయడం శ్రేష్ఠం. భక్తులు నియమాలతో కూడిన ప్రదక్షిణలు చేయడం ముఖ్యం. రోజూ ఒకేమారు 108 లేదా 54 లేదా 27 పర్యాయాలు ప్రదక్షిణ చేయాలి. పువ్వులు, వక్కలు, పసుపుకొమ్ములు వంటి వాటిని లెక్కించడానికి వాడటం మంచిది. ప్రదక్షిణలు చేస్తూ చదవాల్సిన శ్లోకాలు

'శ్రీహనుమన్ జయ హనుమాన్ జయ జయ హనుమాన్'
శ్లో: ఆంజనేయం మహావీరం – బ్రహ్మవిష్ణు శివాత్మకం
తరుణార్క ప్రభంశాంతం – రామదూతం నమామ్యహం
మర్కటేశ మహోత్సాహ – సర్వశోక వినాశన
శత్రూన్ సంహర మాం రక్ష – శ్రియం దాపయ మే ప్రభో

అని చదువుకొంటూ ప్రదక్షిణాలు చేయాలి. కోరిక మేరకు మండలం, అర్ధమండలం కాని ప్రదక్షిణలు చేసి చివరలో స్వామికి విశేషార్చన జరిపించాలి. ప్రదక్షిణ కాలంలో బ్రహ్మచర్యం, శిరఃస్నానం, భూశయనం, సాత్వికాహారం వంటి నియమాలు పాటించాలి. సాధారణ సమయాలలో కూడా హనుమకు ఐదు ప్రదక్షిణలు చేయడం శ్రేష్ఠం.

● నిర్మల వాణి

సర్వ మత సమ్మేళనం విశ్వ నిర్మల ధర్మం



ధర్మో రక్షతి రక్షితః అనే సూక్తి వాల్మీకి రామాయణంలోని ఒక శ్లోకం లోనిది. దీని అర్థం – ధర్మాన్ని మనం రక్షిస్తే, అది మనల్ని రక్షిస్తుంది అని. నారాయణ ఉపనిషత్తు ప్రకారం – 'ధర్మమే సర్వ జగత్తుకు ఆధారం'. 'మనుస్మృతి' ప్రకారం ధైర్యం, క్షమ, సంయమనం, అస్తేయం, శౌచం, ఇంద్రియ నిగ్రహం, విద్య, సత్యం, క్రోధ రాహిత్యం, సంశయం లేకుండా ఉండుట. ఈ పదింటిని జీవితంలో ధరించుటయే ధర్మం. ఇదే పరమపూజ్య శ్రీ మాతాజీ నిర్మలా దేవి ప్రవేశ పెట్టిన 'విశ్వనిర్మల ధర్మం' నేపథ్యం.

'సహజయోగం ఏ ఒక్క మతానికో చెందినది కాదు. ఇది సర్వమత సమ్మేళనం. సర్వమతాల సారం. ఎందరో అవతారపురుషుల ప్రబోధాలు, ఎందరో సద్గురువుల, మత ప్రవక్తల బోధనల సారాంశాన్ని ఏకీకృతం చేసి,సమ్మిళితం చేసే ఏకైక ధార్మిక సంగమం సహజయోగం. ఇంతకు మునుపు మనిషి ఏ మతానికి సంబంధినవాడైనా సరే. తన మత సారాంశాన్ని సహజ యోగంలోకి వచ్చిన తరువాత అనుభూతి చెంది తను ఆచరించే మతంలో వున్న దాన్ని తనలో వాస్తవంగా జాగృతి చేయబడటాన్ని గమనిస్తాడు.

ఇప్పటివరకు అవతార పురుషుల పేరు మీదనే ఆయా మతాలు వ్యక్తీకరింపబడుతున్నాయి. శ్రీ మాతాజీ నిర్మలాదేవి తాను ప్రబోధించిన సూత్రాలను, ఆదర్శాలను, ధర్మాలను తాను స్వయంగా ఆచరిస్తూ, తాను స్థాపించిన సహజయోగంలో వాటిని ఆచరణీయమైన అంతర్భాగంగా చేశారు. సహజయోగంలో స్థిరపడిన ఏ సహజయోగికి తాను ఏ కులమో, ఏ మతమో అనే విషయమే జ్ఞాపకం రాదు. ఎందుచేతనంటే అన్ని మతాల గురువులను, అవతారమూర్తులను కూడా తమ అంతర్గత సూక్ష్మ శరీరంలోని చక్రాలలో అధిష్ఠాన దేవతలుగా గుర్తించి వారు సాధన చేసే రోజువారీ ధ్యానంలో వారిని పూజిస్తున్నారు, వారి గుణ గణాలను, వారి బోధలను తమలో స్థిరపరచుకునే ప్రయత్నం చేస్తున్నారు.



పరమపూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి

మన అందరిదీ ఒకే మతం, ఒకే రంగు, ఒకే జాతి కాకపోయినా, అందరినీ సృష్టించిన ఆది దంపతులు ఒక్కరే. అప్పుడందరిది ఒక్కటే మతం. ఒకటే అభిమతం. ఒకటే కుటుంబం. అదే విశ్వనిర్మల ధర్మం. ఇది అర్థం చేసుకోవాలన్నా, ఆచరించి చూపించాలన్నా, ప్రజలు సహజయోగంలోనికి వస్తేనే సాధ్యమవుతుంది. అలా జరిగిన నాడు మనది భూతల స్వర్గమే.

ఒకసారి మనం విశ్వనిర్మల ధర్మాన్ని అంగీకరిస్తే అప్పుడు మనం ఈ చిన్న చిన్న కుల ప్రస్తావనలు, సంప్రదాయాలు, జీవం లేని పాత కట్టుబాట్లు, మన ఆత్మకు సరిపోని అన్ని విషయాలను మరచిపోతాము. ఏదైతే ఆత్మకు అంగీకారమౌతుందో వాటినే ధర్మ సూత్రాలుగా అంగీకరించాలి. అంతే! శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచనాల ప్రభావంతో సహజయోగులు సాధించినదంతా విశ్వనిర్మల ధర్మం సారమే. ఇంత వరకూ స్థాపింపబడిన మతాలన్నీ వాస్తవంగా ఎంతో గొప్ప గొప్ప అవతరమూర్తులు స్థాపించినవే. అవన్నీ గొప్పవే. కానీ ఆ మతాలన్నీ కొందరిచేత వ్యక్తీకరించ బడ్డాయి. దానికి కారణం మొట్టమొదటిది – వారికి ఆత్మసాక్షాత్కారం ఇవ్వబడలేదు. మానవ జన్మ పరమార్థమే ఆత్మ సాక్షాత్కారం పొందడం. మనిషి వెన్నెముకలో నిద్రాణ స్థితిలో వున్న కుండలినీ శక్తిని జాగతి చేసి బ్రహ్మరంధ్రాన్ని ఛేదించి సహస్రార చక్రాన్ని తెరచి బాహ్య పరంగా వున్న పరమాత్మ శక్తితో ఏకీకరణ కావడమే ఆత్మ సాక్షాత్కారం.

అయితే వచ్చిన చిక్కేమిటంటే విశ్వనిర్మల ధర్మం ఒక 'మతం' అని చెబితే ప్రజలు మతం తీసుకోవాలి కాబోలు అనుకుంటారు. సహజయోగంలోనికి రావాలంటే మతానికి సంబంధించిన ఆచార వ్యవహారాలు, నియమ నిష్ఠలు అనుసరించాలి కాబోలు అని అనుకుంటారు. కానీ ఇందులో ప్రత్యేకంగా పాటించే సంప్రదాయం ఏమీ లేదు. కేవలం ఆత్మకు సౌకర్యవంతమైనవి, మన ఆధ్యాత్మిక ఎదుగుదలకి ఉపయోగపడేవి మాత్రమే. అన్ని మతాలలోని మూల సారాంశం – "నిన్ను నీవు తెలుసుకో". అదే సత్యం. భగవంతుడనేవాడు ఎక్కడో కాదు, నీలోనే ఆత్మగా ఉన్నాడు. నువ్వు ఆత్మ స్వరూపునిగా పరిణామం చెందాలి, అదే పరమ సత్యం, వాస్తవం. ఎన్నో సంవత్సరాల, జన్మల ఈ సత్యాన్వేషణ సహజయోగంలో ఆత్మసాక్షాత్కారంతో ముగుస్తుంది. అదే మానవ జన్మ పరమార్థం.

– డా. పి.రాకేష్
(పరమపూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచనాల ఆధారంగా)

● కథానీతి

చెప్పులు వదిలినట్లు...

ఇంట్లో పోరు ఎక్కువయ్యిందని, భార్యా పిల్లలతో ప్రశాంతత కరువయ్యిందని ఒక వ్యాపారి ఆశ్రమానికి వెళ్లి గురువును కలిశాడు. తాను తన భార్యాబిడ్డలకోసం ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి వ్యాపారం చేస్తున్నానని, ఇంటికొస్తే భార్య తనను ఆదరించడం లేదని, పిల్లలు అది కావాలి ఇది కావాలి అని పోరుపెడుతున్నారని, దానివల్ల తనకు మానసిక ప్రశాంతత కరువయ్యిందని వాపోయాడు.

గురువు అంతా విని చిరునవ్వు నవ్వి "నీవు వ్యాపారం ముగించుకుని ఇంటిలోపలికి వెళ్లే ముందు ఏమి చేస్తావు" అని అడిగాడు.



చెప్పులు బయట వదిలి ఇంట్లోకి వెళ్తానని బదులిచ్చాడు వ్యాపారి.

"అంతే కదా.. మనం ఎన్నో లౌకిక వ్యవహారాలలో తలమునకలై అదే ఒత్తిడితో ఇంటికి వెళతాము. మనకు తెలిసో తెలియకో ఆ ఒత్తిడిని ఇంట్లో వారిపైన ప్రదర్శిస్తాము. ఎంతటి ఖరీదైన చెప్పులైనా ఇంటి బయటే కదా వదులుతాము. అలాగే ఎంత పెద్ద సమస్యలున్నా మనం వాటిని ఇంటి బయటే వదిలేయాలి. సమస్యలను మనం ఇంట్లోకి మోసుకుపోవడం వలన ఇబ్బందులు వస్తాయి. ఇంట్లో వారి సాధకబాధకాలు అల్పంగాను మన సమస్యలు పెద్దవిగాను కనిపిస్తాయి. దీంతో భార్యాభర్తల మధ్య సఖ్యత కొరవడుతుంది" అని వివరించాడు గురువు.

అర్థం అయిందన్నట్లు తల ఊపి, అలాగే చేస్తానని వ్యాపారి ఇంటికెళ్ళాడు. ఆరు నెలల తర్వాత భార్యతో కలిసి నవ్వుతూ వచ్చి గురువు ఆశీర్వాదం తీసుకున్నారు.

● సువార్త

మోయదగిన క్రీస్తు కాడి

'యవ్వన కాలమున కాడి మోయుట నరునికి మేలు. అతని మీద దానిని మోపినవాడు యెహోవాయే' – విలాప 3:27,28. మహారాజు పట్టణంగా చెప్పబడే యెరూషలేము గొప్ప వైభవం గలది. ఇప్పుడు అది చెరపట్టబడి నాశనం అవుతుంటే దాన్ని చూస్తూ ఇర్మీయా ప్రవక్త కన్నీటితో విలపిస్తూ రాసిన సందర్భం ఇది. దీనిగూర్చి లోతైన సమాచారం ఉంది. ఇది క్రీస్తుకు కూడా నిరభ్యంతరంగా ఆపాదించవచ్చు. ఇక్కడ క్రీస్తుకు కూడా అన్నది గమనించాలి. క్రీస్తుకు సంబంధించిన ప్రవచనం కాదు. అయితే ఇది మొదటగా అక్కడి సందర్భాన్ని బట్టే చూడాలి. యేసుక్రీస్తు తన నిండు యవ్వన ప్రాయాన దేవునికి పరిపూర్ణంగా లోబడుట ద్వారా ఇలా ఈ విధేయత అనే కాడిని మోశాడు. దేవుని రాజ్యమును గూర్చిన సువార్త భారం, దేవుని ఇంటిని గూర్చిన ఆసక్తి, దేవుని గొర్రె పిల్లగా లోక పాపాలను మోసే భారం, సిలువ శ్రమలు, దేవుని రాజ్యపు బరువు బాధ్యతలు వంటి అనేకం ఆయన మీద మోపబడ్డాయి. ఇవన్నీ క్రీస్తు మీద మోపినవాడు తండ్రియైన యెహోవాయే. అయితే ఈ వచనం ఆ పట్టణం నాశన సంబంధిత పరిణామాలను అక్కడి యెరూషలేము యువత శ్రమలను తట్టుకొనేలా వారి బలం, ప్రోత్సాహాలను ఉద్దేశించి, చెర యువతను గూర్చి ఈ సందర్భం ప్రముఖంగా ప్రస్తావించిందన్నది మరచిపోరాదు. దీని పైన కింద అక్కడి యువతను తిరిగి కట్టే యోచన గూర్చిన దేవుని వివరణే. ఒకరిమీద తండ్రియైన దేవుడు కాడి మోపితే దానికి ఉండే ఉన్నతే వేరు. ఉత్సాహం కొద్దీ ఆ వెనుక దాగిన అర్థం పరమార్థం తెలుసుకొని ఇక తప్పక ఆ కాడికి విధేయంగా తలవంచి తీరాల్సిందే. దేవుని కాడి బరువు అంతా క్షేమదాయకమే. కాడి అంటే నీ కోసం ప్రాణం పెట్టిన క్రీస్తురాజుకు, ఆయనదైన ఏలుబడికి నిన్ను నీవు సజీవ యాగంగా సమర్పించుకోవడం. ఆయనకు దాసుడుగా వ్యవహరించడం. ఇక నీకంటూ స్వంత జీవితం, ఇష్టాయిష్టాలు ఉండవు. ఇలా క్రీస్తును సేవించడం గొప్ప లాభదాయకం అంటుంది గ్రంథరాజం.

ఆ దేవదేవుని ప్రియ కుమారుడు మన ప్రభువైన క్రీస్తు కూడా కాడి గూర్చి చాలా ఉన్నతంగా వైవిధ్యంగా బోధ చేసాడు. 'ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా వద్దకు రండి. నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను, దీన మనస్సు గలవాడను గనుక మీమీద నా కాడి ఎత్తుకొని నా వద్ద నేర్చుకోనుడి. అప్పుడు మీ ప్రాణాలకు విశ్రాంతి దొరకును. ఏలయనగా నా కాడి సుళువుగాను నా భారము తేలికగాను ఉన్నవి' – మత్త 11: 28–30. ధర్మ శాస్త్రము మోయలేని కాడి లాంటిది. అందులోని అనేక ఆచారాలలో సున్నతి ఆచారం ఒకటి. ధర్మశాస్త్రమును కొట్టి వేయుటకు రాలేదు. దాన్ని నెరవేర్చుటకే వచ్చాను అన్నాడు ప్రభువు. ధర్మ శాస్త్రం యావత్తూ ఆయన ఒక్కడే నెరవేర్చి ఆ తదుపరి తన మరణంతో దాన్ని కొట్టి వేసాడు (ఎఫెసీ 2:14, కొలొస్స 2: 13–15). ఒక్క క్రీస్తు తప్ప ఇశ్రాయేలీయులలో ఏ ఒక్కరూ తమ జీవిత కాలంలో ధర్మ శాస్త్రాన్ని ఆచరించి చూపలేకపోయారు. పది ఆజ్ఞలలో వాటిని పాటించుటలో అందరూ ఏదో ఒక చోట తప్పిపోయిన వారే. ఇలాంటి మోయలేని కాడి బరువు, భారం ఎలా ఉంటుందో ప్రభువుకు తెలుసు కనుకనే తన కాడిని చాలా సులువు చేసాడు (ఫిలిప్పీ 2:7,8 హెబ్రీ 2:14–18, 4:15). కృప కోణంలో నుండి చూస్తేనే ఇది అర్థమవుతుంది.



మూడున్నర సంవత్సరాలపాటు క్రీస్తు వద్ద కాడిని సులువుగా మోయడం నేర్చుకొన్న పేతురు విధేయమైన ఉపదేశానికి క్రీస్తు చెప్పిన పై బోధే ఆధారం కూడా. యెరూషలేములో ఉన్న పేతురు వద్దకు అంతియొకయ సంఘం నుంచి ఒక సమస్య వచ్చి పడింది. దాన్ని అతడు ఒకే ఒక్క మాటతో చాలా సానుకూల పద్ధతిలో సులభంగా హుందాగా పరిష్కరించడం అబ్బురపరచే విశేషం కూడా (అపొ. కా.15:1–29). సున్నతి మోయలేని కాడి వంటిది.

యేసు బాప్తిస్మము తీసుకొనే ముందు బాప్తిస్మమిచ్చు యోహానుతో ఇలా అన్నాడు. 'నీతి యావత్తు ఇలా నెరవేర్చుట మనకు తగియున్నది'. ఆత్మ సంబంధ సున్నతిగా చెప్పబడే బాప్తిస్మం అనేది క్రీస్తు ద్వారా సులభతరం చేయబడిన ఎన్నో కాడులలో ఇది ఒక మోయదగిన కాడి అని చెప్పవచ్చు. క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానంలలో పాలు పంపుట అనుగ్రహించి పెట్టేది ఈ ఒక్కటే అనబడే లేఖనానుసార బాప్తిస్మం మాత్రమే. పురోగమన బాప్తిస్మంలో ఉన్న ఈ భాగ్యం తిరోగమన సున్నతిలో లేదు. ఇప్పుడైతే యూదుడని, అన్యజనుడని, పురుషుడని, స్త్రీ అని ఏ భేదమూ లేదు. ఇదంతా మోయదగిన క్రీస్తు కాడి ప్రభావం.

– జేతమ్

● ఇస్లాం వెలుగు

ఇహలోక జీవితం పరీక్షా నిలయం



మంచీ చెడు, ధర్మం అధర్మం – ఇవి రెండే మార్గాలు. మానవుడు ఇందులో ఏదో ఒకమార్గాన్ని ఎంచుకోవలసిందే. మరోమార్గం లేదు. దేవుడు మానవుడికి ఈ పరీక్ష పెట్టేముందే సత్యాసత్యాలను అతనికి ఎరుక పరిచాడు. ధర్మాధర్మాలను బోధపరిచాడు. ప్రవక్తలద్వారా, గ్రంథాల ద్వారా విషయాన్ని విశదీకరించాడు. అంతేకాదు, విచక్షణా జ్ఞానాన్ని, స్వేచ్ఛను, నిర్ణయాధికారాలనూ ప్రసాదించాడు. ఇక మానవుడు దైవాదేశాలకనుగుణంగా ధర్మబద్ధమైన జీవితం గడిపితే ఇహపరలోకాల్లో సాఫల్యం పొందుతాడు. కాదంటే దేవుని ఆగ్రహానికి గురై ఇహంలోనూ, పరంలోనూ పరాభవం పాలవుతాడు. దేవుని ఆగ్రహాన్నుండి, ఆయన శిక్షనుండి తప్పించుకోడానికి అతనికి మరేమార్గమూ లేదు. ఎందుకంటే, దేవుడు అతనికి ముందే బుద్ధిజ్ఞానాలను ప్రసాదించి, ధర్మాధర్మాలను విడమరిచి తెలియజేశాడు. ఇది మంచీ, అది చెడు, ఇది ధర్మం, అది అధర్మం, ఇది న్యాయం, అది అన్యాయం అని స్పష్టంగా వివరించి, ఈ మార్గంపై నడిస్తే స్వర్గానికి పోతావు, ఆ మార్గాన్ని అనుసరిస్తే నరకానికి వెళతావు అని స్పష్టంగా చెప్పేశాడు. కనుక తప్పించుకునే దారి లేనేలేదు. అందుకని బుద్ధిజీవి అయిన మానవుడు దైవం తనకు మాత్రమే ప్రసాదించిన విచక్షణాజ్ఞానాన్ని, ఆలోచనా శక్తిని, స్వయం నిర్ణయాధికార స్వేచ్ఛను దుర్వినియోగం చేయకుండా ధర్మబద్ధంగా దైవాభీష్టమైన జీవితం గడపాలి. మూణ్ణాళ్ళ ముచ్చట అయిన ఈ ప్రాపంచిక జీవితాన్ని అనంతమైన, శాశ్వతమైన సాఫల్య జీవితానికి ఆలంబనగా మలచుకోవాలి. విజయం కోసం తపించే విద్యార్థి ఎలా శ్రమిస్తాడో, పరీక్ష హాలులో రెండున్నర, మూడుగంటల సమయాన్ని ఎంత తెలివిగా సద్వినియోగం చేసుకుంటాడో, అంతకన్నా ఎక్కువ దీక్షతో ఇహలోక జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పరీక్షరాసే విద్యార్థికి ఆ కొద్దిపాటి సమయం ఎంతవిలువైనదో, చాలా చిన్నదైన ఈ ప్రాపంచిక జీవితం అంతకన్నా అమూల్యమైనది. సమాజహితం, సర్వమానవ సంక్షేమమే ధ్యేయంగా పెట్టుకుంటే అంతకన్నా ధార్మికత, అంతకన్నా మానవత మరేమీ ఉండదు. అన్యాయం, అక్రమాలు, అవినీతి, దుర్మార్గాలకు దూరంగా నిజాయితీగా విలువలతో కూడిన జీవితం గడిపితేనే దేవుడు సంతోషిస్తాడు. సమాజమూ హర్షిస్తుంది. ఇదేమీ పట్టకుండా భౌతిక ప్రగతే ప్రధానంగా ఇష్టానుసార జీవితం గడిపితే, పరీక్షా సమయం ముగిసిపోతుంది కాని, విజయం మాత్రం అందని ద్రాక్షగానే మిగులుతుంది. ఇహపరాల్లో వైఫల్యం చవిచూడవలసి వస్తుంది. అల్లాహ్ మానవాళికంతటికీ ఇహ పరలోకాల్లో విజయవంతమైన సాఫల్య జీవితం అనుగ్రహించాలని మనసారా కోరుకుందాం.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

బిజినెస్ రీల్

మాడెన్‌తో కోరమాండల్ ఇంటర్నేషనల్ ఎంవోయూ



హైదరాబాద్: అగ్రి సొల్యూషన్స్ సంస్థ కోరమాండల్ ఇంటర్నేషనల్ తాజాగా ఫాస్ఫేట్ ఎరువుల తయారీ దిగ్గజం మాడెన్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీర్ఘకాలికంగా డై-అమ్మోనియం ఫాస్ఫేట్ (డీఏపీ), ఎన్‌పీ/ఎన్‌పీకే ఎరువుల సరఫరా కోసం ఇది ఉపయోగపడనుంది. గత అనేక సంవత్సరాలుగా కోరమాండల్‌కు మాడెన్ సంస్థ అమోనియా సరఫరా చేస్తోంది. తమ భాగస్వామ్యానికి సంబంధించి ఈ కొత్త ఒప్పందం ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ఇరు సంస్థలు తెలిపాయి. సరఫరాపరంగా అంతర్జాతీయంగా అవరోధాల కారణంగా భారత్‌లో ఇటీవల డీఏపీ లభ్యత దెబ్బతిందని, రైతులకు సకాలంలో డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని కోరమాండల్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ నారాయణన్ వెల్లాయన్ తెలిపారు. తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని సమీప భవిష్యత్తులో 6 మిలియన్ టన్నుల నుంచి 9 మిలియన్ టన్నులకు పెంచుకుంటున్నట్లు మాడెన్ డైరెక్టర్ సాద్ అల్ తమీమి పేర్కొన్నారు.

ఒలెక్ట్రాకు 297 బస్సుల ఆర్డరు

డీల్ విలువ రూ. 424 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహనాల తయారీ దిగ్గజం ఒలెక్ట్రా గ్రీన్‌టెక్‌కు హిమాచల్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (హెచ్‌ఆర్‌టీసీ) నుంచి 297 బస్సుల సరఫరా, నిర్వహణకు భారీ ఆర్డరు లభించింది. కాంట్రాక్ట్ ప్రకారం లెటర్ ఆఫ్ అవార్డ్ (ఎల్‌వోఏ) తేదీ నుంచి 11 నెలల్లో బస్సులను అందించాల్సి ఉంటుంది. ఈ డీల్ విలువ సుమారు రూ. 424.01 కోట్లని కంపెనీ వివరించింది. హిమాచల్ ప్రదేశ్‌లోని కొండ ప్రాంతాల్లో నడిపేందుకు ప్రత్యేకంగా రూపొందిన ఈ బస్సులు 30 మంది ప్రయాణికుల సీటింగ్ సామర్థ్యంతో ఉంటాయి. ఒక్కసారి చార్జ్ చేస్తే 180 కి.మీ. వరకు ప్రయాణిస్తాయి. ఒక రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఇన్ని విద్యుత్ బస్సులను నేరుగా కొనుగోలు చేయడం దేశీయంగా ఇదే తొలిసారని ఒలెక్ట్రా సీఎండీ కేవీ ప్రదీప్ చెప్పారు. ఎలక్ట్రిక్ బస్సులకు సంబంధించి దేశీయంగా అతి పెద్ద ఆర్డరును అందుకోవడం తమకు గర్వకారణమని తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-4-2025

విశాఖ	435-00
చిత్తూరు	460-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	390-00
వరంగల్	392-00
రిటైల్ ధర	4.50

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
NESTLEIND	2,350.00	3.28
HINDUNILVR	2,349.00	2.61
TITAN	3,178.95	1.81
POWERGRID	294.1	1.78
TATACONSUM	1,087.55	1.66

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
WIPRO	236.8	-4.23
SBIN	742.45	-3.4
TECHM	1,270.95	-3.31
LT	3,062.00	-3.13
TRENT	4,625.70	-2.97

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	3,605
ఎన్ఎస్ఈ	80,976
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,62,109
ఎఫ్ఐఐ	- 4,358
డీఐఐ	+ 2,978

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	61.85	$ 59.58
బ్రెంట్	64.99	$ 62.82

మరిన్ని పీఎస్‌యూల్లో ఇన్వెస్ట్ చేయాలి

- మ్యూచువల్ ఫండ్స్‌కు దీపమ్ సలహా
- ప్రయివేట్ కంపెనీలు డివిడెండ్ పెంచాలి
- దీపమ్ కార్యదర్శి అరునిష్ చావ్లా సలహాలు



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ తమ పోర్ట్‌ఫోలియోలో ప్రభుత్వ రంగ సంస్థల(పీఎస్‌యూలు)కు మరింత ప్రాధాన్యత ఇవ్వవలసి ఉన్నట్లు దీపమ్ కార్యదర్శి అరునిష్ చావ్లా పేర్కొన్నారు. ఇదేవిధంగా వాటాదారులకు డివిడెండ్ చెల్లింపు విషయంలో ప్రయివేట్ రంగ కంపెనీలు మరింత సముచితంగా వ్యవహరించవలసి ఉన్నట్లు వ్యాఖ్యానించారు. ప్రభుత్వ డివిడెండ్ విధానం ప్రకారం పీఎస్‌యూలు ఒక ఆర్థిక సంవత్సరం నికర లాభాల నుంచి కనీసం 30 శాతం డివిడెండ్‌ను తప్పనిసరిగా ప్రకటించవలసి ఉంది. అయితే ఈ నిబంధన ప్రయివేట్ రంగ కంపెనీలకు వర్తించకపోవడం గమనార్హం! దీంతో సగటున ప్రయివేట్ రంగ కంపెనీల వార్షిక డివిడెండ్ చెల్లింపులు సగటున నికర లాభాల్లో 20 శాతానికే పరిమితమవుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో దీపమ్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన చావ్లా త్వరలో మ్యూచువల్ ఫండ్ సంస్థలతో ముంబైలో సమావేశంకానున్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు(సీపీఎస్ఈలు) అనుసరిస్తున్న విలువ సృష్టి వ్యూహాలను ఈ సందర్భంగా హైలైట్ చేయనున్నారు. వెరసి ఫండ్స్ తమ పోర్ట్‌ఫోలియోలో సీపీఎస్ఈలకు మరింత వాటా కల్పించవలసి ఉన్నట్లు ప్రస్తావించనున్నారు.

సరికొత్త రికార్డ్

ఇటీవలే ముగిసిన గతేడాది(2024-25) ప్రభుత్వ రంగ సంస్థలు చరిత్రలోనే అత్యధికంగా రూ. 1.5 లక్షల కోట్లను డివిడెండ్‌గా చెల్లించినట్లు చావ్లా పేర్కొన్నారు. ఫలితంగా సాధారణ వాటాదారు సైతం కార్పొరేట్ల ఉత్తమ పనితీరు నుంచి డివిడెండ్ రూపేణా లబ్ధి పొందవలసి ఉన్నట్లు ప్రభుత్వం భావిస్తున్నదని తెలియజేశారు. గణాంకాల ప్రకారం మొత్తం లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువలో 65 లిస్టెడ్ పీఎస్‌యూలు 10 శాతం వాటా ఆక్రమిస్తున్నాయి. అయితే మొత్తం డివిడెండ్ చెల్లింపుల్లో 25 శాతం ఆక్రమిస్తుండటం గమనార్హం! వెరసి ఫండ్ మేనేజర్లు పీఎస్‌యూ స్టాక్స్‌ను పోర్ట్‌ఫోలియోలలో చేర్చుకోవలసి ఉన్నట్లు చావ్లా సూచించారు. తద్వారా సాధారణ ఇన్వెస్టర్లు, సీనియర్ సిటిజెన్లు, మైనారిటీ వాటాదారులు సీపీఎస్ఈలు సృష్టిస్తున్న విలువలో కొంతమేర పొందగలుగుతారని వివరించారు. మరోపక్క మైనారిటీ వాటాదారులకు ప్రయోజనం కలిగేలా ప్రయివేట్ రంగ కంపెనీలు తగిన స్థాయిలో డివిడెండ్లను ప్రకటించాలని విమర్శించారు. ఈ రెండు అంశాల ద్వారా సాధారణ ఇన్వెస్టర్లకు షేర్ మార్కెట్ తగిన పెట్టుబడి మార్గంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. సీపీఎస్ఈలు 2023-24లో రూ. 1.23 లక్షల కోట్లు, 2022-23లో రూ. 1.05 లక్షల కోట్లు చొప్పున డివిడెండ్లు పంచాయి. ఈ బాటలో ప్రభుత్వానికి పీఎస్‌యూలు 2022-23లో రూ. 59,533 కోట్లు, 2023-24లో రూ. 63,748 కోట్లు, 2024-25లో రూ. 74,017 కోట్లు చొప్పున చెల్లించడం విశేషం!

రూ. 91 వేల దిగువకు పసిడి

న్యూఢిల్లీ: స్టాకిస్టులు, రిటైలర్ల నుంచి డిమాండ్ తగ్గడంతో పసిడి ధర బుధవారం రూ. 1,050 మేర క్షీణించింది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత గల 10 గ్రాముల పసిడి రేటు రూ. 90,200కి దిగి వచ్చింది. ఇక 99.5 శాతం స్వచ్ఛత బంగారం కూడా అంతే తగ్గి రూ. 89,750కి పరిమితమైంది. అయితే, వెండి ధర మాత్రం కేజీకి రూ. 500 పెరిగి రూ. 93,200కి చేరింది. వాణిజ్య యుద్ధాలు ప్రపంచ ఎకానమీని మాంద్యంలోకి తోసే స్థాయనే భయాలతో అంతర్జాతీయంగా మాత్రం పసిడి ధర పెరిగినట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయంగా బంగారం రేటు ఒక దశలో ఔన్సుకు (31.1 గ్రాములు) సుమారు 3,103 డాలర్ల స్థాయిని తాకింది. అమెరికా విధించిన 104 శాతం టారిఫ్‌లకు ప్రతీకారంగా చైనా 84 శాతానికి సుంకాలను పెంచుతామంటూ ప్రకటించడం వాణిజ్య యుద్ధానికి మరింత ఆజ్యం పోసింది. చైనా టారిఫ్‌లు ఏప్రిల్ 10 నుంచి అమల్లోకి రానున్నాయి.



విఝింజం పోర్టుకు అతి పె....ద్ద కంటైనర్ షిప్





తిరువనంతపురం: ప్రపంచంలోనే అత్యంత భారీ కంటైనర్ షిప్‌లలో ఒకటైన ఎంఎస్‌సీ తుర్కియే తాజాగా కేరళలోని విఝింజం ఇంటర్నేషనల్ సీపోర్టుకు వచ్చింది. భారతీయ పోర్టుకు ఇంత భారీ నౌక రావడం ఇదే ప్రథమమని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ పోర్టును అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ (ఏపీసెజ్‌) నిర్వహిస్తోంది. మెడిటేరేనియన్ షిప్పింగ్ కంపెనీ (ఎంఎస్‌సీ)కి చెందిన ఈ నౌక ఒక అధునిక ఇంజినీరింగ్ అద్భుతం. 399.9 మీటర్ల పొడవు, 61.3 మీటర్ల వెడల్పు, 33.5 మీటర్ల ఎత్తు ఉంటుంది. 24,346 టీఈయూల (ట్వెంటీ-ఫుట్ ఈక్వివాలెంట్ యూనిట్లు) సామర్థ్యం దీని సొంతం. ఇంధనాన్ని అత్యధికంగా ఆదా చేయడం ద్వారా ఇది కర్బన ఉద్గారాలను కూడా గణనీయంగా తగ్గిస్తుంది.

టాటా స్టీల్ నెదర్లాండ్స్ ప్లాంటులో 1,600 ఉద్యోగాల కోత



న్యూఢిల్లీ: ఉక్కు దిగ్గజం టాటా స్టీల్ తమ నెదర్లాండ్స్ ప్లాంటు కార్యకలాపాలను క్రమబద్ధీకరించుకునే క్రమంలో ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకుంటోంది. మేనేజ్‌మెంట్, సపోర్ట్ విధులకు సంబంధించి 1,600 ఉద్యోగాల్లో కోత విధించనున్నట్లు సంస్థ తెలిపింది. ఉత్పత్తి సామర్థ్యాన్ని, మార్జిన్లను మెరుగుపర్చుకోవడానికి, వ్యయాలు తగ్గించుకోవడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వివరించింది. స్థానిక మేనేజ్‌మెంట్ బోర్డులో కూడా కొన్ని మార్పులు, చేర్పులు చేయనున్నట్లు పేర్కొంది. ఈ విషయాలను సెంట్రల్ వర్క్స్ కౌన్సిల్‌తో పాటు ట్రేడ్ యూనియన్లకు కూడా తెలియజేసినట్లు కంపెనీ వివరించింది. 2025 ఆర్థిక సంవత్సరంలో నెదర్లాండ్స్ ప్లాంటు 6.75 మిలియన్ టన్నుల లిక్విడ్ స్టీల్ ఉత్పత్తి చేసింది. అయితే, భౌగోళిక-రాజకీయ పరిణామాల వల్ల యూరప్‌లో డిమాండ్ నెమ్మదించడం, వాణిజ్యం..సరఫరా వ్యవస్థల్లో అవాంతరాలు ఏర్పడటం తదితర అంశాలు నిర్వహణ వ్యయాలపైనా, అంతిమంగా ఆర్థిక పనితీరుపైనా ప్రభావం చూపాయి. నెదర్లాండ్స్ ప్లాంటులో హరిత టెక్నాలజీలను అమల్లోకి తేవడానికి కట్టుబడి ఉన్నట్లు టాటా స్టీల్ సీఈవో టీవీ నరేంద్రన్ తెలిపారు. ఇందులో భాగంగా ఈ దశాబ్దం ఆఖరు నాటికి రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల స్థానంలో అధునాతన పర్యావరణహిత ఫర్నేస్‌లను ఏర్పాటు చేయనున్నట్లు, దీనితో ఏటా 5 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గనున్నట్లు వివరించారు.

ఏప్రిల్ 30వరకే వివాద్ సే విశ్వాస్

తుది గడువు ప్రకటించిన ఆదాయపన్ను శాఖ



న్యూఢిల్లీ: పన్ను వివాదాల పరిష్కారానికి తీసుకువచ్చిన వివాద్ సే విశ్వాస్ పథకానికి ఆదాయపన్ను శాఖ తాజాగా తుది గడువును ప్రకటించింది. పన్ను చెల్లింపుదారులు 2025 ఏప్రిల్ 30లోగా పథకాన్ని వినియోగించుకునేందుకు డిక్లరేషన్‌ను సమర్పించవలసి ఉంటుందని స్పష్టం చేసింది. తద్వారా 2024 అక్టోబర్1న ప్రవేశపెట్టిన ఈ పథకానికి తొలిసారి తుది గడువును సీబీడీటీ నోటిఫై చేసింది. పన్ను సంబంధ బకాయిలపై ప్రత్యక్ష పన్నుల పథకాన్ని ఆశ్రయించేవారు ఈ నెల 30లోగా డిక్లరేషన్‌ను ఇవ్వవలసి ఉంటుందని ఆదాయపన్ను శాఖ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. పన్ను సంబంధిత వివాదాలు లేదా వివిధ అప్పీళ్లలో భాగమైన పన్ను చెల్లింపుదారులు పథకాన్ని తుది గడువులోగా వినియోగించుకోవచ్చునని వివరించింది. సుమారు 2.7 కోట్ల ప్రత్యక్ష పన్ను డిమాండ్ల ద్వారా రూ. 35 లక్షల కోట్లు వివిధ వివాదాలలో నమోదైన నేపథ్యంలో పథకానికి ప్రాధాన్యత ఏర్పడింది. పన్ను చెల్లింపుదారులు ఈ పథకాన్ని వినియోగించుకోవాలంటే.. వివాదంలో ఉన్న పన్నుపై 110 శాతాన్ని చెల్లించవలసి ఉంటుంది. 2024 వివాద్ సే విశ్వాస్ పథకానికి 2024-25 బడ్జెట్‌లో తెరతీశారు. 2024 అక్టోబర్ 1న నోటిఫై చేశారు.

డిక్సన్ టెక్నాలజీస్ రూ. 1,000 కోట్ల ప్లాంటు

5,000 ఉద్యోగాల కల్పన



చెన్నై: ఎలక్ట్రానిక్స్ తయారీ సేవల దిగ్గజం డిక్సన్ టెక్నాలజీస్, చెన్నైకి దగ్గర్లోని ఒరగాడంలో రూ. 1,000 కోట్లతో ప్లాంటును ఏర్పాటు చేయనుంది. దీనితో ప్రాంతీయంగా 5,000 పైచిలుకు ఉద్యోగాల కల్పన జరుగుతుందని అంచనా. ప్లాంటు నెలకొల్పడానికి సంబంధించి తమిళనాడు ప్రభుత్వంతో కంపెనీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్లాంటులో ఇతర కంపెనీల కోసం ల్యాప్‌టాప్‌లు, ఆల్ ఇన్ వన్ పర్సనల్ కంప్యూటర్లు మొదలైన వాటిని ఉత్పత్తి చేయనుంది. ఇందులో త్వరలోనే హెచ్‌పీ ల్యాప్‌టాప్‌ల తయారీ ప్రారంభమవుతుందని తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా తెలిపారు. తమిళనాడు ప్రభుత్వం 100 బిలియన్ డాలర్ల ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థను నిర్మించడంపై దృష్టి పెట్టిన నేపథ్యంలో ఇది ప్రాధాన్యం సంతరించుకుంది. డిక్సన్ టెక్నాలజీస్ 1993లో ఏర్పాటైంది. శాంసంగ్, షావోమీ, మోటరోలా, బోట్, వన్‌ప్లస్ తదితర సంస్థల కోసం కాంట్రాక్ట్ తయారీ సేవలను అందిస్తోంది.

భారత్‌లో పెట్టుబడులకు భారీ అవకాశాలు

- బ్రిటన్ ఇన్వెస్టర్లకు కేంద్ర మంత్రి నిర్మల ఆహ్వానం
- బ్యాంకులు, పెన్షన్ ఫండ్స్‌తో రౌండ్ టేబుల్ సమావేశం



పటిష్టమైన పాలసీల దన్ను..

లండన్: భారత్‌లో వివిధ పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టడానికి అపార అవకాశాలు ఉన్నాయని బ్రిటన్ ఇన్వెస్టర్లకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వివరించారు. బ్యాంకింగ్ తదితర రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని ఆమె పేర్కొన్నారు. లండన్‌లో జరిగిన భారత్-బ్రిటన్ ఇన్వెస్టర్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు చెప్పారు. వివిధ పెన్షన్ ఫండ్స్, బీమా కంపెనీలు, బ్యాంకులు, ఇతరత్రా ఆర్థిక సంస్థలకు చెందిన 60 పైచిలుకు ఇన్వెస్టర్లు ఈ సమావేశంలో పాల్గొన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రకటన ప్రకారం.. సుస్థిర ఆర్థిక వృద్ధి సాధన, పెట్టుబడులకు అనుకూల పరిస్థితులను ఏర్పర్చేందుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు నిర్మలా సీతారామన్ వివరించారు. నిబంధనల భారాన్ని తగ్గించి, వ్యాపారాలు.. పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పించేందుకు పలు సంస్కరణలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 'బ్యాంకింగ్ రంగంలో విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో విదేశీ బ్యాంకులు మరింతగా విస్తరించేందుకు గణనీయంగా అవకాశాలు ఉన్నాయి' అని మంత్రి చెప్పారు.

మధ్య తరగతి ప్రజల సంఖ్య పెరుగుతుండటం, స్థిరమైన..పటిష్టమైన పాలసీలు అమలవుతుండటం తదితర అంశాల ఊతంతో 2024-2028 మధ్య కాలంలో భారత బీమా మార్కెట్ వార్షికంగా 7.1 శాతం మేర వృద్ధి చెందనున్నట్లు ఆమె వివరించారు. 2032 నాటికి ఆరో అతి పెద్ద ఇన్సూరెన్స్ మార్కెట్‌గా ఎదగనున్నట్లు తెలిపారు. ఇక టీప్లస్1 సెటిల్మెంట్‌ను 2023లోనే ప్రవేశపెట్టడం ద్వారా ఈ విధానాన్ని అమలు చేసిన అతి కొద్ది బడా సెక్యూరిటీస్ మార్కెట్లలో భారత్ కూడా ఒకటని ఇన్వెస్టర్లకు వివరించారు. 4.6 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో భారత సెక్యూరిటీస్ మార్కెట్ అంతర్జాతీయంగా నాలుగో స్థానంలో ఉందని చెప్పారు. ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ (గిఫ్ట్-ఐఎఫ్ఎస్‌సీ) గురించి కూడా మంత్రి వివరించినట్లు ఆర్థిక శాఖ తెలిపింది. 2025 మార్చి నాటికి బ్యాంకులు, బీమా, ఫిన్‌టెక్, ఎయిర్‌క్రాఫ్ట్ లీజింగ్, షిప్ లీజింగ్ మొదలైన రంగాలకు చెందిన 800 పైచిలుకు సంస్థలు గిఫ్ట్ సిటీలో కార్యకలాపాలు సాగిస్తున్నట్లు మంత్రి వివరించారు. స్థూల దేశీయోత్పత్తికి డిజిటల్ ఎకానమీ దన్నుగా నిలుస్తున్న తీరును తెలిపారు. ప్రభుత్వ సానుకూల విధానాలు, వినూత్నమైన స్టార్టప్‌ల తోడ్పాటుతో దేశీయంగా ఫిన్‌టెక్ వ్యవస్థ పటిష్టంగా మారిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. గత అయిదేళ్లలో ఫిన్‌టెక్ల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు చెప్పారు. దేశీ యూనికార్న్‌ల సంఖ్యపరంగా అంతర్జాతీయంగా భారత్ మూడో స్థానంలో ఉన్నట్లు సీతారామన్ చెప్పారు.

అనిశ్చితిలోనూ పటిష్టంగా ఎగుమతులు

2024-25లో 820 బిలియన్ డాలర్లకు అప్ ● 6 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితులు నెలకొన్నప్పటికీ 2024-25 ఆర్థిక సంవత్సరంలో వస్తు, సేవల ఎగుమతులు 820 బిలియన్ డాలర్లకు చేరినట్లు వాణిజ్య శాఖ వెల్లడించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 6 శాతం పెరిగినట్లు తెలిపింది. 2023-24లో ఎగుమతులు 778 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వాణిజ్య శాఖ గణాంకాల ప్రకారం.. 2024-25 ఏప్రిల్-ఫిబ్రవరి మధ్య కాలంలో ఉత్పత్తుల ఎగుమతులు 395.38 బిలియన్ డాలర్ల నుంచి 395.63 బిలియన్ డాలర్లకు చేరాయి. అలాగే సర్వీసుల ఎగుమతులు 311.05 బిలియన్ డాలర్ల నుంచి 354.90 బిలియన్ డాలర్లకు పెరిగాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఎగుమతులు, దిగుమతుల పూర్తి వివరాలను వాణిజ్య శాఖ ఏప్రిల్ 15న విడుదల చేయనుంది.


పరిశ్రమకు మంత్రి గోయల్ భరోసా..

అమెరికా టారిఫ్‌ల విధింపు నేపథ్యంలో ఎగుమతి ప్రోత్సాహక మండళ్లు, పరిశ్రమ వర్గాలతో వాణిజ్య శాఖ మంత్రి పీయుష్ గోయల్ సమావేశమయ్యారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం నెలకొన్న సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అందుబాటులో ఉన్న అవకాశాలను వివరించారు. అంతర్జాతీయంగా వ్యాపార పరిస్థితుల్లో ఇటీవల తలెత్తిన సవాళ్లను అధిగమించడంలో ఎగుమతి సంస్థలకు తోడ్పాటు అందించేందుకు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి భరోసా ఇచ్చినట్లు వాణిజ్య శాఖ తెలిపింది. ఎర్ర సముద్రం సంక్షోభం, ఇజ్రాయెల్-హమాస్ ఉద్రిక్తతలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, కొన్ని సంపన్న ఎకానమీల్లో వృద్ధి నెమ్మదించడం తదితర సవాళ్లు నెలకొన్నప్పటికీ ఎగుమతులు వృద్ధి చెందడం సానుకూలాంశమని ఎగుమతిదారులు, పరిశ్రమను మంత్రి అభినందించారు. వివిధ రంగాలకు ప్రాతినిధ్యం వహించే ఎగుమతి ప్రోత్సాహక మండళ్లు ఈ సమావేశంలో తమ అభిప్రాయాలు, అంచనాలను తెలిపాయి. కష్ట కాలంలో ఎగుమతి సంస్థలను ఆదుకునేందుకు ప్రభుత్వం క్రియాశీలక చర్యలు తీసుకోవాలని కోరాయి.

అమెరికాతో ఒప్పందంపై కసరత్తు...

అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం విషయంలో సమతుల్యత సాధించడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని మంత్రి చెప్పారు. దేశానికి ప్రయోజనం కలిగే విధంగా సరైన ఫలితాలను రాబట్టేందుకు ప్రభుత్వం 'వేగంగా' పనిచేస్తోందని, 'అనవసర తొందరపాటు' చర్యలు తీసుకోవడం లేదని మంత్రి పేర్కొన్నారు. టారిఫ్‌లపై ఇతర దేశాలు వివిధ రకాలుగా స్పందిస్తున్నాయని ఆయన చెప్పారు. 'విశ్వసనీయమైన భాగస్వామిగా భారత్ ఎదిగింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థలో భారత్ పెద్ద సంస్థలను ఆకర్షించే స్థితిలో ఉంది. కాబట్టి తయారీని పెంచుకునేందుకు, మరిన్ని ఉద్యోగాలను కల్పించేందుకు మనకు అవకాశాలు ఉన్నాయి' అని మంత్రి వివరించారు. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని భారత్, అమెరికా నిర్దేశించుకున్నాయి. ఆ దిశగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై కసరత్తు చేస్తున్నాయి. చర్చల తొలి దశ ఈ ఏడాది సెప్టెంబర్-అక్టోబర్‌లో ముగుస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 191 బిలియన్ డాలర్లుగా ఉంది.

ఆటలో 'అహం' పనికిరాదు!



విరాట్ కోహ్లి

- పరిస్థితులను బట్టే ఆడతా
- విరాట్ కోహ్లి వ్యాఖ్య

న్యూఢిల్లీ: మ్యాచ్‌లో పరిస్థితులను బట్టే బ్యాటింగ్ చేయాల్సి ఉంటుందని, ఈ క్రమంలో వ్యక్తిగత ఇష్టానికి చోటు ఉండదని స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి వ్యాఖ్యానించాడు. తాను ఎప్పుడైనా జట్టు గురించే ఆలోచిస్తూ ఆడానని అతను అన్నాడు. 'జట్టు తరఫున ఆడుతున్నప్పుడు 'నేను' అనే అహం బ్యాటింగ్‌లో ఎప్పుడూ కనిపించకూడదు. మరో ఎండ్‌లో ఉన్న బ్యాటర్‌పై ఆధిపత్యం ప్రదర్శించే ప్రయత్నం సరైన బ్యాటింగ్ అనిపించుకోదు. నేను మ్యాచ్‌లో పరిస్థితిని అర్థం చేసుకునేందుకే ప్రయత్నిస్తా. దానిని బట్టే ఆడేందుకు ప్రయత్నిస్తా. ఇది నేను గర్వించే విషయం కూడా. నేను మంచి లయ అందుకొని జోరు మీదుంటే నాపై బాధ్యత వేసుకుంటా. మరో బ్యాటర్ బాగా ఆడుతుంటే అతను అదే బాధ్యత తీసుకుంటాడు' అని విరాట్ విశ్లేషించాడు. ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తరఫున 256 మ్యాచ్‌లు ఆడిన కోహ్లి మొత్తం 8168 పరుగులు చేశాడు. అయితే తొలి మూడు సీజన్లలో ఎక్కువగా మిడిలార్డర్‌లో బరిలోకి దిగిన అతను చెప్పుకోదగ్గ ప్రభావం చూపలేకపోయాడు. 38 ఇన్నింగ్స్‌లు ఆడినా అతని ఖాతాలో 2 హాఫ్ సెంచరీలే ఉన్నాయి. అయితే 2011 నుంచి అతని ఆట మలుపు తిరిగింది. 'ఆర్‌సీబీ తరఫున మొదటి మూడేళ్లు నాకు టాపార్డర్‌లో ఎక్కువగా బ్యాటింగ్ చేసే అవకాశాలు రాలేదు. కాబట్టి ఐపీఎల్‌లో గొప్పగా ఆడలేదు. అయితే 2010లో కాస్త నిలకడ వచ్చింది. 2011 నుంచి రెగ్యులర్‌గా మూడో స్థానంలోకి వచ్చేశాను. సరిగ్గా చెప్పాలంటే నా అసలు ఐపీఎల్ ప్రయాణం అప్పుడే మొదలైంది' అని కోహ్లి గుర్తు చేసుకున్నాడు. ఐపీఎల్‌లో సుదీర్ఘ కాలంగా ఆడటం వల్లే టి20 ఫార్మాట్‌లో తన ఆటను మెరుగుపర్చుకోవడం సాధ్యమైందని అతను చెప్పాడు.

పాకిస్తాన్ గెలుపు బోణీ



దయానా బేగ్

- ఐర్లాండ్‌పై 38 పరుగుల తేడాతో విజయం
- స్కాట్లాండ్ చేతిలో వెస్టిండీస్ పరాజయం
- మహిళల వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ టోర్నీ

లాహోర్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో పాకిస్తాన్ జట్టు శుభారంభం చేసింది. స్వదేశంలో జరుగుతున్న ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు 38 పరుగుల తేడాతో ఐర్లాండ్‌పై విజయం సాధించింది. మొత్తం 6 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో టాప్-2లో నిలిచిన రెండు జట్లు ఈ ఏడాది ఆఖర్లో భారత్ వేదికగా జరగనున్న మహిళల వన్డే ప్రపంచకప్‌నకు అర్హత సాధించనున్నాయి. బుధవారం జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 49 ఓవర్లలో 217 పరుగులకు ఆలౌటైంది. సిద్రా అమీన్ (112 బంతుల్లో 51; 3 ఫోర్లు), ఆలియా రియాజ్ (58 బంతుల్లో 52; 4 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకాలతో ఆకట్టుకోగా... మునీబా అలీ (32) రాణించింది. ఐర్లాండ్ బౌలర్లలో జానె మగుర్ 3 వికెట్లు పడగొట్టగా... కెల్లి, కారా ముర్రె చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో ఐర్లాండ్ మహిళల జట్టు తడబడింది. 44 ఓవర్లలో 179 పరుగులకే ఆలౌటై పరాజయం మూటగట్టుకుంది. కెప్టెన్ గాబీ లూయిస్ (67 బంతుల్లో 44; 5 ఫోర్లు), అమీ హంటర్ (54 బంతుల్లో 44; 4 ఫోర్లు), ఒర్లా ప్రెండెర్‌గాస్ట్ (37) పోరాడినా ఫలితం లేకపోయింది. పాకిస్తాన్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దయానా బేగ్ 4, నష్రా సంధు 3 వికెట్లు పడగొట్టారు. తదుపరి మ్యాచ్‌లో శుక్రవారం స్కాట్లాండ్‌తో పాకిస్తాన్ జట్టు తలపడుతుంది.

హేలీ మాథ్యూస్ సెంచరీ వృథా...



హేలీ మాథ్యూస్

కెప్టెన్ హేలీ మాథ్యూస్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టినా... వెస్టిండీస్ జట్టుకు పరాజయం తప్పలేదు. బుధవారం జరిగిన పోరులో విండీస్ 11 పరుగుల తేడాతో స్కాట్లాండ్ చేతిలో ఓడింది. మొదట స్కాట్లాండ్ 45 ఓవర్లలో 244 పరుగులకు ఆలౌటైంది. సారా బ్రైస్ (56 బంతుల్లో 55; 6 ఫోర్లు), మేగన్ మెక్‌కాల్ (45; 5 ఫోర్లు) రాణించారు. విండీస్ బౌలర్లలో హేలీ మాథ్యూస్ 4 వికెట్లు పడగొట్టగా... అలీనె, కరిష్మా చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం ఛేదనలో వెస్టిండీస్ 46.2 ఓవర్లలో 233 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ హేలీ మాథ్యూస్ (113 బంతుల్లో 114 నాటౌట్; 14 ఫోర్లు) ఓపెనర్‌గా బరిలోకి దిగి అజేయంగా నిలిచినా... మరో ఎండ్ నుంచి ఆమెకు సరైన సహకారం లభించలేదు. జైదా జేమ్స్ (45; 5 ఫోర్లు, 1 సిక్స్) పర్వాలేదనిపించింది. వరుస విరామాల్లో వికెట్లు పడుతున్నా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మాథ్యూస్ మొండిగా పోరాడింది. స్కాట్లాండ్ బౌలర్లలో క్యాథరిన్ 3 వికెట్లు తీసింది.

రష్మిక అదుర్స్



- బిల్లీ జీన్ కింగ్ కప్ టోర్నీలో భారత్‌కు తొలి విజయం
- థాయ్‌లాండ్‌పై 2-1తో నెగ్గిన టీమిండియా

పుణే: ప్రతిష్టాత్మక బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1 మహిళల టీమ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత్ ఖాతాలో తొలి విజయం చేరింది. తొలి రోజు మంగళవారం న్యూజిలాండ్ చేతిలో 1-2తో ఓడిపోయిన భారత్ వెంటనే తేరుకుంది. బుధవారం థాయ్‌లాండ్ జట్టుతో జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 2-1తో గెలుపొందింది. భారత్‌కు తొలిసారి ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక థాయ్‌లాండ్‌తో మ్యాచ్‌లోనూ శుభారంభం అందించింది. ప్రపంచ 170వ ర్యాంకర్ లానియానా తారారుడి (థాయ్‌లాండ్)తో జరిగిన తొలి సింగిల్స్‌లో ప్రపంచ 345వ ర్యాంకర్ రష్మిక 6-2, 6-4తో సంచలన విజయం సాధించింది. 75 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక నాలుగు ఏస్‌లు సంధించింది. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. రెండో మ్యాచ్‌లో భారత్‌కు నిరాశ ఎదురైంది. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న మరో హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లి మూడో సెట్‌లో గాయం కారణంగా వైదొలిగింది. మనాన్‌చాయ (థాయ్‌లాండ్)తో జరిగిన మ్యాచ్‌లో సహజ తొలి సెట్‌ను 3-6తో కోల్పోయింది. రెండో సెట్‌ను టైబ్రేక్‌లో 7-6 (7/3)తో సొంతం చేసుకుంది. మూడో సెట్‌లో సహజ 0-1తో వెనుకబడిన దశలో గాయం కారణంగా ఆమె తప్పుకుంది. ఫలితంగా థాయ్‌లాండ్ స్కోరును 1-1తో సమం చేసింది. నిర్ణాయక మూడో మ్యాచ్‌లో అంకిత రైనా-ప్రార్థన తొంబరే ద్వయం సత్తా చాటుకుంది. పీంగ్‌టార్న్-పట్‌చారిన్ (థాయ్‌లాండ్) ద్వయంతో జరిగిన డబుల్స్ మ్యాచ్‌లో అంకిత-ప్రార్థన 7-6 (7/3), 3-6, 10-3తో 'సూపర్ టైబ్రేక్'లో గెలిచి భారత్‌కు 2-1తో విజయాన్ని ఖరారు చేసింది.

సింధు శుభారంభం



నింగ్బో (చైనా): భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఆసియా బ్యాడ్మింటన్ వ్యక్తిగత చాంపియన్‌షిప్‌లో శుభారంభం చేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 17వ ర్యాంకర్ సింధు 21-15, 21-19తో ప్రపంచ 36వ ర్యాంకర్ ఎస్తర్ నురుమి వార్డోయో (ఇండోనేసియా)పై గెలిచింది. 44 నిమిషాల పాటు సాగిన పోరులో వరుస గేమ్‌ల్లో విజృంభించిన సింధు... 19 ఏళ్ల ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. గురువారం జరగనున్న ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ అకానె యామగుచి (జపాన్)తో సింధు తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 14-11తో యామగుచిపై ఆధిక్యంలో ఉంది. ఇతర మ్యాచ్‌ల్లో ఆకర్షి కశ్యప్, అనుపమ, మాళవిక ఓటమి పాలై ఇంటిదారి పట్టారు. ఆకర్షి 13-21, 7-21తో ప్రపంచ మూడో ర్యాంకర్ హాన్ యూ (చైనా) చేతిలో... అనుపమ 13-21, 14-21తో ప్రపంచ 13వ ర్యాంకర్ రచనోక్ ఇంతనోన్ (థాయ్‌లాండ్) చేతిలో... మాళవిక 14-21, 8-21తో గావ్ ఫెంగ్ జై (చైనా) చేతిలో ఓడారు.

ప్రిక్వార్టర్స్‌లో కిరణ్, ప్రియాన్షు...

పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ ఆటగాళ్లు లక్ష్యసేన్, హెచ్‌ఎస్ ప్రణయ్ తొలి రౌండ్‌లోనే పరాజయం పాలవగా... కిరణ్ జార్జి, ప్రియాన్షు రజావత్ ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరారు. తొలి రౌండ్‌లో లక్ష్యసేన్ 18-21, 10-21తో లీ చయ్ హా (చైనీస్ తైపీ) చేతిలో... ప్రణయ్ 16-21, 21-12, 11-21తో జూ గువాంగ్ లూ (చైనా) చేతిలో పరాజయం పాలయ్యారు. కిరణ్ జార్జి 21-16, 21-8తో దిమిత్రి పనారిన్ (కజకిస్తాన్)పై, ప్రియాన్షు 20-22, 21-12, 21-10తో వాంగ్‌చరోయెన్ (థాయ్‌లాండ్)పై విజయం సాధించారు. మహిళల డబుల్స్‌లో ప్రియా-శ్రుతి మిశ్రా జోడీ 11-21, 13-21తో షూ యెన్ సంగ్-చైన్ హుయి యూ (చైనా) జంట చేతిలో ఓడింది. పురుషుల డబుల్స్‌లో హరిహరన్-రూబన్ ద్వయం 21-3, 21-12తో మధుక దులంజన-లహిరు వీరసింఘే (శ్రీలంక) జోడీపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించగా... పృథ్వీ-సాయి ప్రతీక్ జంట 19-21, 12-21తో చై సియాంగ్ చై-వాంగ్ చీ లిన్ (చైనా) ద్వయం చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

ఆంధ్రప్రదేశ్‌పై తెలంగాణ హాకీ జట్టు విజయం

ఝాన్సీ: జాతీయ సీనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టు జోరు కొనసాగుతోంది. 'బి' డివిజన్‌లో భాగంగా బుధవారం జరిగిన పోరులో తెలంగాణ జట్టు 8-2 గోల్స్ తేడాతో ఆంధ్రప్రదేశ్‌పై విజయం సాధించింది. తెలంగాణ తరఫున అయ్యప్ప (6వ, 20వ, 31వ, 52వ నిమిషాల్లో) నాలుగు గోల్స్‌తో విజృంభించాడు. వెంకటేశ్ (3వ 55వ నిమిషాల్లో) రెండు గోల్స్ కొట్టగా... రోహిత్ సింగ్ (9వ నిమిషంలో), రామ్ కుమార్ (11వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. ఆంధ్రప్రదేశ్ తరఫున సందీప్ (13వ నిమిషంలో), వేణుగోపాల్ (50వ నిమిషంలో) ఒక్కో గోల్ నమోదు చేశారు. మ్యాచ్ ఆరంభం నుంచే తెలంగాణ జట్టు వరుస దాడులతో ఆంధ్రప్రదేశ్‌పై ఒత్తిడి పెంచి ఫలితం రాబట్టింది. 'బి' డివిజన్‌లో భాగంగా ఆరో రోజు జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో చండీగఢ్ 9-0 గోల్స్ తేడాతో ఉత్తరాఖండ్‌పై... ఢిల్లీ 6-4 గోల్స్ తేడాతో అస్సాంపై, కేరళ 4-1 గోల్స్‌తో దాద్రా నగర్ హవేలీ-దమన్ దియుపై గెలుపొందాయి. పంజాబ్ 3-2 గోల్స్‌తో ఒడిశాపై గెలువగా... మణిపూర్, కర్ణాటక మధ్య పోరు 1-1 గోల్స్‌తో 'డ్రా'గా ముగిసింది.

దోహా డైమండ్ లీగ్‌తో నీరజ్ సీజన్ షురూ



న్యూఢిల్లీ: భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా 2025 సీజన్‌ను దోహా డైమండ్ లీగ్ మీట్‌తో ప్రారంభించనున్నాడు. ఈ మీట్ ఖతర్ రాజధాని దోహాలో మే 16వ తేదీన జరుగుతుంది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన నీరజ్ చోప్రా దోహా డైమండ్ లీగ్ మీట్‌లో వరుసగా మూడో ఏడాది బరిలోకి దిగనున్నాడు. 2023లో నీరజ్ దోహా మీట్‌లో జావెలిన్‌ను 88.67 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. చెక్ రిపబ్లిక్‌కు చెందిన దిగ్గజ జావెలిన్ త్రోయర్ జాన్ జెలెజ్నీ వద్ద శిక్షణ తీసుకుంటున్న 27 ఏళ్ల నీరజ్ ఈ ఏడాది 90 మీటర్ల లక్ష్యాన్ని అందుకోవాలనే లక్ష్యంతో ఉన్నాడు. దోహా డైమండ్ లీగ్ మీట్ తర్వాత స్వదేశంలో మే 24వ తేదీన జరిగే 'నీరజ్ చోప్రా క్లాసిక్' జావెలిన్ ఈవెంట్‌లో పోటీపడతాడు.

క్వార్టర్ ఫైనల్లో శ్రీరామ్ బాలాజీ జోడీ



మెక్సికో సిటీ: భారత పురుషుల టెన్నిస్ డబుల్స్ మూడో ర్యాంకర్ శ్రీరామ్ బాలాజీ మెక్సికో సిటీ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టోర్నమెంట్‌లో శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో టాప్ సీడ్ శ్రీరామ్ బాలాజీ (భారత్)-మిగెల్ రేయస్ వరేలా (మెక్సికో) జోడీ 6-3, 6-2తో మటియస్ అల్వెస్ (బ్రెజిల్)-స్టెఫానో నపోలిటానో (ఇటలీ) జంటపై విజయం సాధించింది. 63 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బాలాజీ-వరేలా ద్వయం రెండు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సర్వ్‌లో 23 పాయింట్లకుగాను 20 పాయింట్లు, రెండో సర్వ్‌లో 22 పాయింట్లకుగాను 11 పాయింట్లు సాధించింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది.

సాకేత్ జంట గెలుపు



సాక్షి, హైదరాబాద్: మాడ్రిడ్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో భారత డేవిస్ కప్ జట్టు సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని శుభారంభం చేశాడు. స్పెయిన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాకేత్-రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) జంట 6-2, 5-7, 10-6తో 'సూపర్ టైబ్రేక్'లో జిరీ బరాంట్-ఫిలిప్ డూడా (చెక్ రిపబ్లిక్) జోడీపై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. హైదరాబాద్‌కే చెందిన అనిరుధ్ చంద్రశేఖర్ కూడా డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. తొలి రౌండ్‌లో అనిరుధ్ (భారత్)-డేవిడ్ వేగా హెర్నాండెజ్ (స్పెయిన్) జోడీ 3-6, 7-5, 10-8తో 'సూపర్ టైబ్రేక్'లో టాప్ సీడ్ గిడో ఆండ్రెజీ (అర్జెంటీనా)-థియో అరిబెగ్ (ఫ్రాన్స్) జంటను బోల్తా కొట్టించింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో సిద్ధాంత్ బంతియా (భారత్)-అలెగ్జాండర్ డాన్‌స్కీ (బల్గేరియా) ద్వయం 6-4, 6-4తో నిక్కీ కలియంద పునాచా (భారత్)-సెర్జియో మార్టోస్ (స్పెయిన్) జోడీపై గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది.

ఢిల్లీకి ఎదురుందా!

నేడు రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో 'ఢీ'





- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

బెంగళూరు: ఐపీఎల్ 18వ సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేస్తున్న ఇరు జట్ల మధ్య సమరానికి రంగం సిద్ధమైంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్... గురువారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో తలపడుతుంది. తాజా సీజన్‌లో జోరు మీదున్న ఆర్‌సీబీ నాలుగు మ్యాచ్‌లు ఆడి మూడింట గెలిచింది. గత మ్యాచ్‌లో కెప్టెన్ రజత్ పాటీదార్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి అర్ధశతకాలతో చెలరేగడంతో ముంబై ఇండియన్స్‌పై బెంగళూరు ఘన విజయం సాధించింది. ఇదే జోరు కొనసాగిస్తూ తమ చిరకాల స్వప్నం నెరవేర్చుకోవాలని బెంగళూరు భావిస్తోంది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ ఆర్‌సీబీ బలంగా ఉండగా... కొత్త సారథి అక్షర్ పటేల్ కెప్టెన్సీలో ఢిల్లీ క్యాపిటల్స్ పరాజయం ఎరగకుండా దూసుకెళ్తోంది. ఇప్పటి వరకు ఒక్కసారి కూడా టైటిల్ నెగ్గలేకపోయిన ఇరు జట్లు ఈ సారి ట్రోఫీ చేజిక్కించుకోవడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాయి. ఇతర మైదానాలతో పోల్చుకుంటే కాస్త చిన్నదైన చిన్నస్వామి స్టేడియంలో ఆతిథ్య ఆర్‌సీబీ అదరగొడుతుందా... లేక ఢిల్లీ క్యాపిటల్స్ జైత్రయాత్ర కొనసాగిస్తుందా చూడాలి!

విరాట్‌పైనే భారం...

మునుపటి ఫామ్ అందిపుచ్చుకున్న విరాట్ కోహ్లి తిరిగి సాధికారికంగా ఆడుతుండటం బెంగళూరు జట్టుకు ప్రధాన బలం. ఫిల్ సాల్ట్ అడపాదడపా రాణిస్తుండగా... కెప్టెన్ రజత్ పాటీదార్, దేవదత్ పడిక్కల్ గత మ్యాచ్‌లో కీలక ఇన్నింగ్స్‌లతో విలువ చాటుకున్నారు. మిడిలార్డర్‌లో లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ, టిమ్ డేవిడ్ రూపంలో మంచి హిట్టర్లు అందుబాటులో ఉన్నారు. ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లో జితేశ్ కీలక ఇన్నింగ్స్ ఆడటంతోనే జట్టు భారీ స్కోరు చేయగలిగింది. ప్రత్యర్థి జట్టు ప్రధాన పేసర్ స్టార్క్‌ను ఈ దళం ఎలా ఎదుర్కొంటుందనే దానిపైనే మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంది. టి20ల్లో స్టార్క్‌పై కోహ్లికి మెరుగైన రికార్డు ఉంది. అతడి బౌలింగ్‌లో 31 బంతులు ఎదుర్కొన్న విరాట్ 72 పరుగులు చేశాడు. మరి ఈ సీజన్‌లో ఆడిన 3 మ్యాచ్‌ల్లోనే 9 వికెట్లు తీసిన స్టార్క్‌ను కోహ్లి ఎలా ఎదుర్కొంటాడనేది ఆసక్తికరం. గత సీజన్లతో పోల్చుకుంటే బెంగళూరు బౌలింగ్ ఈసారి మెరుగ్గా కనిపిస్తోంది. హాజల్‌వుడ్, భువనేశ్వర్, యశ్ దయాళ్ పేస్ భారం మోయనుండగా... కృనాల్ పాండ్యా, సుయాశ్ శర్మ స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నారు.

స్పిన్నర్లే బలం...

ఇంటా బయటా అనే తేడా లేకుండా చక్కటి ఆటతీరు కనబరుస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్... బెంగళూరుపైనా అదే దూకుడు కొనసాగించాలని చూస్తోంది. ఓపెనర్ కేఎల్ రాహుల్ అనుభవానికి మరో ఓపెనర్ మెక్‌గుర్క్ మెరుపులు తోడవుతుండటంతో ఆ జట్టుకు మెరుగైన ఆరంభాలు దక్కుతున్నాయి. చిన్నస్వామి స్టేడియంపై మంచి అవగాహన ఉన్న కర్ణాటక ప్లేయర్ కేఎల్ రాహుల్ మరోసారి కీలకం కానున్నాడు. ఇక వన్‌డౌన్‌లో అభిషేక్ పొరెల్ నమ్మదగ్గ ఆటగాడిగా ఎదుగుతున్నాడు. కెప్టెన్ అక్షర్ పటేల్, ట్రిస్టన్ స్టబ్స్, సమీర్ రిజ్వీ, అశుతోష్ శర్మలతో మిడిలార్డర్‌లో ప్రతిభకు కొదవలేదు. ఈ మ్యాచ్‌లో ప్రధానంగా ఢిల్లీ మణికట్టు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు బెంగళూరు స్టార్ కోహ్లికి మధ్య ఆసక్తికర సమరం ఖాయమే. గత మూడు మ్యాచ్‌ల్లో కలిపి 8 ఓవర్లు వేసి ఒక్క వికెట్ కూడా పడగొట్టలేకపోయిన సారథి అక్షర్‌పై ఒకింత ఒత్తిడి ఉంది. సహచరులు రాణిస్తున్న చోట అతడు కూడా బంతితో మెరవాల్సిన అవసరముంది. స్టార్క్, ముకేశ్ కుమార్, మోహిత్ శర్మ పేస్ బౌలింగ్ బాధ్యతలు పంచుకోనుండగా... అక్షర్, కుల్దీప్, విప్రాజ్ నిగమ్ స్పిన్ భారం మోయనున్నారు. మూడు మ్యాచ్‌ల అనుభవమే ఉన్న విప్రాజ్ నుంచి కూడా బెంగళూరు బ్యాటర్లకు ముప్పుపొంచి ఉంది.

తుది జట్లు (అంచనా)

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు: రజత్ పాటీదార్ (కెప్టెన్), సాల్ట్, కోహ్లి, పడిక్కల్, లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ, టిమ్ డేవిడ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్, హాజల్‌వుడ్, యశ్ దయాళ్, సుయాశ్ శర్మ.

ఢిల్లీ క్యాపిటల్స్: అక్షర్ పటేల్ (కెప్టెన్), మెక్‌గుర్క్, కేఎల్ రాహుల్, అభిషేక్ పొరెల్, సమీర్ రిజ్వీ, స్టబ్స్, అశుతోష్ శర్మ, విప్రాజ్ నిగమ్, స్టార్క్, కుల్దీప్, మోహిత్, ముకేశ్ కుమార్.

మరీ ఇంత మతిమరుపా!

బంగారం నుంచి చీరల దాకా ఉబర్ క్యాబ్‌ల్లో వదిలేస్తున్నారు

ముంబై నగరంలో మరీ ఎక్కువ

ఎయిర్‌పోర్టుకు వెళ్లినప్పుడు **పాస్‌పోర్ట్**, రోజంతా కష్టపడి షాపింగ్ చేశాక **ఇంటికొచ్చే** దారిలో పెళ్లి చీర. కష్టించి సంపా**దించిన డ**బ్బుతో కొన్న బంగారు బిస్కెట్. **ఇలాంటి**వన్నీ క్యాబ్‌లో మర్చిపోతే! అంత **విలు**వైన వస్తువులు ఎవరైనా మర్చిపో**తా**రా అని కొట్టిపారేయకండి. భారతీయులు ఉబర్ క్యాబ్‌ల్లో మర్చిపోయిన వస్తువుల్లో ఇవి కొన్ని మాత్రమే. ఉబెర్ 9వ 'లాస్ట్ అండ్ ఫౌండ్ ఇండెక్స్'విడుదల చేసిన గణాంకాల్లో ఇవన్నీ ఉన్నాయి. భారత్‌లో అత్యంత మతిమరుపు నగరంగా ముంబై నిలిచిందని నివేదిక తేల్చింది.

బ్యాగులు, పర్సులు, తాళా**లు, కళ్ల**ద్దాలు, ఇయర్ ఫోన్స్ వంటివా**టిని మర్చిపో**వడం పరిపాటే. కానీ కొందరు **మాత్రం మతిమ**రుపును మరో లెవల్‌కు తీసుకెళ్లారు**. వీల్ చైర్, 25** కిలోల నెయ్యి డబ్బా, యజ్ఞకుండం, **పెళ్లి చీర, బం**గారు బిస్కెట్ల వంటివాటిని కూడా క్యాబ్‌లో మర్చిపోయారు. వినియోగదారులు కోల్పోయిన వస్తువులను గుర్తించే ఇన్‌-యాప్ ద్వారా ఆయా వస్తువులను ఉబర్ వారికి తిరిగి చేర్చిందన్నది వేరే విషయం. 2024లో అత్యంత 'మతిమరుపు' నగరాల జాబితాలో ముంబై తర్వాత ఢిల్లీ రెండో స్థానంలో ఉంది. అత్యధిక 'మతిమరుపు'నగరాల్లో **పుణే, బెంగళూరు**, కోల్‌కతా కూడా ఉన్నాయి. **హైదరాబాద్ మా**త్రం మంచి మార్కులు కొట్టేసింది. **ప్రధాన** నగరాల్లో హైదరాబాద్ ప్రయాణి**కులు వస్తు**వులను మర్చిపోయింది చాలా **తక్కువ**ట.

శనివారం జాగ్రత్త

శనివారం ప్రయాణాల్లో ఇకపై మరింత అప్రమత్తంగా ఉండండి. వారంలో అత్యంత మతిమరుపు రోజు ఇదేనని ఉబర్ నివేదిక తేల్చింది. అందులోనూ శనివారం సాయంత్రాలు మతిమరుపు పీక్స్‌లో ఉంటోందట. ప్రయాణికులు అత్యధికంగా వస్తువులను క్యాబ్‌ల్లో మర్చిపోయింది ఆ రోజే. ఈ విషయంలో పండగ రోజులూ తక్కువేమీ కాదు. పర్వదినాల్లో కూడా ప్రయాణికులు ఉబర్‌లో అత్యధికంగా వస్తువులు మరిచిపోయారు. ''మర్చిపోయిన వస్తువులను సులభంగా తిరిగి పొందేందుకు ఉబర్ క్యాబ్‌ల్లో ఇన్‌-యాప్ ఆప్షన్ ఇచ్చాం. అయినా ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలి'' అని ఉబర్ ఇండియా దక్షిణాసియా కన్స్యూమర్ అండ్ గ్రోత్ డైరెక్టర్ శివ శైలేంద్రన్ సూచించారు. వస్తువులన్నింటినీ ఒకే బ్యాగ్‌లో వేసుకోవడం, క్యాబ్ దిగేముందు ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవడం మేలని చెప్పారు.

2024లో అత్యధిక మతిమరుపు రోజులు

- ఆగస్టు 3 (శనివారం, శివరాత్రి), సెప్టెంబర్ 28 (శనివారం), మే 10 (శుక్రవారం, అక్షయ తృతీయ)


మరిచిన టాప్ 10 వస్తువులు

- బ్యాక్ ప్యాక్/బ్యాగ్, ఇయర్ **ఫోన్స్**/స్పీకర్, ఫోన్, వాలెట్/పర్స్, **కళ్లద్దాలు**/సన్ గ్లాసెస్, తాళంచెవులు, **బట్టలు,** లాప్‌టాప్, వాటర్ బాటిల్, **పాస్‌పోర్ట్**

మర్చిపోయిన అరుదైన వస్తువులు

- **విగ్, టెలిస్కోప్**, గ్యాస్ బర్నర్ స్టవ్, 25 కిలోల **నెయ్యి, వీల్‌చైర్**, పిల్లనగ్రోవి, పెళ్లి చీర, గోల్డ్ **బిస్కెట్, కుక్క**లు మొరగకుండా నియంత్రించే పరికరం, యజ్ఞకుండం

– సాక్షి, నేషనల్ డెస్క్



'శుద్ధ కేరళ సదస్సు'లో భాగంగా బుధవారం తిరువనంతపురంలోని కనకకున్ను ప్యాలెస్ సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో చక్కటి ప్రతిమకు తుదిరూపునిస్తున్న కళాకారుడు

పొరపాటున కట్ చేశాం

డబ్ల్యూఎఫ్‌పీ నిధులను పునరుద్ధరించిన అమెరికా

వాషింగ్టన్: వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం (డబ్ల్యూఎఫ్‌పీ)కు నిధుల నిలిపివేత పొరపాటున జరిగిందని అమెరికా తెలిపింది. 14 పేద దేశాల్లోని ఫుడ్ ప్రోగ్రాం ఎమర్జెన్సీ ప్రాజెక్టులకు కొన్ని ఒప్పందాలను పొరపాటున రద్దు చేశామని మంగళవారం పేర్కొంది. వాటిని పునరుద్ధరిస్తున్నట్లు యూఎస్ విదేశాంగ శాఖ తెలిపింది. ఏయే దేశాలకు నిధులు పునరుద్ధరించారనే విషయంపై సమాచారం లేదని ఆ శాఖ అధికార ప్రతినిధి టామీ బ్రూస్ తెలిపారు. కాంట్రాక్టులు ఎలా రద్దయ్యాయనే దానిపైనా ఆమె వివరణ ఇవ్వలేదు. దీనిపై వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం వెంటనే స్పందించలేదు. అఫ్గానిస్తాన్, సిరియా, యెమన్, మరో 11 పేద దేశాల్లో లక్షలాది మంది అన్నార్తులకు సాయపడే యూఎస్ వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం తాలూకు అత్యవసర కార్యక్రమాలకు ట్రంప్ ప్రభుత్వం నిధులను నిలిపేయడం తెలిసిందే. డోజ్ టాప్ లెఫ్టినెంట్ జెరెమీ లెవిన్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీన్ని డబ్ల్యూఎఫ్‌పీ తీవ్రంగా తప్పుబట్టింది. ఈ నిర్ణయం ఆకలితో అలమటిస్తున్న లక్షలాది మంది పాలిట మరణశాసనంగా అభివర్ణించింది. దాన్ని ఉపసంహరించుకోవాలని సోమవారం విజ్ఞప్తి చేసింది.

కోర్టుల్లో నిర్దోషిగా తేలినా కనికరం చూపని అమెరికా

భారతీయ విద్యార్థుల వీసాలను నిర్దాక్షిణ్యంగా రద్దుచేస్తున్న ట్రంప్ సర్కార్

వాషింగ్టన్: చిన్నపాటి ట్రాఫిక్ ఉల్లంఘనలనూ సాకుగా చూపి విదేశీ విద్యార్థులకు బహిష్కరణ నోటీసులు ఇచ్చిన ట్రంప్ సర్కార్ నిర్దయగుణం ఇతర ఘటనల్లోనూ బయటపడుతోంది. ఇతర కేసుల్లో పొరపాటున ఇరుక్కుని ఎలాగోలా నిర్దోషులుగా బయటపడినా సరే అలాంటి విదేశీ విద్యార్థులనూ అమెరికా స్వదేశానికి వెళ్లిపోవాల్సిందేనని కరాఖండీగా చెప్పేస్తోంది. ఇలా కఠిన నిబంధనల బారిన పడిన వారిలో భారతీయ విద్యార్థులూ ఉన్నారు. ఇటీవల తన ప్రమేయంలేకున్నా ఒక కేసులో ఇరుక్కున్న ఒక భారతీయ విద్యార్థి ఎట్టకేలకు న్యాయస్థానంలో నిర్దోషిగా బయటపడ్డాడు. అయినా సరే గత నిందితుడు, నేరస్తుడు అని పేర్కొంటూ బహిష్కరణ నోటీసులిచ్చారు. అతని అమెరికా విద్యాభ్యాసానికి సంబంధించిన స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(సెవిస్) రికార్డ్‌ను హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగ డేటాబేస్ నుంచి తొలగించారు. దీంతో తప్పనిసరిగా అమెరికాను వీడాల్సిన దుస్థితి దాపురించింది. ఇలా అనూహ్య అవస్థలు పడుతున్న భారతీయ విద్యార్థులు చాలా మంది ఉన్నారని తెలుస్తోంది. ఇలా డిపోర్టేషన్ ఈ-మెయిల్ అందుకుని పరిష్కారం కోసం నా వద్దకు దాదాపు 30 మందికిపైగా భారతీయ విద్యార్థులు వచ్చారని పర్వతనేని చంద్ అనే ఒక వలసపరిష్కారాల న్యాయవాది చెప్పారు. లక్షలు ఖర్చుపెట్టి అమెరికాలో ఉన్నత విద్య కోసం వచ్చిన భారతీయులు తమ చదువులను పూర్తి చేసుకోకుండానే తిరిగి వెళ్లాల్సిన అనూహ్య పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. సెవీస్ డేటాబేస్ అనేది విదేశీ విద్యార్థులకు సంబంధించింది. విద్యార్థులకు ఎఫ్-1 వీసా, వృత్తివిద్యా కోర్సులు చదివేవారికి ఎం-1 వీసా, ఇతర రకాల కోర్సులు, అంశాలతో సంబంధం ఉన్న వారికి జే-1 వీసాలు ఇస్తారు. వీళ్లందరి డేటాను సెవీస్‌లో పొందుపరుస్తారు. ఉదాహరణకు ఒకవేళ సెవీస్‌లో ఒక విద్యార్థి డేటాను తొలగిస్తే అతను అమెరికాలో ఉండేందుకు అనర్హుడవుతాడు. అప్పుడు అతనికి రెండే దారులుంటాయి. ఒకటి మళ్లీ తన డేటాను పునరుద్ధరించుకునేందుకు న్యాయబద్ధంగా పోరాడాలి. లేదంటే 15 రోజుల్లోపు స్వీయబహిష్కరణ ద్వారా అమెరికాను వీడాలి. అప్పటికీ వెళ్లలేదంటే అమెరికా ప్రభుత్వం బలవంతంగా పంపేసి సుదీర్ఘకాలంపాటు మళ్లీ వీసా రాకుండా అడ్డుకుంటుంది. స్టూడెంట్ వీసాదారులనేకాదు ఇటీవలికాలంలో గ్రీన్‌కార్డ్, తాత్కాలిక వర్క్ వీసాదారుల కార్యకలాపాలనూ అధికారులు సునిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పాలస్తీనా సానుభూతిపరులను సాగనంపిన విషయం విదితమే.

పాత కేసులనూ తవ్వితీసి..

లెర్నింగ్ లైసెన్స్‌తో కారు నడిపి దొరికిపోతే జరిమానా విధిస్తారు. వాస్తవాని**కి** అమెరికాలో శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే కారు నడపాలి. భారతీయ విదేశీ విద్యార్థులు ఇలా లెర్నింగ్ లైసెన్సుతో కారు నడిపి పోలీసులకు చిక్కిన ఉదంతాలను ఇప్పుడు హో**ం**ల్యాండ్ సెక్యూరిటీ అధికారులు **బయటకు** లాగుతున్నారు. పాత కేసులను తవ్వి**తీసి బహి**ష్కరణ నోటీసులిస్తున్నారు. గతంలో**నే కొట్టే**సిన, ఉపసంహరించుకున్న గృహహిం**స సం**బంధ పాత కేసులనూ డిపోర్టేషన్‌కు **వాడుకుం**టున్నారు. ఇప్పుడా కేసు మనుగడ**లో లేదని** వాదించినా అధికారులు వినిపించు**కోవట్లేరు.** ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నా **దానిని** అమెరికాలో పరిగణించబోమని అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ ఒకరకంగా వేధింపులకు పాల్పడుతున్నారు. ఆల్కాహాల్, డ్రగ్స్ వాడకున్నా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసిన కేసునూ డిపోర్టేషన్‌కు ఆయుధంగా వాడుతున్నారు. **పదేళ్ల క్రితం ఓ విద్యార్థి ఎయిర్‌పోర్ట్/నౌకాశ్రయం వద్ద అనుమతిలేకుండా ప్రవేశించాడని కేసు నమోదైంది. తర్వాత అతనికి చట్టబద్ధంగా వీసా రావ**డంతో కేసు పక్కనబెట్టారు. ఆ పాత కేసును ఇప్పుడు అధికారులు బయటకు తీసి ఆ వ్యక్తికి వీసా కష్టాలను పెంచారు. ఇలా ప్రతి అనవసర అంశాన్నీ విదేశీ విద్యార్థులను పంపించేందుకు అధికారులు దుర్వినియోగం చేస్తున్నారు.

కారణం చెప్పకుండా వీసా రద్దు అన్యాయం

''ఇటీవల డార్ట్‌మౌత్ కాలేజీలో పీహెచ్‌డీ చదువుతున్న ఒక చైనా విద్యార్థి వీసా గడువును ప్రభుత్వం హఠాత్తుగా ముగించేసింది. అతను ఏ నిరసనలో పాల్గొనలేదు. సోషల్‌మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక పోస్ట్ పెట్టలేదు. ఎలాంటి నేరచరిత్ర లేదు. అయినా సరే కారణంలేకుండా వీసాను రద్దుచేశారు. దీంతో వెంటనే మేం కేసు వేశాం. విదేశీ విద్యార్థుల పట్ల ఇలాంటి ధోరణి అవాంఛనీయం''అని న్యూ హ్యాంప్‌షైర్ అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్(ఏసీఎల్‌యూ), షాహీన్ అండ్ గార్డన్ న్యాయసేవా సంస్థలు చెప్పాయి. ఇలాంటి ప్రభుత్వ పనికిమాలిన ప్రవర్తన కారణంగా ఆ చైనా విద్యార్థి పీహెచ్‌డీ కల చెదిరిపోయిందని ఏసీఎల్‌యూ డైరెక్టర్ గిలీస్ బిసోనెటీ ఆవేదన వ్యక్తం చేశారు.

అమెరికాలో మళ్లీ కాల్పుల మోత

ముగ్గురి మృతి • మరో ముగ్గురికి గాయాలు

స్పాట్సిల్వేనియా కౌంటీ(వర్జీనియా): అమెరికాలో మరోసారి తుపాకుల మోత మోగింది. వర్జీనియా రాష్ట్రంలోని స్పాట్సిల్వేనియా కౌంటీ పరిధిలోని ఓల్డ్ గ్రీన్‌విచ్ గ్రామంలో మంగళవారం సాయంత్రం కాల్పుల ఘటన జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. బుల్లెట్ గాయాలైన ముగ్గురు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనలో నలుగురు నిందితులను పోలీసులు బుధవారం తెల్లవారుజామున అరెస్ట్‌చేసి ప్రశ్నిస్తున్నారు. దేశ రాజధాని వాషింగ్టన్ డీసీకి 65 మైళ్లదూరంలో ఈ గ్రామం ఉంది. అక్రమంగా సంపాదించిన గన్స్‌ను విక్రయించే క్రమంలో రెండు వర్గాలకు మధ్య జరిగిన వాగ్వాదం చివరకు దోపిడీకి, ఆ తర్వాత కాల్పులకు దారితీసిందని స్థానిక మీడియాలో వార్తలొచ్చాయి. రెండు బృందాలుగా ఏర్పడిన పలువురు టీనేజర్లు ఈ పరస్పర కాల్పుల ఘటనకు కారకులని తెలుస్తోంది. కాల్పుల మోత ధాటికి సమీప ఇళ్ల ప్రజలు భయంతో వణికిపోయారు. నిందితులు అందర్నీ పట్టుకున్నామని, స్థానికులు భయపడాల్సిన పనిలేదని స్పాట్సిల్వేనియా కౌంటీ షరీఫ్ అధికారి మేజర్ ఎలిజబెత్ స్కాట్ ప్రకటించారు. చనిపోయిన ముగ్గురిలో ఇద్దరిని 18 ఏళ్ల టీనేజర్లుగా పోలీసులు గుర్తించారు. టీనేజీ బృందాలు ఆటోమేటెడ్ రైఫిల్, గన్‌లతో పరస్పరం కాల్పులు జరుపుకున్నాయి. దీంతో అక్కడి కార్లు, ఇళ్ల గోడల్లోకి బుల్లెట్లు దూసుకెళ్లాయి.

రైలులో లగేజీ బాధ్యత ప్రయాణికులదే: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: రైలులో ప్రయాణిస్తున్నప్పుడు లగేజ్ చోరీ కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రయాణికులదేనని ఢిల్లీ హైకోర్టు బుధవారం స్పష్టంచేసింది. రైల్వే శాఖ అందుకు బాధ్యత వహించదని వెల్లడించింది. ఒకవేళ రైలులో ప్రయాణికుల వస్తువులు దొంగలపాలు కావడానికి రైల్వే అధికారుల నిర్లక్ష్యం గానీ, ప్రవర్తన గానీ కారణమైతే అందుకు రైల్వే శాఖ బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవీందర్ దుడేజా తీర్పు వెలువరించారు. 2013 జనవరిలో ఢిల్లీ నుంచి నాగపూర్‌కు రైలులో ప్రయాణిస్తుండగా తన బ్యాగు పోయిందని, అందులో ల్యాప్‌టాప్, కెమెరా, చార్జర్, ఏటీఎం కార్డులు ఉన్నాయని పేర్కొంటూ ఒక ప్రయాణికుడు తొలుత జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించాడు. తనకు రైల్వేశాఖ నుంచి రూ.84,000 పరిహారం ఇప్పించాలని కోరాడు. అతడి వినతిని కమిషన్ తిరస్కరించింది. ప్రయాణికుడు నిర్లక్ష్యంతో బ్యాగు పోగొట్టుకున్నాడని, అతడికి పరిహారం ఇవ్వడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. దాంతో అతడు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. కమిషన్ నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించింది.

తోటి ప్రయాణికుడిపై మూత్ర విసర్జన

ఢిల్లీ–బ్యాంకాక్ విమానంలో అమానవీయ ఘటన

న్యూఢిల్లీ: ఢిల్లీ నుంచి థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్ బయలుదేరిన ఎయిర్ ఇండియా 'ఏఐ2336'విమానంలో బుధవారం అమానవీయ ఘటన చోటుచేసుకుంది. ఒక ప్రయాణికుడు మరో ప్రయాణికుడిపై మూత్ర విసర్జన చేయడం కలకలం రేపింది. దీనిపై డీజీసీఏకు సమాచారం చేరవేసినట్లు ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ వ్యవహారంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు స్పందించారు. ఎయిర్ ఇండియా విమానంలో జరిగిన ఘటనపై దర్యాప్తు జరిపిస్తామని, తప్పు జరిగినట్లు తేలితే దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. విమానంలో జరిగిన ఘటనపై దర్యాప్తు జరపడానికి స్టాండింగ్ ఇండిపెండెంట్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది. ఈ విషయంలో డీజీసీఏ నిర్దేశించిన ప్రామాణిక నియమావళి ప్రకారమే నడుచుకుంటామని స్పష్టంచేసింది. అయితే, విమానంలో సదరు ప్రయాణికుడు మద్యం మత్తులోమూత్ర విసర్జన చేశాడా లేక ఇంకేదైనా కారణం ఉందా? అనేది తెలియరాలేదు.

యెమెన్‌పై అమెరికా దాడులు.. 10 మంది మృతి

దుబాయ్: హౌతీ తిరుగుబాటుదార్ల భరతం పట్టడమే లక్ష్యంగా అమెరికా సైన్యం యెమెన్‌పై వైమానిక దాడులకు దిగింది. ఎర్ర సముద్ర తీర నగరమైన హొడీడాపై మంగళవారం రాత్రి ఈ దాడులు జరిగాయి. అమెరికా దాడుల్లో కనీసం 10 మంది మరణించారని, మరో 16 మంది గాయపడ్డారని హౌతీ రెబెల్స్ బుధవారం ప్రకటించారు. ఈ రేవు నగరాన్ని హౌతీలు చాలాకాలంగా ప్రధాన స్థావరంగా ఉపయోగించుకుంటున్నారు. ఇక్కడి నుంచే ఎర్ర సముద్రంలోని నౌకలపై దాడులు చేస్తున్నారు. ఇటీవలి కాలంలో హౌతీలపై అమెరికా దాడులు ఉధృతం చేస్తోంది. ఈ దాడుల్లో ఇప్పటిదాకా 107 మంది మరణించారు. యెమెన్‌పై జరిగిన తాజా వైమానిక దాడులను అమెరికా సెంట్రల్ కమాండ్ ఇంకా ధ్రువీకరించలేదు.

వక్ఫ్ చట్టం బెంగాల్‌లో అమలు చేయం: మమత

కోల్‌కతా: పార్లమెంట్‌లో విపక్షాల తీవ్ర అభ్యంతరాలు, గంటల తరబడి చర్చల తర్వాత ఎట్టకేలకు అమల్లోకి వచ్చిన వక్ఫ్(సవరణ) చట్టాన్ని తమ రాష్ట్రంలో అమలుచేయబోమని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ మమతా బెనర్జీ స్పష్టంచేశారు. బుధవారం కోల్‌కతాలో ఓ కార్యక్రమంలో సీఎం పాల్గొని ముస్లింలనుద్దేశించి ప్రసంగించారు. ''వక్ఫ్ బిల్లు కారణంగా ముస్లిం మైనారిటీలు ఎంతో వేదన అనుభవిస్తున్నారు. మైనారిటీలను, వారి ఆస్తులను పరిరక్షిస్తాం. బెంగాల్‌లో విభజించు, పాలించు విధానాన్ని అస్సలు అనుమతించబోను''అని అన్నారు. ''రాజకీయ ఉద్యమం ఎగదోసేందుకు కొందరు ప్రయత్నిస్తుంటారు. మీరు వాళ్ల మాయలో పడి అనవసర ఆవేశాలకు లోనుకాకండి. శాంతంగా ఉండండి. నాపై నమ్మకం ఉంచండి. మిమ్మల్ని, మీ ఆస్తులను పరిరక్షిస్తా. మనమంతా ఐక్యంగా ఉంటే విజయం మనదే. ప్రపంచాన్నీ జయించగలం. మైనారిటీలు, ఇతర వర్గాల మధ్య చిచ్చుపెట్టాలని చూసే వాళ్ల ఆటను సాగనివ్వొద్దు''అని పరోక్షంగా బీజేపీని విమర్శించారు. మంగళవారం ముర్షీదాబాద్ జిల్లాలో వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు జరిగిన నేపథ్యంలో ముస్లింలు శాంతంగా ఉండాలని సీఎం పిలుపునిచ్చారు.

కుర్‌కురే ప్యాకెట్లో ఏముందన్న ఆసక్తే ఎక్కువ

ప్యాకెట్‌పై ఏముందో ఎవరూ చూడరు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ప్యాకేజ్డ్ ఫుడ్ ఐటమ్స్‌పై హెచ్చరిక లేబుల్ ముద్రించేలా ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు బుధవారం విచారణకు స్వీకరించింది. ఈ సందర్భంగా కుర్‌కురే ప్యాకెట్ గురించి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పార్దివాలా ప్రస్తావించారు. ''కుర్‌కురే ప్యాకెట్‌పై ఏముందో తెలుసుకోవడం కంటే లోపల ఏముందో తెలుసుకోవడంపైనే పిల్లలు ఆసక్తి చూపుతారు. ప్యాకెట్‌పై ఏం రాసి ఉందో వారు చూడరు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టాలి. అప్పుడే కుర్‌కురే అంటే ఏమిటో తెలుస్తుంది'' అని పేర్కొ న్నారు. ప్యాకేజ్డ్ ఫుడ్ ప్యాకెట్ ముందుభాగంలో అందులోని చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వులు, ఇతర పదార్థాల వివరాలు కచ్చితంగా ముద్రించాలని పిటిషనర్ కోరారు. అంతేకాకుండా తగిన హెచ్చరిక లేబుల్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఇందుకు సుప్రీంకోర్టు సానుకూలంగా స్పందించింది. ఇలాంటి హెచ్చరికల ముద్రణ కోసం సిఫార్సులు చేయడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

నగదు రహిత పథకంలో జాప్యమెందుకు?: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత వైద్య చికిత్స అందించే పథకం రూపకల్పనలో ఎందుకు జాప్యం చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ కేంద్ర రోడ్డు రవాణా శాఖ కార్యదర్శికి సమన్లు జారీ చేసింది. ఈ నెల 28న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ ఎదుట హాజరు కావాలని పేర్కొంది. నగదు రహిత వైద్య చికిత్స పథకాన్ని త్వరగా రూపొందించాలంటూ ఈ ఏడాది జనవరి 8న జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇంకా స్పందించలేదు. అందుకే ఈ అంశంపై ధర్మాసనం బుధవారం మళ్లీ విచారణ చేపట్టింది. ప్రభుత్వానికి ఇచ్చిన గడువు మార్చి 15వ తేదీన ముగిసిపోయినట్లు స్పష్టంచేసింది.



మంగళవారం తెల్లవారుజామున పైకప్పు కూలడంతో నామరూపాల్లేకుండా పోయిన నైట్‌క్లబ్ భవంతి

నైట్ క్లబ్ పైకప్పు కూలి... 113 మంది దుర్మరణం

డొమినికన్ రిపబ్లిక్‌లో విషాదం

మృతుల్లో పలువురు ప్రముఖులు

శాంటో డొమింగో: డొమినికన్ రిపబ్లిక్ రాజధాని శాంటో డొమింగోలో ఓ నైట్ క్లబ్ పైకప్పు కుప్పకూలింది. ఈ ఘటనలో 113 మందికి పైగా మృతి చెందారు. 255 మందికి పైగా గాయపడ్డారు. జెట్‌సెట్ నైట్ క్లబ్‌లో ప్రముఖ గాయకుడు రుబీ ప్రెజ్ లైవ్‌షో జరుగుతుండగా మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. శిథిలాల కింద చిక్కిన వారిలో ప్రెజ్ కూడా ఉన్నట్లు సమాచారం. ఘటన జరిగినప్పుడు క్లబ్‌లో వందలాది మంది ఉన్నారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని భావిస్తున్నారు. మృతుల్లో మాంటెక్రిస్టీ ప్రావిన్స్ గవర్నర్ నెల్సీ క్రూజ్‌తో పాటు ప్రావిన్షియల్ గవర్నర్, మేజర్ లీగ్ బేస్ బాల్ ఆటగాడు మాజీ ఆక్టావియో డోటెల్(51)తో పాటు పలువురు నేతలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు తదితరులున్నారు. డోటెన్‌ను శిథిలాల నుంచి బయటికి తీసి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. బాధిత కుటుంబాలకు డొమినికన్ రిపబ్లిక్ అధ్యక్షుడు అబినార్ సంతాపం తెలిపారు. జెట్ సెట్ బాగా పేరున్న నైట్ క్లబ్. ఇక్కడ సోమవారం రాత్రి డ్యాన్స్, మ్యూజిక్ షోలు ఉంటాయి. రాజకీయ నాయకులు, క్రీడాకారులు, ప్రముఖులు హాజరవుతుంటారు. క్లబ్ లోపల తీసిన వీడియో ఫుటేజీలో స్టేజీ ముందు టేబుళ్ల వద్ద కొందరు వ్యక్తులు కూర్చుని ఉన్నారు. పెరెజ్ పాడుతుండగా వెనక కొందరు నృత్యం చేస్తున్నారు. వేదిక పక్కన నిలబడ్డ ఒక వ్యక్తి 'పైకప్పు నుంచి ఏదో పడిపోయింది' అని చెప్పడం, అతని వేలు పైకప్పు వైపు చూపడం సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియోల్లో కనిపిస్తోంది. పెరెజ్ కూడా ఆ వ్యక్తి సూచించిన వైపు చూడటం కన్పించింది. 30 సెకన్ల తర్వాత పెద్ద శబ్దం వినబడింది.

ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశంగా భారత్‌కు మద్దతు

- స్లొవాకియా అధ్యక్షుడు పీటర్ పెల్లిగ్రినీ వెల్లడి
- భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ

బ్రటిస్లావా: ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం లభించాలని, అందుకు తమ పూర్తి సహకారం ఉంటుందని స్లొవాకియా అధ్యక్షుడు పీటర్ పెల్లిగ్రినీ చెప్పారు. భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశంగా మారే అర్హత భారత్‌కు ఉందన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత్, స్లొవాకియా పరస్పరం కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధికారిక పర్యటన నిమిత్తం బుధవారం స్లొవాకియా చేరుకున్నారు. ప్రభుత్వం ఆమెకు ఘన స్వాగతం పలికింది. ప్రెసిడెన్షియల్ ప్యాలెస్‌లో ముర్ము, పీటర్ పెల్లిగ్రినీ సమావేశమయ్యారు. భారత్-స్లొవాకియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. అనంతరం ప్రతినిధుల స్థాయిలో చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా రెండు అవగాహనా ఒప్పందాల(ఎంఓయూలు)పై భారత్, స్లొవాకియా సంతకాలు చేశాయి. భారత్‌కు చెందిన సుష్మాస్వరాజ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ సర్వీసు(ఎస్ఎస్ఐఎఫ్ఎస్), స్లొవాకియాకు చెందిన స్లొవాక్ మినిస్ట్రీ ఆఫ్ ఫారిన్ అండ్ యూరోపియన్ అఫైర్స్ పరస్పరం సహకరించుకోనున్నాయి. అలాగే ఇరుదేశాల పరిశ్రమల మధ్య సహకారం కోసం ఒప్పందం కుదిరింది. పీటర్ పెల్లిగ్రీతో భేటీ అనంతరం ద్రౌపది ముర్ము ఒక ప్రకటన విడుదల చేశారు. ఉక్రెయిన్‌లో యుద్ధం మొదలైనప్పుడు అక్కడి నుంచి భారతీయ విద్యార్థులను తరలించడానికి స్లొవాకియా ప్రభుత్వం ఎంతగానో సహకరించిందని తెలిపారు. స్లొవాకియా సహకారం, దాతృత్వాన్ని భారత్ ఎప్పటికీ మర్చిపోదని ఉద్ఘాటించారు.

మళ్లీ మండుతున్న బంగ్లాదేశ్

- గాజాపై ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా ర్యాలీలు
- అంతర్జాతీయ బ్రాండ్ల దుకాణాలపై దాడులు, లూటీలు

ఢాకా: బంగ్లాదేశ్ మళ్లీ మండిపోతోంది. అల్లరి మూకలు ఎక్కడికక్కడ బీభత్సం సృష్టిస్తున్నాయి. గాజాపై ఇజ్రాయెల్ దాడులను వ్యతిరేకిస్తూ సాగుతున్న నిరసన ర్యాలీలు చివరకు విధ్వంసానికే దారితీస్తున్నాయి. దుకాణాలపై దాడులు చేస్తూ అందినంత దోచుకుంటున్నారు. వ్యాపార కేంద్రాలపై రాళ్లు రువ్వుతూ ధ్వంసం చేస్తున్నారు. బాటా, కేఎఫ్‌సీ, పిజ్జా హట్, డోమినోస్, పూమా వంటి అంతర్జాతీయ బ్రాండ్లు విక్రయించే దుకాణాలను తీవ్ర నష్టం జరుగుతోంది. ఇజ్రాయెల్‌తో అనుబంధం ఉన్న కంపెనీలను వదిలిపెట్టబోమని, బంగ్లాదేశ్ నుంచి తరిమికొడతామని ఆందోళనకారులు హెచ్చరిస్తున్నారు. పాలస్తీనా పౌరులకు మద్దతుగా సిల్హెట్, చత్తోగ్రామ్, ఖుల్నా, బరీషల్, కుమిల్లా, ఢాకా తదితర నగరాల్లో తాజాగా ర్యాలీలు జరిగాయి. వేలాది మంది వీధుల్లోకి వచ్చారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ఇజ్రాయెల్‌కు మద్దతు ఇవ్వడం తక్షణమే మానుకోవాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ బ్రాండ్లు విక్రయిస్తున్న దుకాణాలను రాళ్లు, ఇటుకలతో ధ్వంసం చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దుకాణాల్లోని వస్తువులను దోచుకెళ్లారు. నిజానికి ఆయా బ్రాండ్లతో ఇజ్రాయెల్‌కు ఎలాంటి సంబంధాలు లేవని నిపుణులు చెప్పారు. తమ దుకాణాలపై దాడుల చేయడాన్ని బాటా కంపెనీ ఖండించింది. ఇజ్రాయెల్-హమాస్ ఘర్షణతో తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. తప్పుడు ప్రచారం నమ్మి అల్లరి మూకలు విధ్వంసం సృష్టిస్తున్నాయని స్థానిక మీడియా వెల్లడించింది. 70 మందికిపైగా ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం.

కుటుంబం ఆవిర్భవించడానికి కారణం ఏమిటి?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ

కుటుంబం

1. కింది వాటిలో అత్యంత ప్రధానమైన సామాజిక సంస్థ ఏది?
   ఎ) కుటుంబం బి) వివాహం
   సి) విద్య డి) మతం
2. 'ఉమ్మడి కుటుంబం నశించిపోతుందనడం సరైంది కాదు' అని పేర్కొన్నవారు? (CDPO-2013)
   ఎ) మెనారియా బి) మదన్
   సి) కపాడియా డి) రామ్ అహూజా

గమనిక: కె.ఎం. కపాడియా 1969లో గుజరాత్‌లోని నవేసరి అనే బస్తీలో 246 కుటుంబాలను అధ్యయనం చేసి వాటిలో 139 (56 శాతం) సంప్రదాయబద్ధమైన సమష్టి కుటుంబాలని, మిగిలిన 107 (47 శాతం) ప్రాథమిక కుటుంబాలని తెలిపారు.

3. 'ఫ్యామిలీ' అనే పదం రోమన్ పదమైన ఫేమలస్ నుంచి ఆవిర్భవించింది. 'ఫేమలస్' పదానికి అర్థం ఏమిటి?
   ఎ) కూలీ బి) సేవకుడు
   సి) సన్యాసి డి) వర్తకుడు
4. The origin of family, private property and the state గ్రంథ రచయిత ఎవరు?
   ఎ) కె.ఎం. కపాడియా బి) కార్వే
   సి) మోర్గాన్ డి) ఫ్రెడరిక్ ఏంగెల్స్
5. ఉమ్మడి కుటుంబానికి మరో పేరు? (CDPO-2013)
   ఎ) బంధిత కుటుంబం బి) పెద్ద కుటుంబం
   సి) సంప్రదాయిక కుటుంబం
   డి) అవిభాజ్య కుటుంబం
6. కుటుంబ చక్రం దేన్ని సూచిస్తుంది?
   ఎ) వధూవరుల వివాహం మొదలుకొని వారి మరణాల వరకు జరిగే వివిధ సంఘటనలు
   బి) మొదటి, చివరి బిడ్డల జననం, వివాహాలు
   సి) సంతాన పోషణ ప్రక్రియ, వృద్ధాప్య దశ
   డి) పైవన్నీ
7. కింది వాటిలో కుటుంబం విశిష్ట లక్షణం కానిది ఏది? (Gr-II, backlog-2000)
   ఎ) ఇది సార్వజనీనమైంది
   బి) ఇది చిన్న వ్యవస్థ
   సి) అన్ని సమాజాల్లో ఉంటుంది
   డి) ఇందులో పరస్పర సంబంధాలు ఉండవు
8. భారతదేశంలో కుటుంబాలు ఏ వంశానుక్రమంపై ఆధారపడి ఉన్నాయి? (CDPO-2013)
   ఎ) మాతృ వంశానుక్రమం
   బి) పితృ వంశానుక్రమం
   సి) ద్వి వంశానుక్రమం
   డి) ఏక వంశానుక్రమం
9. కింగ్‌స్లే డేవిస్ అభిప్రాయం ప్రకారం కుటుంబం మౌలిక ప్రకార్యాలు ఏవి?
   ఎ) లైంగిక, ఆర్థిక అవసరాలు తీర్చడం
   బి) పునరుత్పత్తి, సాంఘికీకరణ
   సి) అభిమానం, ఆహ్లాద, మతపరమైన అవసరాలు తీర్చడం
   డి) పైవన్నీ
10. మెకైవర్ అభిప్రాయం ప్రకారం కుటుంబ మౌలిక లక్షణాలు ఏవి?
    ఎ) విశ్వజనీనత బి) ఉద్వేగాత్మక ఆధారం
    సి) బాధ్యతలను గుర్తించడం
    డి) పైవన్నీ
11. కింది ఏ సంస్థలో జన్మించిన పిల్లలకే చట్టబద్ధమైన అంతస్తు ఉంటుంది? (CDPO-2013)
    ఎ) పాఠశాల బి) గ్రామం
    సి) కుటుంబం డి) దేశం
12. ఏ ప్రమాణం ఆధారంగా మాతృస్వామిక, పితృస్వామిక కుటుంబాలుగా వర్గీకరిస్తారు? (CDPO-2013)
    ఎ) వంశం బి) అధికారం
    సి) పరిమాణం డి) కూర్పు
13. స్త్రీ కుటుంబ అధికారిణిగా వ్యవహరించే కుటుంబాన్ని ఏమని పిలుస్తారు?
    ఎ) పితృస్వామిక కుటుంబం
    బి) ఉమ్మడి కుటుంబం
    సి) దాంపత్య మూలక కుటుంబం
    డి) మాతృస్వామిక కుటుంబం
14. కింది వాటిలో దేని ఆధారంగా కుటుంబాలను పతి స్థానిక, మాతుల స్థానిక, మాతృ స్థానిక కుటుంబాలుగా వర్గీకరిస్తారు?
    ఎ) అధికార ప్రమాణం బి) నివాస ప్రమాణం
    సి) వారసత్వ ప్రమాణం
    డి) జీవిత భాగస్వాముల సంఖ్య
15. కుటుంబం ఏ రకమైన సమూహం? (CDPO-2013)
    ఎ) గౌణ బి) ప్రాథమిక
    సి) ద్వితీయ డి) తృతీయ

గమనిక: మానవ సమూహాలన్నింటిలో అతి ముఖ్యమైన ప్రాథమిక సమూహం కుటుంబం. ఇది అతి చిన్న సామాజిక సమూహం.

16. కుటుంబ ప్రకార్యాలను ఆవశ్యక, అనావశ్యక ప్రకార్యాలు అనే రెండు రకాలుగా వర్గీకరించినవారు? (CDPO-2013)
    ఎ) మెకైవర్ బి) ఆగ్బర్న్
    సి) లుండ్‌బర్గ్ డి) ఎ.ఇ. రాస్
17. కుంటుంబాన్ని సమష్టి నివాసం, ఆర్థిక సహకారం, ప్రత్యుత్పత్తి అనే లక్షణాలున్న సామాజిక సమూహంగా వర్ణించినవారు?
    ఎ) రీడ్ బి) నిమ్‌కాఫ్
    సి) మెకైవర్ డి) డేవిస్

గమనిక: మెకైవర్ కుటుంబ ప్రకార్యాలను కింద పేర్కొన్న 2 భాగాలుగా విభజించాడు.

ఆవశ్యక ప్రకార్యాలు:
ఎ. లైంగిక అవసరానికి లేదా మిథున వాంఛకు స్థిరమైన సంతృప్తి.
బి. పిల్లల ఉత్పత్తి, పెంపకం
సి. గృహ సదుపాయం



అనావశ్యక ప్రకార్యాలు:
ఎ. మతపరమైనవి
బి. విద్యా విషయమైనవి
సి. ఆర్థికపరమైనవి
డి. ఆరోగ్యానికి సంబంధించినవి
ఇ. వినోదానికి సంబంధించినవి

18. మాతృవంశీయ కుటుంబాలు ఏ సమాజంలో కనిపిస్తాయి?
    ఎ) రాడార్లు బి) ఖాసీలు
    సి) భిల్లులు డి) తోడాలు
19. కుటుంబాల వర్గీకరణకు ప్రమాణం కాని అంశం ఏది? (Gr-II, backlog-2000)
    ఎ) పూర్వీకుల స్థితి బి) నిర్మితి
    సి) మతం డి) నివాసం
20. వివాహం, కుటుంబ వ్యవహారాలకు సంబంధించిన వివాదాలను పరిష్కరించడానికి కుటుంబ న్యాయస్థానాల చట్టాన్ని ఆమోదించిన సంవత్సరం ఏది? (Civils-1999)
    ఎ) 1984 బి) 1961 సి) 1955 డి) 1971
21. కింది వాటిలో సరైన జత/జతలను గుర్తించండి. (Civils-1996)
    1. వివాహం : సమూహం
    2. కుటుంబం : సంస్థ
    3. గోత్రం : సాజాత్యం
    4. తెగ : సముదాయం
    ఎ) 1, 2, 3, 4 బి) 2, 3, 4
    సి) 1, 2, 3 డి) 3, 4

గమనిక:
- సామాజిక శాస్త్రం ప్రకారం వివాహం అనేది ఒక సంస్థ.
- కొన్ని రక్త సంబంధాల ఆధారంగా కొన్ని కుటుంబాలు, వంశాలతో ఏర్పడే సంస్థ గోత్రం. గోత్రం బహిర్వివాహానికి సంబంధించింది.

22. 'దోపిడీ పూర్వక సమాజంలో ఆదర్శవంతమైన సాధనమే కుటుంబం' అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన వారెవరు?
    ఎ) డేవిడ్ కూపర్ బి) ఎడ్మండ్ లీచ్
    సి) ఫ్రెడరిక్ ఏంగెల్స్ డి) ఆర్.డి. లయింగ్
23. వివాహం ద్వారా ఏర్పడే కుటుంబాన్ని ఏమని పిలుస్తారు?
    ఎ) జన్మప్రాప్త కుటుంబం (Family of Procreation)
    బి) అనుస్థాపిత కుటుంబం (Family of Orientation)
    సి) కేవలం ఒక కుటుంబం
    డి) వ్యష్టి కుటుంబం
24. భారతదేశంలో ఏ వర్గంలో ఉమ్మడి కుటుంబం అదృశ్యమైంది?
    ఎ) నగర వ్యాపారస్థులు
    బి) వృత్తి నిపుణులు
    సి) భూమిలేని వేతన కార్మికులు
    డి) గ్రామీణ భూస్వాములు
25. జతపరచండి.
    గ్రూప్-ఎ
    i. ఐ.పి. దేశాయ్ ii. ఎ.ఎం. షా
    iii. కె.ఎం. కపాడియా iv. ఎం.ఎస్. గోరె
    గ్రూప్-బి
    1) హౌస్‌హోల్డ్ డైమన్షన్ ఆఫ్ ది ఫ్యామిలీ ఇన్ ఇండియా
    2) మ్యారేజ్ అండ్ ఫ్యామిలీ ఇన్ ఇండియా
    3) అర్బనైజేషన్ అండ్ ఫ్యామిలీ
    4) సమ్ ఆస్పెక్ట్స్ ఆఫ్ ఫ్యామిలీ ఇన్ మహువా
    5) వరల్డ్ రివల్యూషన్ అండ్ ఫ్యామిలీ పాట్రన్
    ఎ) i-4, ii-1, iii-2, iv-3
    బి) i-4, ii-5, iii-2, iv-3
    సి) i-1, ii-4, iii-5, iv-2
    డి) i-3, ii-1, iii-4, iv-2
26. ఒక 'నాయర్ కుటుంబం'ను కింద పేర్కొన్న ఏ విధంగా కూడా పిలుస్తారు? (Gr-II, 2000)
    ఎ) గోటుల్ బి) నోక్నా
    సి) తార్వాడ్ డి) ఇల్లయ్
27. కింది వాటిలో ఉమ్మడి కుటుంబ లక్షణం కానిది ఏది? (Gr-II, 2000)
    ఎ)సభ్యులందరూ ఒక ఇంటిలో నివసించడం
    బి) సభ్యులు ఒకరితో ఒకరు బంధువులు కానవసరం లేదు
    సి) ఆస్తి మొత్తం కుటుంబానికి చెందడం
    డి) కుటుంబ ఆదాయం ఒకటిగా చేర్చడం
28. కుటుంబంలో అధికారం ఒక స్త్రీపై ఆపాదిస్తే దాన్ని ఏమని పిలుస్తారు. (Gr-II, 2000)
    ఎ) మాతృ స్థానిక కుటుంబం
    బి) మాతృ వంశీయ కుటుంబం
    సి) మాతృస్వామిక కుటుంబం
    డి) పితృస్వామిక కుటుంబం
29. కింది వాటిలో ఉమ్మడి కుటుంబం క్షీణతకు కారణం కానిది?
    ఎ) వ్యవసాయ ఉత్పత్తి పెరగడం
    బి) పాశ్చాత్యీకరణ
    సి) వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ నుంచి పారిశ్రామికీకరణకు మారడం
    డి) సామాజిక చట్టాలను చేయడం
30. ఉమ్మడి కుటుంబం వల్ల కలిగే నష్టం?
    ఎ) వ్యక్తివాదం బి) సహకారం
    సి) పోటీ డి) సోమరితనం
31. ఉమ్మడి కుటుంబ విభజనకు కారణం?
    ఎ) ఉమ్మడి కుటుంబం సోమరులను తయారు చేయడం
    బి) ఉమ్మడి కుటుంబం వ్యక్తివాదాన్ని అణచివేయడం
    సి) ఉమ్మడి కుటుంబంలో సభ్యుల మధ్య వివాదాలు ఎక్కువగా ఉండటం
    డి) పైవన్నీ
32. ఆధునిక కుటుంబంలో విధులు..?(Gr-II, 2000)
    ఎ) వేగంగా అధికమవుతున్నాయి
    బి) వృద్ధి చెందుతున్నాయి
    సి) తగ్గుతున్నాయి
    డి) రెట్టింపు అవుతున్నాయి
33. కుటుంబం ఆవిర్భవించడానికి కారణం ఏమిటి? (Gr-II, 2000)
    ఎ) లైంగిక ప్రేరణ బి) ఆర్థిక అవసరం
    సి) సంతానోత్పత్తి ఆవశ్యకత
    డి) పైవన్నీ
34. నూతన వధూవరులు విడిగా నివాసం ఏర్పరచుకునే పద్ధతిని ఏమంటారు?
    ఎ) నూతన స్థానిక నివాసం
    బి) మాతృ స్థానిక నివాసం
    సి) పితృ స్థానిక నివాసం
    డి) పైవేవీ కావు
35. కింది వాటిలో మాతృస్వామిక కుటుంబ లక్షణం కానిది ఏది?
    ఎ) మాతృవంశానుక్రమం
    బి) మాతృ అధికారం
    సి) పతి స్థానిక నివాసం
    డి) మాతృవంశీయ ఆస్తి సంక్రమణం
36. మాతుల స్థానిక నివాసంలో వివాహమైన జంట ఎవరితో నివసిస్తుంది?
    ఎ) వధువు తల్లి సోదరుడు
    బి) వరుడి తల్లి సోదరుడు
    సి) వరుడి తండ్రి సోదరి
    డి) వధువు సోదరుడు
37. కింద పేర్కొన్న ఏ తెగలో మాతృ సంతతి కుటుంబం కనిపిస్తుంది? (Gr-II, backlog-2000)
    ఎ) ముండాలు బి) ఖాసీలు
    సి) ఖారియార్లు డి) కిసాన్‌లు
38. దేని ఆధారంగా కుటుంబాన్ని ఏక పత్నీత్వ, బహు పత్నీత్వ కుటుంబంగా విభజిస్తారు? (Gr-II, backlog-2000)
    ఎ) నివాసం బి) వివాహం
    సి) వంశపారంపర్యం డి) ఆస్తి హక్కులు
39. తార్వాడ్ అనే కుటుంబ నమూనా కింది ఏ రాష్ట్రంలో కనిపిస్తుంది? (Gr-II, backlog-2000)
    ఎ) అసోం బి) కేరళ సి) బిహార్ డి) ఒడిశా
40. ఒక వ్యక్తికి వివాహమై సంతానం పొందితే ఏర్పడే కుటుంబాన్ని ఏమని పిలుస్తారు?
    ఎ) వైవాహిక బి) సంయోగ
    సి) అనుస్థాపిత డి) ప్రత్యుత్పత్తి
41. అధికారానికి విశేష ప్రాధాన్యం ఉంటూ తల్లిదండ్రులు-పిల్లల సంబంధాలపై ఆధారపడే కుటుంబాన్ని ఏమని పిలుస్తారు?
    ఎ) ఏకరక్త కుటుంబం
    బి) మాతృస్వామ్య కుటుంబం
    సి) వైవాహిక కుటుంబం
    డి) బహిర్వివాహ కుటుంబం
42. కుటుంబ వ్యవస్థకు సంబంధించి కిందివాటిలో సరికానిది ఏది?
    ఎ) కుటుంబం విశ్వజనీనం
    బి) కుటుంబం అన్ని సమాజాల్లో ఒకే విధంగా ఉంటుంది
    సి) కుటుంబ వ్యవస్థ భిన్న సమాజాల్లో విభిన్న రీతుల్లో ఉంటుంది
    డి) ఎ, బి

సమాధానాలు

1) ఎ; 2) సి; 3) బి; 4) డి; 5) బి; 6) డి; 7) డి; 8) బి; 9) డి; 10) డి; 11) సి; 12) బి; 13) డి; 14) బి; 15) బి; 16) ఎ; 17) సి; 18) బి; 19) సి; 20) ఎ; 21) బి; 22) సి; 23) ఎ; 24) సి; 25) ఎ; 26) సి; 27) బి; 28) బి; 29) ఎ; 30) డి; 31) డి; 32) సి; 33) డి; 34) ఎ; 35) సి; 36) బి; 37) బి; 38) బి; 39) బి; 40) డి; 41) ఎ; 42) బి.

నిజామాబాద్ జిల్లాలో పడమటి కనుమలను ఏమంటారు?

తెలంగాణ- నైసర్గిక స్వరూపం

1. తెలంగాణ రాష్ట్రం ఉన్న 'దక్కన్ పీఠభూమి' ఏ శిలలతో విస్తరించి ఉంది?
   1) రూపాంతర శిలలు
   2) అగ్నిశిలలు
   3) స్ఫటిక శిలలు 4) పైవన్నీ
2. తెలంగాణ పీఠభూమి ప్రాంతం సముద్ర మట్టానికి ఎంత ఎత్తులో ఉంది?
   1) 300-450 మీ. 2) 480-600 మీ.
   3) 730 మీ. 4) 520 మీ.
3. నిర్మల్ కొండల్లో ఎత్తైనది ఏది?
   1) మహబూబా ఘాట్
   2) జహంగీర్ ఘాట్
   3) షాజహాన్ ఘాట్
   4) హైదర్ ఘాట్
4. నిజామాబాద్ జిల్లాలో పడమటి కనుమలను ఏమంటారు?
   1) రాజు గుట్టలు 2) శేషాచలం గుట్టలు
   3) సిర్నపల్లి పంక్తులు
   4) యల్లండ్లపాడు గుట్టలు
5. రాచకొండ గుట్టలు విస్తరించి ఉన్న తెలంగాణ జిల్లా?
   1) ఆదిలాబాద్ 2) ఖమ్మం
   3) మహబూబ్‌నగర్
   4) నల్లగొండ
6. తెలంగాణ పీఠభూమి ప్రాంతం ఏ దిక్కునుంచి ఏ దిక్కునకు వాలి ఉంది?
   1) ఆగ్నేయం నుంచి వాయవ్యానికి
   2) పశ్చిమం నుంచి తూర్పునకు
   3) వాయవ్యం నుంచి ఆగ్నేయానికి
   4) నైరుతి నుంచి ఈశాన్యానికి
7. నిర్మల్ కొండల పొడవు ఎంత?
   1) 300 కి.మీ. 2) 150 కి.మీ.
   3) 520 కి.మీ. 4) 180 కి.మీ.
8. హైదరాబాద్ నగరం సముద్రమట్టానికి ఎంత ఎత్తులో ఉంది?
   1) 480 మీ. 2) 730 మీ.
   3) 520 మీ. 4) 536 మీ.
9. తూర్పు కనుమలను మహబూబ్‌నగర్ జిల్లాలో ఏ పేరుతో పిలుస్తారు?
   1) రాఖీ కొండలు
   2) సిర్నపల్లి పంక్తులు
   3) అమ్రాబాద్ గుట్టలు
   4) నిర్మల్ కొండలు
10. పడమటి కనుమలు తెలంగాణ ప్రాంతంలో మొదట ఏ జిల్లాలో ప్రవేశిస్తాయి?
    1) మహబూబ్‌నగర్2) ఆదిలాబాద్
    3) నిజామాబాద్ 4) మెదక్
11. తెలంగాణ ప్రాంతం కృష్ణ, తుంగభద్ర నదీ లోయల మధ్య ఎంత ఎత్తు వరకు ఉంది?
    1) 300-450 మీ. 2) 450-730 మీ.
    3) 480-600 మీ. 4) 600-730 మీ.
12. ఖమ్మం జిల్లాలో విస్తరించిన గుట్టలు ఏవి?
    1) రాచకొండ గుట్టలు
    2) కందికల్ గుట్టలు
    3) యల్లండ్లపాడు గుట్టలు
    4) నిర్మల్ గుట్టలు



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలంగాణ జాగ్రఫీ

13. రాఖీ గుట్టలు ఏ జిల్లాలో విస్తరించి ఉన్నాయి?
    1) ఆదిలాబాద్ 2) కరీంనగర్
    3) వరంగల్ 4) నిజామాబాద్
14. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని గోదావరి పరీవాహక ప్రాంతంలో విస్తరించిన శిలలు ఏవి?
    1) క్వార్ట్జ్ శిలలు
    2) రూపాంతర శిలలు
    3) అతి పురాతన స్ఫటిక శిలలు
    4) గోండ్వానా శిలలు
15. పడమటి కనుమలను వరంగల్ జిల్లాలో ఏమని పిలుస్తారు?
    1) రాఖీ గుట్టలు
    2) వెంకటాద్రి గుట్టలు
    3) కందికల్ గుట్టలు
    4) రాచకొండ గుట్టలు
16. తూర్పు కనుమలను రంగారెడ్డి జిల్లాలో ఏ పేరుతో పిలుస్తారు?
    1) అమ్రాబాద్ కొండలు
    2) అనంతగిరి గుట్టలు
    3) అమృత కొండలు
    4) నీలగిరి కొండలు
17. తెలంగాణలో గోదావరి నది ఏ కొండల మధ్య ప్రవహిస్తుంది?
    1) పాపి కొండలు
    2) అనంతగిరి గుట్టలు
    3) నల్లమల కొండలు
    4) నీలగిరి కొండలు
18. తెలంగాణ ప్రాంతంలో వ్యాపించిన పశ్చిమ కనుమల శాఖ పేరు?
    1) నీలగిరి పర్వతాలు
    2) ఎల్లోరా పర్వతాలు
    3) సహ్యాద్రి పర్వతాలు
    4) ఆరావళి పర్వతాలు
19. అనంత పద్మనాభస్వామి దేవాలయం ఏ కొండల్లో నెలకొని ఉంది?
    1) అమృత కొండలు
    2) రాచకొండ గుట్టలు
    3) పాపి కొండలు
    4) అనంతగిరి గుట్టలు
20. మూసీ నది ఏ కొండల్లో జన్మిస్తుంది?
    1) రాచకొండ గుట్టలు
    2) అనంతగిరి కొండలు
    3) పాపి కొండలు
    4) సిర్నపల్లి పంక్తులు
21. కింది వాటిలో ఖమ్మం జిల్లాలో విస్తరించిన కొండలు ఏవి?
    1) నందగిరి కొండలు
    2) రాఖీ గుట్టలు
    3) రాచకొండ గుట్టలు
    4) పాపి కొండలు
22. భీమా, గోదావరి నదుల మధ్య దక్కన్ పీఠభూమి ఎంత ఎత్తు వరకు ఉంది?
    1) 600 మీ. 2) 730 మీ.
    3) 450 మీ. 4) 520 మీ.
23. తూర్పు కనుమలు తెలంగాణ రాష్ట్రంలోకి ఏ జిల్లాలో ప్రవేశిస్తాయి?
    1) మహబూబ్‌నగర్
    2) ఖమ్మం
    3) వరంగల్ 4) నల్లగొండ
24. రాజు గుట్టలు ఏ జిల్లాలో విస్తరించి ఉన్నాయి?
    1) రంగారెడ్డి 2) హైదరాబాద్
    3) ఖమ్మం 4) కరీంనగర్
25. నల్లమల కొండలు ఏ జిల్లాలో విస్తరించి ఉన్నాయి?
    1) హైదరాబాద్ 2) మహబూబ్‌నగర్
    3) వరంగల్ 4) ఖమ్మం

సమాధానాలు

1) 4; 2) 2; 3) 1; 4) 3; 5) 4; 6) 3; 7) 2; 8) 4; 9) 3; 10) 2; 11) 1; 12) 3; 13) 2; 14) 4; 15) 3; 16) 2; 17) 1; 18) 3; 19) 4; 20) 2; 21) 4; 22) 2; 23) 1; 24) 3; 25) 2.

తెలంగాణ రాష్ట్ర శీతోష్ణస్థితి

1. తెలంగాణ రాష్ట్రంలో ఎలాంటి శీతోష్ణస్థితి ఉంటుంది?
   1) అనార్ద్ర శీతోష్ణస్థితి
   2) అర్ధ శీతోష్ణస్థితి
   3) అర్ధశుష్క శీతోష్ణస్థితి
   4) ఉపఅర్ధ శీతోష్ణస్థితి
2. నైరుతి రుతుపవనాలు తెలంగాణలో ఎప్పుడు ప్రవేశిస్తాయి?
   1) జూన్ మొదటి వారంలో
   2) జూన్ చివరి వారం
   3) జూలై మొదటి వారం
   4) జూన్ రెండో వారం
3. తెలంగాణ రాష్ట్ర సగటు అత్యధిక ఉష్ణోగ్రత ఎంత?
   1) 42°C 2) 31.5°C
   3) 38.5°C 4) 18°C
4. తెలంగాణ ప్రాంతంలో నైరుతి రుతుపవన కాలంలో ఎంత శాతం వర్షపాతం సంభవిస్తుంది?
   1) 65% 2) 70%
   3) 75% 4) 80%
5. తెలంగాణలో అధికంగా చలి ఉండే ప్రాంతం?
   1) ఉత్తర తెలంగాణ
   2) దక్షిణ తెలంగాణ
   3) తూర్పు తెలంగాణ
   4) మధ్య తెలంగాణ
6. తెలంగాణ రాష్ట్రంలో సగటు వర్షపాతం ఎంత?
   1) 1162.4 మి.మీ.
   2) 828.7 మి.మీ.
   3) 906.6 మి.మీ.
   4) 782 మి.మీ.
7. ఈశాన్య రుతుపవనాల వల్ల తెలంగాణలో కురిసే సాధారణ వర్షపాతం ఎంత?
   1) 150 మి.మీ. 2) 129 మి.మీ.
   3) 384 మి.మీ. 4) 258 మి.మీ.
8. ఈశాన్య రుతుపవనాల వల్ల అధికంగా వర్షపాతం సంభవించే ప్రాంతం ఏది?
   1) కరీంనగర్ 2) ఆదిలాబాద్
   3) మహబూబ్‌నగర్
   4) హైదరాబాద్
9. నైరుతి రుతుపవనాల వల్ల అల్పంగా వర్షపాతం సంభవించే ప్రాంతం ఏది?
   1) ఆదిలాబాద్ 2) హైదరాబాద్
   3) మహబూబ్ నగర్
   4) ఖమ్మం
10. తెలంగాణ రాష్ట్రంలో ఈశాన్య రుతుపవన కాలం?
    1) సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు
    2) అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు
    3) నవంబర్ నుంచి మార్చి వరకు
    4) డిసెంబర్ నుంచి జూన్ వరకు
11. తెలంగాణ రాష్ట్రంలో 24 గంటల్లో అత్యధిక వర్షపాతం ఎక్కడ నమోదైంది?
    1) పేరూరు 2) రామగుండం
    3) కొత్తగూడెం
    4) మహబూబ్ నగర్
12. తెలంగాణ రాష్ట్రంలో అతి తక్కువ ఉష్ణోగ్రత నమోదయ్యే జిల్లా ఏది?
    1) కరీంనగర్ 2) హైదరాబాద్
    3) నల్లగొండ 4) ఆదిలాబాద్
13. దక్షిణ తెలంగాణలో ఏ నెలలో అధిక వర్షపాతం సంభవిస్తుంది?
    1) జూలై 2) ఆగస్టు
    3) సెప్టెంబర్ 4) అక్టోబర్
14. నైరుతి రుతుపవనాల వల్ల తెలంగాణ ప్రాంతంలో సంభవించే సాధారణ వర్షపాతం ఎంత?
    1) 129 మి.మీ. 2) 715 మి.మీ.
    3) 906.6 మి.మీ. 4) 560 మి.మీ.
15. తెలంగాణ ప్రాంతంలో వర్షపాత అస్థిరత్వం నైరుతి రుతుపవన కాలంలో ఎంత ఉంటుంది?
    1) 25 శాతం కంటే ఎక్కువ
    2) 25 శాతం కంటే తక్కువ
    3) 80 శాతం కంటే తక్కువ
    4) 80 శాతం కంటే ఎక్కువ
16. తెలంగాణలో అత్యంత కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతం ఏది?
    1) నిర్మల్ 2) కోదాడ
    3) సూర్యపేట 4) రామగుండం
17. తెలంగాణ ప్రాంతంలో వేసవిలో కురిసే వర్షాలను ఏమని పిలుస్తారు?
    1) ఏరువాక 2) మ్యాంగో షవర్స్
    3) కాలబైశాఖి 4) నార్వెస్టర్స్
18. ఉత్తర తెలంగాణలో అధిక వర్షపాతం సంభవించే నెల ఏది?
    1) నవంబర్ 2) డిసెంబర్
    3) జూలై 4) అక్టోబర్
19. తెలంగాణ రాష్ట్రంలో వేసవిలో ఉరుములు, మెరుపులతో కురిసే వర్షాలకు కారణం అయ్యే మేఘాలు ఏవి?
    1) నింబస్ 2) సిర్రస్
    3) క్యుములో నింబస్
    4) క్యుములో సిర్రస్
20. వర్షాకాలానికి, శీతాకాలానికి సంధిమాసం ఏది?
    1) సెప్టెంబర్ 2) అక్టోబర్
    3) నవంబర్ 4) ఆగస్టు
21. కిందివాటిలో 1000 మి.మీ. కంటే ఎక్కువ సగటు వర్షపాతం నమోదయ్యే జిల్లా ఏది?
    1) నల్లగొండ
    2) రంగారెడ్డి
    3) మహబూబ్‌నగర్
    4) నిజామాబాద్
22. తెలంగాణ రాష్ట్రంలో నైరుతి రుతుపవన కాలం ?
    1) జూన్ నుంచి సెప్టెంబర్
    2) జూలై నుంచి అక్టోబర్
    3) జూన్ నుంచి సెప్టెంబర్
    4) అక్టోబర్ నుంచి డిసెంబర్
23. తెలంగాణ రాష్ట్రానికి లభించే వర్షపాతం అత్యధికంగా ఏ రుతుపవనాల ద్వారా కలుగుతుంది?
    1) ఈశాన్య రుతుపవనాలు
    2) నైరుతి రుతుపవనాలు
    3) ఆగ్నేయ రుతుపవనాలు
    4) తిరోగమన రుతుపవనాలు
24. తెలంగాణ ప్రాంతంలో సాధారణంగా అతి ఎక్కువ ఉష్ణోగ్రత నమోదయ్యే జిల్లా ఏది?
    1) నల్లగొండ 2) మెదక్
    3) వరంగల్ 4) కరీంనగర్
25. ఈశాన్య రుతుపవనాల వల్ల అల్ప వర్షపాతం సంభవించే ప్రాంతం ఏది?
    1) కరీంనగర్
    2) హైదరాబాద్
    3) మహబూబ్‌నగర్
    4) ఆదిలాబాద్
26. తెలంగాణలో సాధారణంగా అధిక వర్షపాతం సంభవించే ప్రాంతం ఏది?
    1) హైదరాబాద్ 2) మహబూబ్‌నగర్
    3) ఆదిలాబాద్ 4) కరీంనగర్

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 4; 5) 1; 6) 3; 7) 2; 8) 4; 9) 3; 10) 2; 11) 1; 12) 4; 13) 3; 14) 2; 15) 1; 16) 4; 17) 2; 18) 3; 19) 3; 20) 2; 21) 4; 22) 3; 23) 2; 24) 4; 25) 1; 26) 3.

వేములవాడ చాళుక్యుల మొదటి రాజధాని?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

చాళుక్య యుగం

1. విష్ణుకుండినుల అనంతరం తెలంగాణ బాదామీ చాళుక్యుల పాలనలోకి వచ్చిందని పరిశోధనాత్మకంగా నిరూపించింది?
   1) డాక్టర్ డి. రాజారెడ్డి 2) బి.ఎన్.శాస్త్రి
   3) డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి
   4) బిరుదురాజు రామరాజు
2. బాదామీ చాళుక్య వంశ తొలి రాజు?
   1) జయసింహవల్లభుడు 2) రణరాగుడు
   3) మొదటి పులకేశి 4) రెండో పులకేశి
3. బాదామీ చాళుక్య వంశంలో తొలి స్వతంత్ర పాలకుడు?
   1) జయసింహవల్లభుడు 2) రణరాగుడు
   3) మొదటి పులకేశి 4) రెండో పులకేశి
4. రెండో పులకేశి ఎవరిని సంహరించి రాజ్యానికి వచ్చాడు?
   1) కీర్తివర్మ 2) మంగళేశుడు
   3) మొదటి పులకేశి 4) రణరాగుడు
5. రెండో పులకేశి రాజ్యానికొచ్చిన కాలం?
   1) క్రీ.శ. 606 2) క్రీ.శ. 608
   3) క్రీ.శ. 612 4) క్రీ.శ. 610
6. రెండో పులకేశి వేయించిన హైదరాబాద్ శాసన కాలం?
   1) క్రీ.శ. 606 2) క్రీ.శ. 608
   3) క్రీ.శ. 612 4) క్రీ.శ. 610
7. రెండో పులకేశి ఎవరి కొడుకు?
   1) మొదటి కీర్తివర్మ 2) మంగళేశుడు
   3) చంద్రాదిత్యుడు 4) రణరాగుడు
8. ఎవరి వారసులను తూర్పు చాళుక్యులంటారు?
   1) కుబ్జ విష్ణువర్ధనుడు 2) మంగళేశుడు
   3) రణరాగుడు 4) మొదటి పులకేశి
9. ఎవరి వారసులను బాదామీ చాళుక్యులు అంటారు?
   1) మొదటి కీర్తివర్మ 2) మంగళేశుడు
   3) మొదటి పులకేశి 4) రెండో పులకేశి
10. బాదామీ చాళుక్య చివరి చక్రవర్తి?
    1) రెండో కీర్తివర్మ 2) రణరాగుడు
    3) మొదటి విక్రమాదిత్యుడు
    4) చంద్రాదిత్యుడు
11. రెండో కీర్తివర్మను రాష్ట్రకూట రాజైన దంతి దుర్గుడు ఓడించిన సంవత్సరం?
    1) క్రీ.శ. 750 2) క్రీ.శ. 751
    3) క్రీ.శ. 753 4) క్రీ.శ. 755
12. దేవాలయ నిర్మాణ పద్ధతిలో 'దక్కన్‌శైలి' ఎవరి కాలంలో అభివృద్ధి చెందింది?
    1) విష్ణుకుండినులు 2) బాదామీ చాళుక్యులు
    3)రాష్ట్రకూటులు 4) వేములవాడ చాళుక్యులు
13. దక్షిణాది దేవాలయ నిర్మాణ పద్ధతి?
    1) చతురస్రం 2) చతురస్రం - చతురస్రం
    3) శిఖరం 4) దీర్ఘచతురస్రం
14. ఉత్తరాది దేవాలయ నిర్మాణ పద్ధతి?
    1) చతురస్రం 2) చతురస్రం - స్తూపం
    3) శిఖరం 4) దీర్ఘచతురస్రం
15. బాదామీ చాళుక్యుల దేవాలయ నిర్మాణ పద్ధతి?
    1) చతురస్రం - చతురస్రం 2) శిఖరం
    3) చతురస్రం 4) మిశ్రమం
16. గద్వాల సంస్కృత శాసన కాలం?
    1) క్రీ.శ. 670 2) క్రీ.శ. 674
    3) క్రీ.శ. 680 4) క్రీ.శ. 684
17. రాష్ట్రకూటులు ఎవరి సామంతులు?
    1) విష్ణుకుండినులు 2) శాతవాహనులు
    3) బాదామీ చాళుక్యులు 4) ఇక్ష్వాకులు
18. రాష్ట్రకూట వంశ మూలపురుషుడు?
    1) మొదటి ఇంద్రరాజు
    2) మొదటి గోవిందవర్మ
    3) మొదటి కర్కరాజు
    4) రెండో ఇంద్రరాజు
19. స్వతంత్ర రాష్ట్రకూట రాజ్యాన్ని స్థాపించింది?
    1) మొదటి ఇంద్రరాజు
    2) మొదటి గోవిందవర్మ
    3) కర్కరాజు 4) దంతిదుర్గుడు
20. దంతిదుర్గుడి పాలనా కాలం?
    1) క్రీ.శ. 740-748 2) క్రీ.శ. 748-768
    3) క్రీ.శ. 735-758 4) క్రీ.శ. 738-758
21. 'అష్టవర్షాలు' యుద్ధం చేసిన రాష్ట్రకూట రాజు?
    1) దంతిదుర్గుడు 2) ధ్రువరాజు
    3) రెండో గోవిందుడు 4) మొదటి కృష్ణుడు
22. మొదటి కృష్ణుడు ఏ బాదామీ చాళుక్య రాజుతో 'అష్టవర్షాలు' యుద్ధం చేశాడు?
    1) మొదటి విక్రమాదిత్య
    2) రెండో విక్రమాదిత్య
    3) రాహప్ప 4) రెండో కీర్తివర్మ
23. రాష్ట్రకూటుల రాజధాని?
    1) ఏలేశ్వరం 2) ఇంద్రపురి
    3) విజయపురి 4) మాణ్యఖేటం
24. వేంగీ చాళుక్యరాజైన విష్ణువర్ధనుడిని ఓడించిన రాష్ట్రకూట రాజు?
    1) మొదటి కృష్ణుడు 2) మూడో గోవిందుడు
    3) ధ్రువరాజు 4) రెండో గోవిందుడు



25. విష్ణువర్ధనుడి కుమార్తె 'శీలా మహాదేవి'ని వివాహమాడిన రాజు?
    1) మొదటి కృష్ణుడు 2) రెండో గోవిందుడు
    3) మూడో గోవిందుడు 4) ధ్రువరాజు
26. వేంగీ విష్ణువర్ధనున్ని ఓడించడానికి ధ్రువరాజు ఎవరి సహాయం తీసుకున్నాడు?
    1) మొదటి నరసింహుడు
    2) మొదటి అరికేసరి
    3) రెండో నరసింహుడు 4) రెండో అరికేసరి
27. 'కవిరాజమార్గం' అనే గ్రంథాన్ని రాసిన రాష్ట్రకూట రాజు?
    1) మూడో గోవిందుడు
    2) నాలుగో గోవిందుడు
    3) మొదటి అమోఘవర్షుడు
    4) రెండో అమోఘవర్షుడు
28. నాలుగో గోవిందుడిని ఓడించడంలో బద్దెగునికి మద్దతు పలికిన రాజు?
    1) మొదటి అరికేసరి 2) రెండో అరికేసరి
    3) మొదటి నరసింహుడు
    4) రెండో నరసింహుడు
29. అంతర్గత తిరుగుబాట్లు, చికాకులతో నాలుగో గోవిందుడు పారిపోయిన ప్రాంతం?
    1) ఉత్తరప్రదేశ్ 2) మహారాష్ట్ర
    3) కళింగ 4) చోళమండలం
30. రాష్ట్రకూట చివరి పాలకుల్లో రాజ్యానికి పూర్వ వైభవం తీసుకొచ్చిన రాజు?
    1) మొదటి గోవిందుడు
    2) మూడో గోవిందుడు
    3) నాలుగో గోవిందుడు
    4) రెండో గోవిందుడు
31. ఎవరి పాలనా కాలంలో రాష్ట్రకూట రాజ్య పతనం ప్రారంభమైంది?
    1) మొదటి గోవిందుడు
    2) మూడో గోవిందుడు
    3) నాలుగో గోవిందుడు 4) ఖొట్టిగ
32. రాష్ట్రకూట వంశ చివరి పాలకుడు?
    1) నాలుగో ఇంద్రుడు
    2) రెండో కర్కరాజు
    3) ఖొట్టిగ 4) నిరుపమ
33. రెండో కర్కరాజును ఓడించిన కల్యాణి చాళుక్య రాజు?
    1) సత్యాశ్రయుడు 2) రెండో జయసింహుడు
    3) రెండో తైలపుడు 4) మూడో తైలపుడు
34. కల్యాణి చాళుక్యుల రెండో రాజధాని?
    1) మాణ్యఖేటం 2) కల్యాణి
    3) కొలనుపాక 4) బోధన్
35. కల్యాణి చాళుక్యుల కాలంలో చోళుల దాడికి గురైన ప్రసిద్ధి చెందిన తెలంగాణ ప్రాంతం?
    1) కల్యాణి 2) కొలనుపాక
    3) బోధన్ 4) వేములవాడ
36. కాకతీయ గరుడబేతరాజును హన్మకొండ విషయ పాలకుడిగా నియమించిన కల్యాణి చాళుక్య రాజు?
    1) సత్యాశ్రయుడు 2) రెండో తైలపుడు
    3) కర్కరాజు 4) అయ్యన
37. కాకతీయులు, కందూరి చోడుల సాయంతో సింహాసనం ఆక్రమించిన కల్యాణి చాళుక్య రాజు?
    1) సత్యాశ్రయుడు
    2) ఆరో విక్రమాదిత్యుడు
    3) రెండో సోమేశ్వరుడు
    4) జగదేకమల్లుడు
38. కల్యాణి చాళుక్య వంశానికి చెందిన ఏ పాలకుడి ప్రశంస ఉన్న శాసనాలు తెలంగాణలో వివిధ ప్రాంతాల్లో లభించాయి?
    1) రెండో సోమేశ్వరుడు
    2) జగదేకమల్లుడు
    3) మూడో సోమేశ్వరుడు
    4) జయసింహుడు
39. సోదరులపైనే తిరుగుబాటు చేసి రాజ్యాన్ని ఆక్రమించిన రాష్ట్రకూట రాజులు?
    1) ధ్రువుడు, నాలుగో గోవిందుడు
    2) ధ్రువుడు, రెండో కర్కరాజు
    3) రెండో కర్కరాజు, నాలుగో గోవిందుడు
    4) మూడో గోవిందుడు, నాలుగో గోవిందుడు
40. ఎవరి కాలంలో స్త్రీలు రాజ్యాధికారం చేయడం ఒక విశేషం?
    1) బాదామీ చాళుక్యులు
    2) రాష్ట్రకూటులు 3) వేంగీ చాళుక్యులు
    4) విష్ణుకుండినులు
41. రాయచూరు ప్రాంతాన్ని రాజప్రతినిధిగా పాలించిన 'చంద్రబేలబా' ఎవరి కుమార్తె?
    1) మొదటి అమోఘవర్షుడు
    2) రెండో అమోఘవర్షుడు
    3) మూడో గోవిందుడు
    4) నాలుగో గోవిందుడు
42. రాష్ట్రకూటులు అనుసరించిన మతం ఏది?
    1) శైవం 2) వైదికం
    3) బౌద్ధం 4) జైనం
43. 'రత్నమాలిక' గ్రంథాన్ని మొదటి అమోఘవర్షుడు ఏ భాషలో రాశాడు?
    1) సంస్కృతం 2) ప్రాకృతం
    3) కన్నడం 4) తెలుగు
44. తెలంగాణలో తొలి తెలుగు గద్యశాసనమైన 'కొరివి' శాసన కాలం?
    1) క్రీ.శ. 893 2) క్రీ.శ. 890
    3) క్రీ.శ. 895 4) క్రీ.శ. 898
45. రాజశేఖరుడు అనే సంస్కృత కవి ఎవరి ఆస్థానంలో ఉండేవారు?
    1) శాతవాహనులు 2) ఇక్ష్వాకులు
    3) రాష్ట్రకూటులు 4) బాదామీ చాళుక్యులు
46. వేములవాడ చాళుక్యుల వంశ మూల పురుషుడు?
    1) మొదటి అరికేసరి
    2) సత్యాశ్రయ రణవిక్రముడు
    3) భద్రదేవుడు 4) మొదటి నరసింహుడు
47. వేములవాడ చాళుక్యుల మొదటి రాజధాని?
    1) కొలనుపాక 2) ఇంద్రపురి
    3) వేములవాడ 4) బోధన్
48. వేములవాడ చాళుక్యుల రాజధానిని బోధన్ నుంచి వేములవాడకు మార్చిన రాజు?
    1) మొదటి అరికేసరి
    2) రెండో అరికేసరి
    3) మొదటి నరసింహుడు
    4) రెండో నరసింహుడు
49. దంతిదుర్గుని వద్ద సేనాధిపతిగా పనిచేసిన వేములవాడ చాళుక్యరాజు?
    1) వినయాదిత్య యుద్ధమల్లుడు
    2) సత్యాశ్రయ రణవిక్రముడు
    3) మొదటి అరికేసరి
    4) రెండో అరికేసరి
50. 'కొల్లిపర' శాసనం వేయించిన వేములవాడ చాళుక్య రాజు?
    1) వినయాదిత్య యుద్ధమల్లుడు
    2) సత్యాశ్రయ రణవిక్రముడు
    3) మొదటి అరికేసరి
    4) రెండో అరికేసరి
51. ముగ్ధ శివాచార్యుడికి మొదటి అరికేసరి దానం చేసిన గ్రామం?
    1) వేములవాడ 2) వేంగీ
    3) బోధన్ 4) బెల్మోగ
52. మొదటి బద్దెగుడు తూర్పు చాళుక్య మొదటి భీమునిపై యుద్ధం చేసి బంధించినట్లు తెలుపుతున్న శాసనం?
    1) కొల్లిపర 2) పర్భని
    3) వేములవాడ 4) బోధన్
53. రెండో నరసింహుడు ఉత్తర భారత జైత్రయాత్ర చేసి లాట, మాళవలను జయించినట్లు తెలుపుతున్న శాసనం?
    1) కొల్లిపర 2) పర్భని
    3) వేములవాడ 4) బోధన్
54. రాష్ట్రకూట మూడో ఇంద్రుడు తన సోదరి 'జాకవ్వ'ను ఎవరికిచ్చి వివాహం చేశాడు?
    1) రెండో నరసింహుడు
    2) మొదటి నరసింహుడు
    3) మొదటి అరికేసరి
    4) రెండో అరికేసరి
55. వేములవాడ చాళుక్యుల్లో అగ్రగణ్యుడు?
    1) రెండో నరసింహుడు
    2) మొదటి నరసింహుడు
    3) మొదటి అరికేసరి
    4) రెండో అరికేసరి
56. రాష్ట్రకూట మూడో ఇంద్రుడి కుమార్తె?
    1) లోకాంబిక 2) జాకవ్వ
    3) రేవక నిర్మాడిని 4) మైలాంబిక
57. రాష్ట్రకూట వంశ ఏ రాజు కాలంలో వారసత్వ యుద్ధాలు మొదలయ్యాయి?
    1) రెండో అరికేసరి
    2) మొదటి అరికేసరి
    3) రెండో నరసింహుడు
    4) మొదటి నరసింహుడు
58. వేములవాడలో 'సోమదేవసూరి' కోసం 'శుభదామ జినాలయం' నిర్మించిన రాజు?
    1) రెండో అమోఘవర్షుడు
    2) మొదటి బద్దెగుడు
    3) రెండో బద్దెగుడు
    4) రెండో అరికేసరి
59. 'పర్భని' శాసనం వేయించిన రాజు?
    1) మొదటి బద్దెగుడు
    2) మొదటి అరికేసరి
    3) రెండో అరికేసరి 4) మూడో అరికేసరి
60. మూడో అరికేసరి ఆచార్య సోమదేవసూరికి దానమిచ్చిన గ్రామం?
    1) కొల్లిపర 2) వనికటుపలు
    3) బెల్మోగ 4) వేంగీ
61. మూడో అరికేసరి ఎప్పుడు రేపాక గ్రామంలో జినాలయం నిర్మించాడు?
    1) క్రీ.శ. 964 2) క్రీ.శ. 966
    3) క్రీ.శ. 968 4) క్రీ.శ. 970
62. వేములవాడ చాళుక్యుల్లో చివరివాడు?
    1) మూడో బద్దెగుడు 2) మూడో అరికేసరి
    3) రెండో నరసింహుడు
    4) అమోఘవర్షుడు

సమాధానాలు

1) 2	2) 1	3) 3	4) 2	5) 4
6) 3	7) 1	8) 1	9) 3	10) 1
11) 4	12) 2	13) 2	14) 3	15) 4
16) 2	17) 3	18) 1	19) 4	20) 2
21) 4	22) 3	23) 4	24) 3	25) 4
26) 2	27) 3	28) 2	29) 4	30) 2
31) 4	32) 2	33) 3	34) 2	35) 2
36) 2	37) 2	38) 2	39) 1	40) 2
41) 1	42) 4	43) 3	44) 1	45) 3
46) 2	47) 4	48) 2	49) 1	50) 3
51) 4	52) 2	53) 3	54) 1	55) 4
56) 3	57) 1	58) 3	59) 4	60) 2
61) 3	62) 1			

What is the full form of MSME?

MODEL QUESTIONS

Bank Exams

Banking Awareness

1. Which Bank has opened its first branch in South Korea (Seoul) on 13th Jan, 2016 ?
   a) ICICI
   b) Punjab National Bank
   c) Corporation Bank
   d) State Bank of India
   e) Indian Overseas Bank
2. The purpose of SARFAESI Act 2002 is:
   a) Recovery of dues in Education Loans only
   b) Recovery term loans sanctioned for construction of infrastructure projects
   c) Court permission is must before recovery of overudes in NPAs
   d) Recovery of dues classified as non-performing assets without intervention of court
   e) None of the above
3. A banknote, of which a portion is missing or which is composed of more than two pieces is called ?
   a) Soiled Note
   b) Cut Note c) Duplicate Note
   d) Bad Note
   e) Mutilated banknote
4. Consumption loan under priority sector can be granted to..
   a) Rural artisans
   b) Small/Marginal farmers
   c) Landless labourers
   d) All e) None
5. Which of the following is a borrowing facility/loan advance __?
   a) Term finance
   b) Performance guarantee
   c) Bill received under letter of credit
   d) All the above
   e) None of the above
6. Collateral securities can be __?
   a) Tangible
   b) Intangible in the shape of personal guarantee of a third party
   c) Security given to get credit facilities/loan
   d) All of the above
   e) None of the above
7. A charge where there is neither the transfer of ownership nor the possession is called ______?
   a) Hypothecation
   b) Lien c) Pledge
   d) Mortgage
   e) None of the above
8. As per the directives of Reserve bank of India, 'Notice deposit' shall mean:
   a) The deposit withdrawable at the will of the depositor
   b) The deposit repayable only after the bank gives notice to the depositor
   c) Term deposit for specific period but with drawable on giving at least one complete banking day's notice
   d) None of the above
   e) All of the above
9. Regional Rural Banks have been permitted to pay ½% additional interest on ___?
   a) All deposits accounts except current deposits
   b) All deposits accounts including current deposits
   c) Saving account and time deposits of less than three years
   d) All deposit accounts except Recurring Deposit Scheme
   e) None of the above
10. Name the 9 digit numeric code that uniquely identifies a bank branch participating in electronic clearing scheme?
    a) MICR b) ECS c) NEFT
    d) IFSC e) INFINET
11. What is the full form of the CORE word in Core Banking Solutions?
    a) Core Online Real-time Exchange
    b) Centralized Online Real-time Exchange
    c) Central Online Real-time Exchange
    d) Centralized Online Retail Exchange
    e) None of the above
12. Which Bank scores a first, mortgage portfolio crossing Rs 1 lakh crore ?
    a) State Bank of India
    b) HDFC
    c) CORPORATION BANK
    d) ICICI
    e) Punjab National Bank



13. A part of the issued capital of the Regional Rural Banks is subscribed as under___?
    a) Fifty per cent by Central Government
    b) Fifty per cent by State Government
    c) Thirty per cent by sponsoring bank
    d) All the above
    e) None of the above
14. Which amongst the following is not term deposits issued by commercial banks?
    a) Current account
    b) Fixed deposit
    c) Recurring deposit
    d) Reinvestment deposit
    e) All the above
15. What is the main purpose of Open market o perations?
    a) A fiscal device which assists Government borrowing
    b) A monetary measure to regulate quantity of money in circulation and the cash reserves of the commercial banks
    c) A measure to counteract extreme trends in business
    d) A measure to influence the balance of payments position
    e) None of the above
16. What is the full form of MSME?
    a) Mini, Small and Medium Enterprises
    b) Micro, Small and Medium Enterprises
    c) Mini scale Marketing Enterprises
    d) Medium Scale Marketing Enterprises
    e) None of the above
17. A customer is required to maintain adequate balances in his/her accounts in order to use his ____ card in the merchant establishments?
    a) Smart Card
    b) Credit Card
    c) Add-on Credit card
    d) Debit Card
    e) None of the above
18. Which of the following are the latest guidelines issued by the RBI in respect of opening new branches in villages?
    a) To open more brick and mortar branches in villages where there are no banking facilities and population is more than 5,000.
    b) Banks to submit a roadmap on how many branches they will be opening by 31 March 2017.
    c) The roadmap by end of January 2016.
    d) BCBF Model to be discontinued
    e) Only a, b, c
19. Name the financial instrument which is/are issued for short term (up to one year) borrowing by RBI on behalf of the Government of India?
    a) Treasury Bills
    b) Commercial Paper
    c) Certificate of Deposit
    d) Non-convertible Debenture
    e) Only b & c
20. KYC (Know Your Customer) norms were implemented in the Indian banking system in 2002 as per the directive of ?
    a) SEBI b) RBI c) IBA
    d) IRDA e) None of these
21. Often, we read in the newspapers that several Indian companies are taking the FCCB route to raise capital. What does the term FCCB stand for?
    a) Foreign Currency Convertible Bond
    b) Foreign Convertible Credit Bond
    c) Financial Consortium and Credit Bureau
    d) Future Credit and Currency Bureau
    e) None of these
22. Account Holder of Which of the following accounts with a bank will be issued with ATM cards?
    a) Saving bank account
    b) Current accounts
    c) Term deposits
    d) Loan or cash credit accounts
    e) Either a or b
23. A commercial paper is
    a) A paper issued by Reserve Bank of India an trade and commerce
    b) An unsecured money market instrument issued in the form of promissory note
    c) A document issued by IDBI for seeking refinance facility from Reserve Bank India
    d) All of the above
    e) None of the above
24. Which of the following would fall under the category of retail banking?
    a) Home Loans b) Credit Cards
    c) Personal Loans
    d) Car Loans e) All of these
25. Who decides how much quantity of the coins to be minted?
    a) Reserve Bank of India
    b) Central Government
    c) Finance Ministry
    d) Both RBI and Central Government decide
    e) None of the above
26. What are the components of Foreign Exchange Reserves?
    a) Foreign currency assets
    b) Gold
    c) Special Drawing Rights
    d) Reserve Position in the IMF
    e) All the above
27. The chairman of Regional Rural Bank is appointed by ____?
    a) State Government
    b) Reserve Bank of India
    c) Central Government
    d) Sponsoring bank in consultation with NABARD
    e) None of the above
28. To control inflationary situation in the economy, RBI can increase one or more of these monetary tool?
    a) CRR-SLR-Bank Rate
    b) SLR-CRR-Base Rate
    c) CRR-SLR-Repo Rate
    d) CRR-SLR-Reverse Repo Rate
    e) CRR-SLR-BPLR
29. Who can open various types of non-resident accounts?
    a) Persons of Indian Nationality or person of Indian origin residing outside India
    b) Persons of foreign nationality or origin residing outside India
    c) Firms, companies and other organization resident outside India
    d) a, b and c e) None
30. ATMs which are set up, owned and operated by non-banks are called as?
    a) White Label ATMs
    b) Green Label ATMs
    c) Brown Label ATMs
    d) Red Label ATMs
    e) None of the above
31. What is the name of the asset which has remained NPA for a period exceeding 12 months?
    a) Sub-standard
    b) Doubtful asset
    c) Loss asset d) Critical Asset
    e) None of the above

KEY

1) d;	2) d;	3) e;	4) d;
5) a;	6) d;	7) a;	8) c;
9) c;	10) a;	11) b;	12) d;
13) a;	14) a;	15) b;	16) b;
17) d;	18) e;	19) a;	20) b;
21) a;	22) e;	23) b;	24) e;
25) b;	26) e;	27) d;	28) a;
29) d;	30) a;	31) b.	